వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

VEEKSHANAM, TELUGU MONTHLY

సంపుటి : 17 సంచిక : 8 హైదరాబాద్ 217 ఆగస్ట్ 2019 పేజీలు : 68 రు. 25

వీక్షణం విడిప్రతి కొనుగోలు కోసం

మీ సమీపంలోని ఈ కింది న్యూస్‌స్టాల్స్‌లో వీక్షణం విడి(ప్రతి కొనుక్కోవచ్చు

రైజింగ్ సన్ న్యూస్ ఏజెన్సీ (సోల్ డిస్ట్రిబ్యూటర్)	ఆబిడ్స్, హైదరాబాద్	96666 80857
నవోదయ బుక్‌హౌస్	కాచిగూడ, హైదరాబాద్	90004 13413
సహచర బుక్‌మార్క్	బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్	98483 48173
బాల రాజేశ్వర బుక్ డిపో	నల్లకుంట బస్ స్టాప్ హైదరాబాద్	9705055738
వెంకటేశ్వర బుక్‌స్టాల్, స్టేషనరీ	నల్లకుంట, శంకర్‌మఠ్ హైదరాబాద్	040-66131071
ఫస్ట్ లక్కీ పాన్‌షాప్	విద్యానగర్ సిగ్నల్స్ హైదరాబాద్	9848672831
సుధాకర్ బుక్‌స్టాల్	సన్‌మాన్ హోటల్ పక్కన, తార్నాక హైదరాబాద్	9949337605
వెంకటేశ్వర బుక్‌స్టాల్	రామ్‌నగర్ గుండు హైదరాబాద్	9502964995
భవాని బుక్‌స్టాల్	శివం రోడ్ హైదరాబాద్	9849836996
శ్రీభవాని బుక్‌స్టాల్	శివం రోడ్ (ఇండియన్ బ్యాంక్ దగ్గర) హైదరాబాద్	9640712555
ఓరియన్ బుక్‌స్టాల్	అంబర్‌పేట్ (శ్రీరమణ టాకీస్ దగ్గర) హైదరాబాద్	7702535137
అరవింద్ బుక్ స్టాల్	రామంతాపూర్ (టివి స్టూడియో ఎదురుగా) హైదరాబాద్	8977995537
నేషనల్ బుక్‌హౌస్	అబిడ్స్, హైదరాబాద్	9394495189
దుర్గా భవన్ బుక్‌స్టాల్	నాంపలి, హైదరాబాద్	9030656640
డైమండ్ బుక్‌స్టాల్	నాంపలి, హైదరాబాద్	9885127491
రాజు రామ్‌దాస్ బుక్‌స్టాల్	మెహదీపట్నం, హైదరాబాద్	7799244409
రిలయబుల్ బుక్ సెంటర్	నానల్‌గూడ, హైదరాబాద్	040-23512447
ఇస్పెక్ట్రం బుక్‌హౌస్	లంగర్‌హౌజ్, హైదరాబాద్	98486 68354
శ్రీ లక్ష్మి బుక్‌స్టాల్	హైదర్‌గూడ, హైదరాబాద్	98855 81249
మల్లిఖార్జున బుక్‌స్టాల్	దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్	90594 40756
సుధీర్ బుక్‌స్టాల్	తార్నాక, హైదరాబాద్	95426 04166
లడ్డు బుక్‌స్టాల్	పంజగుట్ట, హైదరాబాద్	99492 15135
వినోద్ బుక్‌స్టాల్	సరూర్‌నగర్, హైదరాబాద్	95536 03603
రాజారెడ్డి బుక్‌స్టాల్	చందానగర్ బిఎచ్‌ఇఎల్	93466 07648
నవ తెలంగాణ బుక్ హౌస్	చిక్కడపల్లి, హైదరాబాద్	94900 99373
నవ తెలంగాణ బుక్ హౌస్	బాగ్‌లింగంపల్లి-సుందరయ్య విజ్ఞాన కేంద్రం, హైదరాబాద్	94900 99378
నవ తెలంగాణ బుక్ హౌస్	నామ్‌దేవ్‌వాడ, నిజామాబాద్	83329 95395
నవ తెలంగాణ బుక్ హౌస్	సుందరయ్య భవన్, నల్గొండ	94906 18735
నవ తెలంగాణ బుక్ హౌస్	జగ్‌జీవన్‌నగర్, న్యూ బస్‌స్టాండ్, మహబూబ్‌నగర్	99593 74907
నవ తెలంగాణ బుక్ హౌస్	బాప్టిస్ట్ చర్చ్ కాంప్లెక్స్, మొదటి అంతస్తు, హనుమకొండ	94900 99197
నవ తెలంగాణ బుక్ హౌస్	పాత సిపిఐ (ఎం) ఆఫీస్, బాలాజీనగర్, ఖమ్మం	94900 99329
రాజ్ బుక్స్ స్టేషనరీ	ఓల్డ్ బస్‌స్టాండ్ దగ్గర, మెదక్ రోడ్, సిద్దిపేట్	87905 60097
అక్షర బుక్ వరల్డ్, ఎటిసి మార్కెటింగ్	న్యూ టౌన్, మహబూబ్‌నగర్	90102 10464
శ్రీ స్వయం రాజరాజేశ్వర బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, హుస్నాబాద్	90592 85948
భాస్కర్ పాన్ షాప్ & జనరల్ స్టోర్	కోహెడ	95021 82545
భండారి కిష్టయ్య బుక్‌స్టాల్	ఫైర్‌స్టేషన్ దగ్గర, గోదావరిఖని	98497 93836
గణేష్ బుక్‌స్టాల్	కళాభారతి ఎదురుగా, కరీంనగర్	97019 99007
వినయ్ బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, మంచిర్యాల	94407 57503
పాండు బుక్‌స్టాల్, కూల్‌డ్రింక్స్	ఆర్‌టిసి కాంప్లెక్స్, మిర్యాలగూడ	98857 38144
సత్యసాయి బుక్‌స్టాల్	ఖమ్మం	79890 81728
రాజన్న బుక్ స్టాల్	హనుమకొండ చౌరస్తా	93955 07773
ఎ.ఎచ్. వీలర్ బుక్‌స్టాల్	వరంగల్ రైల్వే స్టేషన్	70757 59274
మహాకవి శ్రీశ్రీ బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, పార్వతీపురం	73825 60366
మణి బుక్‌స్టాల్	సండేమార్కెట్, నెల్లూరు	73862 23538
సురేష్ బుక్‌స్టాల్	శివాలయం వీధి, ప్రొద్దటూరు	81210 02112
క్రిసెంట్ న్యూస్ ఏజెన్సీ	కడప	98852 35846
పద్మావతి బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, అనంతపూర్	73965 09767
అనేక బుక్‌స్టాల్	ఏలూరు రోడ్డు, విజయవాడ	92472 53884
మైత్రీ బుక్‌హౌస్	మజీద్ వీధి, అరండల్‌పేట, విజయవాడ	98486 31604
రాజేశ్ బుక్‌సర్వీస్	ఆర్‌టిసి బస్‌స్టేషన్ కాంప్లెక్స్, విశాఖపట్నం	99483 19842
వి. భాస్కర్ న్యూస్‌పేపర్ ఏజెన్సీ	డాబా గార్డెన్, విశాఖపట్నం	99482 90318
రాఘవేంద్ర బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, ఒంగోల్	90595 23091
శ్రీదేవి సాయి కూల్‌డ్రింక్స్, కమ్యూనికేషన్స్	దేవి చౌక్, రాజమండ్రి	98489 84394
త్రినాథ్ పాన్ షాప్	మరిడి మహాలక్ష్మి టెంపుల్, రాజమండ్రి	99519 76044

217 ISSN 2231-6892

వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

ఆగస్టు 2019
సంపుటి : 17
సంచిక : 8

‘వీక్షణం’ పేరిట రచనలు, ఎం.ఓలు, చెక్కులు,డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం VEEKSHANAM

మైత్రి రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029. ఫాక్స్, ఫోన్ : 040-66843495

Email : veekshanam2003@gmail.com
www.veekshanam.wordpress.com

ప్రింటర్స్ : **చరితా ఇంప్రెషన్స్**
ఆజామాబాద్, హైదరాబాద్. ఫోన్ : 040 - 27678411

వీక్షణం చందా వివరాలు

	సంస్థలకు / లైబ్రరీలకు	వ్యక్తులకు
విడి ప్రతి	రు. 25	రు. 25
సంవత్సరం	రు. 300	రు. 250
మూడు సంవత్సరాలు	రు. 900	రు. 650
ఐదు సంవత్సరాలు	రు. 1500	రు. 1100
పది సంవత్సరాలు	రు. 3000	రు. 2000

ఆన్‌లైన్ ఆంధ్రబ్యాంక్ ద్వారా డబ్బులు పంపేవారు బ్యాంక్ స్లిప్‌లపై ‘**VEEKSHANAM**’ అని రాసి తమ పేరు కూడా రాయాలి. వీక్షణం అకౌంట్ నెంబర్ – **013911011002175** ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్ పేరు మీద వేయాలి. ఇతర బ్యాంకులలో వేసేవారు **ANDB 0000139** నెంబర్‌తో పాటు తమ పేరు కూడా రాసి వేయాలి.

వీక్షణం ఆర్థిక పరిస్థితిని వివరిస్తూ చేసిన విజ్ఞప్తికి స్పందిస్తూ వీక్షణంను నిలబెట్టుకోవాలనే తపనతో ఆర్థిక సహాయం అందించిన ఎన్. రాంగోపాల్, హైదరాబాద్- రు. 2,500, రాజేంద్రబాబు అర్విణి, హైదరాబాద్ - రు. 5,000, డా. ఎన్. జగతి, హైదరాబాద్ - రు. 5,000; కె. మధుసూదనరావు, హైదరాబాద్ - రు. 5000. మిత్రులకు కృతజ్ఞతలు - సం.

వీక్షణం ఎడిటర్ గారికి, మీ పత్రికాభిమానిగా నా కండ్లకు ప్రతి అక్షరం సవ్యమైదిగా, అభినందించతగినదిగానే కన్పిస్తుంది. జూలై సంచికను రెండు రోజులలోనే పూర్తిగా చదివేశాను. ప్రతి అక్షరం, ప్రతి పేజీ క్షుణ్ణంగా చదివాను. అర్థం కాని, జటిలమైనవి, సందిగ్ధమైనవీ కొన్ని ఉన్నాయి. వాటిలో ఒకటి, 'నూతన జాతీయ విద్యా విధానం'పై బి. రామకృష్ణ గారు రాసిన 6 పేజీల సుదీర్ఘ వ్యాసం. దీని పూర్వాపరాలు, మంచి చెడ్డలు కొంత చర్చించారు. నేను బోధనా కళాశాలలో పనిచేసిన అనుభవాన్ని అనుసరించి నా అనుమానాలను పాఠకుల దృష్టికి తేదలచుకున్నాను.

కొఠారీ కమిషన్ దగ్గరి నుంచి ఎన్నో విద్యా కమిషన్లు కొత్త కొత్త విధానాల్ని జాతీయ విద్యా విధానంపై రుద్దుతున్నాయి. ఇది ఇంకో ప్రయోగం. ఇందులో కస్తూరి రంగన్ కమిషన్ ఇచ్చిన నివేదికను మిత్రులు చక్కగానే పరిశీలించారు. అయినా అందులో లొసుగుల్ని ఇంకా స్పష్టంగా చెప్పలేకపోయారు. 'జాతీయ విద్యా విధానం 2019'లో సెకండరీ విద్యా పైనే దృష్టిని మళ్లించినట్లుంది. కళాశాల ఉన్నత, సాంకేతిక విద్యా విధానాన్నే సూత్ర ప్రాయంగానైనా పేర్కొనలేదు. ప్రస్తుతం చాలా రాష్ట్రాలలో నడుస్తున్న 10+2+3+15 సంవత్సరాల విద్యా విధానం దేశ వ్యాప్తంగా నడుస్తున్నది. ప్రాథమిక విద్య 5 సంవత్సరాలు, సెకండరీ విద్య 5 సంవత్సరాలు + ఇటర్ (హయ్యర్ సెకండరీ) 2 సంవత్సరాలు + డిగ్రీ కళాశాల 3 సంవత్సరాలుగా మొత్తం 15 ఏండ్ల విద్యా సంవత్సరాలు పట్టిన దానిని ఇప్పుడు ఈ విధానం ద్వారా ఒక్క సెకండరీ విద్యా విధానానికే ఈ 15 ఏండ్లు పట్టింది. కళాశాల (ఉన్నత విద్య) డిగ్రీ కోసం మరో 3 ఏండ్లు లేదా 4 ఏండ్లు పట్టే విధంగా 15+3 లేదా 4+18, 19 ఏండ్ల చదువుకాలం, అంటే 3 ఏండ్లకు అదనంగా డిగ్రీ కోసం 21 ఏండ్లు వచ్చేదాకా చదవాల్సి వస్తుంది. ఎక్కడైనా సిలబస్ పెంచుతూ తరగతుల్ని తగ్గిస్తుంటారు కొత్తతరం అని - ఇప్పుడు సిలబస్ తగ్గించి తరగతుల్ని పెంచి సెకండరీ విద్య కొరకై (3 సంవత్సరాలు పునాది దశ) ప్రీ ప్రైమరీ+1,2 తరగతులు కలిపి (5 ఏండ్లు) +3 ఏండ్లు ప్రిపరేటరీగా+మరో 3 ఏండ్లు హయ్యర్/మిడిల్ తరగతులుగా+మరో 4 ఏండ్లు సెకండరీ విద్యగా మొత్తం=(3+2) + 3+3+4=15 ఏండ్లు పట్టింది.

ఇక డిగ్రీ ఉన్నత కళాశాల విద్యకు మరో 3-4 ఏండ్లు వేరుగా చదవాల్సి ఉంటుందన్నమాట! ఇప్పుడు స్కూలు, ఇంటర్, డిగ్రీ 10+2+3=15 ఏండ్ల చదువుకే డిగ్రీ అందుకుంటుండగా, రాబోయే విధానంలో 5+3+3+4=15 ఏండ్లకు సెకండరీ విద్య మాత్రమే పూర్తి అవుతుందట! అది రాబోయే తరానికి భారం! చదువుల వేగం పెరిగే ఈ ఆధునిక సాంకేతిక కాలంలో వేగం తగ్గించి ప్రీ ప్రైమరీకి 3 ఏండ్ల కాలం అదనంగా కేటాయించి ఏం నేర్పుతారో, సిలబస్ ఏమిటో 3 ఏండ్ల నుండి 5 ఏండ్ల లోపు పిల్లలకు 3 ఏండ్లు ఏం నేర్పుతారో తెల్పనే లేదు. 3 భాషలు నేర్పుతారా? ఆట పాటలతో గడపాల్సిన ప్రీ ప్రైమరీ (కిండర్ గార్డెన్‌లో) చదువులపై మనసుపెట్టగలరా? సాంకేతికంగా పరిణతి చెందిన రాకెట్ యుగంలో కస్తూరి రంగనాథన్ గారు అశాస్త్రీయ, ప్రాచీన విద్యా విధానాలు యోగ, ధ్యాన, విద్యల్ని నేర్పాలనుకోవడం దానికి బిజెపి వత్తాసుగా నిలవడం, ఆ మరో కొత్త ప్రయోగంతో మరో తరాన్ని తిరోగమన దశకు తీసుకొని వెళ్లడం ఎంతవరకు బాధ్యత వహించగలదో విద్యా పరిశోధకులు, అభిమానులు చర్చించాల్సి ఉంది. ఆశయాలు ఎంత ఉన్నతమైనవైనా, వాటిని ఆచరించే విధానం కూడా సులభంగా చేయగలిగించే విధంగా ఉండాలి గానీ, 'పిల్లి' అంటే 'మార్జాలం' లాగా క్లిష్టతరం చేయకూడదు కదా! 'ఏ' ఫర్ యాపిల్, 'అ' అంటే 'అమ్మ' చదువులే గాదు, అంతకంటే ఉన్నతంగా ఆలోచించాలి గదా?

పూర్తిగా 'జూనియర్' కళాశాలలు మాయమైపోతాయట! సెంకండరీలోనే మిలితమైపోతాయి గనుక కళాశాల విద్య (బిఏ), (బిఇడి), (ఇఎంసిఇటి) 3-4-5 ఏండ్లుంటుందట! బిఇడి 4 ఏండ్లట! ఇంజనీరింగ్, విద్య, సాంకేతికాలు ఐదేండ్లు ఉంటాయి గదా!

- ఎస్. హజరత్ అలి
వేమూరు, గుంటూరు

వీక్షణం జూలై సంచికలో మహేష్ వ్యాసం 'కుల వ్యవస్థలో మామిడి పండూ ప్రాణాంతకమే' వ్యాసంలో దళితుడిని మామిడి పండ్లు దొంగిలించాడనే నెపంతో కొట్టి హత్య చేసిన ఘటన గురించి బాగా వివరించారు. అలాగే దేశంలో దళితులపై, అట్టడుగు వర్గాలపై జరుగుతున్న దాడులు, తక్కువ కులాలవారు ఎక్కువ కులాల వారిలా తయారవుతున్నారనే కారణంతో, గుడిలోకి వెళ్లారనే నెపంతో వారిమీద దాడులు చేయడం, చంపడం గురించి చదువుతుంటే సమాజం ఎక్కడికి పోతుందో అని ఆందోళనగా ఉంది.

- కృష్ణహరి
మహబూబ్‌నగర్

వీక్షణం జూలై సంచికలో వచ్చిన వ్యాసాలన్ని ఆలోచింపజేసేవిగా ఉన్నాయి. అలాగే ఆదివాసుల గురించి గడ్డం లక్ష్మణ్ రాసిన వ్యాసం బాగుంది. కొమురం భీం జిల్లా కొలాంగోండి గ్రామానికి చెందిన ఆదివాసులు రిజర్వు ఫారెస్ట్ భూమిలో అక్రమంగా నివసిస్తున్నారని, జంతువులను చంపుతున్నారని, చెట్లు నరుకుతున్నారనే కారణంతో వారిని అరెస్ట్ చేయడం, వారి గుడిసెలను, పశువుల, గొర్రెల పాకలను అటవీ అధికారులు ధ్వంసం చేయడం గురించి వివరంగా రాశారు. దశాబ్దాలుగా అడవిని నమ్ముకొని జీవిస్తున్న ఆదివాసుల్ని అటవీ నుండి దూరం చేసి వారు జీవించే హక్కును కోల్పోతున్న విషయాలు, అలాగే అడవితో ఆదివాసులకు ఉన్న సంబంధం గురించి, వారి కట్టుబాట్ల గురించి వివరంగా చెప్పారు.

- మాధవ్ కుమార్
జహీరాబాద్, మెదక్

అసహజ మరణాల సూచి జిల్లాల కరస్పాండెంట్లు

తెలంగాణ : ఆదిలాబాద్ - సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి; ఖమ్మం - సి.ఎచ్. గిరిజ; మెదక్ - ముత్తన్నగారి రాజేందర్‌రెడ్డి; మహబూబ్‌నగర్ - మహమ్మద్ ఇక్బాల్; వరంగల్ - ఓరగంటి ఎల్లయ్య

ఆంధ్రప్రదేశ్ : అనంతపూర్ - కె. నాగేశ్వరాచారి; చిత్తూరు - పలమనేరు బాలాజి; కడప - కొండ్రాయుడు; కర్నూలు - జి.వి. సుధాకర్ రెడ్డి; తూర్పు గోదావరి - కె.ఎస్. ప్రకాష్‌రావు; శ్రీకాకుళం - ఆర్. శ్రీలత; విశాఖపట్నం - పి.వి. రమణ

(ఈ సంచికలోని హైదరాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్, నల్గొండ, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, విజయనగరం, ప. గోదావరి జిల్లాల అసహజ మరణాల వివరాలు అందిస్తున్నవారు ఎస్. వెంకటేశ్)

పదునెక్కుతున్న హిట్లర్ పాలన కోరలు

అడాల్ఫ్ హిట్లర్ నాయకత్వంలో జర్మనీలో ఎనబై సంవత్సరాల కింద సాగిన నాజీ పాలన ఒక దుర్మార్గం నుంచి మరొక దుర్మార్గానికి ఎలా పయనించిందో గతంగా, గడిచిపోయిన పీడకలగా, చరిత్రగా మాత్రమే చదువుకున్న వారికి, ఇవాళ నరేంద్ర మోడీ – అమిత్ షా పాలన దాన్ని వర్తమానంగా దృశ్యమానం చేస్తున్నది. ఈ విషవిద్వేష పాలన అధికారపు పగ్గాలు చేపట్టి ఇంకా రెండు నెలలు పూర్తిగా నిండలేదు. కాని ఈ నరహంతక, భిన్నాభిప్రాయ హనన జగన్నాథ రథం పరుగులు వడివడిగా సాగుతున్నాయి. ఆ చక్రాల కింద పడి నలిగిపోతున్న అసహాయుల ఆర్తారావాలు వినబడుతున్నాయి. ఆ చక్రాల కింద అణచివేతకు గురవుతున్నది ముస్లింలు, దళితులు, భిన్నాభిప్రాయాలు ఉన్నవారు మాత్రమే కాదు, బహుళత్వానికీ, వైవిధ్యానికీ చిహ్నమైన మన సమాజం మొత్తాన్నీఆ రథం తొక్కివేస్తున్నది, తొక్కివేయడానికి చూస్తున్నది. సమాజం మొత్తాన్నీ ఒక దేశం – ఒకే జాతి, ఒకే మతం, ఒకే ఎన్నికలు, ఒకే ఆహారపుటలవాట్లు, ఒకే ఆహార్యం, ఒకే ఆలోచన అనే ఏకశిలా సదృశ, శ్మశాన సామ్రాజ్యంగా చదును చేయాలని ఆ రథం కోరుకుంటున్నది. గడిచిన నాలుగు వారాలలో జరిగిన ఘటనలూ పరిణామాలూ చూస్తే ఈ విద్వేష రాజకీయ రథం చట్టాలను మార్చి, పాలనావిధానాలను మార్చి తన భావజాలాన్ని సమాజం మీద రుద్ది, ఆ భావజాలానికి భిన్నమైన ఆలోచనలు గలవాళ్లందరినీ వేధించడానికి మార్గాలు సిద్ధం చేసుకుంటున్నట్టు స్పష్టంగా కనబడుతున్నది. సరిగ్గా హిట్లర్ చేసిన పని ఇదే. 1920లలో పార్టీ పెట్టిన నాటి నుంచి, 1933లో అధికారానికి వచ్చిననాటి నుంచి యూదులను, కార్మిక నాయకులను, కమ్యూనిస్టులను, సోషలిస్టులను ఒక్కొక్కరినీ వేధించడానికి, హింసించడానికి, ఊచకోత కోయడానికి మార్గం సుగమం చేసుకుంటూ వచ్చాడు. అప్పటికి దేశంలో ఉన్న దాదాపు ఇరవై రాజకీయ పార్టీలనూ ఊడ్చేస్తానని ఎన్నికలలో గెలవకముందే హెచ్చరించాడు. 'ఏకీభవించనోని పీకనొక్కు సిద్ధాంతాన్ని' అక్షరాలా అమలు చేశాడు.

సరిగ్గా అట్లాగే మోడీ – షా ప్రభుత్వం వేరువేరు రంగాల్లో తన పావులు కదుపుతున్నది. సమాచార హక్కు చట్టానికి సవరణలు, జాతీయ మానవ హక్కుల కమిషన్ సవరణలు, నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ చట్టానికి సవరణలు, అన్‌లాఫుల్ ఆక్టివిటీస్ ప్రివెన్షన్ చట్టానికి సవరణలు, ట్రిపుల్ తలాక్ చట్టం వంటివి నేరుగా కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగిన చర్యలు కాగా, అవన్నీ రాజ్యాంగ ఆదర్శాలకు, ప్రాథమిక హక్కులకు, చట్టబద్ధ పాలనకు, సామాజిక న్యాయభావనకు తూట్లు పొడిచేవే. ప్రజల పన్నులతో, దేశ సంపదతో నడిచే ప్రభుత్వ కార్యకలాపాల గురించి పూర్తి సమాచారం ప్రజలకు అందుబాటులో ఉండాలని దశాబ్దాల పాటు సాగిన ప్రజా ఉద్యమం వల్ల చిట్టచివరికి అవసరమైన సమాచారాన్ని అనేక ఆంక్షలకు లోబడి అయినా పొందగలిగే చట్టం పదిహేను సంవత్సరాల కింద ఉనికిలోకి వచ్చింది. ఆ చట్టాన్ని సవరించాలనీ, ప్రశ్నించడానికి వీలులేని తమ నిరంకుశ అధికారాన్ని నిలబెట్టుకోవాలనీ ప్రభుత్వాలు చాలసార్లు ప్రయత్నించాయి. సమాచార హక్కు ఉద్యమ కార్యకర్తలు, ప్రజలు ఆ ప్రయత్నాలను అడ్డుకోగా, ఇప్పుడు భాజపా ప్రభుత్వం అధికారానికి రాగానే సమాచార హక్కు చట్టంలో సవరణలు ప్రతిపాదిస్తూ లోకసభలో మందబలంతో నెగ్గించుకుంది. రాజ్యసభలో బలం లేకపోయినా తెలంగాణ రాష్ట్ర సమితి, వైఎస్ఆర్‌సిపి, బిజూ జనతా దళ్ వంటి అవకాశ వాద పార్టీల మద్దతుతో గెలిపించుకుంది. ఈ సవరణలతో సమాచార హక్కు చట్టం బలహీనపడి, ప్రజలకు అవసరమైన సమాచారం ఇవ్వకుండా ఉండే హక్కు ప్రభుత్వానికి అందుతుంది. అసలు సమాచారం కావాలని ప్రశ్నలు అడగడానికి ప్రజలకు ఉన్న హక్కులు కుంచుకుపోతాయి. అలాగే ఇంతకాలం ఎంతో కొంత, ఎప్పుడో ఒకప్పుడు స్వతంత్రంగా పనిచేసే అవకాశం ఉన్న జాతీయ మానవ హక్కుల సంఘం, రాష్ట్ర మానవ హక్కుల సంఘాల విధివిధానాలను మారుస్తూ, అంటే వాటిని బలహీన పరుస్తూ కేంద్ర ప్రభుత్వం మరొక చట్టం తీసుకువచ్చింది. నేషనల్ ఇన్వెస్టిగేటింగ్ ఏజెన్సీ కోరలు పదును పెడుతూ, దాన్ని బలోపేతం చేస్తూ ప్రజల మీద, భిన్నాభిప్రాయాలు ఉన్నవారి మీద విరుచుకుపడడానికి, తప్పుడు కేసుల్లో ఇరికించడానికి, శిక్షలు విధింపజేయడానికి ప్రభుత్వం మరొక చట్ట సవరణను ప్రవేశపెట్టింది. అంతకన్న ఘోరంగా, చట్టవ్యతిరేక కార్యకలాపాల (నిరోధ) చట్టంలో అన్యాయమైన సవరణలు ప్రవేశపెట్టి నెగ్గించుకుంది. ఈ నాలుగు చట్ట సవరణలు అంతిమంగా రాజకీయ ప్రత్యర్థుల మీద, భిన్నాభిప్రాయాలు ప్రకటించేవారి మీద, సంఘ్ పరివార్ వ్యతిరేకుల మీద కక్ష సాధింపుకూ, వేధింపుకూ మాత్రమే ఉపయోగిస్తా రనడంలో సందేహం లేదు.

ఇటువంటి "చట్టబద్ధమని" అనిపించే చట్టాలను మార్చే, ఏమార్చే చర్యలు ఒకవైపు జరుగుతుండగానే, చట్టవ్యతిరేక, దుర్మార్గ, దౌర్జన్య చర్యలు పెచ్చుమీరుతున్నాయి. ఆదివాసుల భూమి ఆక్రమించి, వారిని వెళ్లగొట్టడానికి కాల్పులు జరిపేదాకా భూస్వాములు తెగబడుతున్నారు. వచ్చినది తమ ప్రభుత్వమే గనుక తమ హంతక చర్యలకు అనుమతి దొరికినట్టేనని భావిస్తున్న సంఘ పరివార్ శక్తులు, వారి ఆశ్రితులు దేశ వ్యాప్తంగా జైశ్రీరాం అని నినదించమని ఇతరులను హింసిస్తున్న ఘటనలు పెరిగిపోయాయి. ఇటువంటి మూక హత్యలు సమాజానికీ, భవిష్యత్తుకూ మంచివి కావని, వీటిని ఆపడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సమాజ భవిష్యత్తు మీద ప్రేమ ఉన్న మేధావులు, ప్రజాస్వామిక వాదులు ప్రభుత్వానికి లేఖ రాస్తే, వారి మీద వేధింపులు, దుర్భాషలు, వారిని చంపుతామని బెదిరింపులు సాగుతున్నాయి.

లెక్కపెడితే గడిచిన నాలుగు వారాలలో ప్రభుత్వం, అధికారపక్షం, అధికార పక్షపు మాతృసంస్థ తరఫున రోజుకొక్కటైనా ఇటువంటి మానవత పట్ల నేరాలు జరిగాయి, చట్టబద్ధ పాలనకూ, సక్రమమైన న్యాయ విచారణకూ సంబంధం లేని పనులు, చట్టాలనే తారుమారు చేసి, కనీస ప్రజాస్వామిక సంప్రదాయాలను తలకిందులు చేసే పనులు జరిగాయి. అధికారం నెరపడానికి అవకాశం వచ్చిన అరవై నెలల్లో రెండు నెలల్లోనే ఈ దిశ, దశ ఇలా ఉంటే, ఈ అధికార వ్యవధి పూర్తయ్యేలోగా ఈ దేశం ఈ దేశం లాగనే ఉంటుందా అని అనుమానించే స్థితి తలెత్తుతున్నది. ఇది కేవలం సంఘ్ పరివర్ శక్తులకూ, వారిని వ్యతిరేకించే శక్తులకూ మధ్య ఘర్షణ కాదు, వారికి మాత్రమే పరిమితమైన సమస్య కాదు. ఈ స్థితి కొనసాగితే, కొనసాగనిస్తే దేశంలో అసహాయుల మీద, ప్రత్యర్థుల మీద మితిమీరిన హింసతో దేశం విస్ఫోటనం వైపు పయనిస్తుంది. ఇతరేతర విభేదాలన్నీ తాత్కాలికంగానైనా పక్కనపెట్టి, బుద్ధిజీవులు, ప్రజాస్వామికవాదులు, ప్రగతివాదులు విశాల ప్రజారాశుల మధ్యకు వెళ్లి జనసమీకరణ జరిపి ప్రతిఘటించవలసిన, పరిష్కరించవలసిన విస్తృత సామాజిక సమస్య ఇది. వీ

సంపాదకీయ వ్యాఖ్య - తెలంగాణ

బంగ్లలు కూలగొట్టుడు మంచిదే, కాని బంగ్లల పెత్తనమో?

పెద్దొర మాదండి ఉపాయం జేశిండట గద. పట్నంల గప్పుడెప్పుడో నిజాం రాజు గట్టిచ్చిన బంగ్లలన్ని కూలగొట్టాల్నని అనుకుంటాండట గద. మంచిగున్నది. అవ్వల్ దర్జ. బంగ్లలు పాతగై కూలిపోతాంటె ఇగ అవ్వి గూలిపోవుడేంది, మనమే గడ్డపారకు పని జెప్తె గాదా అనిపియ్యొచ్చు. అచ్చా, పాతవి గానివి గుడ కూలగొడ్తనంటాండా? అస్సల్కెందుకొచ్చె ఈ ఆలోశన దొరవారికి? తుర్కోల్లు గట్టిచ్చిన బంగ్లల్ల యాగాలు జేసుడు కుదరదని జెప్పింద్రా ఏంది పంతుళ్లు. ఎహె, పంతుళ్ల లెక్కేందయా, గాలి ఎటు మళ్లితె గటే మాట్లాడ్తరు! మారె, వాస్తు బాగలేదు, బంగ్ల గిట్లనే ఉంటె శని జొస్తదని చెప్పింద్రా ఏంది? గదానికి కూలగొట్టాల్నావయా? ఒక బంగ్ల వదిలిపెట్టి ఇంకో బంగ్లలకు పోతె సరిపాయె. అహ, పట్నంల ఎటు వోయినా గీ బంగ్లా నిజాం గట్టిచ్చిండు, గా బంగ్లా నిజాం గట్టిచ్చిండు, అగ్గో గీ బంగ్లాల నిజాం బామ్మర్ది ఉండె, గా బంగ్లాల నిజాం అత్తగారుండిరి, అని ఇనబడ్తాంటే దొర నారాజ్ అయిండేమో. ఇంకో పదేండ్లు బోయినంక, ఇగో గా బంగ్లా దొర గట్టిచ్చిండు, గీ బంగ్లా చిన్నదొర గట్టిచ్చిండు, ఇగో గీ బంగ్ల ఇంకో దొర గట్టిచ్చిండు గని, దొర బిడ్డ మన్ను పడి తీసుకున్నది, అగ్గో గా బంగ్లాల బుచ్చి దొర చిర్రగోనె ఆడిండు, మారె ఏదో నా జ్యాసల చిర్రగోనె అంటి గని, బుచ్చి దొర గా సుద్దరోల్ల ఆట ఆడ్తడా? కిర్కిట్టా అదేందో ఆడ్తడు గద... ఇట్ల జెప్పుకుంటె పట్నం చరిత్ర నిండ ఎటు దిరిగినా దొర పేరు ఇనబడాల్నని కాయిష్ అయిందా దొరకు? ఎహె, అది గాదు, ఇది గాదు, పాత బంగ్లాలు కూలగొట్టనీకి ఒక గుత్తెదారు, మల్ల కొత్తది కట్టనీకి ఇంకొక గుత్తెదారు, అట్ల గుత్తెదార్లు బలిశిపోవుటానికే ఈ ఉపాయం అని గుడ కొందరు అంటాంద్రట. నిజం అబద్ధం మనకు దెల్వది గని, గుత్తెదార్లు బాగుపడెడిదైతే నివద్దె. ఇంగ పాత బంగ్లలు కూలగొట్టి, ఆ జాగలు ఎవలికన్న అమ్మినా, ఇచ్చినా బగ్గ పైసలు వస్తయట గద. మారె, నా జిందగి మొత్తంల పదివేల కట్ట జూడలే గాని, పోరలు అంటాంటె ఇన్న, పదివేల కట్టలు వెయ్యి ఆడ బెడితె కోటి అంటరట గద, అటువంటి కోట్లు వందలు వస్తయట గద పట్నంల జాగలమ్మితె. అవునా? అయన్ని దొరకే వస్తయా, నాకు దెల్వకడుగుతాన. అంతె గద. పాత రాజు బోయి, ఇప్పుడు దొరొచ్చిండు గద గద్దె మీన. పాత రోజుల్ల రాజుకు బోయేది, ఇప్పుడు దొరకు బోతయి గావచ్చు. గంతేనా. అయినా ఇంకో ముచ్చటిను. బంగ్లలు ఉంటేంది, పోతేందయా? నా చిన్నప్పటి సంది, మా నాయినె చిన్నప్పటి సంది, ఇంక జెప్పాల్నంటే మా తాత ముత్తాతల సంది బంగ్లలున్నయి. మేమేమి బంగ్లలు వద్దన్లె. వాని పాపాన వాడే పోతడు తియ్ అనుకున్నం. మేం అడిగిందల్ల ఒక్కటే, మీరు బంగ్లల ఉన్నా, మేం గుడిసెల ఉన్న మిమ్ములను గోసిన నెత్తురే ఒస్తది, మమ్ములను గోసిన నెత్తురే ఒస్తది. అందరం మనుషుల మేనయ్యా, బంగ్లాల ఉన్నమని జులుం జెయ్యకుండ్రి, హజం జెయ్యకుండ్రి, బంగ్లతనం చూపెట్టకుండ్రి అని. ఉంటె ఉండనియ్యి తియి గాని, బంగ్లతనం ఎందుకు నాయినా? రాజకీయ పాల్టీల్ల తిరిగెటోడు చూడు, పైసలున్నోడు చూడు, సర్కారు నౌకరి జేసెటోడు జూడు, పోలీసోడు జూడు, తెల్లబట్టలు ఏస్కునోడు జూడు, వాడున్నది బంగ్ల గానీ కాకపోనీ, బంగ్లతనం జూపెడ్తడు. మేం మనుషులమే గానట్టు తీసి తీసి పారేస్తడు. గా బంగ్లతనం పోవాలె నాయనా. కావాల్నంటే బంగ్లల్లనె ఉండుండ్రి, పాత బంగ్లలు కూలగొట్టుండ్రి, కొత్త బంగ్లలు గట్టుకోండ్రి. కాని బంగ్లతనం ఇడిశి పెట్టుండ్రి బాంచెన్. అయినా నా పిచ్చిగని, పెద్దొర బంగ్లల మీద బంగ్లలు గట్టె. బంగ్లతనంల, కట్టె మర్లేసుల్ల మాబగ్గ అవ్వల్ దర్జ మారాజేనాయె. గాయినె బంగ్లతనం పోగొడ్తడా, ఉట్టి మాట గాని... వీ

సంపాదకీయ వ్యాఖ్య - ఆంధ్రప్రదేశ్

సమీక్షలు ప్రజా ప్రయోజనాల కోసమే కావాలి


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జూలై 1న తీసుకున్న ఒక సంచలనాత్మక నిర్ణయం కేంద్ర ప్రభుత్వంలో, పారిశ్రామిక, వాణిజ్యవర్గాలలో, బహుళ జాతి సంస్థలలో వివాదాస్పదమవుతూ చిలికి చిలికి గాలివానగా మారుతున్నది. దేశంలో బహుళ జాతి సంస్థలకూ, బడా పారిశ్రామిక వర్గాలకూ ప్రాతినిధ్యం వహించే వాణిజ్య పత్రికలన్నీ ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా విరివిగా వార్తా కథనాలు రాస్తున్నాయి. రాష్ట్రంలో గత తెలుగుదేశం పార్టీ పాలనా కాలంలో సంప్రదాయేతర విద్యుదుత్పత్తి కోసం, ముఖ్యంగా 7,700 మెగావాట్ల స్థాపిత సామర్థ్యపు సౌర, పవన విద్యుదుత్పత్తి కోసం, ఆ విద్యుత్తు కొనుగోలు కోసం ప్రైవేటు వ్యాపార సంస్థలతో కుదుర్చుకున్న ఒప్పందాలలో భారీ అవినీతి జరిగిందనీ, ఆ ఒప్పందాలన్నిటినీ సమీక్షించాలనీ, వారికి చెల్లిస్తున్న ధరలనూ, ఒప్పందం కుదిరిన నాటి మార్కెట్ ధరలనూ, ప్రస్తుత ధరలనూ మదింపు వేసి, ఆ ఒప్పందాలు సక్రమంగా జరిగి ఉంటే ప్రభుత్వానికి ఎంత ప్రయోజనం ఉండేదో తేల్చి, ఆయా సంస్థలతో కొత్త ఒప్పందాల కోసం చర్చలు జరిపి 45 రోజుల్లోగా నివేదిక ఇవ్వవలసిందిగా ఆదేశిస్తూ ప్రభుత్వం ఒక ఉన్నతస్థాయి కమిటీని జూలై 1న నియమించింది. ఆ క్రమంలోనే ఆంధ్రప్రదేశ్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపనీ అటువంటి సమీక్ష కోసం రమ్మని, ఈలోగా విద్యుత్ ధరలు తగ్గించమని ఒప్పందం కుదుర్చుకున్న వ్యాపార సంస్థలకు జూలై 12న లేఖ రాసింది. ప్రపంచీకరణ విధానాలు ప్రారంభమైనప్పటి నుంచీ విద్యుత్ కొనుగోలు ఒప్పందాలన్నీ అక్రమాల కుప్పలే. ఆ తేనెతుట్టెను కదిలిస్తే గత రెండున్నర దశాబ్దాలలో అధికారంలో ఉన్న ముఖ్యమంత్రులూ, విద్యుత్ శాఖ మంత్రులూ, సంబంధిత శాఖల అధికారులూ, బహుళ జాతి సంస్థలూ, వారి దళారీ సంస్థలూ అందరికందరూ వందల, వేల కోట్ల రూపాయల కుంభకోణాలలో భాగస్వాములుగా బైటపడతారు. అందుకే, గతంలో అక్రమంగా, అవినీతితో జరిగిన ఒప్పందాల రద్దు దాకా కూడ కాదు, కేవలం సమీక్ష అనే ప్రతిపాదన రాగానే గగ్గోలు ప్రారంభమయింది. ఇది మదుపుదారుల విశ్వాసాన్ని దెబ్బతీస్తుందని, అంటే రాష్ట్ర అభివృద్ధి గమనాన్ని మందగింపజేస్తుందని, ఇటువంటి చర్యలు చేపట్టవద్దని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. ఈ సమీక్షలు సాగితే, ఆ వ్యాపార సంస్థలు తెచ్చుకున్న రుణాలకు ముప్పు వాటిల్లుతుందని, తక్షణమే రు. 10,600 కోట్ల రుణాలు మొండి బకాయిలుగా మారిపోతాయని, మొత్తంగా ఇది రు. 21,000 కోట్ల రుణాలు ఇబ్బందిలో పడడానికి దారితీస్తుందని వ్యాపార సలహా సంస్థలు గగ్గోలు ప్రారంభించాయి. ఇక ఆ ఒప్పందాలు కుదుర్చుకున్న వ్యాపార సంస్థలు ప్రభుత్వ నిర్ణయాన్ని సవాలు చేస్తూ హైకోర్టుకు వెళ్లాయి. హైకోర్టు ప్రభుత్వ నిర్ణయం మీద స్టే విధించింది. వై ఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కూడ ఆ వ్యాపార సంస్థలను బెదిరించి వారి నుంచి ముడుపులు సంపాదించడానికే ఈ సమీక్షా కార్యక్రమాన్ని ప్రతిపాదించింది గాని, నిజంగా సమీక్షించాలని ఏమీ కాదు. ప్రజాధనం వ్యర్థమవుతున్నదనే, కాపాడాలనే ఆలోచన ఆ ప్రభుత్వానికేమీ లేదు. ప్రభుత్వాలూ వ్యాపార సంస్థలూ కలిసి ఎన్ని అక్రమాలతో ఎన్నెన్ని వేల కోట్ల ప్రజాధనాన్ని దోచుకు తింటున్నాయో, ఆ దోపిడీని ఆపడం కూడ కాదు, కనీసం సమీక్షిస్తామని అంటేనే ఎంత గగ్గోలు జరుగుతుందో ఈ పరిణామాలు చూపుతున్నాయి. పాలకవర్గ ముఠా తగాదాలే ఇంత గగ్గోలు రేకెత్తిస్తే, నిజంగా ప్రజల పక్షాన ఇటువంటి సమీక్షలూ, అక్రమాల రద్దులూ జరిగితే ఎంత విస్ఫోటనం జరగాలి! వీ


అమెరికా కనుసన్నలలో జి 20 శిఖరాగ్ర సమావేశం

- రాజేంద్ర బాబు అర్విణి


గత నెల జూన్‌లో జపాన్‌లోని ఒసాకా పట్టణంలో జరిగిన 'జి 20' శిఖరాగ్ర సమావేశం ప్రపంచం ఎదుర్కొంటున్న ముఖ్య సమస్యలే ఎజెండాగా చర్చించినట్లు పైకి కనిపించినా, అంతర్గతంగా అమెరికా, చైనా దేశాల మధ్య రగులుతున్న వాణిజ్య వైరానికి తాత్కాలిక విరామం పలకడం మినహా సాధించింది పెద్దగా ఏమీ లేదు. మార్కెట్లు విస్తరించుకునే క్రమంలో చైనా, దాని కద్దుకట్ట వేసి తన ఆధిపత్యం నిలుపుకోవాలని అమెరికా దోబూచు లాడుతుండడంతో ఈ రెండు దేశాల మధ్య వర్తక వ్యాపారాలకు సంబంధించి ఇటీవలి కాలంలో కొన్ని పరిణామాలు సంభవించాయి. అవి ప్రపంచ ఆర్థిక రంగాన్ని కొంతమేరకు ఒడిదుడుకులకు గురిచేసే ప్రభావం కలవి. కొన్ని లక్షల కోట్ల డాలర్లు అమెరికా నుండి బయటి దేశాలకు ముఖ్యంగా చైనాకు తరలిపోతున్నాయని, అమెరికా నుండి మేధోపరమైన చౌర్యానికి చైనా పాల్పడుతుందన్న ఆరోపణలతో అమెరికా కఠినమయిన ఆంక్షలకు తెరలేపింది. చైనా నుండి దిగుమతి అవుతున్న 1300 రకాల వస్తువులపై అధిక సుంకం విధించింది. దానికి ప్రతిగా చైనా అమెరికా నుంచి వచ్చే అత్యంత విలువైన 128 దాకా దిగుమతులపై సుంకాన్ని ఎన్నో రెట్లు పెంచింది. హువావే అన్నది చైనాకు చెందిన అతి పెద్ద టెలికమ్యూనికేషన్స్ సంస్థ. దానికవసరమయిన పరికరాలు అమెరికన్ కంపెనీల నుండి కొనకూడదని నిర్దేశిస్తూ ఆ సంస్థను నిషేధిత సంస్థల జాబితాలో చేర్చింది అమెరికా. దాదాపు ఒక సంవత్సర కాలంగా నడుస్తున్న అమెరికా చైనాల వాణిజ్య యుద్ధం నిలుపుకోవడం ఆ రెండు దేశాలకు అవసరం. లేకపోతే మార్కెట్ల కోసం అవి వెంపర్లాడే పరిస్థితి ఏర్పడుతుంది. ఇతర దేశాలతో పోటీ అనివార్యమవుతుంది. ఈ ఉద్రిక్త పరిస్థితి నుండి తాత్కాలిక ఉపశమనం కలిగేందుకు జి 20 సమావేశం తోడ్పడిందని చెప్పవచ్చు. జి 20 వేదికగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్, చైనా అధినేత జి జిన్ పింగ్ ఇరువురు ఏకాంతంగా 80 నిమిషాలు సమావేశమై రెండు దేశాల మధ్య ఉన్న విభేదాలను తాత్కాలికంగా పక్కకు పెడదామని నిర్ణయించుకొని పెంచిన సుంకాలను ఉపసంహరించుకున్నాయి.

ప్రపంచ ఆర్థిక రంగం, వర్తకం–పెట్టుబడులు, నూతన ఆవిష్కరణల ఆవశ్యకత, యువతకు ఉపాధి కల్పన, మహిళా సాధికారత లాంటి అంశాలతో పాటు జి 20 సమావేశం ప్లాస్టిక్ ఉపయోగం వల్ల సంభవిస్తున్న విపరీత పర్యావరణ ప్రతికూలతలు, ముఖ్యంగా సముద్ర గర్భంలో అది సృష్టిస్తున్న వినాశనకర పరిస్థితులపై చర్చించింది. ప్లాస్టిక్ వాడకం గురించి మూడు సూత్రాలు (వాడకం తగ్గించడం, తిరిగి ఉపయోగించడం, పునరావృతం చేయడం) పాటించాలని ప్రపంచ దేశాలకు సూచించింది. ఇవన్నీ ఇట్లా ఉండగా, అమెరికా అధ్యక్షుని కూతురు ఇవాంకా, అల్లుడు జారెల్ కుషనర్, కొడుకు డోనాల్డ్ జూనియర్‌లు పలు అంతర్జాతీయ నాయకులతో కలుపుగోలుగా ఉండడమేకాదు చర్చలలో అధికారికంగా పాల్గొంటూ ఆ సమావేశాన్ని కుటుంబ వ్యవహారంగా మార్చారు. ప్రజాస్వామ్యం బదులు కుటుంబ స్వామ్యాన్ని ప్రోత్సహించడం, వచ్చే సంవత్సరం (2020) తమ దేశంలో జరగనున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ జి 20 వేదికపై జాత్యహంకార భావనలు రేకెత్తించే వ్యాఖ్యలు చెయ్యడం ప్రపంచ వ్యాప్తంగా మేధావుల నిరసనకు గురయింది. జి 20 సభ్య దేశాలయిన 20 దేశాల అధినేతలతో పాటు 17 మంది ప్రత్యేక ఆహ్వానితులు హాజరయిన ఈ శిఖరాగ్ర సమావేశం ప్రపంచ రాజకీయాలకు దశ, దిశా నిర్దేశం ఏమాత్రం చేయలేక పోయిందనడం వాస్తవ దూరం కాదు. వీ






❖ **రాయలసీమను ఇలా సస్యశామలం చేద్దాం!** – ఎం. సుబ్బారాయుడు – రాయలసీమ విద్యావంతుల వేదిక ప్రచురణ – 128 పేజీలు, 1/8 డెమీ, రు. 50, ప్రతులకు: అరుణ్, ఇ.నెం. 87/106, శ్రీలక్ష్మినగర్, బి–క్యాంప్, కర్నూల్–518002, ఫోన్: 9440294462




❖ **సందర్భంతో సంభాషణ** – ఎం. శ్రీనివాస్ – సాహితీ స్పృహ ప్రచురణ – 248 పేజీలు, 1/8 డెమీ, రు. 160




❖ **మోడీ పాలన – కార్మిక వర్గం** – ఎం. శ్రీనివాస్ – సాహితీ స్పృహ ప్రచురణ – 152 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: ఎం. శ్రీనివాస్, ఫోన్ : 9392556967, అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో




❖ **సులభ వ్యాకరణము** – బొంత లచ్చారెడ్డి – పాలపిట్ట బుక్స్ ప్రచురణ – 151 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: పాలపిట్ట బుక్స్, ఇ.నెం. 16-11-20/6/1/1, 403, విజయసాయి రెసిడెన్సీ, సలీంనగర్, మలక్‌పేట, హైదరాబాద్ – 500036



❖ **నాలుగు అస్తిత్వాలు – నాలుగు నవలికలు** – డా. శాంతి నారాయణ – ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక సంస్కృతి సమితి ప్రచురణ – 212 పేజీలు, 1/8 డెమీ, రు. 150



❖ **నాగలకట్ట సుద్దులు** – రెండవ భాగము – డా. శాంతి నారాయణ – విమలా శాంతి ప్రచురణలు అనంతపురం – 224 పేజీలు, 1/8 డెమీ, రు. 150,
పై రెండు ప్రతులకు: డా. శాంతి నారాయణ, ఎస్.ఎస్. అపార్ట్‌మెంట్స్, మారుతి నగర్, అనంతపురం – 515001, సెల్ నెం. 8074974547




❖ **శ్రీ సీతారాముల కథ** – బాలకాండము – పారనంది శోభాదేవి – పాలపిట్ట బుక్స్ ప్రచురణ – 132 పేజీలు, 1/8 డెమీ, రు. 99, ప్రతులకు: శోభాదేవి పారనంది, ఫ్లాట్ నెం. 145, శైలి గార్డెన్స్, యాప్రల్, జె.జె. నగర్ పోస్ట్, సికింద్రాబాద్ – 500087



❖ **ఆధునికాంధ్ర గేయకవిత్వం** – ఉస్మానియా విశ్వ విద్యాలయం వారి పిహెచ్.డి. పట్టం పొందిన సిద్ధాంత గ్రంథం – ఆచార్య జి. చెన్నకేశవరెడ్డి – జయమిత్ర సాహిత్య సాంస్కృతిక వేదిక ప్రచురణ – 506 పేజీలు, 1/8 డెమీ, రు. 350,



❖ **మకాం మార్చిన మణి దీపం** – కవితా సంపుటి – ఆచార్య జి. చెన్నకేశవరెడ్డి – జయమిత్ర సాహిత్య సాంస్కృతిక వేదిక ప్రచురణ – 156 పేజీలు, 1/8 డెమీ, రు. 125,



❖ **అక్షరన్యాసం** – సాహిత్య వ్యాస సంపుటి – ఆచార్య జి. చెన్నకేశవరెడ్డి – జయమిత్ర సాహిత్య సాంస్కృతిక వేదికి ప్రచురణ – 288 పేజీలు, 1/8 డెమీ, రు. 250,
పై మూడు ప్రతులకు: ఆచార్య జి. సుమిత్ర, విల్లా నెం. 5, సైబర్ మీడోస్, జైన్ హెరిటేజ్ స్కూల్ ఎదురు రోడ్డు, కొండాపూర్, హైదరాబాద్ – 500084, ఫోన్: 040–23014405, సెల్ : 9492047027




❖ **మహాభారతం – సొగసులు–సూక్ష్మాలు** – సాకం నాగరాజు – అభినవ ప్రచురణలు, తిరుపతి – 85 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: సాకం శశికళ, ఇ.నెం. 6–1–70, వరదరాజు నగర్, తిరుపతి – 517 507, ఫోన్ : 0877–2230135



❖ **కొత్త కథ – 2019** – సంపాదకులు కె. సురేష్, మహమ్మద్ ఖదీర్‌బాబు– రైటర్స్ మీట్ పబ్లికేషన్స్ ప్రచురణ – 248 పేజీలు, 1/8 డెమీ, రు. 149, ప్రతులకు: నవోదయ బుక్‌హౌస్, కాచిగూడ, హైదరాబాద్, అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో



❖ **నీటిదీపం** – కవిత్వం – తండ హరీష్ గౌడ్ – శారద ఫౌండేషన్ ప్రచురణ – 160 పేజీలు, 1/8 డెమీ, రు. 125, ప్రతులకు: టి. హరీష్ గౌడ్, ఇ.నెం. 12–4/3సి, గ్రామం : మండల్ : గూడూరు, జిల్లా మహబూబాబాద్ – 506134, ఫోన్ : 8978439551



❖ **వడిచర్ల మణిపూసలు** – వడిచర్ల సత్యం – కాగ్నా కళాసమితి – 108 పేజీలు, 1/8 డెమీ, రు. 75, ప్రతులకు: వడిచర్ల సత్యం, ఇ.నెం. 2–2–87/29, సాయినగర్, సాయిపూర్, తాండూర్, వికారాబాద్ – 501141; సెల్: 9441350137

లక్ష్యాలు ఘనం - ఫలాలు శూన్యం - కేంద్ర బడ్జెట్

***కేంద్ర ప్రభుత్వం ఈసారి ప్రవేశపెట్టిన బడ్జెట్ బహుళజాతి కంపెనీలకు, ప్రైవేటీకరణకు మరింత లాభం చేకూర్చే విధంగా, దేశీయ మౌలిక రంగాలను మరింత నీరుగార్చే విధంగా ఉందని అంటున్నారు* ఎ. పున్నయ్య**

దాదాపుగా ఏడున్నర దశాబ్దాల స్వతంత్ర భారత ఆర్థిక చరిత్రలో 28 మంది ఆర్థిక మంత్రులుగా పనిచేస్తే, ఇందులో నేటి వరకు కేవలం ఇద్దరు మహిళలు మాత్రమే పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టారు. 1970-71లో తొలి మహిళగా ఇందిరా గాంధీ చరిత్రలో నిలిచిపోయారు. తిరిగి దాదాపు ఐదు దశాబ్దాల అనంతరం ద్వితీయ మహిళా ఆర్థికమంత్రిగా నిర్మలా సీతారామన్ జూలై 5న పార్లమెంట్‌లో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. స్త్రీల ఆర్థిక, సామాజిక, రాజకీయ స్వావలంబన కోసం దశాబ్దాలుగా మహిళా రిజర్వేషన్ బిల్లు ఒక మూల నలుగుతోంది. ఈ సందర్భంలో ప్రపంచ మూడవ ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతున్న అతిపెద్ద ప్రజాస్వామ్య భారతదేశానికి అత్యంత కీలకమైన ఆర్థిక శాఖ పగ్గాలు మహిళ చేపట్టినందుకు స్వాగతించాల్సిందే. తాను రాసుకొచ్చిన స్పీచ్ చదివినట్టు కాకుండా చాలా ఆత్మ విశ్వాసంతో చాణక్య నీతులు, ఉర్దూ కవితలు, పురాణ గాథలు వల్లిస్తూనే సామాన్యులకు అర్థం కాని ఆర్థిక పదజాలంతో ప్రసంగం ప్రారంభించింది. అయినప్పటికీ ఈ దేశంలో సాధారణంగా వ్యవస్థీకృతమైన విధానమే ఈ ఆర్థిక మంత్రికి వర్తించింది. స్త్రీ శక్తి అని చెప్పినా స్వతంత్ర శక్తిలేని స్త్రీ ప్రవేశపెట్టిన బడ్జెట్‌గానే చూడాల్సి వస్తుంది. ఎందుకంటే కథ, స్క్రీన్‌ప్లే, నిర్మాణ బాధ్యతలన్నీ మోడీవి కాగా కేవలం ప్రివ్యూ విడుదల మాత్రమే సీతారామన్‌ది అని అర్థమవుతోంది.

బడ్జెట్ భావనలు

భారతదేశంలో రాజ్యాంగబద్ధ పాలన కోసం ప్రతి సంవత్సరం ఏప్రిల్ నుండి మార్చ్ 31 వరకు ప్రభుత్వం చేసే ఖర్చుకు పార్లమెంట్ ద్వారా అనుమతి పొందే ప్రక్రియ బడ్జెట్. సాంకేతికంగా బడ్జెట్ అంటే ఆదాయ వ్యయాలు తెలిపే వార్షిక ప్రకటన. ఈ ప్రకటనలో దేశ ఆర్థికాభివృద్ధి సవాళ్లు, సమస్యలు పరిష్కారాలు ఉండాలి. ఇది ప్రజల జీవన పరిస్థితులు మెరుగుపరిచి సంపదను సృష్టించే వినూత్న ఆలోచనలతో కూడిన ఆవిష్కరణ కావాలి. ఈ ఆవిష్కరణలు ముందుకు పోవాలంటే అధిక మూలధన వ్యయం జరగాలి. సంపదను సృష్టించి ఆదాయాలను పెంచాలి. దీనితో ప్రజలకు ఉపాధి కల్పనతో పాటు కొనుగోలు శక్తి పెరుగుతుంది. స్థూలంగా ఉత్పత్తి పెరుగుతుంది. ఇదే బడ్జెట్ లక్ష్యంగా ఉండాలి. కాని ఈ బడ్జెట్‌లో దేశ భద్రత, ఆర్థికవృద్ధి అనే రెండు కీలక లక్ష్యాలు. నవ భారత నిర్మాణం కోసం అడుగులు వేస్తున్నామంటూ దేశ ఆర్థిక రంగ బలోపేతం భారీ స్వప్నంగా దిగ్గజ భారత నిర్మాణమే ధ్యేయంగా గత బడ్జెట్ కంటే 13.3 శాతం అధిక అంచనాలతో రు. 27,86,349 కోట్ల ఆదాయ వ్యయ అంచనాలు వేసింది. దీనిని రానున్న పదేళ్లకు దార్శనికత పత్రంగా ప్రకటించింది. 2024 నాటికి 5 ట్రిలియన్ డాలర్ల (350 లక్షల కోట్లు) ఆర్థిక వ్యవస్థగా రూపుదిద్దుకోవాలని సంకల్పించింది. కాని ఎంచుకున్న మార్గాలలో స్పష్టత లేదు.

ఈ బడ్జెట్‌లో ద్రవ్యలోటు రు. 7,03,760 కోట్లు చూపింది. ఇది స్థూల జాతీయోత్పత్తిలో (జిడిపి) 3.3 శాతం. ఈ లోటును పూడ్చడమంటే గతం కంటే రు. 26 లక్షల కోట్లు ఎక్కువగా విదేశీ మార్కెట్ నుండి రు. 4.48 లక్షల కోట్లు అప్పులు సేకరించాలి. నిజానికి గత ఆర్థిక సంవత్సరంలో తీసుకున్న అన్ని రకాల రుణాలను కలిపితే రు. 5.71 లక్షల కోట్లు. ఈ సంవత్సరం ద్రవ్యలోటును పూడ్చాలంటే దేశీయంగా, విదేశీయంగా రు. 7.1 లక్షల కోట్ల రుణాలు సేకరించాల్సింది ఉంది. 2019-20 చివరి నాటికి రు. 98,67,921 కోట్ల అప్పును అంచనా వేసింది. ఈ సంవత్సర బడ్జెట్‌లో 18 శాతం అనగా రు. 6,60,471 కోట్లు వడ్డీలు చెల్లించే రుణగ్రస్థ స్థితిలో భారతదేశం ఉండడం విచారకరం.

బడ్జెట్ లక్ష్యాలు

బృహత్ ప్రణాళిక రచనకే పెద్దపీట వేశామని ఊరడింపులు, ఉదార కేటాయింపులు లేకుండా గట్టి ఆర్థిక క్రమశిక్షణ పాటించామని గొప్పలు చెప్పారు. వాస్తవానికి కొనసాగుతున్న సంక్షేమ పథకాలన్నింటికీ బాసట నివ్వడంతో పాటు కీలకరంగాల్లో విదేశీ పెట్టుబడులకు తులుపులు బార్లా తెరిచింది. కార్పొరేట్ల కనుసన్నలలో నడిచే ఈ ప్రభుత్వం కార్పొరేట్లకు ప్రోత్సాహకంగా పన్ను తగ్గించి వారి నుంచి మరింత మెప్పు పొందింది. ఆదాయపు పన్ను శ్లాబుల్లో ఎలాంటి మార్పులు లేకుండా యథాతథంగా కొనసాగించి వేతన జీవులను నిరాశపరిచింది. పైకి కనిపించే విధంగా ఎన్నికల వాగ్దానాలను ముందుకు తీసుకుపోయినట్లుగా భ్రమపరస్తూ గావ్, గరీభ్, కిసాన్‌లకు నామమాత్రంగా కేటాయింపులు జరిపింది.

స్థూలంగా ఈ బడ్జెట్‌లో అంకెలకన్నా ఆలోచనలు భారీ గణాంకాల

కేంద్ర బడ్జెట్ సమగ్ర స్వరూపం (రు. కోట్లలో)

	2017-18 వాస్తవ గణాంకాలు	2018-19 బడ్జెట్ అంచనాలు	2018-19 సవరించిన అంచనాలు	2019-20 బడ్జెట్ అంచనాలు
రెవెన్యూ వసూళ్లు	14,35,233	17,25,738	17,29,682	19,62,761
మూలధన వసూళ్లు	7,06,740	7,16,475	7,27,553	8,23,588
మొత్తం వసూళ్లు	21,41,973	24,42,213	24,57,235	27,86,349
మొత్తం వ్యయం	21,41,973	24,42,213	24,57,235	27,86,349
రెవెన్యూ లోటు	4,43,600	4,16,034	4,10,930	4,85,019
కోశలోటు	5,91,062	6,24,276	6,34,398	7,03,760
ప్రాథమిక లోటు	62,110	48,481	46,828	43,289

కన్నా భ్రమనుగొల్పే ప్రణాళికలే అధికంగా ఉన్నాయి. పైకి ఉన్నత లక్ష్యాలు కనిపించినప్పటికీ కేటాయింపుల్లో కనిపించకపోవడం శోచనీయం. పెట్రోల్, డీజిల్‌పై అదనపు ఎక్సైజ్ సుంకం, రహదారుల మౌలిక సదుపాయాల సెస్సును పెంచి సామాన్య మధ్యతరగతిని తీవ్ర నిరాశకు గురిచేసింది. వ్యవసాయ, విద్య, గ్రామీణ, ఆరోగ్య రంగాలకు అరకొర కేటాయింపులతో అసంతృప్తి కలిగించింది. బంగారంపై దిగుమతి సుంకం పెంచి మహిళలను నిరాశ పరిచింది.

అర్థం కాని అదనపు పన్ను వసూలు పెంపు

పన్ను వసూలు 78 శాతం పెరిగిందని ప్రభుత్వం ప్రకటించింది. పన్ను వసూలు పెరిగిన తర్వాత ఉద్యోగుల నుంచి అదనపు పన్ను వసూలు ఎందుకు చేయాలన్నది అర్థం కావడం లేదు. పథకాల కన్నా ముందుగా పన్ను ప్రకటించడం ఈ బడ్జెట్‌లో కొత్త మార్పు. డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించాలంటూ ఏడాదికి కోటి రూపాయల నగదు ఉపసంహరిస్తే రెండు శాతం పన్ను విధించాలని సూచించారు. కాని కోట్లలో లావాదేవీలు జరిపేవారు చెక్కుల రూపంలోనే చెల్లిస్తారు. కోటీ లోపల వ్యాపారం చేసేవారు ఉపసంహారాలు కోటి దాటనివ్వరు. ఈ కొత్త పన్ను ఎందుకో స్పష్టత లేదు.

అన్నదాతను నిరాశపరిచిన ఆర్థిక మంత్రి

2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలన్న నిర్దేశిత లక్ష్యాన్ని సాధించే దిశగా వ్యవసాయ రంగానికి కేటాయింపులు లేవు. ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థలో వాణిజ్య పరమైన షరతులతో వ్యవసాయ రంగాన్ని పూర్తిగా దెబ్బతీస్తున్నాయి. యుపిఎ, ఎన్‌డిఎ ప్రభుత్వాలు పంటల మద్దతు ధరను స్వల్పంగా పెంచినాయి. అయినప్పటికీ స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం పంటల సాగు వ్యవసాయానికి అదనంగా 50 శాతం కలిపి మద్దతు ధర ఇచ్చే ప్రతిపాదనేది ఈ బడ్జెట్‌లో లేదు. ద్రవ్యోల్బణాన్ని ఆహార ఉత్పత్తుల ధరలను అదుపులో ఉంచడానికి మద్దతు ధరలను పెంచడం లేదు. పంటల ధరలు ఉత్పాదకత పెరగకుండా రైతుల ఆదాయం ఎలా పెరుగుతుంది? వ్యవసాయ రంగంలో ప్రభుత్వ పెట్టుబడులు గణనీయంగా తగ్గిపోతున్నాయి. సమాజంలో అభివృద్ధి కరమైన మార్పులు రావాలంటే రైతులకు సహాయ, సహకారాలు అందించాల్సిన అవసరముంది. నేటికి ఈ దేశంలో యాభై శాతానికి పైగా జనాభా వ్యవసాయం దాని అనుబంధ రంగాల మీద ఆధారపడింది. కాని జిడిపిలో సేద్యం వాటా రోజు రోజుకు తగ్గుకుంటూ నేడు 14.4 శాతంగా నమోదు అయింది. ఈ తగ్గింపు ఆందోళన కలిగిస్తుంది. దీనికి ప్రధాన కారణాలు దేశంలోని దాదాపు 14.4 కోట్ల మంది రైతుల్లో 86.2 శాతం చిన్న, సన్నకారు రైతులున్నారు. వీరి చేతిలో ఉన్నది కేవలం 47.4 శాతం భూమి మాత్రమే. మిగిలిన 13.8 శాతం రైతుల చేతిలో 52.6 శాతం భూమి ఉన్నది. అత్యంత శాతం రైతులు అతి తక్కువ విస్తీర్ణం సాగు చేయడం కలవరపరిచే కఠోర సత్యం. భారీ భూ సంస్కరణలు, దీర్ఘకాలిక వ్యూహాలు బలంగా అమలు చేశామని ప్రకటించినప్పటికీ క్షేత్రస్థాయిలో దాని ప్రభావం కనిపించడం లేదు.

రైతులకు ప్రత్యక్షంగా ఉపయోగపడే అంశాలేవీ ఈ బడ్జెట్‌లో ప్రస్తావించలేదు. గడిచిన రెండేళ్లలో పప్పు దినుసుల ఉత్పత్తి పెంచినందుకు సంతోషాన్ని వ్యక్తం చేసిన ప్రభుత్వం ముమ్ముందు రైతులు నూనే గింజల ఉత్పత్తిని పెంచాలని, దీనివలన దిగుమతుల భారం తగ్గుతుందని ప్రోత్సహించింది. దీనిని స్వాగతించాల్సిందే కాని, గతంలో పప్పు దినుసులను అధికంగా పండించినప్పటికీ ధరలు పడిపోవడం వలన రైతులు నష్టపోయారు. ఇప్పుడు నూనే గింజల దిగుబడులను పెంచినప్పటికీ ధరలు పడిపోతే భరోసా ఎవరన్నది రైతుల నుంచి ఉత్పన్నమయ్యే ప్రశ్న. దీనికి ప్రభుత్వం మద్దతు ధరతో ఆదుకునేందుకు ముందుకు రావడమే పరిష్కారం. కాని తాత్కాలిక చర్యలు సరిపోవు.

శాస్త్రీయ ఆలోచనలేని ప్రకృతి వ్యవసాయ ప్రతిపాదన

రైతులపై రుణ భారాన్ని తగ్గించేలా, పంటల సాగు ఖర్చును తగ్గించేలా ప్రకృతి వ్యవసాయానికి (జీరో బడ్జెట్ ఫార్మింగ్‌కు) కార్యాచరణ మొదలు పెట్టినట్లు బడ్జెట్‌లో వెల్లడించారు. పెరిగిన పెట్టుబడుల, అతివృష్టి, అనావృష్టితో కొట్టుమిట్టాడుతూ మద్దతుధర లేకపోవడంతో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. రైతుల ఆత్మహత్యల నివారణకు సరైన సమయానికి రుణాలు మంజూరు చేయాలి, మద్దతు ధరను ప్రకటించాలి, రుణమాఫీ ప్రకటించాలి. కాని, ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయం ద్వారా అన్నదాతలు తమ ఆదాయం రెట్టింపు చేసుకోవాలని సూచించే ముందు దీనిపై శాస్త్రీయంగా విశ్లేషణ చేయించడం, దీని సాధ్యాసాధ్యాలు లాభ నష్టాలను మదింపు చేయాల్సిన అవసరముంది. అనంతరం వెల్లడైన ఫలితాల మేరకు కార్యాచరణతో ముందుకు సాగాలి. కాని అశాస్త్రీయంగా ముందుకు వెళితే ఫలితాలు సానుకూలంగా ఉండవు.

గ్రామీణ ప్రాంతాల్లో 75,000 మందికి వ్యవసాయ వ్యాపార సామర్థ్యాలు పెంపొందేలా తర్ఫీదు ఇచ్చి, వారి నైపుణాలు పెంచి చిన్న వ్యాపారులుగా తీర్చిదిద్దాలనే సంకల్పం స్వాగతించాల్సిందే. ఈ సంఖ్యను మరింత పెంచి ఈ వ్యాపారులు రైతులు పండించే పంటలను గ్రామీణ ప్రాంతాల్లోనే ప్రాసెసింగ్ చేసే చర్యలు తీసుకోవాలి. ఆ మేరకు పన్నులను తగ్గించే ప్రతిపాదనలు ముందుకు రావాలి. ఈ చర్యలు ఆచరణాత్మకంగా ముందుకు వస్తే రైతులు పండించిన పంటకు అధిక ధర లభించే అవకాశాలున్నాయి. దీనిని అమలు చేసి ఈ ప్రభుత్వం తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి. వచ్చే ఐదేళ్లలో దేశ వ్యాప్తంగా కొత్తగా 10 వేల రైతు ఉత్పాధక సంఘాలు ఏర్పాటు చేయనున్నట్లు బడ్జెట్‌లో ప్రకటించింది. ఈ సఖ్యను మరింత పెంచితేనే రైతుల సంఘటిత శక్తి పెరిగి అధిక లాభాలు పొందే అవకాశముంది. కాని దీనికోసం ఖర్చుచేసే నిధులపై స్పష్టత రావాల్సిన అవసరముంది.

ఇ-నామ్‌లు మరిన్ని విస్తరించాలి

ఈ-నామ్ పద్ధతిని మెరుగ్గా ఉపయోగించుకొని రైతులు అధిక ధరలు పొందాలన్నా, మోసాల బారీన పడకుండా తమ పంటలకు గిట్టుబాటు ధరలు పొందాలంటే ఈ-నామ్‌ల సంఖ్యను మరింతగా విస్తరించాలి. కేంద్ర ప్రభుత్వమే ఈ-నామ్‌లను నిర్వహిస్తే పారదర్శకంగా ఉంటుంది. కేంద్రం తాను బాధ్యత నుండి తప్పించుకునే ప్రయత్నమే రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి నిర్వహిస్తామని నమ్మబలకడం. ఈ ప్రభుత్వానికి రైతుల మీద చిత్తశుద్ధి ఉంటే స్వామినాథన్ కమిషన్ నివేదిక ప్రకారం కేంద్ర ప్రభుత్వమే ఈ-నామ్‌లను ముందుకు తీసుకుపోవాలి. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలని ఆర్థిక సర్వే పేర్కొంటుండగా బడ్జెట్‌లో మాత్రం ఎరువుల రాయితీని 14 శాతం పెంచి ఇందుకోసం రు. 79,976 కోట్లు కేటాయించింది. దీనికి ప్రత్యామ్నాయంగా సంప్రదాయ ఎరువుల అభివృద్ధికి చర్యలతో పాటు రాయితీలిస్తే అనుకున్న లక్ష్యం నెరవేరుతుంది. దీనితో పాటు పర్యావరణాన్ని పరిరక్షించినట్లు అవుతుంది. కాని ఈ దిశగా చర్యలు జరగలేదు.

స్థూలంగా ఈ బడ్జెట్‌ను సమీక్షిస్తే వ్యవసాయ రంగానికి తగిన ప్రాధాన్యత దక్కలేదు. జిఎస్‌టి మండలీ తరహాలో జాతీయ స్థాయిలో

వ్యవసాయ మండలిని ప్రధాన మంత్రి అధ్యక్షతన ఏర్పాటు చేయాలి. ప్రథమంగా విత్తనరంగ అభివృద్ధికి అవసరమైన మరిన్ని పరిశోధనలు జరగాలి. ఇది జరగని పక్షంలో వ్యవసాయ రంగంలో మౌలిక మార్పుల కోసం కిసాన్ లాంగ్‌మార్చ్‌లు, ప్రాణం తప్ప పోగొట్టుకోవడానికి ఏమీలేని రైతులు సుమారు యాభైవేల మంది కాలిపాదాలు పగిలి నెత్తురోడుతున్నా తమ జీవించే హక్కు, గిట్టుబాటు ధర, రుణమాఫీ అడిగిన సంఘటనలు మరల పునరావృతం అవుతాయి. అలాంటి స్థితిలోకి ఈ దేశ రైతులను నెట్టకుండా ప్రభుత్వాలు జాగ్రత్తపడాలి.

విద్యా రంగానికి అరకొర నిధులే

మానవ వనరుల అభివృద్ధి విద్యారంగ అభివృద్ధిపై ఆధారపడింది. కాలానుగుణంగా పెరుగుతున్న జనాభా అవసరాలను దృష్టిలో ఉంచుకొని దేశంలో విద్యా రంగంలో సమగ్ర సంస్కరణలు తీసుకురావాలి. ఈ అవసరాలు తీరే విద్యా రంగానికి జిడిపిలో కనీసంగా ఆరు శాతం నిధులైనా కేటాయించాలని అనేక కమిషన్లు నివేదికలిచ్చాయి. ఆర్గనైజేషన్ ఫర్ ఎకనమిక్ అంట్ కో ఆపరేషన్ డెవలప్‌మెంట్ విడుదల చేసిన 2018 వార్షిక నివేదికను, బ్రెజిల్, చిలీ, మెక్సికో, న్యూజిలాండ్ లాంటి దేశాలు సహితం 16 నుంచి 19 శాతం నిధులు విద్యా రంగానికి కేటాయిస్తున్నాయి. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం విద్యా రంగంలో సమూల మార్పుల కోసం జాతీయ విద్యా విధానం అమలు చేస్తామని, విద్యా రంగానికి పెద్దపీట వేసి నవతరం శాస్త్ర సాంకేతిక రంగాల్లో ప్రపంచ స్థాయి ఉన్నత విద్యను సిద్ధం చేసుకోవడానికి ఈ బడ్జెట్‌లో 400 కోట్లు కేటాయించారు. కౌశల్ భారత్ పేరిట, నిపుణ మానవ వనరులను తయారు చేసుకుంటామనే ఆర్భాటమే తప్ప అడుగులు ముందుకు పడలేదు. ఈ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి దేశ వ్యాప్తంగా కోటి మందికి నైపుణ్యాలు కృత్రిమ మేధ, ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్, బిగ్‌డెటా, 3-డి ముద్రణ వర్చువల్ రియాలిటి, రోబోటిక్స్ లాంటి కొత్త తరం నైపుణ్యాలను అందించి ప్రపంచంలో ఎక్కడానైనా ఉపాధి సాధించే సత్తా చేకూర్చుతామని ప్రకటించడం ఆశ్చర్యం కలిగిస్తుంది.

మొత్తం బడ్జెట్‌లో విద్యా రంగానికి కేవలం రు. 94,854 కోట్లు అంటే 3.4 శాతం నిధులు మాత్రమే కేటాయించింది. ఇది గత బడ్జెట్ కంటే 5 శాతం తగ్గింపు. ఇలాంటి అరకొర కేటాయింపులతో విద్యారంగం ఏ రకంగా పురోగతి చెందుతుందో పాలకులకే తెలియాలి. దేశంలో విశ్వవిద్యాలయాలు, కళాశాలల సంఖ్య పెరుగుతుందే కాని, బోధనా సిబ్బంది ఖాళీలను భర్తీ చేయడం లేదు. నేటికీ కేంద్రీయ విశ్వ విద్యాలయాల్లో సుమారు 5,606, ఐఐటీల్లో 2802, ఎన్ఐటీల్లో 3235తో పాటు ఐఐఎం, ఐఐబిలలో వేలాది ఖాళీలున్నాయి. దేశంలో 78 శాతం కళాశాలలు ప్రైవేట్ యాజమాన్యాల చేతుల్లో ఉన్నాయి. ప్రైవేట్ యాజమాన్యాలు లాభాల గురించి మాత్రమే ఆలోచిస్తారు. ఈ నేపథ్యంలో పరిశోధనలను గాలికొదిలినారు. జిడిపిలో చైనా 1.97 శాతం, అమెరికా 2.84 శాతం, జపాన్ 3.5 శాతం, దక్షిణ కొరియా 4.3 శాతం, భారత్ మాత్రం 7.7 శాతం మాత్రమే పరిశోధనలకు కేటాయించడం ముందుచూపు లేకపోవడమే. పరిశోధనలు పెరిగినప్పుడే దేశం అన్ని రంగాల్లో ముందడుగు వేస్తుంది. ప్రపంచ దేశాలతో పోల్చుకుంటే విద్యార్థుల స్థూల నమోదులో మనదేశం వెనకంజలో ఉంది. అమెరికాలో 85.5 శాతం, రష్యాలో 80.4 శాతం, యునైటెడ్ కింగ్‌డమ్‌లో 50.5 శాతం, చైనాలో 43.4 శాతం ఉంటే భారతదేశంలో మాత్రం 25.8 శాతం ఉంది. స్థూల నమోదు అనేది విద్యాభివృద్ధికి తొలిమెట్టు. ప్రపంచ దేశాలతో పోటీ పడాలంటే ప్రభుత్వాలు విద్యారంగం మీద దృష్టి సారించాల్సిన అత్యవసరముంది. నిధులను కనీసంగా రెట్టింపు చేయాలి. విద్య కేవలం కేంద్ర జాబితాలో లేదు. రాష్ట్ర జాబితాలో కూడా ఉంది కావున కేంద్రం రాష్ట్రాలను సంప్రదించకుండా ఏమి రుద్దినా అది నియంతృత్వమే అవుతుంది. స్వయం లాంటి ఆన్-లైన్ పద్ధతి ద్వారా విద్యను ప్రోత్సహిస్తామంటున్న ప్రభుత్వం లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, లండన్ యూనివర్సిటీ కేంబ్రిడ్జి యూనివర్సిటీ, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ లాంటి ప్రసిద్ధి పొందిన విశ్వవిద్యాలయాల దూరవిద్యను ఎందుకు గుర్తించడం లేదో సమీక్షించుకోవాలి.

జిడిపిలో ఒక్క శాతానికి మించని ఆరోగ్య రంగం

బడ్జెట్‌లో ప్రభుత్వ ఆరోగ్య సంస్థలను బలోపేతం చేసే దిశగా అడుగులు పడలేదు. పేద ప్రజలకు మేలు చేసే పథకాలను ప్రకటించక పోగా, కార్పొరేట్లకు లాభం చేకూర్చే విధంగా ఈ బడ్జెట్ ఉంది. గత బడ్జెట్‌లో రు. 52,800 కోట్లు కేటాయిస్తే, నేడది రు. 19 శాతం అధికం చేసి రు. 62,398 కోట్లకు పెంచింది. ఇది దేశ జిడిపిలో కేవలం ఒక శాతంలోపే. కనీసం 2.5 శాతానికి కేటాయింపులు లేకపోవడం శోచనీయం. ఈ కేటాయింపులతో ఆరోగ్య భారతాన్ని నిర్మించడం అసాధ్యమే. దేశప్రగతి సూచికలైన విద్య, వైద్యం ఏ దేశంలోనైతే ఉచితంగా, గుణాత్మకంగా అందుతుందో ఆ దేశం ప్రగతి పథంలో ముందుకు సాగుతుంది. వాస్తవానికి నేడు ప్రతి ఒక్కరు అధికంగా ఖర్చు పెట్టేది ఈ రెండింటి పైననే. ఈ రెండు రంగాలకు తగిన కేటాయింపులు లేకపోవడం ఈ ప్రభుత్వ దార్శనికత లోపమే. మిగిలిన అన్ని రంగాలలో పెట్టుబడులు ఆశించిన మోతాదులో లేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం.

విదేశీ సంస్థలకు ఎర్రతివాచీ పరిచిన బడ్జెట్

స్వాతంత్ర్యానంతరం ఈ దేశం మిశ్రమ ఆర్థిక విధాన నమూనాను ఎంచుకొని నెహ్రూ సోషలిస్టు పంథానుంచి క్రమ క్రమంగా స్వేచ్ఛా విఫణి దిశగా కదిలింది. ఈ క్రమంలో అనేక సంస్కరణలు ముందుకు వచ్చాయి. భీమా, డిజిటల్ మీడియా, ఒప్పంద పారిశ్రామిక ఉత్పత్తి వంటి రంగాల్లో భారీగా విదేశీ పెట్టుబడులను ఆహ్వానిస్తుంది. నేడు చైనాపై అమెరికా సాగిస్తున్న వాణిజ్య యుద్ధ ప్రభావం వలన ప్రపంచమంతటా స్వీయ వాణిజ్య రక్షణ ధోరణులు పెచ్చరిల్లుతున్నాయి. ఈ నేపథ్యంలో భారత్‌లో పెట్టుబడులు పెట్టడానికి బహుళజాతి సంస్థలు ఏ మేరకు ముందుకు వస్తాయో అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో దాదాపుగగా 200 అమెరికన్ బహుళజాతి సంస్థలు తమ ఉత్పత్తి కార్యకలాపాలను చైనా నుంచి భారత్‌కు తరలించడానికి సిద్ధంగా ఉన్నట్లు ఆ సంస్థల యాజమాన్యాలు ప్రకటించాయి. ఇలాంటి అంతర్జాతీయ సంస్థలను ఆకర్షించడానికి ఈ ప్రభుత్వం సులభంగా వ్యాపారం చేసుకునే పరిస్థితులను భారీగా కలిపిస్తుంది. పరిశ్రమలకు భూసేకరణలో, అవస్థాపన సౌకర్యాల కల్పనలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. సారంలో బహుళజాతి సంస్థలకు ఎర్రతివాచి పరిచి రూపంలో మేక్ ఇన్ ఇండియా మా ఎజెండా అని బోధించడం మొదటి నుండి ఈ ప్రభుత్వ నైజం. ఈ నేపథ్యంలో మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్‌ను మెజారిటీ స్వదేశీ వర్గాలు సంతృప్తి వ్యక్తం చేయకపోయినప్పటికీ అమెరికా పారిశ్రామిక రంగం మాత్రం ఈ బడ్జెట్‌ను స్వాగతించింది. భారతదేశ బడ్జెట్ విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించేదిగా ఉందని, భారత్‌లో మరిన్ని కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు అమెరికా సహకరిస్తుందని స్వయంగా అమెరికా

– భారత్ వ్యూహాత్మక భాగస్వామ్య ఫోరం అధ్యక్షుడు ముఖేషి అభిప్రాయపడ్డాడు. సంస్కరణలే ధ్యేయంగా బడ్జెట్‌ను రూపొందించారని అమెరికా భారత్ వ్యాపారి మండలి అధ్యక్షురాలు నిషాదేశాయి, బిస్వాల్ కితాబివ్వడమంటేనే ఇది నెహ్రూ సోషలిస్టు పంథా నుండి మోడీ స్వేచ్ఛా విఫణి దిశగా ముందుకు సాగుతున్నట్లు అర్థమవుతుంది.

5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ సాధ్యమేనా?

భారతదేశం స్థూల దేశీయ ఉత్పత్తి (జిడిపి) వృద్ధిరేటు కొన్ని దశాబ్దాలుగా 6 నుండి 7 శాతం మధ్య నమోదు అయింది. 2018–19 ఆర్థిక సంవత్సరంలో నాలుగు త్రైమాసికాలలో వృద్ధిరేటు అవరోహణలో క్రమంలో ఉన్నది 8.0, 7.0, 6.5, 5.8 శాతం. ఇదే వృద్ధిరేటులో2024 నాటికి 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను సాకారం చేయలేం. 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను అందుకోవాలంటే 13–14 శాతం వృద్ధిరేటు అవసరంగా ఉంటుంది. ప్రస్తుత పరిస్థితుల్లో అంత వృద్ధిరేటును సాధించే అవకాశాలు సమీపంలో కన్పించడం లేదు. పొదుపు జిడిపి నిష్పత్తి తగ్గిపోతుంది. ఇది ప్రస్తుతం 28 శాతానికి పతనమైంది. పొదుపు జిడిపి పెరగని పక్షంలో మూలధన వ్యయం పెరగదు. అప్పుడు సంపద సృష్టి, ఉద్యోగ కల్పన ఉండదు. 2024 వరకు 5 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థ కావాలంటే పొదుపు జిడిపి నిష్పత్తి కనీసంగా 40 శాతం ఉండాలి. ఆర్థిక సర్వే ప్రస్తావించిన అంశాలను ప్రభుత్వం పరిగణలోకి తీసుకుంటే ఇలాంటి అసాధారణ లక్ష్యాలను ప్రభుత్వం నిర్దేశించుకోదు.

మోడీ ప్రభుత్వం నిశితంగా పరిశీలించాల్సిన సవాళ్లు

దేశంలో ప్రాంతీయ ఆర్థిక అసమానతలు అధికంగా ఉన్నాయి. ఇవి అధిగమించడానికి ప్రభుత్వ వ్యయం చేస్తూ ప్రోత్సాకారంతో పాటు ఆయా రాష్ట్రాలతో కలిసి పనిచేసి ఆ రాష్ట్రాల సామర్థ్యాలను సహజ వనరులను వెలికితీసి మౌలికమైన మార్పుల కోసం పని చేయాలి. ఈ దేశ ప్రజల శ్రమతో అపారంగా అర్జిస్తున్న సంపన్నులు ఈ దేశ శ్రేయస్సుకు మరింత బాధ్యత వహించి తమ అర్జనలో మరింత భాగాన్ని పన్ను రూపేణా ఈ దేశానికి ఇవ్వాలి. ద్రవ్యలోటును 2018–19లో 3.4 శాతం నుంచి 2019–20 3.3 శాతానికి తగ్గించాలని ఈ బడ్జెట్‌లో సంకల్పించారు. ఈ ప్రభుత్వం గత బడ్జెట్‌లలో ద్రవ్యలోటు తగ్గుదలతో పాటు రెవెన్యూలోటు పెరిగింది. రెవెన్యూ లోటు పెరగడం అంటే ప్రభుత్వ వినియోగం పెరగడమే. మొత్తం వ్యయాలు తగ్గిన మేరకు ప్రభుత్వ వినియోగ వ్యయాలు పెరిగాయి. మూలధన వ్యయాలను తగ్గించుకోవడం ద్వారా మాత్రమే మొత్తం వ్యయంలో తగ్గుదలను ప్రభుత్వం సాధించింది. అయితే ప్రభుత్వం ఏదైతే చేయవలసిన తక్షణ అవసర ముందో అందుకు పూర్తి విరుద్ధంగా మొత్తం వ్యయాల తగ్గుదల చోటుచేసుకుంది. ఆర్థిక వ్యవస్థను శీఘ్ర పురోగమన మార్గంలోకి మళ్లించాలంటే మౌలిక సదుపాయాలు అధునాతన శాస్త్ర సాంకేతిక రంగాలలో ప్రభుత్వ వ్యయాలు భారీగా పెరగాల్సిన అవసరముంది. ఇది విస్మరించారనేది ఆర్థిక సత్యం. కనుక రెవన్యూ లోటును తగ్గించేందుకు ఒక మార్గదర్శక ప్రణాళికను ఈ ప్రభుత్వం రూపొందించుకోవాలి.

తెలుగు రాష్ట్రాలకు ఈ బడ్జెట్ ప్రతికూలమే

2019–20 కేంద్ర బడ్జెట్ తెలంగాణకు రిక్తహస్తమే చూపింది. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలో పేర్కొన్న హామీలకు దిక్కులేదు. ఆ చట్టంలో తెలంగాణకు గిరిజన యూనివర్సిటీ, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, స్టీల్ ప్లాంట్, పసుపు బోర్డు, రైల్వే లైన్ల వంటివి ప్రస్తావించినప్పటికీ ప్రస్తుత బడ్జెట్‌లో వాటికి ఎలాంటి కేటాయింపులు లేవు. రాష్ట్ర అభివృద్ధికి ఎలాంటి ప్రాధాన్యత లేదు. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఆవిష్కరించిన మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పథకాలకు, నీతి అయోగ్ గతంలో సిఫారసు చేసింది. ఆ సిఫారసులను ఈ బడ్జెట్ తుంగలో తొక్కింది. కాళేశ్వరం ప్రాజెక్టు గాని, పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టులకు జాతీయ హోదా గాని కేటాయింపులను ప్రస్తావించకపోవడం గమనార్హం. ఇదే క్రమంలో ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన కీలకమైన పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి గాని, జాతీయ విద్యా సంస్థలకు గాని ఎలాంటి కేటాయింపులు లేవు. కనీసం చట్టబద్ధమైన హామీల ప్రస్తావన గాని ప్రత్యేక హోదాకు కేటాయింపు ఈ బడ్జెట్‌లో లేదు. అత్యంత ప్రధానంగా రాజధాని అమరావతి నిర్మాణానికి నిధులు, దుగరాజపట్నం పోర్టు, కడపలో స్టీల్ ప్లాంట్, విశాఖలో పెట్రో కెమికల్ కాంప్లెక్స్ నిర్మాణం. వైజాగ్, విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టులు తదితర అంశాల ప్రస్తావన లేదు. తెలుగు రాష్ట్రాల అవసరాలకు అనుగుణంగా భూమి కార్మికులు, రుణం, వ్యవసాయంతో పాటుగా సేవా రంగాలైన విద్య, వైద్యం, తత్సంబంధిత రంగాలలో కావలసిన మౌలిక సంస్కరణలు స్పష్టంగా ఈ బడ్జెట్‌లో కన్పించ లేదు. తెలుగు రాష్ట్రాలను ప్రోత్సాహించి తద్వారా దేశాభివృద్ధిని సాధించి అసలు సిసలైన సహకార సమాఖ్య స్ఫూర్తికి పునరంకితమైతే బావుండు. కాని ఇలా జరిగినట్లు బడ్జెట్ పత్రాల్లో ఎక్కడా కనిపించలేదు. ఈ బడ్జెట్‌లో దక్షిణాది రాష్ట్రాలకు వివక్ష చూపింది. ఉత్తరాది రాష్ట్రాలు ఒక్క రూపాయి పన్ను చెల్లిస్తే రెండు రూపాయల సహాయం కేంద్రం చెల్లించగా, దక్షిణాది రాష్ట్రాలకు మాత్రం యాభై పైసలందించి చేతులు దులుపుకుంటుంది. ఈ దేశంలో ఫెడరలిజం ఉందా లేక ప్రాంతీయ పార్టీల మీద కక్ష సాధింపా! ప్రభుత్వం స్వీయ విమర్శ చేసుకోవాలి.

బడ్జెట్ ప్రసంగంలో చెప్పే అంశాల కంటే చెప్పలేని అంశాలు అధికంగా ఉంటాయి. దేశ ఆర్థికాభివృద్ధిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు ఒక స్పష్టమైన మార్గ సూచీని ఈ బడ్జెట్‌లో రూపొందించలేకపోయింది. నిర్మాణాత్మక సంస్కరణలతో వచ్చే ఐదేండ్లలో భారత ఆర్థిక వ్యవస్థను 5 ట్రిలియన్ డాలర్లకు తీసుకెళ్లాలని ప్రకటించింది కాని, ఎట్లా సాధ్యమవుతుందనేది స్పష్ట పరచలేదు. 5 ట్రిలియన్ డాలర్ల స్థాయికి వెళ్లడమండే ఆర్థిక వ్యవస్థ వృద్ధి ప్రతి సంవత్సరం కనీసంగా 12 శాతం పైగా జరగాలి. నేటికి 7 శాతం వృద్ధి మించని స్థితి నుండి 12 శాతం కోసం పరుగు తీయడమంటే, ఉట్టికి ఎగరలేనమ్మ ఆకాశానికి ఎగిరినట్లుంది. ఆదాయ వ్యయ వివరాలను చట్ట సభలకు ఏటా బడ్జెట్‌ల రూపంలో సమర్పించే ప్రభుత్వాలు క్షేత్ర స్థాయిలో లక్ష్యాల అమలు తీరుపై దృష్టి పెట్టడం లేదు. వార్షిక బడ్జెట్‌ల అమలు ప్రభుత్వ పనితీరుకు కొలమానం. ప్రభుత్వాలు నిధుల కేటాయింపుకు దృష్టి సారించడంతో పాటుగా నిధుల వినియోగం ద్వారా వచ్చే ఫలితాలను సమీక్షించుకొని గుణాత్మక సంస్కరణలతో ముందుకెళ్లాలి. కేటాయింపుల కనుగుణంగా వాటి అనుబంధ విభాగాలు ఏర్పరుచుకున్న లక్ష్యాలు, సాధించిన ఫలితాల వివరాలు ప్రజలకు తెలియజేయాలి. నిధుల కేటాయింపు వినియోగం తీరుతెన్నులపై కచ్చితమైన వివరాలను వెల్లడిస్తే ప్రభుత్వ కార్యక్రమాల అమలు లోటుపాట్లు స్పష్టమైన దిద్దుబాటు చర్యలకు అవకాశముంటుంది. తద్వారా పాలనలో పారదర్శకత, జవాబుదారీ తనం కనిపిస్తుంది. మొత్తంగా బడ్జెట్ స్వదేశీ, మేక్ ఇన్ ఇండియా ముద్రను కోల్పోయి అప్పుల కోసం, విదేశీ సంస్థల భారీ పెట్టుబడుల కోసం దేబిరిస్తున్నట్లుంది. లక్ష్యాలు భారీగా చూపిస్తూ సత్యదూరమైన గణాంకాలతో దేశ ప్రజలను మభ్యపెట్టే దిశగా ఈ బడ్జెట్ కొనసాగింది.

(రచయిత అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలంగాణ యూనివర్సిటీ) వీ

బ్రాహ్మణవాద ప్రభావంలో కేంద్ర బడ్జెట్

మౌలిక రంగాలైన విద్య, వైద్యం, ఉపాధి రంగాలకు బడ్జెట్‌లో కేటాయింపులు నామమాత్రంగానే ఉన్నాయని, అట్టడుగు వర్గాలను నిరాశపరిచి, ధనవంతులను మరింత పెంచేలా ఉందని అంటున్నారు **డా. కత్తి పద్మారావు**

2019-20 బడ్జెట్‌ను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 5 జులై 2019న పార్లమెంట్‌లో సమర్పించిన విధానం చూస్తే, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాలను నిర్వీర్యం చేసేటట్లుగా ఆమె భాషణ ఉంది. నిజానికి భారత రాజ్యాంగం దళితులకు, బి.సి.లకు, ముస్లింలకు ఇచ్చిన సామాజిక, ఆర్థిక హక్కుల్ని ఈ బడ్జెట్ నిర్లక్ష్యం చేసింది. ఎక్కడ కూడా దళితులు ఎదుర్కొంటున్న అస్పృశ్యతను నివారించడానికి 1989 ఎస్‌సి, ఎస్‌టి, ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీ యాక్ట్‌ని అమలు జరపడానికి సంబంధించి గాని, దళితులు భూమి కొనుగోలు విషయం గాని, దళితులు విద్యా వైద్య రంగాల పునరుద్ధరించిన అంశాలు గాని ఈ బడ్జెట్‌లో పేర్కొనక పోవడం ఆశ్చర్యకరమైన విషయం.

అయితే బడ్జెట్ పరిమాణం ఘనంగానే ఉంది. రు.27,86,349 కోట్ల ఆదాయ వ్యయ అంచనాలతో బడ్జెట్‌ను రూపొందించారు. ఇందులో ద్రవ్య లోటు రు.7,03,760 కోట్లుగా ఉంది. ఇది స్థూల జాతీయ ఉత్పత్తి (జిడిపి)లో 3.3శాతం లోటును పూడ్చడానికి ఈ ఏడాది విదేశీ మార్కెట్ నుంచి రు.4.48 లక్షల కోట్లు రుణాలు సేకరించనున్నట్లు చెప్పారు. గత ఏడాది రు. 4.22 లక్షల కోట్ల రుణాలు తీసుకోగా, ప్రస్తుతం అంతకన్నా ఎక్కువే తీసుకునున్నారు. అన్ని రకాల రుణాలు కలిపి గత ఆర్థిక సంవత్సరంలో రు. 5.71 లక్షల కోట్ల మేర తీసుకోగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రు.7.1 లక్షల కోట్ల మేర తీసుకోవాలని ప్రతిపాదించారు. వడ్డీల చెల్లింపులకు ఈ బడ్జెట్‌లో రు.6,60,471 కోట్లు కేటాయించారు. ఇందులో రెవెన్యూ వసూళ్లు 19,62,761 కోట్లు, మూలధన వసూళ్లు 8,23,588 కోట్లు, మొత్తం బడ్జెట్ 27,86,349 కోట్లు, రెవెన్యూ లోటు 4,85,019 కోట్లు కాగా ఆదాయ వ్యయాల్లో అర్ధ భాగమైన స్త్రీలను ఈ బడ్జెట్ బాగా నిరాశపరిచింది.

శ్రమజీవులకు వృత్తి ఏది?

చైనా, జపాన్ లాగా ప్రతి మండలంలో స్త్రీలకు ఒక కుటీర పరిశ్రమ పెట్టి అందులో ఉత్పత్తి అయ్యే వస్తువులకు ప్రపంచ మార్కెట్ కల్పించడం ద్వారా ప్రపంచ మార్కెట్‌లో దేశీయ వస్తువులు అమ్మే విధానానికి స్వస్తి పలికారు. కేవలం స్త్రీల చేతికి డబ్బు ఇవ్వడం ద్వారా, ఋణాలు ఇవ్వడం ద్వారా ప్రయోజనం లేదు. మళ్లీ అవి ఏదో ఒక రూపంలో పురుషుని చేతికే చేరుతున్నాయి. స్త్రీ శక్తిని గుర్తించకుండా భారతదేశం, స్త్రీని వస్తువులు కొనే వారిగా, టి.వి.లు చూసేవారిగా మార్చివేస్తున్నారు. ప్రపంచ వ్యాప్లంగా స్త్రీ ఉత్పత్తుల్లో పాలుపంచుకొన్నప్పుడే దేశం వర్ధిల్లుతుంది. ముఖ్యంగా దళితులు, ఆదివాసులు, శ్రమజీవులు. అతి ప్రాచీన కాలం నుండి భారతదేశ ఉత్పత్తి క్రమంలో ప్రధాన పాత్రదారులుగా వాళ్లు ఉన్నారు. భారతదేశ వ్యాప్తంగా ప్రభుత్వాధీనంలో ఉన్న కోట్లాది ఎకరాల భూముల్ని దళితులకు పంచినట్లైతే వ్యవసాయ విస్తృతి జరుగుతుంది. భారతదేశంలో వ్యవసాయ విస్తృతి ఆగిపోయింది. ఆదివాసుల హక్కులు హరించడం ద్వారా కార్పొరేట్ శక్తులకు అడవుల్ని, కొండల్ని దారాదత్తం చేయడం ద్వారా భారతదేశ పర్యావరణం అతలాకుతలం అవుతుంది. భారతదేశ పర్యావరణ పునరుజ్జీవన శక్తులు ఆదివాసులు దళితులే. వారిని నిర్వీర్యం చేయడం ద్వారా భారతదేశంలోని పేదరికం నిర్మూలన కావడం లేదు. పైగా కోటీశ్వరులు మరింత కోటీశ్వరులు అవుతున్నారు. పేదలు మరింత పేదలు అవుతున్నారు. దీనికి కారణం హిందూవాదం బడ్జెట్ మీద చూపిస్తున్న ప్రభావమే. బడ్జెట్‌లో మానవతా స్ఫూర్తి లేదు. కారణం స్వాములకు, యోగులకు, మత సంస్థలకు వందలాది, వేలాది ఎకరాలు, ఆస్తులు ఉన్నాయి మరింతగా వారికి ఆస్తులు ఏర్పడుతున్నాయి. అయితే అవేవి ఉత్పత్తేర కారకాలుగా లేకపోగా, ఉత్పేత్తర జీవన విధానాన్ని విస్తృతి చేస్తున్నాయి. భారత ప్రభుత్వం సంవత్సరంన్నర క్రితం పార్లమెంట్‌కు సమర్పించిన సర్వేను బట్టి 2018-19లో 7 నుండి 71/2 శాతం జిడిపి పెరుగుతుందని చెప్పారు. నిజానికి అది 6,7 శాతానికే పరిమితం. మళ్లీ ఇప్పుడు పార్లమెంట్‌లో జిడిపి వృద్ధి రేటును ఘననీయంగా పెంచగలమని ఇప్పుడు భీరాలు పలుకుతుంది. అతి చిన్న దేశమైన జపాన్ 1950-73 మధ్య జిడిపిలో 10 శాతానికి మించి వృద్ధిని నమోదు చేసింది. దానికి కారణం అక్కడ ప్రతి మనిషి పనిచేయడమే. మనుషులకు పని ఇవ్వకుండా డబ్బులు ఉచితంగా ఇస్తే మోడీ ప్రభుత్వం చెప్పునట్లు 2020 నాటికి కోట్ల అతి గొప్ప ఆర్థిక వ్యవస్థను వీళ్లు ఎలా నిర్మించగలరనేదే ప్రశ్న. అంటే 8శాతం జిడిపి వృద్ధి రేటును సాధిస్తామని వీరు బీరాలు పలుకుతున్నారు. నిజానికి కృష్ణమూర్తి సుబ్రమణ్యం సర్వేను బట్టి ఇప్పుడు జిడిపి వృద్ధి రేటు 4.5 గానే ఉంది. కానీ దాన్ని వీరు దాన్ని పెంచి చూపిస్తున్నారు.

ఆర్థిక సంక్షోభానికి మూలాలు

మొత్తం భారతదేశంలో జల సంక్షోభం వల్ల వర్షపాతం బాగా తగ్గిపోయి నీటి లభ్యతలేక వ్యవసాయాభివృద్ధి అడుగంటి పోతుంది. రాను రాను వ్యవసాయంలో వృద్ధి తగ్గిపోయి రైతు జీవన సంక్షోభంలో ఉన్న ఈ సందర్భంగా రైతుల ఆరోగ్యం మరింత క్షీణిస్తుంది. ఇప్పుడు భారతదేశ ఆర్థిక వ్యవస్థను మనం ఒకసారి పరిశీలిస్తే 2017-18లో ఆహార ధాన్యాల ఉత్పత్తి 28.5 శాతం ఉంటే 2018-19కి 29.3 శాతానికి తగ్గిపోయింది. కానీ దేశ జనాభా పెరుగుతున్న దృష్ట్యా ఆహార లభ్యత కొందరికి ఎక్కువగా, కొందరికి తక్కువగా ఉంది. ఇక విదేశీ మారక నిల్వలకు వస్తే 2015-16కి 36.020 కోట్ల డాలర్లలో విదేశీ మారక నిల్వలు ఉంటే 2016-17కి 37వేల కోట్ల డాలర్లకు, 2017-18కి

42.450 కోట్ల డాలర్లకు, 1018-19కి 41.290 డాలర్లకు పరిమితమైంది. భారతదేశం నుంచి ఎగుమతులు బాగా తగ్గాయి. దిగుమతులు బాగా తగ్గాయి. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆరోగ్య రంగానికి 2018-19లో 62,659.12 కోట్లు కేటాయించింది. 2018-19లో 52,800 కోట్ల కేటాయించింది. ఇప్పుడున్న అనారోగ్య భారతంలో ఇది చాలా తక్కువ. పథకాలు అయితే చాలా పెంచారు. ఆరోగ్య భీమా, జాతీయ పట్టణాల ఆరోగ్య పథకం, ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమాలు ఇలా పెంచారు గానీ, ప్రధానంగా భారతదేశం ఎదుర్కొంటున్న సమస్య శిశుమరణం. అయితే 1,360 కోట్లు కేటాయించారు ఆమె.

ప్రధానమంత్రి మాతృవందన యోజన అనే పథకానికి, గర్భిణీ స్త్రీలకు పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్‌లోనే ఆయుర్వేద, యోగ, ప్రకృతి చికిత్స, సిద్ధ, హెూమియోపతి వైద్య రంగాలకు 1.939.76 కోట్లు కేటాయించారు. అయితే ప్రపంచం మొత్తంగా ఆయా దేశాలు జిడిపిలో ప్రధాన భాగాన్ని ఆరోగ్యానికి కేటాయిస్తున్నాయి. అమెరికా 17.0, బ్రిటన్ 9.7, అఫ్ఘానిస్తాన్, 6.2 నేపాల్, 4.9 చైనా, 3.6 భారత్. భారత్ జిడిపిలో అయితే 1 శాతం మించని ఆరోగ్య బడ్జెట్‌ను 62.62 కోట్లు మాత్రమే కేటాయించడం జరిగింది. ఈ బడ్జెట్‌లో ప్రపంచ దేశాలతో పోలిస్తే ఆరోగ్యానికి అతి తక్కువ కేటాయింపులు చేయడమే గాక ప్రాథమిక వైద్య శాలల అభివృద్ధికి ఏ మాత్రం దోహదం చేసేదిగా బడ్జెట్ లేకపోవడం మౌలిక అంశాల పట్ల నిర్లక్ష్యం కనిపిస్తుంది.

దేశంలో 80 శాతం మంది ఏదో ఒక అనారోగ్యంతో జీవిస్తున్న, ఆరోగ్య వ్యవస్థను పునరుజ్జీవనం చేయడం మీద మోడీ ప్రభుత్వం నిర్లక్ష్యం చూపిందనడంలో సందేహం లేదు. మరి ముఖ్యంగా భారతదేశంలో ఈనాడు కుంటుబడుతున్న ప్రాథమిక విద్య, నిరక్ష్యరాస్యత, మధ్య తరగతి విద్య, మాధ్యమిక విద్య, ఉన్నత విద్యల పట్ల మరింత నిర్లక్ష్యం బడ్జెట్ కెటాయింపులో కనబడింది. స్వయంగా నిర్మలా సీతారామనే ప్రపంచంలోని అత్యున్నతమైన విశ్వవిద్యాలయాల్లో మనవి మూడు మాత్రమే అని ప్రకటించింది. అలా ప్రకటిస్తూనే 3.8 శాతం ఫండ్స్ మాత్రమే జిడిపిలో విద్యారంగానికి కేటాయించారు. ముఖ్యమైన దేశాల్లో డెన్మార్క్ 7.6 శాతం, నార్వే 7.6 శాతం, బ్రెజిల్ 6.2 శాతం, అమెరికా 5.0 శాతం, పాకిస్థాన్ 2.8 శాతం, ఆఫ్ఘనిస్థాన్ 3.9 శాతం. డా. బి.ఆర్. అంబేద్కర్ విద్యను అభివృద్ధి చేసుకోవడానికి మాత్రమే నూత్న సామాజిక సంస్కృతిలోకి ప్రవహిస్తుందని అందువల్లే మానవత ఉద్దీప్తం అవుతుందని, మానవ సమాజం పరిణితి విద్యాభివృద్ధిలో దాగివుందని బోధించారు. భారత రాజ్యాంగ కర్త ఆలోచనల్ని ఈ బడ్జెట్ పూర్తిగా విస్మరించింది. ప్రపంచ దేశాలన్నీ తమ విశ్వవిద్యాలయాలను విజ్ఞాన కేంద్రాలుగా మారుస్తుంటే, భారతదేశ పాలకులు మాత్రం మన విశ్వవిద్యాలయాల్ని మత మూఢ ఊబిలోకి దించుతున్నారు. విశ్వవిద్యాలయాల్లో మత ఘర్షణలు జరుగుతున్నాయి. కులాధిపత్యం పెరుగుతుంది. చివరికి డిగ్రీలు కూడా కులాన్ని, మతాన్ని బట్టి ఇచ్చే పరిస్థితి వచ్చేసింది. విద్యా వ్యవస్థ మీద దళిత బహుజనులు కూలీలుగా మారే భావం పెరుగుతుంది. అన్ని కులాలవారు, మతాల వారు వర్ణతత్వం ఇందులో దాగివుంది. ఇది భారత రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమైన భావం.

దళిత బహుజనుల విద్యా ప్రతిభను అణచివేస్తున్నారు

నిజానికి శాస్త్రీయ రంగాల్లో ముఖ్యంగా వృక్షశాస్త్రంలో, జంతుశాస్త్రంలో ఆదివాసులు, దళితులు అత్యంత ప్రతిభావంతులుగా ముందుకు వెళ్తున్నారు. ఎందుకంటే మొక్కల తోటి, జంతువుల తోటి ఉండే అనుబంధం అటువంటిది. మరొక పక్క సామాజిక శాస్త్రం వాళ్ల జీవితమే. కులాంతరాలు, కులం పుట్టుక, కుల నిర్మూలనా వంటి భావాలు వాళ్ల జీవితంలో ఒక భాగంగా ఉంటాయి. మరో పక్క చారిత్రక అవగాహన వారికి మెండు. అందుకే సామాజిక శాస్త్రంలో గానీ, మానవ పరిణామ శాస్త్రంలో గానీ, ఆర్థిక శాస్త్రంలో గానీ దళిత బహుజనుల విద్యార్థులు బహుముఖంగా దూసుకెళ్తున్నారు. అయితే వాళ్లకు సరైన స్కాలర్‌షిప్‌లు లేవు, కోచింగ్ సెంటర్లు లేవు, విశ్వవిద్యాలయాల హాస్టలన్నీ కూడా మత కులాధిపత్యంతో నిండిపోయి ఉన్నాయి. ప్రైవేట్ విశ్వవిద్యాలయాల్లో ఫీజులు చెల్లించి చేరలేరు. అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల్లోకి వెళ్లేవారి సంఖ్య అతి స్వలం. అందుకే వాళ్లు విద్యార్థి జీవితం నుంచే ఎంతో ఘర్షణతో జీవిస్తున్నారు. ఇటు కూలికీ, నాలికీ వెళ్లే పరిస్థితుల్లో లేరు. అటు ఉద్యోగ భద్రత లేదు. ఇటు చూస్తే స్కూళ్లలో, కాలేజీల్లో, విశ్వవిద్యాలయాల్లో విపరీతమైన కులమత అణచివేత జరుగుతుంది. ఈ పరిస్థితుల్లో ఇంటికి ఏమీ చేయలేక పోతున్నామని తమకీ ఏమీ చేసుకోలే పోతున్నామనే ఒక నిర్వీర్యభావన ప్రభుత్వం వారిలో కలిగిస్తుంది. ఇదంతా కూడా ప్రభుత్వం పనిగట్టుకొని చేస్తుందనడంలో సందేహం లేదు. ప్రభుత్వం బ్రాహ్మణవాద పూర్వంగా ఉంది. హిందూవాద నియంతృత్వంలో ఉంది.

ప్రకృతి శక్తులన్నీ అంతరించి పోతున్నాయి. చెట్లు నరికి వేస్తున్నారు. చెరువులు ఎండిపోతున్నాయి. నదులు శుష్కించబడుతున్నాయి. గాలి కలుషితమై పోతుంది. నాయకుల ప్రగల్భాలు మాత్రం ఆకాశాన్ని అంటుతున్నాయి. ఆకాశం నుండి మేఘాలు కాక ప్రగల్భాలే వినబడు తున్నాయి. ఒక పక్క పత్రికలు, మరో పక్క టి.విలు వేదికల నినాదాలకే పతాక శీర్షికలు పెడుతున్నాయి. నిజానికి బడ్జెట్ ఆశలు కల్పించక పోగా ఆశల్ని, ఆశయాల్ని కూల్చిందనే చెప్పాలి. మరోపక్క ప్రజలు కూడా నిర్వీర్యత నుండి బయటబడి ప్రభుత్వం మీద ఆధారపడి జీవించడం, ఆత్మస్థైర్యంతో స్వీయ జీవితోద్ధరణకు, సామాజిక సృహతో, సామాజిక పునరుజ్జీవనానికి ముందుకు నడవాల్సిన అవసరం కూడా ఉంది. నిజానికి సోమరులు, అలసత్వం ఉన్నవారు, పుక్కిటి పురాణాలు చెప్పి బతికేవాళ్లు, శ్రమలో పాత్రలేని వారి సంఖ్య ముప్పై కోట్లకు పైగా భారతదేశంలో ఉంది. వీళ్లందరికి శ్రమజీవుల చెమటదార నుంచే ఆహారం వెళ్తుంది. అంతేకాదు రాను రాను నీరు, వాయువు భారతదేశంలో జీవన సంక్షోభాన్ని తీసుకొచ్చే పరిస్థితులు ఉన్నాయి.

దేశంలో మూఢనమ్మకాలు, తాంత్రిక విద్యలు నానాటికీ పెరుగుతున్నాయి. శాస్త్ర సాంకేతిక రంగాల పట్ల ప్రభుత్వం ఉదాసీనంగా ఉంది. మరోపక్క వృత్తి కారులైన బి.సి.లు తమ వృత్తుల్ని కోల్పోతూ మరోపక్క ఇతర పనులు దొరక్క తీవ్ర సంక్షోభంలో ఉన్నారు. మండల్ కమిషన్ రిపోర్టును అనుసరించి బి.సి. సామాజిక వృత్తుల పునరుజ్జీవనానికి ఎటువంటి కేటాయింపులు ఈ బడ్జెట్‌లో లేవు. ఒక మొత్తం భారతదేశంలో మధ్యతరగతి వర్గంపై బడిన పెట్రోల్ ధరల పెంపు పెనుభారం కానున్నది. పెట్రోల్, డీజిల్‌పై లీటర్‌కు ఒక రూపాయి ఎక్సైజ్ సుంకం పెంచడం ద్వారా మధ్య తరగతి ప్రజలు నెలవారీ జీవన భద్రతను కోల్పోతున్నారు. విలువైన లోహాలపై కస్టమ్స్ పెంచడం ద్వారా మధ్యతరగతి కూడా వస్తు సామాగ్రిని సమకూర్చుకోలేక పోతుంది. ఇకపోతే 2019-20 పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. కేంద్ర బడ్జెట్‌లో

రాబడి, వ్యయాల సమతూకాన్ని పాటించారు. మూలధన వ్యయం 3,38,569 కోట్లుకాగా మూలధన రాబడులు ఈ ఆర్థిక సంవత్సరంలో 8,23,588 కోట్లుగా ఉంటాయని అంచనా వేశారు. అలాగే రాబడులు ఈ ఏడాది 19,62,761 కోట్లు కాగా... వ్యయం 24,47,780 కోట్లుగా ఉంది. స్థూల దేశీయోత్పత్తికి రుణ నిష్పత్తి 5 శాతం కంటే తక్కువగా ఉందని తేల్చారు. ఆర్థిక లోటు 3.3 శాతంగా ఉంటుందని అంచనా వేశారు. కరెంటు ఖాతాలోటు జిడిపిలో గత ఏడాది 2.1 శాతంగా ఉంది. దీన్ని మరింత తగ్గించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

గత ఏడాది భారత్‌కు మొత్తం 64.4 బిలియన్ డాలర్ల విలువైన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వచ్చాయి. ఇకపోతే అసంఘటిత కార్మికులు 50 ఎళ్లకే భౌతిక శక్తిని కోల్పోతున్నారు. 60 ఏళ్లకు 3000 ఫించన్ పథకాన్ని 50 ఏళ్ల నుండే ఇచ్చి ఆ పెన్షన్ 5000కు పెంచవలసిన అవసరం ఉంది. ఒక దక్షిణ భారతదేశం నుండి వెళ్లిన స్త్రీగా, ఇటు స్త్రీ లోకానికి గాని ఇటు దక్షిణ భారత దేశానికి గాని మేలు కరంగా వ్యవహరించక పోవడం వల్ల రాజ్యాంగం నిర్దేశించిన ఫెడరల్ స్ట్రక్చర్ దెబ్బతీసేదిగా అఖండ హిందూ భారత్ ధ్యేయంగా ఈ బడ్జెట్ నడిచింది. స్థూల దేశీయోత్పత్తిలో ఈ రంగం వాటా 28 శాతం. దేశ ఎగుమతుల్లో ఈ రంగం తయారు చేసిన ఉత్పత్తులు 40 శాతం పైగా ఉన్నాయి. దేశ తయారీ రంగంలో ఎం.ఎస్.ఎంల వాటా 45 శాతం పైనే ఉంది. దేశంలో దాదాపు 6.3 కోట్ల ఎం.ఎస్.ఎం ఈ యూనిట్లు ఉన్నాయి. అందులో 31 శాతం తయారీ రంగంలో, 36 శాతం వ్యాపార రంగంలో, మిగిలిన 33 శాతం సేవల రంగంలో ఉన్నాయి. 12 కోట్ల మందికి పైగా ఈ రంగంలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు పొందుతున్నారు. 2019 మార్చినాటికి ఎం.ఎస్.ఎం ఈ రంగంలో రుణాలు రు.17.4 లక్షల కోట్లకు చేరుతున్నట్లు చూపాయి.

అణగారిన వర్గాలకు గొడ్డలివేటు

నిజానికి బడ్జెట్ విధానంలో దళిత బహుజనుల స్త్రీల పునరుజ్జీవనం లేదు. ముఖ్యంగా భారత రాజ్యాంగం నిర్దేశిస్తున్న రాష్ట్రాల హక్కులు కాలరాయడం వల్ల ఆయా రాష్ట్రాల అభివృద్ధి కుంటుబడుతుందని దాని వల్ల కరువు ప్రాంతాలు పెరిగే అవకాశం ఉంటుందని అంబేద్కర్ స్పష్టంగా చెప్పాడు. భారతదేశానికి పునాది రాష్ట్రాలైన తెలుగు రాష్ట్రాలు, తమిళనాడు, కర్ణాటక, కేరళ అభివృద్ధి గురించి పారిశ్రామిక పునరుజ్జీవనం గురించి నదుల అనుసంధానం గురించి ఆలోచించక పోవడం, అందునా ముఖ్యంగా ఇటీవల కొత్త రాష్ట్రాల రూపకల్పనలో తప్పకుండా ప్రత్యేక నిధులను, ప్రత్యేక హెూదాని, ప్రత్యేక నిధుల్ని కల్పించాల్సిన చారిత్రక అవసరాన్ని కేంద్ర ప్రభుత్వం మారడం వల్ల ప్రాంతీయ అసమానతలు ముమ్మరంగా రావడమే గాక, కరువు ప్రాంతాలు పెరిగే అవకాశం ఉంది.

రాష్ట్రాల సమతుల్యత గురించి అంబేద్కర్ ఇలా విశ్లేషించారు. 'సమాఖ్య రాజ్యాంగం విజయవంతంగా పనిచేయడానికి రాష్ట్రాలు ఎక్కువగా సమతుల్యతలో ఉండడం అవసరమని నేను భావిస్తున్నాను. వ్యత్యాసం మరీ ఎక్కువగా ఉన్నట్లయితే అది అనుమానాల్ని, అసంతృప్తిని కలిగించడమే కాదు, ఫెడరల్ వ్యవస్థనే విచ్ఛిన్నం చేయగల శక్తులను సృష్టించి దేశ ఐక్యతకే ప్రమాదకారి అవుతుంది. సర్వత్రా దీనిని స్పష్టంగా గుర్తించారు. అనేక ఫెడరల్ రాజ్యాంగాలలో జనాభా, వనరుల విషయాలలో రాష్ట్రాల మధ్య విస్తృత వ్యత్యాసం ఉన్నప్పటికీ, పెద్ద రాష్ట్రాల ప్రాబల్యాన్ని హద్దుల్లో ఉంచేందుకు జాగ్రత్త తీసుకున్నారు. ఆ విధంగానే అమెరికా సంయుక్త రాష్ట్రాలలో కూడా జాగ్రత్తలు తీసుకున్నారు. జనాభా వనరుల విషయంలో, ఆ రాష్ట్రాలు వ్యత్యాసాలతో ఉన్నాయి. ఉదాహరణకు జనాభా విషయంలో నేవడా రాష్ట్రంతో పోలిస్తే న్యూయార్క్ రాష్ట్రం పెక్కు రెట్లు పెద్దది. అయినప్పటికీ రాజ్యాంగం సెనెట్‌లో ప్రతి రాష్ట్రానికి సమాన ప్రాతినిధ్యం కల్పించింది.' డా. బి.ఆర్. అంబేద్కర్ భారతదేశం ఫెడరల్ స్వభావం కలిగివున్నంత కాలమే సమతుల్యతను కాపాడుకోగలుగుతుంది.

బిజెపి బడ్జెట్ నినాదాల్లో ఉన్న పచ్చదనం కేటాయింపుల్లో లేదు. ముఖ్యంగా గంగా నది కల్మష పూరితమై ఉంది. దాని ప్రక్షాళనకు సరైన కేటాయింపులు లేవు. భారతదేశంలో ఉన్న కేంద్రీయ విద్యాలయాలను శాస్త్ర సాంకేతిక రంగాలను అభివృద్ధి చేసే దిశగా యువతకు ఒక ఊతం, వృద్ధులకు ఓ భరోసా, స్త్రీలకు సాధికారిత, కార్మికునికి ఆర్థిక రక్షణ ఈ బడ్జెట్ కల్పించలేక పోయింది. బడ్జెట్‌లో సామాజిక సాధికారిత తగ్గుతూ వస్తుంది. దేశానికి గ్రంథాలయాలు ఊపిరి, సాహిత్య సాంస్కృతిక రంగాల ప్రేరణ సన్నగిల్లింది. బడ్జెట్‌లో పర్యావరణ పరిరక్షిత అంశాలు స్పష్టంగా లేవు. దేశాన్ని ప్రేమించడం అంటే దేశంలో అనారోగ్యం ప్రబలకుండా చూడడం. ఒక జాతీయ ఆరోగ్య విధానాన్ని ప్రకటించలేక పోయారు. మతంతో ముడిపడివున్న వైద్య విధానాలను ప్రోత్సహిస్తున్నారు. శాస్త్రంతో ముడిపడి వున్న వైద్య విస్తృతి లేదు. దేశీయ పరిశ్రమలు రాను రాను మూత పడుతూ వస్తున్నాయి. రైతులకు సరైన విత్తనాలు సరఫరా చేయలేని పరిస్థితులు నెలకొన్నాయి. జలాన్ని సంరక్షించుకొంటే రాను రాను 130 కోట్లు మంది జనాభాలో తాగు నీరు దొరకక నీటి యుద్ధాలు జరిగే అవకాశం ఉంది. దక్షిణాది వారు బడ్జెట్ సమర్పిస్తున్నా ఎందుకో దక్షిణ భారతదేశ అభివృద్ధికి కేటాయింపులు చేయడం లేదు.

దక్షిణ భారతం చిన్న చూపు

దక్షిణ భారతంలో, భాషలు, నీటి వనరులు మానవ శక్తి పుష్కలంగా ఉన్నాయి. వాటి అభివృద్ధి పై కేంద్ర ప్రభుత్వానికి నిర్లక్ష్యం ఉంది. ఇవన్నీ రేపు భారత దేశ సమగ్రతకు ఒక సవాల్ విసురుతాయి. దీని కంతటికి కారణం ద్వితీయ రాజధానిగా హైద్రాబాద్‌ను చేయకపోవడమే, పార్లమెంట్ ఉత్తర భారతంలోనే గాక దక్షిణ భారతదేశంలోను అవసరం అని అంబేద్కర్ చెప్పిన మాటను విస్మరించారు. దక్షిణ భారతంలో అతి ప్రసిద్ధమైన చారిత్రక ముఖ్యపట్టణ నిర్మాణం క్రీస్తు పూర్వం 2వ శతాబ్దిలోనే అమరావతిలో జరిగింది. అమరావతిని దక్షిణ భారతదేశానికే కాదు మొత్తం భారతదేశానికే ఒక చారిత్రక కట్టడం చేసుకోవలసిన బాధ్యత రాష్ట్రానికే కాదు దేశానికీ ఉంది. ఆంధ్ర రాష్ట్రాన్ని రెండుగా విభజించే సమయంలో 5 లక్షల కోట్లు అమరావతి నిర్మాణానికి మనం అడగడం జరిగింది. భారతదేశ నిర్మాణంలో కుల, మత, ప్రాంత విభేదాలు కేంద్రానికి ఉండడానికి వీలు లేదు. తెలుగు ప్రజలు నిర్మాణాత్మక సాంస్కృతిక ఆర్థిక శక్తులు, శాంతి, సామరస్య సౌభ్రాతృత్వంతో జీవించే వారు వీరు. ఎంతో చరిత్ర, సంస్కృతి సాంకేతిక, శాస్త్రీయ పరిజ్ఞానం వీరికి ఉంది. అమరావతి నదికి అటు ఇటు నిర్మించిన కట్టడం, ఈ బౌద్ధ ఆర్కిటెక్చర్ నిర్మాణాన్ని ప్రపంచ దేశాలు అనుకరించాయి.

లౌకికవాద ప్రత్యామ్నాయం

రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఈ కట్టడాన్ని నిర్లక్ష్యం చేయడం అంటే

బడ్జెట్ పద్దులు నీటిమూటలే

***ప్రతి ఏడాది ప్రవేశ పెట్టే బడ్జెట్‌లో సామాన్య ప్రజల బాగోగుల కోసం ఎలాంటి కేటాయింపులు ఉండవనీ, కేవలం బడా పారిశ్రామికవేత్తలకు, పెట్టుబడిదారులకు లాభం చేకూర్చేదిగా బడ్జెట్ ఉంటోందనీ అంటున్నారు* షేక్ కరిముల్లా**

అచ్ఛేదిన్ వారీ కలర్‌ఫుల్ బడ్జెట్ (2019-20) ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టారు. బడ్జెట్ నిండా సంపన్నుల సేవా జపమే. పైపెచ్చు ప్రైవేట్ రంగం దేశం కోసం ఎంతో సేవ చేసిందంటూ ప్రశంస. వీరి సేవలకే బడ్జెట్ ఉంది మంత్రి ప్రసంగం. దేశ విదేశీ కార్పొరేట్ కంపెనీలకు శక్తి వంచన లేకుండా దేశ వనరులను, సంపదను పంచిపెట్టే ప్రణాళికలు బడ్జెట్‌లో ఉన్నాయి. అనేక రంగాల్లో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు తివాచీ పరిచారు. బీమా రంగం, రైల్వేలు, విమానయానం, చివరకు సాంఘిక సంక్షేమ రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యం అంటూ పెట్టుబడులను అన్వయించారు. వీరి కోసం కార్మిక చట్టాలను మార్చేస్తామని, ఎడాపెడా భూములు కేటాయిస్తామని, ఏమైనా ఆటంకాలుంటే తొలగిస్తామని ప్రకటించారు. ఈ విధంగా ప్రైవేట్ రంగానికి పూర్తి స్వేచ్ఛనిస్తూ అందిన కాడికి దోచుకోండంటూ నర్మగర్భంగా ప్రకటించారు.

ఇక సామాన్యుల సంగతేమింటంటారా? యథాప్రకారం పెట్రోల్, డీజిల్ ధరలు లీటరుకు రెండు రూపాయల పెంపు, బంగారంపై 2.5 శాతం సుంకాన్ని పెంచారు. మహాత్మ గాంధీ ఉపాధి హామి పథకానికి నిధులు కుదించేశారు. ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ ప్రజల అభివృద్ధి పథకాలకు కేటాయింపులు అంతంత మాత్రమే. మహిళా అభివృద్ధి, సంక్షేమం కోసం కేటాయింపులను 5.1 శాతం నుండి 4.9 శాతానికి తగ్గింపు. ఆయుష్మాన్ భారత్ పేరిట రు. 6,400 కోట్లు కేటాయించారు. ఇది దేశ జిడిపిలో కేవలం ఒక శాతం మాత్రమే. జిడిపిలో 2.5 శాతం పైగా ఆరోగ్య కేటాయింపులు ఉండాలనేది నీటి మూటగానే మిగిలిపోయింది.

ఇక విద్యారంగానికి కేటాయింపులు చూస్తే నిరాశే. ఈ రంగానికి 94.854 కోట్లు మాత్రమే కేటాయించారు. జిడిపి విద్యా రంగానికి 6 శాతం నిధులు కేటాయించాలని విద్యా కమిషన్లు, విద్యారంగ నిపుణులు ఎన్నటి నుండో చెబుతున్నారు. అయినా కేవలం 2 శాతం లోపే కేటాయిస్తూ ఈ దేశ పౌరులకు చదువులు చెప్పించడం మా బాధ్యత కాదన్నట్లు ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయి.

కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్ర రాష్ట్రంలోని విద్యారంగానికి తీరని అన్యాయం జరిగింది. ముఖ్యంగా రాష్ట్ర విభజన చట్టం ప్రకారం కేంద్రం ఏర్పాటు చేయాల్సిన 17 జాతీయ విద్యా సంస్థల్లో రెండింటికి తప్ప తక్కిన వాటికి రిక్తహస్తం చూపారు. కేంద్రీయ విశ్వవిద్యాలయానికి రు. 13 కోట్లు, గిరిజన వర్సిటీలకు ఎపి, తెలంగాణకు కలిపి రు. 8 కోట్లు నామమాత్రపు కేటాయింపులే చూపారు. ఇదే కాకుండా విభజన చట్టంతో సంబంధం లేకుండా ఏర్పాటు చేసిన సంస్థలకు ప్రత్యేక కేటాయింపులు చూపలేదు. మరికొన్ని సంస్థల ఏర్పాటు ఊసే ఎత్తలేదు. ఎన్నికల సమయంలో ప్రధాని మోడీ రాష్ట్రంలో పర్యటిస్తూ ఎపిని అత్యద్భుత రాష్ట్రంగా అభివృద్ధి పరుస్తామని, అందుకు వీలుగా కేంద్రం నుంచి తగిన ఆర్థిక వనరులను సమకూరుస్తామని హామీలు గుప్పించారు. కానీ ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రవేశపెట్టిన పూర్తిస్థాయి బడ్జెట్‌లో కేటాయింపులు నామమాత్రమే అయ్యాయి. ఇక 17 జాతీయ విద్యా సంస్థలు ఎన్నేళ్లకు పూర్తి చేస్తారు?

మన ఆర్థిక వ్యవస్థకు ప్రధాన వెన్నెముక అయిన వ్యవసాయ రంగానికి రు. 1.39 లక్షల కోట్లు కేటాయించారు. 2022 కల్లా రైతుల ఆదాయాలు రెట్టింపు చేస్తాం అంటూ ప్రగల్బాలు పలుకుతూ ఇప్పటికే కునారిల్లుతున్న వ్యవసాయ రంగంలో భారీ పెట్టుబడులకు పచ్చ జెండా ఊపారు. ప్రైవేట్ పెట్టుబడులతో రైతుల ఆదాయాలు ఎలా రెట్టింపు అవుతాయో చెప్పాలి. 'గావ్, గరీబ్ ఔర్ కిసాన్', 'కిసాన్ సమ్మాన్' అంటూ నినాదాలతో ఊదరగొట్టారు తప్ప ఏమీ లేదు.

తెలంగాణలో రైతుబంధు పథకంలాగా దేశ వ్యాప్తంగా ఉన్న 12.6 కోట్ల మంది చిన్న, సన్నకారు రైతులకు ఏడాదికి రు. 6 వేలు మూడు దఫాల్లో ఖాతాల్లో వేస్తామన్నారు. అప్పుల్లో చచ్చిపోతున్న రైతులకు ఇది ఏ మూలకు. ప్రధాన మంత్రి 'ఫసల్ భీమా యోజన' అంటూ రు. 14 వేల కోట్లు కేటాయించారు. ఇవేమీ రైతులకు మేలుచేసేవి కావు. వ్యవసాయంపై 60 శాతం ప్రజలు ఆధారపడ్డ సేద్యపు రంగాన్ని మోడీ సర్కారు బడ్జెట్‌లో తీవ్ర నిర్లక్ష్యం చేయడం దారుణం. వ్యవసాయం సంక్షోభాన్ని విస్మరిస్తూ దేశ జిడిపి వృద్ధిరేటును 8 శాతం వద్ద సుస్థిరం చేస్తాం అనడం మోసం. దేశ ఆర్థిక వ్యవస్థకు జీవం పోసే ఈ రంగం బాగుపడకుండా, ఈ దేశం ఎలా అభివృద్ధి చెందుతుంది?

రైతులు తాము పండించిన పంటలకు గిట్టుబాటు ధర, మంచి నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, మార్కెటింగ్, పరపతి సౌకర్యాలు అడుగుతున్నారు. ప్రభుత్వ దివాళాకోరు విధానాల మూలంగా విత్తనాలు,

---

తప్పక భారతీయ సంస్కృతిని నిర్లక్ష్యం చేయడమే అవుతుంది. అందుకే ఈ బడ్జెట్‌లో రాజ్యాంగ స్ఫూర్తిలోపించింది. దళిత, ఆదివాసీ, బిసి, మైనార్టీలకు ప్రాంతీయ అభివృద్ధి దిశ లోపించింది. కేంద్ర ప్రభుత్వం తమకిచ్చిన పెద్ద మెజార్టీని దృష్టిలో ఉంచుకొని సమగ్ర సమాజ అభివృద్ధికి దోహదం చేసేటట్లు వ్యవహరించాలి. అందుకే లౌకికవాద శక్తులన్నీ సమాయత్తం కావాలి. ప్రజలు కూడా కేవలం ప్రభుత్వం మీదే ఆధార పడకుండా స్వయం శక్తులుగా ఎదగాల్సి ఉంది. అప్పుడే భారత రాజ్యాంగ స్ఫూర్తి దేశాభ్యుదయానికి మూలం అవుతుంది. రాజ్యాంగ కర్త అంబేద్కర్ ఆశయాలు ఆనాడే నెరవేరతాయి.

(రచయిత సామాజిక తత్త్వవేత్త, వ్యవస్థాపక అధ్యక్షులు నవ్యాంధ్రపార్టీ) వీ

ఎరువులు పరపతి లభించక ఉత్పత్తి ఖర్చులు పెరుగుతున్నాయని మొత్తుకుంటున్నారు. దీనికితోడు అతివృష్టి, అనావృష్టి, చీడలు, కరువు కాటకాలతో అల్లాడుతున్నారు. సాగు బరువు మోయలేక చచ్చిపోతున్నారు. ఏడాదికి సగటున 16 వేల మంది రైతులు బతుకీడ్చలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. రుణ విముక్తి కోరుతున్నారు. బడా బాబులకు రాయితీలు పెద్దవాళ్ల బ్యాంకుల్లో అప్పులు ఎగ్గొడితే నష్టాల్లో ఉన్న బ్యాంకులకు బడ్జెట్‌లో రు. 70 వేల కోట్లు రీక్యాప్ సాయం ప్రకటించారు. కాని రైతుల రుణమాఫీకి మాత్రం డబ్బులు లేవు. దీంతో రోజుకు సగటున 378 మంది రైతులు ఈ రంగాన్ని వదిలిపెట్టి పోతున్నారు.

అరవింద సుబ్రమణియన్ 2019 జూన్‌లో ప్రకటించిన నివేదికలో వ్యవసాయ వృద్ధిరేటు 2 శాతం కన్నా తక్కువగా ఉన్నట్లు పేర్కొన్నారు. అలాగే నూతన ఆర్థిక విధానాలు (ప్రపంచీకరణ) అమల్లోకి రాకముందు 1990లో స్వయం పోషణ కలిగి ఉన్న దేశీయ వ్యవసాయ ఉత్పత్తులు నేడు తగ్గిపోయి దిగుమతులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. 2014 నుండి ఈ దిగుమతులు 50 శాతం అదనంగా పెరిగాయి. చివరికి గోధుమ ఉపఉత్పత్తులు కూడా దిగుమతి చేసుకునే స్థితికి దిగజారాం.

ఈ ఆహార ధాన్యాల దిగుమతులపై ఏటా రు. 2.8 లక్షల కోట్ల వ్యయం చేస్తున్నాం. వంట నూనెలు 1.3 కోట్ల టన్నులు, పప్పులు 50 లక్షల టన్నులు, పంచదార 30 లక్షల టన్నులు, పత్తి 30 లక్షల బైళ్లు, చివరకు కోడి మాంసం, పాలు కూడా దిగుమతి చేసుకుంటున్నాం. అంటే ఏ స్థాయి నుండి ఏ స్థాయికి దిగజారామో చూడండి. దీన్ని బట్టి చూస్తే దేశంలో త్వరలో ఆహార ధాన్యాల కొరత ఏర్పడనుందని చెప్పవచ్చు.

కీలక రంగమైన వ్యవసాయం మందగించడంతో 2017-18 ఆర్థిక సంవత్సరానికి దేశంలో నిరుద్యోగిత నాలుగు దశాబ్దాల గరిష్ట స్థాయికి చేరి ఆందోళన కలిగిస్తూ ఉంది. 2019 మేలో నిరుద్యోగిత 7.17 శాతానికి, గ్రామీణ ప్రాంతాలలో 44 శాతానికి చేరిందని సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియా ఎకానమీ (సిఎంఐఇ) తాజా నివేదిక వెల్లడించింది. ఇది ఆందోళన కలిగించే విషయం. ఈ తరుణంలో వ్యవసాయ రంగ అభివృద్ధికి గట్టి చర్యలేమి బడ్జెట్‌లో లేవు. పైపెచ్చు కార్పొరేట్లకు వరాలు ఇస్తూ, కష్ట జీవులను ఇబ్బందులకు గురిచేసేవిగా ఉన్నాయి బడ్జెట్ కేటాయింపులు.

మోడీ సర్కార్ అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్లకు ఎర్ర తివాచీ పరుస్తోంది. తాజాగా అహ్మదాబాదు, మంగళూరు, లక్నో విమానాశ్రయాల నిర్వహణను ఏకంగా 50 సంవత్సరాల పాటు అదానీ కంపెనీకి లీజుకిస్తూ కేబినెట్‌లో నిర్ణయం తీసుకోవడం చూస్తుంటే ప్రజల సొమ్మును అప్పనంగా దోచిపెట్టడమే.

అలాగే అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థ అయిన భారతీయ రైల్వేలను కూడా ప్రైవేట్ పరం చేసే దిశగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అడుగులు వేస్తూ ఉంది. దశాబ్దాలుగా ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా అందరు సంపన్నుల సేవలో తరిస్తూ ఉన్నారు. దీని కారణంగా దేశంలో అవినీతి, ఆర్థిక అసమానతలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన సంస్థల నివేదికలు చూస్తుంటే ఆందోళన కలిగించే విషయాలు బయట పడుతున్నాయి.

ప్రపంచంలోనే అత్యంత తీవ్రమైన అవినీతిపరులున్న 180 దేశాల జాబితాలో భారత్ 81వ స్థానంలో నిలిచిందని 'ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్' సంస్థ నివేదించింది. అలాగే దేశంలో 100 మంది సంపద దేశ స్థూల జాతీయోత్పత్తిలో 15 శాతం పెరిగిందని, పేదలు మరింత పేదరికంతో కూరుకుపోతున్నారని ఆక్స్‌ఫాం నివేదిక వెల్లడించింది. అంటే మోడీ పాలనలో అచ్చేదిన్ సంపన్నులకేనని తేలిపోయింది. ఆదాయం వినియోగం, సంపద ఆరోగ్యం, విద్య వంటి అంశాల్లో ప్రపంచంలోని అత్యంత అసమానతలున్న దేశాల్లో భారత్ ఒకటిగా నిలిచిందని, దీనికి ప్రధాన కారణమని ఆక్స్‌ఫాం నివేదించింది. ఏటా కోట్ల ఉద్యోగాలిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారు కదా! అంటే 'పకోడీలు వేసుకోండంటూ' వెటకారంగా మాట్లాడుతున్నారు బిజెపి నాయకులు. ఇదేంటని ప్రశ్నిస్తే దేశ ద్రోహులంటూ మేధావులపై తప్పుడు కేసులు పెట్టి జైళ్లలో తోస్తున్నారు. పాత్రికేయులు, హేతువాదులపై దాడులకు తెగబడుతున్నారు, చంపుతున్నారు. బిజెపి సర్కార్ నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా ఒక సుదీర్ఘ ఐక్య ఉద్యమాలు సాగాలి.

వాస్తవాలు ఇలా ఉంటే, ప్రస్తుతం ఉన్న స్థూల జాతీయోత్పత్తిని 2.5 లక్షల కోట్ల డాలర్ల నుండి 2024 నాటికి 5 లక్షల కోట్ల డాలర్లకు వృద్ధి చేస్తామని ప్రకటించడం ప్రజలను మోసం చేయడమే. నెల రోజుల క్రితమే 7 శాతం వృద్ధిరేటు వాస్తవం కాదని అరవింద సుబ్రమణియన్ ప్రకటించారు. అంతా అబద్ధపు ప్రచారాలు, ప్రకటనలు తప్ప ప్రజల నిజ వాస్తవిక జీవనప్రమాణాలు రోజురోజుకూ తగ్గిపోతున్నాయి.

కొత్త కొత్త పన్నుల విధానాలతో (జిఎస్‌టి) సామాన్య ప్రజల నడ్డి విరుస్తూ సంపన్నులకు దోచిపెడుతున్నారు. పై వాస్తవాలను చూస్తుంటే భారత ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందన్నది కాదనలేని వాస్తవం. ఈ ఆర్థిక మాంద్యాన్ని కప్పిపుచ్చడానికి నిజ అంకెలను అధికం చేసి చూపుతోంది బిజెపి ప్రభుత్వం. ఈ చర్యలను ప్రజాపక్ష ఆర్థిక వేత్తలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఇటీవల మోడీ ప్రభుత్వానికి ఆర్థిక సలహాదారుగా ఉన్న అరవింద్ సుబ్రమణియన్ కూడా మోడీ ప్రభుత్వ అభివృద్ధి అంకెల గారడీని తీవ్రంగా విమర్శించారు.

వృద్ధిరేటును ప్రతి ఏడాది 2.5 శాతం చొప్పున పెంచి చూపుతున్నారని, ఇది ప్రజలను మోసగించడమేనని ఆయన బహిరంగంగానే మాట్లాడారు. నిజానికి ఈ జిడిపి గణాంకాలకు ప్రజల జీవన ప్రమాణాలకు లంకే ఎప్పుడో తెగిపోయింది. అప్పటి నుంచే ఈ గణాంకాలు ప్రజల విశ్వసనీయతను కోల్పోయాయి. స్వాతంత్ర్యం వచ్చి 70 సంవత్సరాలు దాటిపోయింది. 70 పైగా బడ్జెట్‌లు వచ్చి పోయాయి.

ఈ బడ్జెట్‌లలో కేటాయించిన కేటాయింపులకు, ఖర్చులకు, సాధించిన ప్రగతి అంచనా లెక్కలు ఏనాడైన ప్రజల ముందు పెట్టారా? పాలకులు చెప్పే అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందాయా? కనీసం సమీక్షలున్నాయా? ఆర్థిక వ్యవస్థ ప్రజలకు జవాబుదారీగా ఉంటూ పారదర్శకంగా ఉండాల్సింది పోయి అంకెల గారడీలు, తప్పుడు చిట్టా పద్దులతో ముద్దు ముద్దు మాటలతో ప్రజలను ఏడాదికి ఒకసారి మోసపుచ్చే తంతే బడ్జెట్.

ఇక ప్రతి సంవత్సరం పార్లమెంట్‌లో జరిగే ఈ బడ్జెట్ నాటకం చూసి సామాన్యుడు తన బతుకుబండి ఎలా లాగాలా అంటూ నిట్టూరుస్తాడు. ప్రతి ఏడు బడ్జెట్ తంతూ అంత ఆర్భాటాలు, ఉత్తర కుమార ప్రగల్భాలతో కూడిన బడ్జెట్ కేటాయింపులుంటాయి. అంతా మాయ గారడీ విద్యలు తప్ప ఇందులో వాస్తవం లేదు. ఇంకా ఎన్నాళ్లీ మోసం. కాబట్టి ప్రజలు బడ్జెట్ భ్రమలు వీడి వాస్తవల్లోంచి ఆలోచించి ఒక మెరుగైన సమసమాజ వ్యవస్థను నిర్మించుకోవాలి, ఇందుకు ఉద్యమించాలి.

(రచయిత సామాజిక విశ్లేషకులు) వీ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బడ్జెట్ - 2019

***2019-20 సంవత్సరానికి గాను ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలను భ్రమల్లో ఉంచే విధంగా ఉందనీ, ఆచరణాత్మకంగా, అభివృద్ధి దిశగా సాగేలా కేటాయింపులు జరపలేదనీ అంటున్నారు* **చిమ్మె జాన్ బర్నబాస్**

2019 జూలై 13న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీలో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి 2019-20 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. పోయిన సంవత్సరం కన్నా 19.32 శాతం పెంచి 2,27,974 కోట్ల రూపాయలకు పైగా అంచనాలతో బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారు. గత ఎన్నికలలో హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి తన ప్రధానమైన 'నవరత్నాల' పథకాలకు ఈ బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇచ్చినట్లు స్పష్టమవుతున్నది.

రైతులకు ప్రాధాన్యత ఇవ్వాలనే సంకల్పంతో వ్యవసాయం దాని అనుబంధ రంగాలకు రు. 20,677.8 కోట్లు కేటాయించారు. గ్రామీణ అభివృద్ధికి 40.90 శాతం అదనంగా రు. 29,329.98 కోట్లు కేటాయించారు. అయితే సాగునీటి రంగానికి గతంలో కన్నా 22.61 శాతం కోతపెట్టి రు. 13,139.05 కోట్లు కేటాయించారు. ఆర్థిక మంత్రి తన ప్రసంగంలో 'ఎంత సారవంతమైన నేల అయినా, ఎంత బాగా దున్నినా, ఎంత చేయి తిరిగిన రైతు అయినా విత్తనం వేయకపోతే పంట పండదు' అని వ్యాఖ్యానించారు. విత్తనం మొలకెత్తాలంటే నీరు అవసరం. ఈ సంవత్సరం వర్షాలు ప్రారంభంలో సరిగా పడడం లేదు. కాబట్టి రైతులు చాలా చోట్ల ఆందోళనతో ఉన్నారు.

పోలవరం ప్రాజెక్టును 2021 అత్యధిక ప్రాధాన్యతతో పూర్తి చేస్తామని ప్రకటించారు. ఈ కేటాయింపులతో మహేంద్ర తనయ, వంశధార, తోటపల్లి, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, పురుశోత్తమపట్నం ఎత్తిపోతల పథకం, గోదావరి డెల్టా ఆధునీకరణ, చింతలపూడి ఎత్తిపోతల పథకం, కృష్ణా డెల్టా ఆధునీకరణ, వెలిగొండ ప్రాజెక్ట్, సంగం ఆనకట్టు, సోమశిల ప్రాజెక్ట్, సోమశిల సర్ణముఖి లింక్ కాల్వ, గాలేరు నగరి, హంద్రీనీవా సుజల స్రవంతి లాంటి అనుబంధ పనులు పూర్తికావడం ఆలస్యమవు తోంది. అంచనాలు పెరుగుతున్నాయి. వ్యయం పెరుగుతూ వస్తోంది.

వివరం	2017-18	2018-19 (బ.అం)	2018-19 (స.అం)	2019-20 (బ.అం)
1) రెవెన్యూ వసూళ్ళు	1,05,062	1,55,507	1,14,684	1,78,697
ఎ)పన్ను ఆదాయం	49,812	65,535	58,125	75,437
బి) పన్నేతర ఆదాయం	3,813	5,346	4,391	7,354
సి) కేంద్ర పన్నుల్లో వాటా	28,674	33,929	32,710	34,833
డి) గ్రాంట్లు	22,760	50,695	19,456	61,071
2) మూలధన వసూళ్లు	41,258	35,552	48,447	49,277
3) మొత్తం వసూళ్లు	1,46,320	1,91,059	1,63,132	2,27,974
4) రెవెన్యూ వ్యయం	1,21,213	1,50,271	1,26,339	1,80,475
5) మూలధన వ్యయం	13,490	28,678	20,398	32,293
6) రుణాలు, వడ్డీ చెల్లింపు	9,458	10,851	13,553	13,417
7) మొత్తం వ్యయం	1,46,944	1,91,063	1,62,134	2,27,974
8) రెవెన్యూ లోటు	-16,151	5,235	-11,654	-1,778
9) ద్రవ్య లోటు	-32,372	-24,205	-33,619	-35,260

బ.అం.- బడ్జెట్ అంచనా
స.అం.- సవరించిన అంచనా
(రూ. కోట్లలో)

వాస్తవానికి రైతులు తీవ్ర దుర్భర స్థితిలో జీవిస్తున్నారు. పంటలు దెబ్బతినడం, గిట్టుబాటు ధరలు లభించకపోవడం, కుటుంబాలలో అనారోగ్యం, పిల్లల చదువులు, వారి పెళ్లిళ్లు ఇలా అనేక కారణాలతో రైతులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు.

2014-19 మధ్య రాష్ట్రంలో దాదాపు 1513 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. కేవలం 391 కుటుంబాలకు మాత్రమే అంతో ఇంతో ఆర్థిక సహాయం అందిందని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. మిగిలిన కుటుంబాల వివరాలు సేకరించి అర్హత గల రైతులకు 7 లక్షల రూపాయల చొప్పున పరిహారం అందించాలని నిర్ణయించి, ఈ బడ్జెట్‌లో కేటాయింపులు చేశారు. అంతవరకు అభినందనీయం.

వైఎస్ఆర్ రైతు భరోసాకు రు. 8,750 కోట్లు కేటాయించారు. దీనికింద 65.07 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరుతుంది. 15 లక్షల మంది కౌలురైతులకు మేలు జరుగుతుంది. అంతే కాకుండా 28,866.23 కోట్ల రూపాయలతో వ్యవసాయ బడ్జెట్‌ను ప్రత్యేకంగా ప్రవేశపెట్టింది రాష్ట్ర ప్రభుత్వం.

ధరల స్థిరీకరణ నిధికి రు. 3,000 కోట్లు, రైతులకు 9 గంటల ఉచిత విద్యుకు రు. 4525 కోట్లు, ఉచిత పంటల భీమాకు రు. 1163 కోట్లు కేటాయించారు. గత తెలుగుదేశం ప్రభుత్వం ఇచ్చిన హామీని ఇప్పటి ప్రభుత్వం నెరవేర్చడం బాధ్యత, రాజ్యాంగ ధర్మం. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం రుణమాఫీకి హామీ ఇచ్చింది. దానిని పూర్తిచేయడం ఈ ప్రభుత్వం కనీస బాధ్యత. దానిని విస్మరిస్తే రైతులు ఇబ్బందులకు గురవుతారు.

భారతదేశంలో వ్యవసాయ రంగాన్ని అన్ని విధాలుగా ఆదుకున్న 'సహకార' రంగానికి ఈ బడ్జెట్‌లో తగిన ప్రాధాన్యత కనబడలేదు. వ్యవసాయ ఉత్పత్తులు, రైతుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారకాలు, క్రయ విక్రయాలను సహకార సంఘాల ద్వారా నిర్వహిస్తే రైతులకు మేలు జరిగే అవకాశం ఉంటుంది.

విద్య, వైద్య రంగాలకు ఈ బడ్జెట్‌లో పెద్దపీట వేశారు. విద్యా రంగానికి మొత్తం రు. 32,618.48 కోట్లు కేటాయించారు. అయితే 'అమ్మ ఒడి' పథకాన్ని ప్రైవేట్ స్కూళ్లకు వర్తింపచేయడం అంటే ప్రభుత్వ విద్యా వ్యవస్థను దెబ్బతీయడమే అవుతుంది. ప్రైవేట్ విద్యా సంస్థలను బలోపేతం చేసినట్లు అవుతుంది. వైద్య రంగానికి రు. 11,399 కోట్లు కేటాయించారు. దీనిలో వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ కింద చేసిన భారీ కేటాయింపులు కార్పొరేట్ ఆసుపత్రులకు మేలు చేకూర్చడమే అవుతుంది. అందుకు ప్రత్యామ్నాయం గా ప్రభుత్వ వైద్యశాలలను ఆధునీకరించడం, పటిష్టవంతం చేయడం, సౌకర్యాలను మెరుగుపరచడం ద్వారా ఎక్కువ మంది పేదవారికి వైద్య సేవలు అందడం జరుగుతుంది. పేదలు అనారోగ్యం భారిన పడకుండా మొదట ప్రాథమికంగా తమను తాము రక్షించుకో గలుగుతారు. ప్రభుత్వ వైద్యశాలలలో రెసిడెంట్ డాక్టర్లకు నివాస సదుపాయాలు లేక వారు దూర ప్రాంతం నుంచి తిరుగుతున్నారు. 30 పడకల ఆసుపత్రులలో డాక్టర్లకు నివాసాలు కట్టిస్తే వారు అక్కడే ఉండి రోగులకు మరింత మెరుగైన సేవలందించే అవకాశముంటుంది.

గృహ నిర్మాణ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్, మైనారిటీ సంక్షేమం, యువత, నైపుణ్యాల అభివృద్ధి, మహిళలు, పిల్లలు, పరిశ్రమలకు గతంతో పోలిస్తే కేటాయింపులు తగ్గించింది. వ్యవసాయ, పారిశ్రామిక, సేవారంగాల్లో అల్ప సంఖ్యాక వర్గాలకు ఊతంగా ఉండడానికి బదులు కులాల పేరిట నిధులు కేటాయించారు. అభివృద్ధి – సంక్షేమం పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి కన్నా జనాకర్షణ వైపు మొగ్గ చూపుతున్నట్లు ఈ కేటాయింపులు జరిగినట్లు స్పష్టమవుతోంది.

చంద్రబాబు హాయంలో పేదలకు కట్టించిన ఇళ్లకు సరిగా బిల్లులు రాలేదని గతంలో ప్రతిపక్ష నాయకుడుగా ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి గతం కన్నా 1.69 శాతం తక్కువగా రు. 3,617.37 కోట్లు కేటాయించారు. ఒకపక్క పేదలకు లక్షల సంఖ్యలో ఇళ్లు మంజూరు చేస్తూ, ఆచరణలో వచ్చేసరికి ఇంత తక్కువ మొత్తం కేటాయించడమంటే ఆ వర్గాలను మోసగించడం తప్ప మరేమీ కాదు.

వడ్డీ లేని రుణాలపై రు. 3,200 కోట్లు ఇస్తామని చెప్పి కేవలం రు. 100 కోట్లు కేటాయించడం ద్వారా మహిళలను వంచించడమే అవుతుంది, మోసం చేయడమే అవుతుంది. ఈ బడ్జెట్‌లో కొన్ని కొత్త పథకాలున్నా, వాటి ఫలితాలు ఎలా ఉంటాయనేది వాటి అమలుపై ఆధారపడి ఉంటుంది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాలైన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు భరోసా కల్పించేందుకు తగిన శ్రద్ధ చూపలేదని స్పష్టమవుతోంది. అగ్రిగోల్డ్ బాధితులకు 1,150 కోట్లు కేటాయించడ మనేది బాధితులు జరిపిన పోరాటానికి ప్రభుత్వం దిగివచ్చి అందించడమే అవుతుంది. ఇది గత ప్రభుత్వం చేయలేకపోయింది.

గత తెలుగుదేశం ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసిందనే ఆరోపణలు చేస్తూ, దయనీయమైన ఆర్థిక వ్యవస్థను వారసత్వంగా చెబుతూ, దానిని సరిచేయడానికి సరియైన మార్గాలను అన్వేషించక పోవడం విచారకరం. రు. 35,260 కోట్ల ద్రవ్యలోటు భారీ బడ్జెట్ అమలుపై పలు సందేహాలు వస్తూ ఉన్నవి. విభిన్న రంగాల్లో ముమ్మరిస్తున్న అవసరాలకు దీటుగా సొంత వనరులను సమీకరించకపోవడంపై శ్రద్ధ చూపాల్సిన అవసరాన్ని ఈ లోటు గుర్తు చేస్తున్నది.

ప్రతి రూపాయిలో పది శాతానికి పైగా వడ్డీ చెల్లింపులకే సరిపోతున్న తీరు ఎఫ్ఆర్‌బిఎం (ఫిషియల్ రెస్పాన్స్‌బిలిటి అండ్ బడ్జెట్ మేనేజ్‌మెంట్ యాక్ట్ 2003) పరిమితులకు లోబడి నడుచుకోవలసిన అవసరాన్ని గుర్తు చేస్తున్నది. కేంద్రం నుంచి నిధులు అందడం లేదు. మరోవైపు జిఎస్‌టి ప్రతికూల ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, లక్షిత పన్నుల మొత్తాన్ని రాబట్టలేని నేపథ్యంలో అన్ని రంగాలకు భారీగా కేటాయింపులు పెంచడమంటే దానిని అనుమానాస్పదం (అమలులో) గానే చూడాలి.

గ్రామీణ, వ్యవసాయం, విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత ఇచ్చినట్లు కనిపిస్తున్నా, వనరుల సమీకరణ ఎలా అన్నది అనేక సందేహాలను రేకెత్తిస్తున్నది. కాబట్టి లోటు పూడ్చుకోవాలన్నా, ఆదాయాన్ని రాబట్టుకోవా లన్నా ఏదో ఒక రూపంలో ప్రజలపై భారం వేయక తప్పని పరిస్థితి. లక్ష్యం మంచిదైనా, వాస్తవాలకు దూరంగా ఉన్నప్పుడు అనుకున్న ప్రయోజనం నెరవేరదు.

మద్యాన్ని దశల వారీగా నిషేధిస్తున్నప్పుడు మద్యంపై వచ్చే ఆదాయం కూడా తగ్గుతుంది. కానీ ఈ బడ్జెట్‌లో మద్యం అమ్మకాలపై ఎక్సైజ్ పన్ను ద్వారా రు. 8,517 కోట్లు వస్తుందని చూపించారు. ఇది గత ఏడాది బడ్జెట్ కంటే రు. 2,297 కోట్లు ఎక్కువ అనగా 36 శాతం ఎక్కువ. దీన్నిబట్టి మద్య నిషేధాన్ని గాలికి వదిలేసినట్లు అర్థమవుతున్నది.

విశాఖపట్టణం గిరిజన ప్రాంతం, విజయనగరం, గుంటూరు జిల్లా గురజాలలో ప్రభుత్వ వైద్య కళాశాలలు, శ్రీకాకుళం జిల్లాలోని ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ పరిశోధనా కేంద్రం ఏర్పాటు చేస్తామని, వాటికి రు. 66 కోట్ల చొప్పున నిధులు కేటాయించడం ఆహ్వానించదగినదే.

అయితే రాష్ట్రాభివృద్ధికి తోడ్పడే అనేక అంశాలను ఈ ప్రభుత్వం విస్మరించింది. నిధులను నామమాత్రంగా కేటాయించింది. ఈ రాష్ట్ర ప్రభుత్వం ఎక్కువగా కేంద్రం ఇచ్చే 'గ్రాంట్ ఇన్ ఎయిడ్' కింద ఎక్కువగా నిధులు వస్తాయని ఆశిస్తున్నది. గత ఏడాది కంటే మూడు రెట్లు అధికంగా కేంద్రం నుండి నిధులు వస్తాయని ఆశిస్తున్నారు. అదంతా ఒట్టి భ్రమగానే మిగిలిపోతుంది. ఎలాగంటే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దక్షిణాది రాష్ట్రాలపై అంత ఆశాజనకంగా లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఊహల్లో తేలాడుతుంది.

(రచయిత న్యాయవాది, ఒపిడిఆర్ రాష్ట్ర కమిటీ సభ్యులు) వీ

రచయితలకు సూచన : *తక్షణ, సమకాలీన అంశాలపై రచనలు చేసి ఆ సంచికలోనే రావాలనుకొనే రచయితలు 20వ తేదీ లోగా పంపగలిగితేనే మరుసటి నెల సంచిక కోసం పరిశీలించడం సాధ్యమవుతుంది. ఆ తరువాత వచ్చిన రచన, అంశం ఎంత ముఖ్యమైనదైనా పరిశీలించడం, ముద్రణకు సిద్ధం చేయడం అసాధ్యమవుతుంది. రచయితలు గుర్తించగలరు. మరొక పత్రికకు పంపిన, మరొక పత్రిక పరిశీలనలో ఉన్న, మరొక పత్రిక ప్రచురణకు ఆమోదించిన రచనను వీక్షణంకు పంపగూడదు. – సం.*

చట్టాల సవరణలతో ఆదివాసుల హక్కుల నిరాకరణ

ఎన్నో పోరాటాల ద్వారా ఆదివాసులు సాధించుకొన్న అటవీ హక్కుల చట్టం అమలుకు చేస్తున్న కృషి ఫలించకపోగా ఆదివాసులు దేశ న్యాయవ్యవస్థ ముందు దోషులుగా నిలబడవలసి వచ్చిందని అంటున్నారు **రామారావు దొర**

దేశవ్యాప్తంగా అటవీ భూములపై హక్కుల కోసం చేస్తున్న తిరుగుబాట్లు ప్రకృతినే నమ్ముకొని జీవనం సాగిస్తున్న ఆదివాసులు, ఇతర పరంపరాగత అటవీ నివాసులందరికి అటవీ చట్టాల సవరణ లేదా మార్పులతో ఒక కొత్త హెచ్చరిక చేసింది పాలక పక్షం. ఈ దేశ ప్రజల మౌలిక ప్రయోజనలకంటే బహుళ జాతి సంస్థల (మల్టీనేషనల్ కంపెనీల) వ్యాపార ప్రయోజనలే ముఖ్యంగా పనిచేస్తున్న ప్రభుత్వాలు స్వల్ప సంఖ్యాకులైన ఆదివాసీ ప్రజల హక్కులను హరించడానికే చూస్తున్నాయి. ఆదివాసులను ఈ ప్రకృతిలో గాని, మానవ సమాజంలో గాని భాగంగా చూడడానికి ఇష్టపడడం లేదు.

తెలుగు రాష్ట్రాల్లో 1980 తరువాత షెడ్యూల్డ్ ప్రాంతల్లో ఇతరుల వలసలు విపరీతంగా పెరిగాచి. ఆదివాసుల నివాస ప్రాంతాలన్ని ఆదివాసేతరుల నివాస ప్రాంతలుగాను, వ్యాపార కేంద్రాలుగాను మారిపోయాయి. వలసలు పెరగడంతో ప్రకృతి నియమాలకు విరుద్ధంగా వైరుధ్యమైన జీవన పరిస్థితులను ఇముడ్చుకోలేని గత్యంతర పరిస్థితుల్లో అడవుల నుంచి మరింత అడవులలోకి వెళ్లవలసిన అత్యయికస్థితి నెలకొంది. భద్రాచలం టౌన్‌షిప్ ఒకప్పుడు కోయ జాతి ఆదివాసులకు స్వర్గధామంగా ఉండేది. నేడు రాములవారి పుణ్యాన ఆదివాసేతర వ్యాపారస్తుల అడ్డగా మారి ఆ జాతి ఉనికినే దెబ్బతీసింది. ఇలా దేశంలో అనేక ప్రాంతాలకు ఈ పరిస్థితి దాపురించింది. ఈ అత్యయిక (ఎమర్జెన్సి) పరిస్థితులను అసరగా తీసుకొంటున్న పాలక పక్షాలు ఆదివాసులను అడవుల వినాశనకారులుగాను, ప్రకృతి విధ్వంసకరులుగాను చిత్రీకరించి అడవుల నుంచి పూర్తిగా దూరం చేయాలని చూస్తోంది. దీనికి ఈ దేశ అత్యున్నత న్యాయవ్యవస్థ సైతం అండగా ఉంటూ వస్తోంది.

ఇది ఆదివాసులను, ఇతర పరంపరాగత అటవీ నివాసితుల జీవితాల్లో మరింత ఆందోళన కలిగించే పరిణామం. ఎన్నో దశబ్దాలుగా అడవికి, భూమికి నిరాకించబడుతూ వస్తున్న ఆదివాసులు పోరాటల ద్వారా నష్టపరిహారంగా సాధించుకొన్న 'అటవీ హక్కుల గుర్తింపు చట్టం 2006' అమలు చేయకుండానే బలహీనం చేయడానికి పూనుకొన్నారు.

తెలంగాణనే ప్రధానంగా తీసుకొంటే అటవీ ప్రాంతల్లో ఒక్క ఆదివాసులు మాత్రమే! అటవీ భూములపై ఆధారపడి జీవించడం లేదు. అడవుల్లో వ్యవసాయం చేసుకుని బతికే ఇతర పరంపరాగత అటవీ నివాసితులు, దళితులు ఇతర పేద ప్రజలు, బలవంతులు, పెట్టుబడిదార్లు, దళారులు, అటవి సంపద ఆధారిత బడా వ్యాపారస్తులు కూడా ఉన్నారు. వీరందరితో పాటు బహుళ జాతీ సంస్థలకు (మల్టీ నేషనల్ కంపెనీలకు) బ్రోకర్లుగా వ్యవహారిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైతం ఓపెన్ కాస్ట్ గనులు, ఇనుప గనులు, బాక్సైట్ గనులు, భారీ ప్రాజెక్టులు ఇతర అనేక ప్రకృతి వినాశకర కార్యకలపల్లో భాగస్వాములుగా ఉంటూ వస్తున్నారు. ఇంతమంది భాగస్వామ్యం ఉంటుండగా కేవలం ఆదివాసులను మాత్రమే 'దురాక్రమణదారులుగా' సుప్రీం కోర్టు పేర్కొనడం అత్యంత విచారకరం, అక్షేపణీయం కూడా.

ఇప్పటికే అభివృద్ధి నమూనా బూచిని చూపి భారి ప్రాజెక్టులు, గనులు వెలికితీత పేరిట ఆదివాసుల వద్దనున్న భూములను బలవంతంగా గుంజుకొన్నారు. నర్మద, శ్రీశైలం, పోలవరం (ఇందిరా సాగర్), నాగార్జున సాగర్, సీలేరు, చిత్రకొండ, డొంకరాయి, జలాపుట్టు, కొలాబ్ రిజర్వయర్ (ఒడిషా), నాల్కో హిందుస్థాన్ హెరోనాటిక్స్ (ఎచ్ఎఎల్), కంతనపల్లి, బాక్సైట్ గనుల తవ్వకాలు, బహిరంగా బొగ్గు గనులు (ఓపెన్ కాస్టు), పులులు, జింకలకు పార్కులు, అభయారణ్యాలు వంటి భారీ ప్రాజెక్టులు, రిజర్వాయర్ల వల్ల ఆదివాసీలనే బలిచేసారు, చేస్తున్నారు. వారికి కనీస పునరావాసం కూడా కల్పించకుండా విస్తాపితులను చేసారు. ఈ నష్టాన్ని ప్రకృతి విధ్వసంగా, మానవ వినాశకర ప్రక్రియగా ఎందుకు గుర్తించరు? తరతరాలుగా ఆదివాసుల అనుభవంలో ఉన్న కొద్దిపాటి భూముల్లో వ్యవసాయం చేసుకోనీయ్యకుండా దురాక్రమణదారులగా నెపం మోపి అడవుల నుంచి వెళ్లగొట్టే చర్యలకు ఎందుకు దిగుతున్నట్టు? ఆదివాసులే ఈ దేశానికి అసలైనా మూలవాసులంటు బుద్ధిజీవులు, మేధావులు, చరిత్రకారులు ఎంత హితబోధ చేస్తున్నా పాలకులకు ఎందుకు పట్టడం లేదు?

ప్రకృతితో మమేకమై జంతు జీవజాలంతో కలిసి బతికిన ఆదివాసులను నేడు అడవుల వినాశకారులుగా ముద్రవేసి బతకనీయకుండా చేస్తున్నారు. జంతు, పర్యావరణ ప్రేమికులుగా, తమకుతాము ప్రకటించుకుంటూ ఆదివాసులపై అక్కసు వెళ్లగక్కుతున్న వారికి ప్రభుత్వాలు చేస్తున్న దమనకాండ ఎందుకు పట్టవు? జీవవైవిద్యం అంటే పులులు, జింకలు, చెట్లు మాత్రమే కాదు. మనుసులు కూడా! ఆ మనుషుల్లో ఆదివాసులు కూడా ఒక భాగమే అనే విషయం వీరు ఎందుకు గుర్తించరు?

ఆదివాసులు ఆధారపడ్డ భూములను బహుళజాతి కంపెనీలకు గంపగుత్తగా అప్పజెప్పి తద్వారా ప్రకృతినీ, జీవవైవిధ్యాన్నీ దెబ్బతీస్తున్న వారి విధనాలను ఎందుకు ప్రశ్నించరు? సాంకేతిక రంగల్లో ముందున్న చైనా, జపాన్, అమెరికా వంటి దేశాలు కాలూష్య కారకాలు ఉత్పత్తి చేస్తూ, వ్యవసాయం మీద ఆధారపడ్డ పేదదేశాలపై అడవులు పెంచాలంటూ ప్రపంచ బ్యాంకు కర్రపెత్తనం చేస్తుంటే ఎవరికి పట్టవు. భూమీ లేకుండానే పంట పండించి అందరికి తిండి పెట్టాలి. ఎలా సాధ్యమవుతుంది?

1971 నాటి బెంగాల్ విభజన అనంతరం బెంగాలీలను శరణార్థులుగా ఒరిస్సా రాష్ట్రం మల్కనగిరి, నవరంగపూర్ జిల్లాల్లో ఒకోక్క కుటుంబానికి మూడేసి ఎకరాల చొప్పున లక్ష ఏభై వేల కుటుంబాలకు 4 లక్షల 50 వేల ఎకరాల అటవీ భూమిని పంచి పెట్టి భూమి పుత్రులను

నిర్వాసితులను చేస్తారు. ఇది భారత రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూల్డ్ అనుసరించి చేసిన 1/70 భూ బదలాయింపు నిషేధ అజ్ఞలు అమల్లో ఉన్న ప్రాంతం.

2015 లో తెలంగాణ ప్రభుత్వ చేపట్టిన 'హరితహారం' కార్యక్రమం ఆ రాష్ట్ర ఆదివాసుల పాలిట శాపంగా మారింది. ఈ కార్యక్రమం ద్వారా 230 కోట్ల మొక్కలు నాటి 25.16 శాతంగా ఉన్న అడవిని 33 శాతానికి పెంచాలని సంకల్పించింది కెసిఆర్ ప్రభుత్వం. మొక్కలు నాటి అడవులను పెంచాలన్న ఉద్దేశాన్ని ఎవరు కాదనరు. అయితే నిర్దేశించిన లక్ష్యం చేరుకోవాలంటే లక్షలాది ఎకరాల భూమి అవసరమైమవుతుంది. ఆ లక్షలాది ఎకరాల ఖాళీ భూములు ఎక్కడున్నాయి? ఎవరి వద్ద ఉన్నాయన్నదే మిలియన్ డాలర్ల ప్రశ్న?

తెలంగాణ ప్రభుత్వం అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేయడం నిలిపివేసి, ఆదివాసులు, ఇతర పరంపారగత అటవీ నివాసితుల హక్కులను నిరాకరించి తరతరాలుగా ఆదివాసుల అధీనంలో, సాగులో ఉన్న పంట భూముల్లో 'హరితహారం' మొక్కలు నాటే కార్యక్రమాన్ని దౌర్జన్యంగా కొనసాగిస్తోంది. ఫిబ్రవరి 13న సుప్రీం కోర్టు వెలువరించిన తీర్పు తెలంగాణలో దౌర్జన్యంగా తమ భూముల్లో హరిత హారం మొక్కలు నాటుతుంటే అడ్డుపడుతున్న ఆదివాసులను 144 సెక్షన్ నిబంధనలు కింద ఊరు దాటి బయటకు రానీయకుండా నిర్బంధించి అణచి వేయడానికి మరింత దోహదపడుతుంది. తెలంగాణ ఆదివాసుల సాగు భూములన్నిటిని గుంజుకోవడానికి ఈ తీర్పును సదావకాశంగా మారింది.

2018 ఏప్రిల్ 24న దఖలైన అఫిడవిట్ వివరాల ప్రకారం ఆ రాష్ట్రంలో హక్కు పత్రాల కోసం 1,86,679 మంది అర్జీలు పెట్టుకోగా 86,076 అర్జీలను తిరస్కరించింది. ఎందుకు తిరస్కరించిందో కూడా చెప్పలేదు. అలాగే దేశ వ్యాప్తంగా 11,72,931 అర్జీలు తిరస్కరిస్తే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మొత్తం 1,81,508 దరఖాస్తులకు గాను 66,351 దరఖాస్తులను (1,41,400 ఎకరాలు) నిరాకరించింది.

ఈ క్లైములన్నిటిని ఎందుకు తిరస్కరించిందో ఆ కారణాలను అర్జీదారులకు స్పష్టంగా తెలియజేయాలని చట్టం చెబుతున్నా ఏ ఒక్క అర్జీదారునికి వివరణ ఇవ్వలేదు. అడవులపై ఆధారపడ్డ ఆదివాసులు, ఇతర పరంపరాగత అటవీ నివాసితులపై ప్రభుత్వాలు ఎంత నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తుందో స్పష్టం చేస్తుంది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి అడవులపై వల్లమాలిన ప్రేమ, ఆదివాసీలపై పెంచుకొన్న ద్వేషం కారణంగా ఒక్కటంటే ఒక్క ఉమ్మడి హక్కు పత్రం కూడా మంజూరు చేయలేదు. అటవీ హక్కుల చట్టం రాక మునుపు విశాఖపట్నం జిల్లా పాడేరు రెవెన్యూ డివిజన్ 11 మండలాల పరిధిలో ఆదివాసుల ఉమ్మడి యాజమాన్యపు నిర్వహణలో ఉన్న అటవీ భూములను 'ఉమ్మడి అటవీ నిర్వహణ' (జాయింట్ ఫారెస్ట్ మేనేజ్‌మెంట్), 'సామాజిక అటవీ నిర్వహణ' (కమ్యూనిటీ ఫారెస్ట్ మేనేజ్‌మెంట్) కింద అటవీ శాఖ బలవంతంగా గుంజుకొంది. వీటినే జెఎఫ్ఎం, సిఎఫ్ఎం అనే పొట్టి పేర్లతో పిలుస్తున్నారు.

అటవీశాఖ మధ్యపెట్టి జెఎఫ్ఎం, సిఎఫ్ఎం కింద తస్కరించిన వేలాది ఎకరాల అటవీ భూమిని ఆదివాసుల పేరిట బదిలిచేసి పట్టాలు మంజూరు చేమవలసి ఉంది. కాని ఆ పని చేయకుండా అటవీ శాఖ అజమాయిషీ చేస్తుంది. అర్జీదారులను దురాక్రమణదారులుగా పేర్కొంటూ అడవుల నుండి గెంటివేయాలని సుప్రీం కోర్టు విధించిన గడువు పూర్తయ్యే నాటికి అంటే జూలై 27 నాటికల్లా తిరస్కరించబడిన క్లైములన్నిటికి బేషరతుగా హక్కు పత్రాలు మంజూరు చేయలన్న డిమాండ్‌తో దేశవ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాల ముందు జూలై 22న ఆదివాసీలు ఆందోళనలు చేపట్టారు. అందులో భాగంగా ఆదివాసీ రిజర్వేషన్ పరిరక్షణ పోరాట సమితి (ఎఆర్‌పిపిఎస్), ప్రజా ఉద్యమాల జాతీయ వేదిక (ఎన్‌ఎపిఎం), ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ వృత్తిదార్ల యూనియన్ (ఎపివివియు), గిరిజన విద్యార్థి సంఘం (జిఎస్‌యు), రైతు స్వరాజ్య వేదిక (ఆర్‌ఎస్‌వి)లు సంయుక్తంగా పాడేరు ఐటిడిఎ ముందు ఆందోళనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి హక్కులు ఎందుకు మంజూరు చేయడం లేదని అధికార్లను నిలదీయగా అటవీ అధికారుల అభ్యంతరం చెబుతున్నందుకే ఇవ్వలేకపోతున్నమని నిస్సిగ్గుగా సమాధానం ఇచ్చిన తీరు చూస్తే అటవీ హక్కుల చట్టాన్ని ఎంత గౌరవంగా అమలు చేస్తున్నారో అర్థమవుతుంది.

ఈ వ్యవహారమంతా పరిశీలిస్తే విశాఖ ఏజెన్సీలో చట్టం అమలు ప్రక్రియా ఇంక పూర్తిగా మొదలు పెట్టకుండానే ఆదివాసులను బయటికి గెంటివేయడానికి పూనుకున్నారు. అసలు సుప్రీంకోర్టు తీర్పే ఒక అసంబద్ధ మైనదిగా ఉందని భావించాల్సి ఉంటుంది. ఎందుకంటే ఈ దేశ మూలవాసులను దురాక్రమణదారులుగా పేర్కొంటూ చేసిన వ్యాఖ్యానమే అభ్యంతకరమైనదిగా ఉంది. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో కొనసాగుతున్న అంతర్యుద్ధంలో నిలువ నీడ కోల్పోయి అంతర్గత నిర్వాసితులుగా తెలంగాణ లోని ఖమ్మం, వరంగల్ జిల్లాల సరిహద్దు ప్రాంతాల్లో తలదాచుకంటున్న 'గొత్తికోయ'లను ఉద్దేశించి అసలు గొత్తికోయలు ఈ దేశ పౌరులే కాదంటూ తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ అన్నంత విశాలమైనదిగా, అటవీ హక్కుల గుర్తింపు చట్టాన్ని సవాలు చేస్తు వన్యప్రాణి సంరక్షకులు వేసిన కేసులో ఆదివాసులను, ఇతర పరంపారగత ఆటవీ నివాసితులను ఉద్దేశించి సుప్రీం కోర్టు ఉద్ఘాటించిన 'దురాక్రమణదారులు (ఎంక్రోచర్స్)' అన్న పదం.

ఇటీవలే తెలంగాణలో నెలకొన్న ఉధృత పరిస్థితుల నేపథ్యంలో కొమురం భీం జిల్లా కొత్తసర్సలలో అటవీ అధికారులపై జరిగిన దాడికి ఆదివాసులకు ఏ విధమైన సంబంధంలేదు. కాని ఆ నింద కూడా ఆదివాసుల పైనే మోపుతున్నారు. కొత్తసర్సల పూర్తిగా మైదాన ప్రాంతం. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో మాత్రమే ఆదివాసులు పోరాటాలు చేస్తున్నారు. కొత్తసర్సల, కొలాంగొంది గ్రామాల్లో అటవీ అధికారులతో జరిగిన ఘర్షణల్లో పదుల సంఖ్యలో ఆదివాసులపై పోలీసు కేసులు నమోద య్యాయి. కఠినమైన నిర్బంధం, అణచివేత కొనసాగుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల్లో తలమునకలై ఉన్న అధికార్లు సుప్రీంకోర్టు ఆదేశాలకు స్పందించకపోవడం, ఇంతలోనే కోర్టు అదేశాలు నిలిపివేస్తు 'స్టే' రావడం జరిగిపోయింది. ఈ రెండు కారణాల వల్ల గత నాలుగు నెలల పాటు ఉపసమనం పొందినప్పటికీ, ఇది శాశ్వత విరామం కాదు. కేంద్ర ప్రభుత్వం సరైన విధంగా స్పందించకుంటే మళ్లీ మరో రూపంలో రావచ్చు. మనమందరం సిద్ధంగా ఉండాలి.

ఆదివాసులను అడవుల నుంచి తొలగించే క్రమంలో మహిళల పైన, చిన్న పిల్లలపై అటవీ శాఖ అధికారులు హింసకు పాల్పడుతున్నారు. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం నుంచి ఖమ్మం, వరంగల్ జిల్లాల సరిహద్దుల్లోకి పారిపోయివచ్చి గుడిసెలు వేసుకుని తలదాచుకొంటున్నారు. అదే సందర్భంలో అక్కడి ప్రభుత్వం వారిని తరిమివేసే సమయంలో అటవీ శాఖా అధికారులు మహిళాలపై భౌతిక దాడులకు పాల్పడి శారీరక హింసను ప్రదర్శిస్తున్నారు. అంతే కాకుండా కవ్వింపు చర్యలకు

పాల్పడుతూ, ప్రేరేపిత దాడులను ప్రోత్సహిస్తున్నారు. ఆదివాసులు ప్రతిస్పందిస్తే, కఠినమైన చర్యలకు పాల్పడుతూ నిర్బంధాన్ని కఠినతరం చేస్తున్నారు.

అటవీ హక్కుల చట్టం అమలు చేయవలసిన పాలకులు చట్టం అమలు చేయకుండా బలహీనం చేయడానికి అనేక జిత్తులమారి ఎత్తుగడలు వేస్తు వచ్చారు. మొన్నటి సుప్రీం కోర్టు తీర్పు అందులో భాగంగా వచ్చిందిగానే చూడాలి. అటవీ హక్కుల చట్టం ఉండగా, 2016లో 'కాంపెన్‌సేటరీ అప్పర్ స్టేషన్ మెయింటెనెన్స్ అండ్ ప్లానింగ్ ఆక్ట్' (కంపా) బిల్లును తెరమీదకు తీసుకువచ్చింది. అంతేకాకుండా సవరణ చట్టం పేరుతో ఇండియన్ ఫారెస్ట్ ఆక్ట్–1927 ను మార్పు చేసి, 'భారతీయ అటవీ చట్టం (సవరణ) 2019' పేరుతో వచ్చే అటవీ చట్టం వల్ల అటవీ హక్కుల చట్టాన్నే కాదు! ఈ దేశ ఆదివాసులు, ఇతర పరంపరాగత అటవీ నివాసుల మనుగడనే ప్రశ్నార్థకంగా మార్చవేస్తుంది. అటవీ అధికారులకు విశేష అధికారాలు కట్టబెట్టడమే కాకుండా ఆయుధాలను కూడా కట్టబెట్టే అవకాశం కల్పిస్తుంది సవరణ ప్రతిపాదనలు.

అటవీ హక్కుల చట్టం తేవడానికి రెండేళ్ల ముందు అంటే మే 2002 – ఆగస్టు 2004 మధ్యకాలంలో ఆదివాసులు, ఇతర పారంపరాగత అటవీ నివాసులను 1.52 లక్షల హెక్టార్ల భూముల నుండి వెళ్లగొట్టిందని ఒక అంచనా. అస్సాం, మహారాష్ట్రలలో ఇళ్లను ధ్వంసం చేయడానికి శిక్షణ పొందిన ఏనుగులను ఉపయోగించారంటే కంపా, ఇండియన్ ఫారెస్ట్ (ఎమెండ్‌మెంట్) ఆక్ట్ –2019 సవరణల ముసాయిద అమోదించి చట్టంగా అమల్లోకి తెస్తే ఎంత భయంకరంగా ఉంటుందో ఊహించగలం.

అటవీ శాఖ అధికారులు ఆయుధాలు (తుపాకులు) వాడడానికి, నష్టపరిహారంగా కొంత డబ్బును ముట్టజెప్పి అటవీ హక్కులను (భూములను) బలవంతగా లాక్కోవడానికి భారతీయ అటవీ చట్టం 2019 సవరణలు ఉపకరిస్తాయి. భారతీయ అడవులను సైనికీకరించి టైగర్ జోన్‌లు వంటి భారీ ప్రాజెక్టులు నెలకొల్పడానికి రంగం సిద్ధం చేస్తున్నారు. దేశ సరిహద్దుల్లో సైనికుల మాదిరిగా సాయుదులైన వేలాది మంది అటవీ అధికారులు షిఫ్టుల వారిగా పహారా తిరుగుతుంటారు. అటువంటి సమయల్లో తచ్చాడిన వారిని అటవీ నేరాల నిరోధించడానికి తుపాకులతో కాల్చడం, సోదాలు చేయడం, ఆస్తులను జప్తు చేయడం, అరెస్టులు చేయడం వంటి అధికారాలు అటవీ శాఖ అధికారులకు సవరణ చట్టం కట్టబెట్టనుంది. ఇన్ని దుశ్చర్యలకు పాల్పడినా 'అటవీ అధికారుల చర్యలకు ఎలాంటి చర్యలు ఉండకూడదని, ఆదివాసులు కోర్టుల పాలైనపుడు బాధితులే తమకు తాముగా తప్పు చేయలేదని కోర్టులో నిరూపించు కోవాల'నీ ప్రతిపాదిస్తుంది. ఇది ప్రమాదకరమైన సంకేతం.

తెలంగాణ ప్రభుత్వం అటవీ అధికారులకు ఆయుధాలు అందించే దానికి సమీక్షలు కూడా ప్రారంభించింది. హరితహారం పేరుతో ప్రభుత్వం గుంజుకుంటున్న భూములు కాపాడుకోవడానికి తిరుగుబాటు చేస్తున్న ఆదివాసుల పైన, వారికి తోడుగా నిలుస్తున్న వారిపైన నక్సలైట్ల ముద్ర వేసి నీర్బంధిస్తామని బహిరంగంగానే ప్రకటించింది. అందుకే ప్రేరేపిత దాడులకు కూడా పూనుకుంటోంది. కొత్తసర్సల దాడులు ఇందులో భాగంగానే భావించాలి.

అటవీ హక్కుల చట్టం చేయడానికి ముందు ఎందుకు చేయవలసి వచిందో వివరిస్తూ 'వలస పాలన కాలంలోనే కాకుండా, స్వతంత్ర దేశంలో కూడా రాష్ట్ర సంరక్షిత అడవుల ఏకీకరణలో పూర్వికుల భూములపై వారి నివాస ప్రాంతాలపై అటవీ హక్కులను గుర్తించలేక పోవడం వల్ల అటవీ పర్యావరణ వ్యవస్థ నిరంతరంగా కొనసాగడానికి, మనుగడ సాధించడానికి కీలకంగా ఉన్న అడవులో నివసించే షెడ్యూల్డ్ తెగలు, ఇతర పరంపరాగత అటవీ నివాసితులకు చారిత్రక అన్యాయం జరిగినందువలననూ, అభివృద్ధి పేరిట ప్రభుత్వం జోక్యం చేసుకొన్న కారణంగా, బలవంతంగా నివాసాలు వేరేచోట తిరిగి ఏర్పాటు చేసుకోవలసి ఉన్న వారితో సహా, అడవులలో నివసిస్తున్న షెడ్యూల్డ్ తెగలు, ఇతర పరంపరాగత అటవీ నివాసితులు దీర్ఘకాలంగా అభద్రతకు గురైన అనుభవ హక్కులను, ప్రవేశ హక్కులను వారికి ఇవ్వవలసిన అవసరం ఏర్పాడినందువలననూ ఈ చట్టం చేయవలసి వచ్చిందని ప్రియాంబుల్లో పేర్కొనడం జరిగింది. ఈ తప్పిదానికి పరిహారంగా అటవీ హక్కుల చట్టం చేస్తున్నామని ఒప్పుకొంది భారత ప్రభుత్వం. బహుశా మన దేశ చరిత్రలోనే కాదు! ప్రపంచంలో కూడా మరెక్కడా ఆదివాసుల పైన పాలకులు, ప్రభుత్వాలు చేసిన నిర్లక్ష్యాన్ని ఇంత నిస్సిగ్గుగా ఒప్పుకొన్న దాఖలాలు లేవేమో!

అంత విశాలమైన దృక్పథంతో రూపొందించుకొన్న ఈ అటవీ హక్కుల గుర్తింపు చట్టం, అమలు దగ్గరకు వచ్చేసరికి ఇరుకైన పాలకుల మనస్సులకి అంతే విశాల దృక్పథంతో చూడడం ఎంతమాత్రం ఇష్టంలేదు. బూజు పట్టిన పాత చట్టాలకు దుమ్ముదులిపే పనిలో ఉంది కేంద్ర ప్రభుత్వం. భారత దేశంలో ఉన్న మొత్తం అడవుల్లో మూడింట రెండు వంతులు ఐదో షెడ్యూల్డ్ భూభాగంలోనే ఉంది. చెట్లు, జంతువులు, పక్షులు, సెలమలు, నదులు మాత్రమే కాదు, అపారమైన ఖనిజ సంపద కూడా అడవుల కిందనే నిక్షిప్తమై ఉన్నది. అటవీ హక్కుల చట్టం స్ఫూర్తిని పక్కాగా అమలు చేస్తే ఈ సంపదను బహుళజాతి కంపెనీలకు బదిలీ చేయలేమనే కుట్రలో భాగంగానే అటవీ హక్కుల చట్టన్ని అమలు చేయకుండా నిరాకరిస్తూ వస్తున్నారని భావించవలసి ఉంటుంది. మన రాజ్యాంగం షెడ్యూల్డ్ ప్రాంతలకు ఏ సాధారణ చట్ట నియమాలను ఆపాదించకూడదని నిర్దేశించింది. 70 ఏళ్లు గడచినా ఏ ఒక్క పాలకుడు కూడా రాజ్యాంగ స్ఫూర్తిని గౌరవించి నడుచుకొన్న పరిస్థితి లేదు.

ఇన్ని అవరోధాలను ఎదుర్కోంటూ 'ఆదిమజాతులు' చేస్తున్న మనుగడ పోరాటాలు 'మానవ జాతీ కొనసాగింపుకు నాంది' కావాలనీ ఆశిద్దాం.

జల్, జంగల్, జమీన్ నినాదంతో దశబ్దాల పోరాటం ఫలితంగా సాధించుకున్న అటవీ హక్కుల చట్టాన్ని పాలకులు నిరాకరిస్తే తిరిగి పొందడానికి తాము చేస్తున్న కృషికి దేశ అత్యున్నత న్యాయస్థానం సైతం వక్రభాష్యం ఆపాదించడం ఒకింత విచారకరమే. ఈ నెల 24న ఇతర కారణాల వల్ల సుప్రీంకోర్టు వాదన వినలేదు. అంతమాత్రనా చెడు వార్తగా భావించనక్కర్లేదు. కానీ స్టే ఉత్తర్వులు అమల్లో ఉంటుండగా కూడా తెలంగాణ, ఛత్తీస్‌గడ్ వంటి అనేక రాష్ట్రాల్లో బలవంతపు తొలగింపులు (ఎవిక్షన్స్) జరుగుతున్నాయి. ఇది ఆందోళన కలిగించే అంశం. తాత్కాలిక నిలుపుదలను శాశ్వత పరిష్కారంగా భావించి మిన్నకుండడం శ్రేయస్కరం కాదు. ఎక్కువకాలం సాగదీస్తే మరింత అన్యాయం జరిగే అవకాశముంది. కేంద్ర ప్రభుత్వం త్వరితగతిన జోక్యం చేసుకుని ఈ కేసు నుండి శాశ్వతంగా విముక్తి కల్పించవలసిన బాధ్యత ఉంది. ఎందుకంటే అటవీ హక్కుల చట్టాన్ని సుప్రీంకోర్టులో సవాలు చేసినపుడు సుదీర్ఘకాలం పాటు మౌనం వహించింది గనుక.

(రచయిత కన్వీనర్, ఆదివాసీ రిజర్వేషన్ పరిరక్షణ పోరాట సమితి) వీ

ఆదివాసుల జీవించే హక్కుకు హాని

కార్పొరేట్ సంస్థల ప్రయోజనం కోసం ఆదివాసుల జీవించే హక్కును హరించే నూతన ముసాయిదా సవరణ చట్టాన్ని అడ్డుకోవాలనీ, మూలవాసుల జీవితాలకు భరోసా కల్పించడం కోసం ఉద్యమించాలనీ అంటున్నారు ఎం. శ్రీనివాస్

మూల ఆదివాసులపై మరో దాడికి నరేంద్రమోడీ ప్రభుత్వం సన్నద్ధమైంది. ఇప్పటికే భారత రాజ్యాంగంలోని 5, 6 షెడ్యూల్డ్‌ల ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. ఆదివాసులు పోరాడి సాధించుకున్న హక్కులు, చట్టాలు ఆచరణలో అమలుకు నోచుకోని పరిస్థితి నెలకొన్నది. అడవుల నుండి ఆదివాసులను గెంటివేసే సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన నేపథ్యంలో 'నూతన అటవీ ముసాయిదా సవరణ చట్టం - 2019' ముందుకు తేవడంతో ఆదివాసుల జీవించే హక్కు ప్రమాదంలో పడింది. నరేంద్రమోడీ ప్రభుత్వం ముసాయిదా సవరణ చట్టాన్ని సమగ్ర చట్టంగా తీసుకురావడానికి మరింత వేగవంతమైన నిర్మాణాత్మకమైన చర్యలను తీసుకుంటుంది. క్రమంగా పూర్తిగా తమ నియంత్రణలోకి తెచ్చుకోవడానికి, తద్వారా స్వదేశీ, విదేశీ బడా కార్పొరేటు ఆర్థిక శక్తులకు, సంస్థలకు అడవులను కట్టబెట్టడానికి కృషి చేస్తున్నది. అందులో భాగమే ఈ ముసాయిదా సవరణ చట్టం-2019. ఇది బ్రిటిష్ వలస పాలకులు తమ వాణిజ్య, వర్తక ఇతర పాలనా పరమైన అవసరాల కోసం అత్యంత నిరంకుశ పద్ధతిలో రూపొందించి అమలు చేసిన 'భారతీయ అటవీ చట్టం - 1927'కు మరిన్ని సవరణలతో వచ్చిన ముసాయిదా.

80వ దశకంలో సామ్రాజ్యవాద బహుళజాతి సంస్థల వ్యాపార వాణిజ్య అవసరాల కోసం ప్రపంచ బ్యాంకు రూపొందించిన 'ప్రపంచ దేశాల అటవీ విధానం-1980' నివేదిక అంశాల పునాదిగా రూపు దిద్దుకున్న ముసాయిదా ఇది. ప్రపంచబ్యాంకు ఏ ప్రయోజనాల కోసమైతే, ఎవరి అవసరాల కోసమైతే, ఈ నివేదికను రూపొందించి ప్రపంచ దేశాలపై రుద్ది ఆయా దేశాల అటవీ పాలసీని రూపొందిస్తూ చట్టాలు చేయాలని ఆదేశించిందో ప్రస్తుతం ఆ విషయాన్ని తర్వాత చర్చించుకో వచ్చును. అయితే 1927లో వచ్చిన ఇండియన్ ఫారెస్టు యాక్టు చట్టానికి భారత ప్రభుత్వం (మోడీ బృందం) తలపెట్టిన సవరణలు లేదా సంస్కరణల వరకే పరిమితమై చర్చించుకుందాం. కనుక ముసాయిదా రూపకల్పనకు అందులో పొందు పరిచిన అంశాలకు మూలాధారమైన ప్రపంచ బ్యాంకు రూపొందించిన అటవీ విధానం నివేదిక అంశాలను మాత్రమే పరిగణలో ఉంచుకుని 1927 అటవీ చట్టానికి చేసే సవరణలను అర్థం చేసుకోవాల్సి ఉంటుంది.

1927 అటవీ చట్టం నేపథ్యం...

మూల ఆదివాసుల పోరాటాలకు సుమారు నూరు దశాబ్దాల చరిత్ర ఉన్నది. ఈ కాలంలో రెండువందలకు పైచిలుకు చారిత్రాత్మకమైన తిరుగుబాట్లు జరిగాయి. ముఖ్యంగా 16వ శతాబ్దం కాలం నుండి వలస పాలకులైన బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా జరిగిన ఆదివాసుల, గిరిజన ప్రజల వీరోచిత పోరాటాలు, సాయుధ తిరుగుబాట్లు మధ్య భారతం మొదలు దక్షిణ భారతాన్ని చుట్టుముట్టి ఈశాన్య రాష్ట్రాల వరకు కొనసాగాయి. ఫలితంగా ఆదివాసులు కొన్ని హక్కులను, చట్టాలను సాధించుకున్నారు. ఆ విధంగా వచ్చిన చట్టాలు కూడా వలస పాలకుల ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలకు లోబడే రూపొందించబడి అమలులోకి వచ్చాయి. శతాబ్దాల తమ ఉద్యమ చరిత్రలో మూల ఆదివాసులు తమ సుపరిపాలన, స్వయం గౌరవం, అడవి, రక్షణయే ప్రాథమిక లక్ష్యంగా సాయుధంగా తిరుగబడ్డారు. పోరాటాలు కొనసాగించారు. దక్షిణ భారతంలో కొమురం భీం, రాంజీ గోండులు కావచ్చు, అల్లూరి సీతారామరాజు కావచ్చు, మధ్య భారతంలో బీర్సా ముండ నాయకత్వంలో కావచ్చు ఈ ఉద్యమాలన్నీ సాయుధంగా జరిగినవే. ఆదివాసుల పోరాట పటిమ, త్యాగ నిరతిని ఆ ఉద్యమాలలో ఉన్న తీవ్రతను గమనించిన వలస పాలకులకు అనివార్యంగా కొన్ని హక్కులను కల్పిస్తూ, చట్టాలు చేయవలసి వచ్చింది. 1878 నుండి 1949 మధ్య కాలంలో ఆ విధంగా భారత అటవీ చట్టం, భూ సేకరణ చట్టం అటవీ నిషేధ చట్టం తదితర కొన్ని చట్టాలు వచ్చాయి.

వేల సంవత్సరాలుగా అడవులలో జీవిస్తున్న మూల ఆదివాసుల సహజ హక్కుగా భావించే జీవనాధార భూములు, ఆవాస ప్రాంతాలు, దైనందిన ఆహారపు అటవీ ఉత్పత్తుల సేకరణలను నిరాకరించే అపరిమితమైన అధికారాలను కలిగి ఉన్న 1927లో వచ్చిన భారత అటవీ చట్టాన్ని ప్రతిఘటించిన సందర్భాలు, వ్యతిరేకంగా సాగిన పోరాటాలు ఆ చట్టం పట్ల సాగిన, సాగుతున్న ప్రతికూల చర్చలు గత శతాబ్ద కాలంగా గమనిస్తున్నాం. ఈ చట్టాన్ని ఉపయోగించుకుని మూలవాసుల పట్ల అమానుషంగా వలసపాలకులే కాదు, తర్వాత కాలంలో వచ్చిన భారత దళారీ పాలకులు కూడా వ్యవహరిస్తూ వచ్చారు. ఈ చట్టం పూర్తిగా ఆదివాసి గిరిజన ప్రజా ఉద్యమాలను, తిరుగుబాట్లను అణచివేయడానికి, మూల ఆదివాసులను పరిమితమైన కొన్ని నిర్దిష్ట ప్రాంతాలకే కుదిస్తూ అత్యంత నిరంకుశమైన నిబంధనలతో పొందుపరచబడిన చట్టంగా ఉన్నది. అయినా ఆదివాసుల పోరాటాలు ఆగిపోలేదు. వివిధ ప్రాంతాలలో భిన్నరూపాలలో ఉద్యమాలు, తిరుగుబాట్లు కొనసాగాయి.

1947 తర్వాత కూడా భారత దళారీ పాలకులు వలస పాలకులు రూపొందించి అమలు చేసిన చట్టాలను యథాతథంగా కొనసాగిస్తూనే వారు కూడా కొన్ని చట్టాలను అనివార్యంగా తీసుకు రావాల్సి వచ్చింది.

1949 నుండి 2013 మధ్య కాలంలోనూ ట్రైబల్ ఏరియా రెగ్యులేషన్ చట్టం, షెడ్యూల్డ్ ఏరియాల ల్యాండ్ ట్రాన్స్‌ఫర్ రెగ్యులేషన్ చట్టం, భూ బదలాయింపు చట్టం, నూతన అటవి విధానం, అటవీ హక్కుల గుర్తింపు చట్టం, నూతన భూసేకరణ చట్టం తదితర చట్టాలను తీసుకువచ్చారు. ఇక్కడొక విషయాన్ని గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది.

దేశంలో అధికార మార్పిడి జరిగిన తర్వాత సుదీర్ఘకాలంగా మూల ఆదివాసులు తమ ఆకాంక్షలకు అనుగుణంగా సాగించిన పోరాటాలు, సాయుధ తిరుగుబాట్లు మధ్యభారతంలోనూ, ప్రధానంగా ఈశాన్య రాష్ట్రాల్లోనూ వాటి ప్రభావ తీవ్రతను, ప్రత్యేక పరిస్థితులను గమనించిన నాటి నెహ్రూ ప్రభుత్వం 1947 నవంబర్ 9న భారత ప్రభుత్వానికి మూల ఆదివాసుల తెగలకు మధ్య జరిగిన చర్చల్లో ఆదివాసుల మౌలిక డిమాండ్ (ప్రత్యేక దేశంగా) కాదని భారత దేశంలో భాగంగా రాజ్యాంగానికి లోబడి ప్రత్యేక ప్రతిపత్తితో స్వయంపాలనా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవచ్చునన్న విధాన నిర్ణయంతో ఒక ఒప్పందం జరిగింది. నిజానికి మూల ఆదివాసుల మౌలిక హక్కులను రద్దుచేసే ప్రక్రియకు పునాది పడింది ఇక్కడే. ఆ తర్వాత కాలంలో ఈ ఒప్పందం ఆధారంగా రాజ్యాంగంలో 5, 6 షెడ్యూల్స్‌ను పొందుపరిచారు.

రాజ్యాంగంలో పొందుపరిచిన ఈ షెడ్యూల్డ్ ప్రాతిపదికన మూల ఆదివాసుల ఆర్థిక, రాజకీయ ప్రజాస్వామిక జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాల రక్షణ, అడవి ప్రాంతాలపై మూల ఆదివాసులకే ప్రాథమిక అధికారమన్న నిజాన్ని భారత దళారీ పాలకులు అనివార్యంగా గుర్తించి ప్రకటించాల్సి వచ్చింది.

ఆదివాసులకు సంబంధించి అత్యంత ఉన్నతమైన నైతిక, ప్రజాస్వామిక విలువలతో కూడిన మూల ఆదివాసుల సమిష్టి జీవన విధానం సంస్కృతి, సంప్రదాయాలు తరతరాలుగా అడవితో పెనవేసుకుని ఉన్నవి. ప్రధానంగా అడవితో వారికి ఉన్న చారిత్రక, మానసిక అనుబంధానికి విఘాతం కలిగిస్తూ 'అభివృద్ధి', 'పర్యావరణం', 'వన్యప్రాణి సంరక్షణ'ల పేరుతో రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా రాజ్యాంగ స్ఫూర్తితో చేయబడిన చట్టాలకు వ్యతిరేకంగా లాభాపేక్షయే ప్రాథమిక లక్ష్యంతో అటవీ వనరులను లూటీ చేయడానికి బడా కార్పొరేట్ ఆర్థిక శక్తులకు, విదేశీ బహుళజాతి సంస్థలకు సంపూర్ణ చట్టబద్ధ అవకాశాలను కల్పించడానికి, తద్వారా అడవుల నుండి మూల ఆదివాసులను తరలించడానికి మహాకుట్ర సాగుతోంది. ఈ కుట్రకు పథకరచన 50వ దశకం ప్రథమార్థంలో మొదలైంది. ఆ పథకాన్ని మోడీ ప్రభుత్వం అత్యంత క్రియాశీలంగానూ, నిర్మాణాత్మకంగానూ అమలు చేయడానికి పూనుకున్నది. ఆ కుట్రలో భాగమే 'నూతన జాతీయ అటవీ ముసాయిదా సవరణ చట్టం – 2019'

మోడీ ఫాసిస్టు విధానాలకు ప్రతీకయే ముసాయిదా సవరణ చట్టం

1927 చట్టసవరణ ముసాయిదా అసలు లక్ష్యం అటవీ ప్రాంతాలను 'ఉత్పాదక అడవులు', 'అడవుల ప్రైవేటీకరణ' కోసం ఒక సమగ్ర విధానాన్ని రూపొందించి అమలు చేయడానికి అడవులను విదేశీ, స్వదేశీ బడా కార్పొరేట్ ఆర్థిక సంస్థలకు అప్పగించడానికి వున్న ఆటంకాలను సంపూర్ణంగా తొలగించడానికి సమగ్రమైన విధాన కార్యాచరణను రూపొందించడం. మూల ఆదివాసులకు ఏదోమేరకు ఉన్న 'సానుకూలమైన' చట్టాలను, హక్కులను ఆచరణలో రద్దు చేయడం. పెసా, అటవీ హక్కుల గుర్తింపు చట్టం – 2006, 1/70 చట్టం, తదితర చట్టాలను నామమాత్రం చేయడం. అటవీ ఉత్పత్తులపై పన్నులు విధించే విధానం, ముసాయిదాకున్న మరో ప్రయోజనం అడవుల రక్షణకు ఆటంకంగా అటవీ హక్కుల గుర్తింపు చట్టం ప్రకారం ఆదివాసులు భూములు కలిగి ఉన్నట్లుగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు భావిస్తే అటువంటి ఆదివాసుల కుటుంబాలకు కొంత నష్టపరిహారం చెల్లించడం, లేదా వేరే ప్రాంతాలలో నివసించడానికి కొంత స్థలం చూపించి, వారిని అక్కడి నుండి తరలించాలన్నదే.

ఈ సవరణ దేశ సర్వోన్నత న్యాయస్థానం తాజా తీర్పుకు అనుగుణంగా ఉందనడంలో సందేహం లేదు. ఈ ముసాయిదా ఆదివాసులు ప్రాణాలను ఫణంగా పెట్టి సాధించుకున్న పెసా, అటవీ హక్కుల గుర్తింపు చట్టంలో పేర్కొన్న ఆదివాసుల గ్రామ సభల అధికారాలను, హక్కులన్నింటిని నిరాకరించే విధాన వైఖరిని కలిగి ఉన్నది. ముసాయిదా ముందుకు తెచ్చిన మరో అంశం ... 'ఉత్పాదక అడవులు' ఈ విధానం వల్ల పరిశ్రమలకు ముడి సరుకులను సరఫరా చేసే కేంద్రాలుగా అడవులను మార్చడం. దీనికి అనుగుణంగా ప్లాంటేషన్లు పెంచడం. అలాగే 'వాణిజ్యం కోసం అడవుల'నే విధానం ద్వారా తరతరాలుగా ఆదివాసులు తన జీవన అవసరాలకోసం సేకరించుకునే అటవీ ఉత్పత్తులపై పన్నులు విధించడం. అంటే అడవులను ప్రైవేటీకరించి తద్వారా కార్పొరేటు సంస్థల ప్రవేశానికి చట్టబద్ధ అవకాశాలను కల్పించాలన్నదే మోడీ ప్రభుత్వ సంకల్పం.

'ముసాయిదా సవరణ చట్టం – 2019'లో పొందుపరిచిన సెక్షన్లను పరిశీలిస్తే మోడీ ప్రభుత్వ ఫాసిస్టు స్వభావానికి, విధానాలకు అనుగుణంగా ఆదివాసుల మనుగడనే హననం చేసే విధంగా తయారు చేయబడిన ముసాయిదా చట్టమన్నది స్పష్టమవుతుంది. సుమారు 123 పేజీలు కలిగి ఉన్న ముసాయిదా సవరణ చట్టంలో సెక్షన్ 22(ఎ) 2 ప్రకారం ఏ గిరిజన కుటుంబమైనా అటవీ సంరక్షణ చట్టానికి అనుగుణంగా లేదని ఫారెస్టు అధికారులు భావిస్తే ఆ కుటుంబానికి ఉన్న అటవీ హక్కులు రద్దు చేయవచ్చునని పేర్కొంటుంది. అయితే ఈ సెక్షన్‌కు సంబంధించిన విషయంపై తగిన వివరణకానీ, నిర్వచనం కానీ ఇవ్వకపోవడమేకాక, పూర్తి అధికారాన్ని ఫారెస్టు అధికారులకు ఇవ్వడం వల్ల పారదర్శకత, జవాబుదారీ తనం లేకుండా పోతుంది. అసలు సెక్షనే అత్యంత ప్రమాదకరమైనది.

ముసాయిదా సవరణ చట్టంలోని సెక్షన్ 26 ప్రకారం అడవులలో పశులు, మేకలను మేపుకోవడం, వివిధ రకాల ఆహార ఉత్పత్తులను సేకరించుకోవడాన్ని నిషేధించబడుతుంది. వేల సంవత్సరాలుగా అడవినే నమ్ముకుని అదే సర్వస్వమని భావించే ఆదివాసుల సహజ సిద్ధమైన హక్కు అయిన నిత్య జీవనాధారమైన అటవీ ఉత్పత్తుల సేకరణను నిషేధించడమంటే జీవించే హక్కును నియంత్రించడమే. రాజ్యాంగం ద్వారా ప్రజలు స్వేచ్ఛగా జీవించే హక్కును గుర్తిస్తూ నిర్దేశించిన ఆర్టికల్ 21కి సాధికారతను చేకూర్చే విధంగా పొందుపరిచిన రాజ్యాంగంలో 5, 6 షెడ్యూల్డ్‌లకు పూర్తిగా విరుద్ధమైనది. మూల ఆదివాసుల జీవించే

హక్కుకు సంబంధించి బ్రిటిష్ పాలనా కాలంలో ఈ విషయంలో నియంత్రణ, పరిమితులు ఉంటే మోడీ హయాంలో వచ్చే ఈ సవరణ ముసాయిదా చట్టం ఏకంగా నిషేధాన్ని విధిస్తుంది.

ముసాయిదా సవరణ చట్టంలో సెక్షన్ 66లో 2 అంశాలను నిర్దేశిస్తున్నాయి. ఫారెస్టు అధికారులకు ఆయుధాలు ఇవ్వాలని, వారిపై వచ్చే మానవ హక్కుల ఉల్లంఘనలపై అభియోగాలకు సంబంధించి పై అధికారుల అనుమతి లేకుండా విచారణ కానీ, కేసుల నమోదు కానీ చేయరాదని పేర్కొనడం ఒక అంశం కాగా, రెండో అంశం అటవీ అధికారులు ఎవరినైనా నేరస్థులుగా భావిస్తే వారిపై రు. 50 వేల జరిమానాతో పాటు 7 సంవత్సరాల వరకు జైలు శిక్ష విధించే అవకాశాన్ని ఈ ముసాయిదా సవరణ చట్టం దఖలు పరుస్తోంది. అంతేకాదు, 1927లో గత బ్రిటిష్ పాలకులు తెచ్చిన భారతీయ అటవీ చట్టంలో పేర్కొన్న విధంగా ఆదివాసుల జీవిత ఆధారిత అవసరాలను నియంత్రించే పలు నిబంధనలను మరింత కఠినతరం చేస్తూ తిరిగి పునరుద్ధరణకు ఈ ముసాయిదా పూనుకున్నది.

ఫారెస్టు అధికారుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి పశువులను, మేకలను మేపుకున్నందుకు పన్నులు చెల్లించాల్సిన నిబంధనతో పాటు ఆదివాసులను అటవీ హక్కుల చట్టం ప్రకారం జీవనం సాగిస్తున్నందుకు ఫారెస్టు పనులను చేయాల్సి వుంటుందన్న నిబంధనలు ఈ ముసాయిదాలో ఉన్నాయి. అంటే 1927 అటవీ చట్టం నిర్దేశించి అమలు చేసిన పుల్లరి చెల్లింపు విధానం, వెట్టి చాకిరి పద్ధతిని పునరుద్ధరించడమే అవుతుంది. 2006లో వచ్చిన అటవీ గుర్తింపు చట్టంలో కల్పించిన హక్కులను, తగు రక్షణలను తిరస్కరించే నియంత్రణాధికారాలను ముసాయిదా సవరణ చట్టం ద్వారా కట్టబెట్టబోతున్నారు. ఆదివాసుల గిరిజన ప్రజల సాంప్రదాయక హక్కులను తొలగించే సర్వాధికారాలతో కూడిన వెసులుబాటు కూడా ఫారెస్టు అధికారులకు లభించబోతుంది. గతంలో వచ్చిన చట్టంలో బెయిల్‌కు అర్హమైన కొన్ని నేరాలను ప్రస్తుత ముసాయిదా సవరణ చట్టంలో నాన్‌బెయిలబుల్‌గా మార్చారు. అంతేకాదు, 'నేరం' మోపబడి ఉన్నవారే నేరం తమది కాదని రుజువు చేసుకోవాల్సిన బాధ్యత ఉంటుంది. నిజానిజాలు నిర్ధారణ అయ్యేవరకు వారు నేరస్థులుగానే పరిగణించ బడతారు. నింధితులను అరెస్టు చేయడానికి అటవీ అధికారులకు అవసరమైన సాయుధ సిబ్బందిని పెంచడానికి అటవీ సిబ్బంది ఆయుధాలను నిత్యం వినియోగించు కోవడానికి అధికారాన్ని ఈ చట్టం దఖలు పరుస్తుంది. ఆయుధాలను భద్రపరచుకోవడానికి, అభియోగాలతో నిర్బంధించబడిన వారి కోసం లాకప్ రూములను నిర్మించుకోవాలని ఈ చట్టం పేర్కొంటుంది.

అటవీ ఉత్పత్తులు సేకరించుకొని అమ్ముకునే వ్యక్తే ఆ ఉత్పత్తులు వారి సొంత భూముల నుండి లేదా హక్కులు గుర్తింపు పొందిన ప్రాంతాల నుండే సేకరించామని రుజువు చేసుకోవాల్సిన బాధ్యత ఉందనీ, అటవీ నేరాలకు పాల్పడినట్లుగా ఎవరిపైననైనా కేసులు నమోదైతే వాటిని ఉపసంహరించే అధికారం ప్రభుత్వానికి కూడా లేదని ముసాయిదా సవరణ చట్టం పేర్కొంటుంది.

గత చట్టంలో ఉన్న వెసులుబాటుకు అనుగుణంగా సెక్షన్ 321 సిపార్‌పిసి కింద నిందితులపై నమోదైన క్రిమినల్ కేసులను ఉపసంహరించమని ప్రభుత్వ సూచనల మేరకు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ లేదా పబ్లిక్ ప్రాసిక్యూటర్ న్యాయస్థానాలను కోరవచ్చును. ఈ అవకాశాన్ని ప్రస్తుత ముసాయిదా సవరణ చట్టం తిరస్కరిస్తోంది. ఈ అవకాశం లేకుండా మరింత కఠినమైన నియమాలను రూపొందించింది. కేసు దర్యాప్తు క్రమంలో నిందితుల నుండి నేరానికి సంబంధించి నమోదు చేసిన స్టేట్‌మెంట్ సాక్ష్యాధారాల చట్టంలోని సెక్షన్ 25, 26ల ప్రకారం చెల్లనేరదు. కానీ ప్రస్తుత ముసాయిదా సవరణ చట్టం నిందితుల నుండి తీసుకునే స్టేట్‌మెంటు కూడా సాక్ష్యంగా పరిగణిస్తుంది.

అటవీ నేరానికి పూనుకున్నట్లుగా కోర్టులో చార్జిషీటు దాఖలైతే సాధారణ న్యాయ సూత్రాల ప్రకారం ఆ నేరం కింద నమోదైన కేసులకు సంబంధించి రుజువు చేయాల్సిన బాధ్యత ప్రాసిక్యూషన్ ఏజెన్సీలదే. ఈ విషయాన్ని ముసాయిదా సవరణ చట్టం పూర్తిగా విభేదిస్తోంది. ఈ ముసాయిదా చట్టం ద్వారా అధికారాలన్నీ కేంద్రం చేతుల్లోకి వెళ్తాయి. కేంద్ర ప్రభుత్వం తనకు తాను కొత్త అధికారాలను ఈ సవరణ చట్టం ద్వారా కల్పించుకుంటుంది. అటవీ భూముల నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వ అధికారాలలో కేంద్రం జోక్యం చేసుకోవచ్చు. అటవీ సంపదకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాలను పునఃసమీక్షించే హక్కు కేంద్రానికి ఉంటుంది. అటవి భూముల్లోని ఏ ప్రాంతమయినా వాణిజ్య పంటలు, మొక్కల పెంపకానికి అనుకూలంగా ఉందని భావిస్తే అక్కడ అటవిశాఖ సంబంధిత ప్రక్రియను నిర్వహించే అధికారాలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించవచ్చు. గతంలో దేశంలో బ్రిటిష్ పాలకులు, హైదరాబాద్ సంస్థానంలో నిజాం పాలకులు అడవిని తమ ఆధీనంలోకి తెచ్చుకోవడానికి 1867 భారత అటవీ చట్టాన్ని, 1878లో అటవీ చట్టాన్ని రూపొందించినట్లుగానే సామ్రాజ్యవాద ఆర్థిక ఏజెన్సీలకు సేవ చేసే తమ దళారీ 'పవిత్ర కర్తవ్యాన్ని' సాకారం చేసుకోవడానికి నరేంద్రమోడీ పాలక బృందం 1927 అటవీ చట్టానికి సవరణల పేరుతో ఈ ముసాయిదా చట్టాన్ని ముందుకు తెచ్చింది.

అభివృద్ధి అడవుల రక్షణ, జీవ వైవిధ్యం, పర్యావరణానికి సంబంధించి వాటి రక్షణ కోసం అంటూ నిత్యం గొంతు చించుకునే పాలకులు వాస్తవిక జీవిత ఆచరణలో వీటి పరిరక్షణలో ఆదివాసుల పాత్రను పూర్వపక్షం చేయడమే కాక, అడవి అంటే వేల, లక్షల సంవత్సరాల మానవ నాగరికత పరిణామపు కొనసాగింపు అన్న నగ్నసత్యాన్ని మరుగపరుస్తూ దేశవ్యాప్తంగా 19 రాష్ట్రాల్లో 90 జిల్లాల్లో విస్తరించిన మూల ఆదివాసులు దేశ జనాభాలో 8 శాతం, అంటే పదిన్నర కోట్ల మంది మూల ఆదివాసుల జీవించే హక్కుతో పాటు, ఇతర మౌలిక హక్కులన్నీ అత్యంత ప్రమాదంలోకి నెట్టబడ్డాయి. ప్రస్తుతం ఉనికిలో ఉన్న చట్టాలు, చట్టాలుగానే ఉంటాయి. పాలకులు ఆ చట్టాల జోలికి వెళ్ళకుండానే తమ కార్యాన్ని సంపూర్ణంగా పూర్తి చేసుకోడానికి ప్రస్తుత నూతన జాతీయ ముసాయిదా సవరణ చట్టం సమగ్ర చట్టంగా ఆమోదం పొందితే ఆదివాసుల అస్తిత్వానికి, మనుగడకు పెను ప్రమాదంగా మారుతుంది. కనుక ఈ ముసాయిదా సవరణ చట్టాన్ని భేషరతుగా ఉపసంహరించుకునే వరకు బలమైన ఐక్య ఉద్యమాన్ని నిర్మించవలసి ఉంటుంది.

(రచయిత ఇఫ్టూ రాష్ట్ర కార్యదర్శి) వీ

కొత్త సీసాలో పాత సారా - ఆంధ్ర రాజకీయాలు

***ఆంధ్రప్రదేశ్‌లో అధికారం చేపట్టే పార్టీలు మారినంత మాత్రాన పాలన మారలేదనీ, ప్రజలు చైతన్యవంతులై తమ హక్కులను సాధించుకోవాలనీ అంటున్నారు* బి.ఎస్. రాజు**

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల పర్వం ముగిసి, తెలుగుదేశం పార్టీ మట్టి కరిచి, వైఎస్ఆర్ కాంగ్రెస్ ఘన విజయం సాధించింది. ఇలా అనడం సరికాదనుకుంటా! చంద్రబాబు అనే కమ్మ సామాజిక వర్గ పాలకుడు చిత్తు చిత్తుగా ఓటమి పాలై, జగన్ అనే రెడ్డి సామాజిక వర్గ పాలకుడు ఘన విజయం సాధించాడని చెప్పాలనుకుంటా! ఇది కూడా సరైన విశ్లేషణ అనిపించుకోదేమో! ఇలా చెప్పడం పాక్షిక విశ్లేషణే అవుతుంది.

మొత్తం 2019 ఎన్నికల విశ్లేషణలో ఈ చర్చను భాగం చేస్తే గాని సరైన దృశ్యం కనిపించదు. అలా అనుకున్నప్పుడు తెలుగు రాష్ట్రాల్లో ఒకటైన తెలంగాణ గురించి కూడా ప్రస్తావించాలి. కేంద్రంలో రెండవసారి పీఠ మెక్కిన హిందుత్వ రాచరికం గురించి కూడా మాట్లాడాలి. తెలంగాణలో వెలమ సామాజిక వర్గ పాలకుడు రెండవసారి విజయ పతాక ఎగరవేశాడు. రెడ్డి వర్గం తిరిగి ఎలాగైనా తెలంగాణ రాష్ట్ర అధికారాన్ని చేబట్టాలని ఎంత ప్రయాస పడినప్పటికీ మునిగిపోతున్న నావలో, అస్తమిస్తున్న రాజకీయ ఆధిపత్యంలో, ఎన్నికల కొత్త మత్తేభ చాణుక్య వ్యూహాల దాడిలో వారు ఓటమి పాలుగాక తప్పలేదు.

దేశంలో రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, పాలనా వ్యవస్థల సర్వాంగాలను గుప్పిట పట్టి శాసించే దశకు చేరుకున్న ఫాసిస్టు పాలన, ఈ 2019 ఎన్నికలతో ఒక్క దక్షిణాది మినహా దేశం నలుమూలలకు వ్యాపించింది. దక్షిణ భారత రాష్ట్రాలు ఇంకా ప్రాంతీయ పార్టీల సంస్థానాలుగానే కొనసాగుతున్నాయి. అంతేగాక, 2019 ఎన్నికలు పలు రాజకీయ పార్టీల మనుగడనే ప్రశ్నార్థకం చేసిన స్థితి ఇపుడు సుస్పష్టం.

మార్క్స్, లెనిన్‌లే ఆదర్శం అని చెప్పుకుంటూ పార్లమెంట్‌ను, ఎన్నికల సంతను, బూటకపు ప్రజాస్వామ్యాన్ని నమ్ముకుని పలు దశాబ్దాలుగా పబ్బం గడుపుకుంటున్న కమ్యూనిస్టు పార్టీలకు ఆస్తులు, కార్యాలయాలు, సైన్ బోర్డులు మాత్రమే మిగిలాయి. కమ్ముకొస్తున్న ఫాసిస్టు కారుమేఘాలు ముందు ముందు ఈ ఎర్ర పార్టీలకు ఇవికూడా మిగలుస్తాయా? అంటే అనుమానమే!

బి.సి, ఎస్.సి, ఎస్.టి, ఆదివాసీ, మైనారిటీ సమూహాల శ్రేయోభిలాష ప్రతినిధులుగా ఇక్కడో, అక్కడో అధికారం అనుభవిస్తూ వస్తున్న ఎస్.పి, బి.ఎస్.పి, ఆర్.జె.డి, తృణమూల్, జె.ఎం.ఎం ఇత్యాది పార్టీలు తమ ముందు దారేమిటో తెలియని అగమ్యగోచర స్థితికి నెట్టివేయ బడ్డాయి. దక్షిణాదిన బలంగా ఉన్న డి.ఎం.కె, టి.ఆర్.ఎస్, వైఎస్ఆర్ కాంగ్రెస్‌ల భరతం పట్టి, కర్ణాటకలో కాంగ్రెస్–జెడిఎస్ సంకీర్ణ ప్రభుత్వాన్ని కూల్చి, ఈ సామంత రాజ్యాలను తుడిచిపెట్టేసే పనిలో కేంద్ర ఫాసిస్టు పాలక ద్వయం తలమునకలై ఉంది. మొత్తం దేశాన్ని చాపచుట్టగా చుట్టి చంకన పెట్టుకోవడానికి సర్వశక్తులు ఒడ్డుతున్న కేంద్ర చక్రవర్తి విజయగర్వం పట్ల తెలంగాణ సామంత ప్రభువు ఏమంటున్నాడో ఇక్కడ మననం చేసుకోవడం అవసరం, సమంజసం కూడా!

'మోడీది ఓ గెలుపా? ఆయన ఏం పనిచేసి గెలిచిండు? దేశభక్తి సెంటిమెంటు రెచ్చగొట్టిండు. బిజెపి లేకుంటే దేశానికి భద్రత లేదనే అభద్రతా భావాన్ని సృష్టించిండు, ఎన్నికల యుద్ధంలో గెలిచిండు. అభివృద్ధి చేసినా ఒక్కోసారి ఓడిపోతాం! ఎన్నికల యుద్ధంలో నైపుణ్యం వేరు. అభివృద్ధి చేస్తే గెలుస్తారా? ప్రజలు ఓట్లు వేస్తారా? అలా అయితే మోడీ ఏం పనిచేసి గెలిచిండు? దేశానికి మోడీ ఏంచేసాడు? ఆయన పని తీరుపై చర్చ జరిగిందా? గెలిస్తే ఏమి చేస్తామో చెప్పిండా? ఎన్నికలనే యుద్ధం చేసి గెలిచిండు. దేశభక్తి, జాతీయత అనే సెంటిమెంట్లను, భావోద్వేగాలను రెచ్చగొట్టి, బిజెపి లేకపోతే దేశానికి భద్రత, రక్షణ లేదనే అభద్రతా భావాన్ని సృష్టించి గెలిచిండు. అదో గెలుపా?' అని కుండ బద్దలు గొట్టేడు. అంతటితో ఆగక ఆయన మరిన్ని సత్యాలను బయట పెట్టాడు. ఎన్నికలంటే వార్ (యుద్ధం). యుద్ధాన్ని, యుద్ధం చేసే గెలవాలి. అభివృద్ధి చేస్తాం. కానీ, ఒక్కోసారి అభివృద్ధి చేసినా ఎన్నికల్లో ఓడిపోతాం. ఎన్నికలనే యుద్ధంలో గెలిచే నైపుణ్యం వేరుగా ఉంటుంది. ఎన్నికలు, అభివృద్ధి అనేవి వేర్వేరు అంశాలని, దేని దారి దానిదేననే ఆయన దాపరికం లేకుండా బయట పెట్టాడు.

కొంచెం విశ్లేషించి చూస్తే, తెలంగాణ ప్రభువర్యుల ఎన్నికల రాజకీయ ప్రవచనంలో ఇరు తెలుగు రాష్ట్రాల ఎన్నికల బండారామే కాక మొత్తం భారత దేశపు రాజకీయ బండారమంతా దర్శనమిస్తుంది. అయితే ఈ విమర్శ చేసిన తెలంగాణ ప్రభువుపై కూడా పలు సందేహాలుండవచ్చు. ఈయనెట్లా గెలిచిండు? ఏ సెంటిమెంట్లు రెచ్చగొట్టి గెలిచిండు? ఎటువంటి ఎన్నికల యుద్ధతంత్రంలో గెలిచిండు? అనే ప్రశ్నలు ఉదయించవచ్చు. మనం ఈ ప్రశ్నలను మనలోనే ఉంచుకోవాలి. నోరెత్తి ప్రశ్నిస్తే సన్నాసులమనే ముద్ర పడవచ్చు. ఇంకేమైనా జరగొచ్చు.

తిరిగి ఇప్పుడు ఆంధ్రా రాజకీయాల్లోకి వస్తే, తనకు ఆంధ్రాలో ఎదురులేదని విర్రవీగి చిత్తుగా ఓడిపోయిన చంద్రబాబు 'నేను ఇంతగా ప్రజలను ఇబ్బంది పెట్టానా? అహోరాత్రులు వారి కోసమే ఆలోచించి, వారికోసమే శ్రమించి, రాష్ట్ర అభివృద్ధికి నిద్ర లేకుండా కృషిచేసిన నాపై ప్రజలకు ఇంత ద్వేషమా? వారిని నేనేమి కష్టాలకు గురిచేశానని నన్నింతగా ఓడించారు? అని దిమ్మ తిరిగిన ఓటమి షాక్‌లో వాపోయేడు. ఇక అసలు గెలవగలనో లేనో అనుకున్న జగన్ అనూహ్యమైన విజయంతో ఆంధ్రలో తెలుగుదేశం పార్టీ మనుగడనే ప్రశ్నార్థకం చేస్తూ పావులు కదుపుతున్నాడు. తనను ముప్పు తిప్పలు పెట్టి, తన రాజకీయ జీవితాన్ని తుడిచివేయాలని విశ్వ ప్రయత్నం చేసి కుదేలైన తన బద్ధ శత్రువు చంద్రబాబుకు ఇప్పుడు అదేగతి, అధోగతి పట్టించే పనిలో ఉన్నాడు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా జగన్ చేస్తున్న ముఖ్యమైన పని అదే! దీన్ని తప్పు పట్టగలమా? పట్టలేం!

కెసిఆర్ సంస్థానంగా ఉన్న తెలంగాణ రాజకీయాల్లో తలదూర్చ ప్రయత్నించి, తాను భంగపడడమే కాకుండా తనతో చెయ్యి కలిపిన కాంగ్రెసు క్కూడా దీపం ఆరిపోయే పరిస్థితి కల్పించిన చంద్రబాబు, కెసిఆర్ చేతికి అల్లాఉద్దీన్ అద్భుత దీపం అందించి, ఆంధ్రాలో రిటర్న్ గిఫ్ట్ సంపాయించాడు. బిజెపి, కెసిఆర్, వైఎస్ఆర్–విజయ సాయిరెడ్డిల త్రిముఖ వ్యూహం, ఎత్తుగడలు ఫలించి చంద్రబాబు బూటకపు అద్భుత అమరావతి బుడగ 'ఢాం' అని పేలిపోయింది. చంద్రబాబు పేర్చి పెట్టిన, పూడ్చిపెట్టిన అవినీతి అస్థిపంజరాలు బయట పడుతున్నాయి.

నావాళ్లు అనుకున్న వాళ్లంతా కాషాయ గంగాజల తీర్థం స్వీకరిస్తున్నారు. మునిగిపోయే నావలో మునిగిపోయేకన్నా మునగక ముందే గట్టుకు ఈదడం తెలివైన పనికదా! కమ్మ ధనిక సామాజికవర్గం తమ ధనధాన్య భూదందాల సంపత్తిని కాపాడుకునే పనిలో పడ్డారు. నిన్నటి వరకు జీ హుజూర్ అని భజన చేసిన చంద్రబాబు పాద దాసులు కష్టకాలంలో నీ చావేదో నువ్ చావంటూ ఎగిరిపోతున్నారు. ఇక చంద్రబాబు అవినీతి సామ్రాజ్యంలో ప్రధాన భాగస్వాములైన 'లుటేరా, కాంట్రాక్టర్లు, స్థిరాస్తి దోపిడీ దందాగాళ్లు' జగనన్న కాళ్లు పట్టుకుని ఎలా తమ కాంట్రాక్టు, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు నిలుపుకోవాలో అనే మార్గాలు వెదుక్కుంటున్నారు.

ఇప్పటి సమాజపు అవినీతి చట్రంలో ప్రధాన భాగస్వాములుగా, అలవిమాలిన భోగభాగ్యాలను అనుభవిస్తున్న వీరు ఈ నడుస్తున్న ప్రభుత్వాల్లో ప్రధాన భాగస్వాములే కదా! అందుచేతవారు అతిచాకచక్యంగా ఇటునుండి అటు అటునుండి ఇటు క్యాంపులు మార్చడం వారికి వ్యాపార వెన్నతో పెట్టిన విద్యే! ప్రజాస్వామ్య పరిరక్షణకు, బడుగు బలహీన వర్గాల సంరక్షణకు కృషి చేస్తామని చెప్పుకునే ఈ ప్రభువులకు ఈ దొంగల ముఠాలే కదా ప్రభుత్వ మెగా ప్రాజెక్టుల నుండి, గనులు తవ్వకాలు, ఇతర బడా వ్యాపారాల నుండి దండుకున్న కోటానుకోట్ల ప్రజా ధనాన్ని సొంత సొమ్ముగా మార్చుకుని, ఆ సొమ్మునే కుప్పలు తెప్పలుగా ఎన్నికల ఖర్చుకై దొడ్డిదారిన సప్లైచేసేది. అధికారం కోసం ప్రజల ముందు తెగ కుమ్ములాడుకుని దుర్భాషలాడుకోవడం, రంకెలు వేసుకోవడం ఒక డ్రామానే. అటూ, ఇటూ కూడా ఉన్నది మనకు తెలిసిన దొంగలే. బడా స్కాముల్లో దోచేసిన బడాబాబులే. ఓ పాతికో, పరకో పేదలకు విదిలించి బుజ్జగించి తమ సంపదను మేటలు వేసుకునే ప్రవీణులే వీరంతా.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో, నడుస్తున్న శాసన సభలో, నిత్యం కనిపించే దృశ్యమేమిటి? నవ్యాంధ్ర ప్రజా రాజధానిగా, నీలి ఆకుపచ్చ స్వర్ణధామం గా, ప్రపంచ దేశాలే విస్తుపోయే విధంగా అమరావతి రాజధాని నగరాన్ని నిర్మిస్తానని ఊదర గొట్టిన చంద్రబాబు బండారం ఎన్నికల్లో ఓడిపోవడంతో దానంతట అదే బయటపడి పోయింది. రాజధాని కాదురా బాబు ఇది, కమ్మ సామాజిక దిగ్గజాలకు, వారి అనుయాయులకు, చంద్రబాబు కుటుంబానికి, అతని సింగపూర్ బినామీలకు ఇదో అడ్డగోలు సంపాదన అడ్డా అని సామాన్య మానవుడికి కూడా క్లారిటీ వచ్చేసింది. అమరావతి కేవలం రంగు బొమ్మల దొంగాటని నిర్ధారణ అయిపోయింది. ప్రపంచ బ్యాంకు కూడా ఇపుడు చంద్రబాబు చల్లిన మత్తులోంచి బయటపడి, అమరావతి నిర్మాణానికి తానిస్తానన్న రు. 2000 కోట్ల అప్పుకు మంగళం పాడేసింది.

ఈ అమరావతి గుంటనక్కలు చాలామంది తేలు కుట్టిన దొంగల్లా తలుపు చాటున మూలుగుతూ కలిసొచ్చే కాలం కోసం, మబ్బులు వీడే అవకాశం కోసం పొంచి ఉన్నారు. కొత్త ముఖ్యమంత్రి ప్రసన్నత కోసం బేరసారాలు సాగించుకుంటున్నారు. ఈ పచ్చటి భూములపై ఆధారపడి తరతరాలుగా జీవనం సాగించిన చిన్న, సన్నకారు రైతులు చంద్రబాబు చూపించిన మాయాబజారులో అమ్ముడుపోయి ముందుగతి ఏమిటో తెలియని స్థితిలో ఉన్నారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను తాకట్టుపెట్టి అమరావతి బాండ్లు స్టాక్ మార్కెట్లో అమ్మిన పాలకుడు పదవిపోతే ఏమి? అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుని హోదాలో ఏలోటూ లేకుండా, సకల సౌకర్యాలతో, సెక్యూరిటీ వలయంలో పబ్బం గడుపుకుంటూనే ఉన్నాడు.

బాబు పాలనలో అవినీతిని బయటపెడుతున్నా, కృష్ణ నది కరకట్టపై కట్టిన అక్రమ నిర్మాణాలను కూలగొడుతున్నా, సౌర పవన విద్యుత్ కొనుగోలు పబ్లిక్–ప్రైవేట్ ఒప్పందాల్లో అవినీతిని పసిగట్టి, వాటిని రద్దు చేస్తా. ప్రజలకు పారదర్శకమైన స్వచ్ఛమైన పాలన అందిస్తా, ఇపుడా పనిలోనే ఉన్నానని ఆంధ్రా కొత్త ముఖ్యమంత్రి జగన్ చెబుతున్నాడు.

ఆంధ్ర ప్రజలకు జగన్ వరప్రసాదమని చాలామంది ఆంధ్ర అమాయక ప్రజలు నమ్ముతున్నారు. చంద్రబాబు తనకు తానే ప్రతిరోజు చెప్పుకునే వాడు, ప్రజలు తనకు బ్రహ్మరథం పడుతున్నారని. తనను పొర్లించి దొర్లించి అష్టకష్టాల పాల్జేసిన ప్రత్యర్థి చంద్రబాబును జగన్ ఢీ కొట్టకుండా వదులుతాడా?

పాదయాత్ర పొడుగునా ప్రజలపై వరాల జల్లును కురిపించిన జగన్ వాటిని ఖాళీ ఖజానాతో ఎలా అమలు చేస్తాడో విప్పి చెప్పగలడా? ఇరు పక్షాలు పోటాపోటీతో చేసిన ఎన్నికల వాగ్దానాల నుండి బాబు ఓడి విముక్తుడైనాడు. గెలిచిన జగన్ తరమా తను చేసిన వాగ్దానాలను నెరవేర్చడం? ప్రత్యేక హోదా హుళక్కి అయిపోయింది. స్పెషల్ ప్యాకేజీ ఓ బూటకమని తేలిపోయింది. చంద్రబాబు ల్యాండ్ బ్యాంకు అభివృద్ధి బొమ్మలాట, కోటానుకోట్ల కట్ అండ్ పేస్ట్ పెట్టుబడుల ఒప్పందాలు నాలిక గీసుకోడానికి కూడా పనికిరావని బుద్ధున్న వాళ్లకు ఆనాడే తెలుసు అదో మాయాజాలమని. నమ్మే గొర్రెలు ఉండనే ఉంటాయి.

ఇప్పుడు పాపం జగనన్నకు ఆ మాయాజాలం పనికిరాదు. ఏదో కొత్త ఎత్తు ఎత్తాలి. అది అంత తేలిక కాదు. ఇప్పటికే రాష్ట్రాన్ని తాకట్టు పెట్టి బడాయి కోసం చేసిన అప్పులు మేటలు పడి ఉన్నాయి. కొత్తగా అప్పులు చేయాలన్నా మార్కెట్లో రాష్ట్రం విలువ నేలబారున ఉంది. ఎవరిస్తారు కొత్త అప్పులు? బాక్సయిట్ గనులను ముట్టుకోమంటున్నాడు. గిరిజనులకు హాని చేయను, మేలుచేస్తానంటున్నాడు. మంచిదే, హర్షించాల్సిందే ! బెల్టు షాపులు రద్దు చేస్తానంటున్నాడు, అంచెలంచెలుగా మందు మద్యం బందు పెడతానంటున్నాడు. ఊరూరా ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, పించన్ల పెంపకాలు, ఉద్యోగుల జీతాల పెంపకాలు బాగానే ఉన్నాయి, కొత్తలో ఏ ప్రభుత్వమైనా జిడ్డుపట్టిన ప్రజల మొఖానికి ఎంతో కొంత ఫేస్‌పౌడర్ అద్దక తప్పదు. దేనికైనా నిత్యం విత్తం కావాలి కదా! విత్తం కావాలంటే రాష్ట్రానికి అంతకు అంత ఆదాయముండాలి కదా! ఈ ఆదాయం ఎలా వస్తుందో జనానికి చెప్పాలి కదా!

పోలవరం చంద్రబాబు చంకలో ఉన్న కాంట్రాక్టు కంపెనీల గోల్‌మాల్ వరమని దాన్ని తిరగదోడాలని, ఈ పోలవరం ప్రాజెక్టులోనూ, తదితర నీటి పారుదల ప్రాజెక్టుల్లోనూ తస్మదీయులకు కోట్లాది సొమ్ము లబ్ది చేకూర్చి పెట్టడమే చంద్ర బాబు వ్యూహమని, ఆయన ఇంటి పెరటి గుమ్మం గుండా ఈ సొమ్ము నుండి వాటాలు లోనికి ప్రవహించాయని జగన్

కాళేశ్వరం ప్రాజెక్టు - నిజానిజాలు

***ప్రజలకు ఎన్నో ఆశలు చూపించి భారీ నిర్మాణం చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో జరుగుతున్న ఖర్చు, ప్రాజెక్టు వల్ల చేకూరే ప్రయోజనాల గురించిన నిజానిజాలను విశ్లేషిస్తున్నారు* అరణ్య**

'నీరు పల్లమెరుగు నిజం దేవుడెరుగు' అనేది సామెత. కానీ పల్లానికి పోయే నీటిని సాంకేతిక పరిజ్ఞానంతో ఎత్తుకు లాగడం, ఎత్తిపడేయడం నేర్చుకున్నాడు మనిషి. నాగరికతకు మూలం నీరు అనేది చరిత్ర చెప్పే విషయం. కానీ నీరు ఈరోజు ఒక రాజకీయమైన విషయంగా మారి పోయింది. రాజకీయాలను శాసించే విషయంగా మారిపోయింది. ఉమ్మడి రాష్ట్రాల నుంచి ప్రాంతాలను కొత్త రాష్ట్రాలుగా చేయగల శక్తి నీటికున్నది. అందుకే నీటికి చాలా ప్రభుత్వాలు భయపడతాయి. అందుకు భిన్నంగా చాలా ప్రభుత్వాలు సాహసోపేతమైన ప్రయత్నాలు చేసి నీటిని ఓట్ల రాజకీయాలలో ప్రధాన నిర్ణయాత్మక వస్తువుగా మార్చి ఓట్లకు సీట్లకు అవసరమైన వనరుగా మార్చుకుంటాయి. ఈ క్రమంలో ప్రభుత్వాలు ప్రాజెక్టుల పేరిట లెక్కకు మిక్కిలి తప్పులు చేస్తుంటాయి. లేదా ప్రజల జీవితాలను గుణాత్మకంగా మార్చేందుకు, సాగునీరు, తాగు నీరు తదితర అవసరాలను తీర్చేందుకు నీటిని వినియోగిస్తుంటాయి. ఏ మార్గం తీసుకోవడమనేది ఆ ప్రభుత్వ స్వభావం మీద ఆధారపడి ఉంటుంది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి విడిపోయాక తెలంగాణ రాష్ట్రంలో మొదటి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర సమితి నీటి వినియోగం గురించి ఆలోచించింది. అప్పటికే తుమ్మిడిహట్టి దగ్గర కట్టాలని నిర్ణయం జరిగిన ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుకు జాతీయ హోదా కావాలని కోరుతూ ప్రభుత్వం తరఫున మంత్రులు, అధికారులు ప్రయత్నాలు ప్రారంభించారు. కాని ఆ తర్వాత మనసు మార్చుకుని ఆ ప్రాజెక్టు డిజైన్‌ను మార్చి, కొత్తగా కాళేశ్వరం ప్రాజెక్టును తెరమీదికి తెచ్చారు. వెనువెంటనే అనుమతులు పూర్తయి పనులు ప్రారంభమై కొనసాగుతూ వస్తున్నాయి. కానీ ఈ ప్రాజెక్టు ప్రారంభమైన నాటి నుంచి వివాదాలలో నిలుస్తున్న దరిమిలా ఈ ప్రాజెక్టును గురించి ఒకసారి మాట్లాడుకుందాం.

మహారాష్ట్రలోని నాసిక్ త్రయంబకేశ్వర్‌లో ప్రారంభమై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో ప్రవహించి ఆంధ్రలో గౌతమి, వశిష్ఠ, వైనతేయ, ఆత్రేయ, కౌశిక, తుల్య, భరద్వాజ అనే ఏడుపాయలుగా చీలి బంగాళా ఖాతంలో కలుస్తుంది. ఒక నదిపై ఆనకట్ట కట్టినప్పుడు నీటితోపాటు మట్టి కూడా వచ్చి ఆగుతుంది. దీన్ని సిల్టింగ్ సమస్య అంటారు. గోదావరిపై కూడా ఆనకట్టలు కడితే మట్టి కూరుకుపోయే సమస్య ఎక్కువగా ఉంది. గత ప్రభుత్వాలు గోదావరి నీటిని పూర్తిగా సద్వినియోగం చేసుకోలేకపోవడానికి ఇది కూడా ఒక కారణం. అందువల్ల వేలాది టిఎంసిల నీరు వృథాగా సముద్రంలో కలిసిపోయేది. ఆ తర్వాత క్రమంగా ప్రభుత్వాలు గోదావరి నది నీటిని వినియోగించుకునే వైపు ఆలోచించడం ప్రారంభించాయి. ఈ గోదావరి ప్రవాహంపై ఇప్పటికే మహారాష్ట్రలో అనేక ఆనకట్టలు కట్టబడ్డాయి. దాంతో తెలంగాణలోకి ప్రవేశించేసరికి గోదావరిలో నీరు చాలా తక్కువగా ఉంటుంది. అందుకే తెలంగాణకు వచ్చేసరికి గోదావరినదికి నీరుచేరడం అనేది మొదటగా దాని పరివాహక ప్రాంతం (కాచ్‌మెంట్ ఏరియా) నుంచి వస్తుంది. అంటే వర్షం పడ్డప్పుడు ఆ నీరు చిన్న చిన్న కాలువలు, ఏరుల ద్వారా నదిలో చేరుతుంది. ఆ ప్రాంతమే గోదావరినది పరివాహక ప్రాంతం.

వర్గీయులు ధీమాగా చెబుతున్నారు. అందుచేత ఈ కాంట్రాక్టులు రద్దుచేసి తిరిగి టెండర్లు పిలిస్తే రాష్ట్రానికి మేలు జరుగుతుందంటున్నారు. మంచిదే! కాదనలేం! కానీ ఇవన్నీ జరిగే పనులేనా ?

కుక్క కడుపున పంచకల్యాణి గుర్రపు పిల్ల పుడుతుందా? తెలంగాణ రాష్ట్రం విడిపోయినప్పుడు అద్భుతాలు జరుగుతాయని ప్రచారం జరిగింది. జనం ఆలా ఆశించారు, నమ్మారు. ఇప్పుడు ఆంధ్రాలో కూడా ప్రజా సంక్షేమ రాజ్యం గురించే జగన్ పాదయాత్రలో ఎనలేని ప్రచారం జరిపారు. జనం ఆశలు మోసులెత్తాయి. జగన్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు కోట్లు ఖర్చు పెట్టకుండా ఎన్నికల్లో గెలిచారా? వీరందరూ ఈ డబ్బుతో పాటు, రాబోయే ఎన్నికల్లో గెలవడానికి కావలసిన సొమ్ము ఎలా సమకూర్చు కోవాలి? ఈ రాజకీయ ఆర్థిక అవసరం తీరకపోతే వారు మరోవైపు జంపుకొట్టరా? వలసలు సాగించరా? అమ్ముడుపోరా? ఇప్పుడు కర్ణాటకలో జరుగుతున్న పశువుల సంత ఇక్కడ పునరావృతమవదా? బిజెపి, రామ్‌మాధవ్ ప్రయత్నాలన్నీ ఇవేకదా!

ఎన్నికల విజయంవల్ల చేకూరిన జోష్ కొంతకాలం ఉంటుంది. తరవాత పైసలతోనే పని, ప్రభుత్వ పథకాలకైనా, పార్టీల నాయకులకైనా! కొద్దిరోజులకు జగన్ చూపించే జోష్ పలచబడి పోవచ్చు. ఈయన సారా సీసా పాతబడిపోవచ్చు. బిజెపి చూపించే కొత్త రంగుల సీసా రాజకీయ నాయకులకు, తద్వారా ప్రజలకు ఆకర్షణీయంగా కనబడవచ్చు. అదే పాతసారా కొత్త సీసాల్లో పోసి ప్రజలకు పంచవచ్చు. ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు ఒనగూరేవి అవే మోసపూరిత రాజకీయాలు.. కొత్త సీసాలో పాత సారా..

ఆంధ్ర ప్రజలైనా, తెలంగాణ ప్రజలైనా, దేశంలో ఇతర రాష్ట్ర ప్రజలైనా ఎన్నికల బూటకపు పార్లమెంటరీ ప్రజాస్వామ్యపు ముసుగును తొలగించుకుని, దోపిడీ రాజకీయ ముఠాల పట్ల తమ వైఖరిని మార్చుకుని చైతన్యయుతంగా శ్రమచేసేవారే రాజ్యాధికారాన్ని సాధించాలనే మార్గం ఎన్నుకుని విజయం సాధించనంత కాలం సీసాలు మారుతుంటాయి. అదే దోపిడీ సారానే చలామణీ అవుతుంటుంది. అద్భుతాలు ఏమీ జరగవు.

(రచయిత ఎడిటర్, శ్రామిక నేస్తం) వీ

ఇక రెండో మార్గం ఉపనదుల ద్వారా నీరు గోదావరిలోకి వచ్చి చేరడం. తెలంగాణ ప్రాంతంలో గోదావరికి ఉత్తరం వైపు నుంచి కడెం, ప్రాణహిత, ఇంద్రావతి నదులు, అలాగే దక్షిణం నుంచి మంజీర, మానేరులు ఉపనదులుగా ఉంటూ వాటి నీరు గోదావరిలోకి వచ్చి చేరుతుంది. అయితే ప్రాణహిత నది గోదావరిలో కలిసే కంటే ముందు మంజీర కలిసిన గోదావరి, కడెం నదిపై ఇప్పటికే వరుసగా శ్రీరాంసాగర్, కడెం ప్రాజెక్టులు ప్రాజెక్టులు నిర్మించడం, ఆ తర్వాత కొద్ది దూరానికే ఎల్లంపల్లి కూడా నిర్మించడంతో ప్రాణహిత కలిసేవరకు గోదావరిలో నీటి పరిమాణం చాలా తక్కువగా ఉంటుంది.

మొత్తంగా చూస్తే ప్రాణహిత కలిసాకే గోదావరిలో నీటిపరిమాణం పెరిగి వినియోగానికి అనువుగా మారుతుంది. ఈ కారణంగానే గతంలోని ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని ప్రణాళికలు రూపొందించాయి. 2004లో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా జలయజ్ఞంలో భాగంగా 80 చిన్న, మధ్యతరహా భారీ నీటిపారుదల ప్రాజెక్టులను నిర్మించి కోటి ఎకరాలకు సాగునీరు అందించాలని దాదాపు లక్ష కోట్ల రూపాయల వ్యయం చేసే జలయజ్ఞం అనే పథకాన్ని చేపట్టాడు. ఆంధ్రప్రదేశ్‌ను హరితాంధ్రప్రదేశ్‌గా మారుస్తానని అన్నాడు. జలయజ్ఞంలో భాగంగా గోదావరి, కృష్ణలతో పాటు ఇతర చిన్న, పెద్ద నదులపై ఆనకట్టలు నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించే పనిని ప్రారంభించగా గోదావరి నీటిలభ్యత గురించి చర్చ జరిగింది. పెద్దది కావడంతో గోదావరి నది నీటిని వినియోగించడంపై అప్పటి ప్రభుత్వ దృష్టి ఉండేది. నీటి లభ్యత చర్చలో భాగంగా ప్రభుత్వం గోదావరిపై ప్రాణహిత– చేవెళ్ల, పోలవరం ప్రాజెక్టులు నిర్మించాలని నిర్ణయించుకుంది. డా. బి.ఆర్.అంబేద్కర్ పేరుతో చేపట్టబోయే ప్రాణహిత – చేవెళ్ల ప్రాజెక్టు డిజైన్ సారాంశంగా గోదావరి నదిలో ప్రాణహిత కలిసేకంటే ముందు ప్రాణహిత నదిపై ప్రాజెక్టును నిర్మిస్తారు. అది కూడా వార్ధా, వైన్‌గంగ నదులు కలిసి తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులో ప్రాణహిత నదిగా మారిన వెంటనే తుమ్మిడిహట్టి వద్ద ఆనకట్టను నిర్మిస్తారు. ఎందుకంటే ఆ రెండు నదులు కలిసే దగ్గర ప్రాణహితలో నీటిలభ్యత ఎక్కువగా ఉంటుంది. తుమ్మిడిహట్టి దగ్గర కట్టిన ఆనకట్ట నుంచి నీటిని చేవెళ్ల వరకు, వివిధ ప్రాంతాలకు అందిస్తారు. 160 టిఎంసిల నీటిని 16.74 లక్షల ఎకరాలకు సాగునీరు కోసం, 30 టిఎంసిల నీటిని హైదరాబాద్, సికింద్రాబాద్ జంటనగరాల తాగునీరు కోసం, 16 టిఎంసిల నీటిని పారిశ్రామిక అవసరాల కోసం ఉపయోగించడం ఈ ప్రాజెక్టు ఉద్దేశ్యం. అయితే ఈ ప్రాజెక్టు వల్ల మహారాష్ట్రలోని అనేక ప్రాంతాలు ముంపుకు గురయ్యే ప్రమాదముంది కనుక ప్రాజెక్టు ఎత్తు విషయంలో మొదటినుంచి మహారాష్ట్ర అభ్యంతరం తెలుపుతూ వచ్చింది. అయితే వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రభుత్వ సమయంలో మహారాష్ట్ర గట్టిగా తన అభ్యంతరాన్ని వినిపించలేదు. 2008 నాటికి సైట్ క్లియరెన్స్, ఎన్విరాన్మెంట్ క్లియరెన్స్, ఆర్ అండ్ ఆర్ క్లియరెన్స్, వైల్డ్ లైఫ్ క్లియరెన్స్, ఫారెస్ట్ క్లియరెన్సు, టెక్నికల్ అడ్వైజరీ కమిటీ క్లియరెన్స్ లాంటి అనుమతులు అన్నీ తెచ్చుకుని వైఎస్ ప్రాజెక్టుల నిర్మాణం ప్రారంభించబోయాడు. కానీ 2009లో వైఎస్ మరణం తర్వాత అన్ని ప్రాజెక్టులతో పాటు ఈ ప్రాజెక్టు కూడా మూలకు పడిపోయింది.

2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడి కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక ఈ ప్రాజెక్టు నిర్మాణం గురించి ఆలోచిస్తున్న క్రమంలో మహారాష్ట్ర ప్రభుత్వం ఈసారి ప్రాజెక్టు విషయమై చాలా గట్టిగా అభ్యంతరం చెప్పింది. 160 టిఎంసిల స్టోరేజీ సామర్థ్యంతో తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టును కడితే మహారాష్ట్ర సరిహద్దు గ్రామాలన్నీ మునిగిపోతాయి కనుక ప్రాజెక్టు సామర్థ్యాన్ని తగ్గించాలని, అందుకుగాను ప్రాజెక్టు ఎత్తును తగ్గించాలని మహారాష్ట్ర ప్రభుత్వం అభ్యంతరపెట్టింది. అలాగే వార్ధ, వైన్ గంగలు కలిశాక నీటి లభ్యత 160 టిఎంసి వరకు ఉండకపోవచ్చునని, బాగా వర్షాలు పడితే 100 నుంచి 120 టిఎంసి మాత్రమే నీటిలభ్యత ఉంటుందని మొదటి నుంచి చాలామట్టుకు సర్వేలు చెప్తూ వచ్చాయి.

అప్పటికే మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు ప్రారంభించినా 160 టిఎంసిల నీటి లభ్యత గురించి అనుమానం క్రమంగా బలపడుతూ వచ్చింది. సర్వేల అంచనాలే నిజమై 100 నుంచి 120 టిఎంసిలు మాత్రమే నీటి లభ్యత ఉంటే ఆ నీటిని రాష్ట్రమంతటా పంచడం కష్టమవుతుంది. దాంతో తెలంగాణ ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణ స్థలాన్ని మార్చాలని నిర్ణయించుకుంది. గోదావరి తెలంగాణలో ప్రవేశించే నిజామాబాద్ జిల్లా కందుకుర్తి నుంచి మొదలుకొని ఆంధ్రప్రదేశ్‌లోకి వెళ్లిపోయే పాపికొండల వరకు ఎక్కడ ప్రాజెక్టు కడితే ఇలాంటి సమస్యలు ఉండవో, నీటి లభ్యత తుమ్మిడిహట్టి కంటే ఎక్కువగా ఉంటుందో తెలిపేందుకు వ్యాప్కోస్ లిమిటెడ్ కంపెనీకి బాధ్యతలు అప్పగించింది. ఈ కంపెనీ లైడార్ టెక్నాలజీతో పరిశోధనలు చేసి అప్పటి ప్రముఖ ఇంజనీర్ విద్యాసాగర్‌రావు లాంటి వారితో చర్చించి గోదావరిలోకి ప్రాణహిత కలిసిన తర్వాత నుంచి అంటే కాళేశ్వరం నుంచి 20 కిలోమీటర్ల దూరంలో మేడిగడ్డ వద్ద ప్రాజెక్టు కడితే ఉపయోగకరంగా ఉంటుందని, అక్కడ 280 టిఎంసి వరకు నీటిని ఉపయోగించుకోవచ్చని సూచించింది. దాంతో తెలంగాణ ప్రభుత్వం మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి 2016లో ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును రీడిజైన్ చేసింది. ఇందులో భాగంగా ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును రెండుగా విభజించింది. మొదటిది– తుమ్మిడిహట్టి వద్ద ఆదిలాబాద్, కొమురంభీం జిల్లాలకు సాగునీటి కోసం 20 టిఎంసిల సామర్థ్యంతో చిన్న ప్రాజెక్టు కట్టడం, రెండవది – కాళేశ్వరం ప్రాజెక్టు.

ఇప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టు గురించి చూద్దాం. ఇది ఒక చక్రీయమైన ప్రాజెక్టు. అంటే గోదావరి నీటిని ఆపి ఆ నీటిని వివిధ మార్గాల ద్వారా వివిధ ప్రాంతాలకు పంపి మళ్లీ గోదావరిలోనే ఆ నీరు కలిసేలా చేస్తూ ఈ చక్రం నిరంతరాయంగా జరిగేలా చూస్తారు. అయితే నీటిని ఆపిన మేడిగడ్డతో పోల్చితే నీరు అందాల్సిన ప్రాంతాలన్నీ ఎత్తులో ఉండే సరికి గ్రావిటీ ద్వారా నీరు పంపడం అసాధ్యమైనపని. అందుకోసం ఎత్తిపోతలు (లిఫ్ట్) తప్ప వేరే మార్గంలేదు. ఏ ప్రాంతానికా ప్రాంతంలో ఎక్కడికక్కడ ఎత్తిపోయడం మినహా గత్యంతరం లేదు. అందుకే భారీఎత్తున మోటార్లు, పంపులు, పైపులు, విపరీతమైన విద్యుత్ అవసరమవుతుంది. అందుకే ప్రాజెక్ట్ నిర్మాణానికి అయ్యే ఖర్చుకంటే భవిష్యత్తులో వీటి నిర్వహణకు అయ్యే ఖర్చు భారీగా ఉంటుంది.

ఇక 85 గేట్లతో వంద మీటర్ల ఎత్తులో ఉన్న ఈ బ్యారేజ్ సామర్థ్యం మొత్తంగా 240 టిఎంసి. ఇందులో 195 టిఎంసి నీటిని మేడిగడ్డ వద్ద ఆనకట్ట కట్టడం ద్వారా, ఎల్లంపల్లి నుంచి 20 టిఎంసి, మరో 25

టిఎంసి గ్రౌండ్ వాటర్ ద్వారా మొత్తం 240 టిఎంసి నీటిని వినియోగం లోకి తెస్తారు. ఈ ప్రాజెక్టు ద్వారా 225 టిఎంసిల నీటి లభ్యత ఉంటుందని అంచనా. ఇందులో మేడిగడ్డ బ్యారేజ్ వద్ద 16.17 టిఎంసిలు నిల్వ ఉంటాయి. కన్నెపల్లి పంప్ హౌస్ నుంచి 11 మోటార్ల ద్వారా రోజుకు రెండు టిఎంసిల చొప్పున 90 రోజులపాటు 180 టిఎంసిలను మళ్లించాలనేది లక్ష్యం. ఇక ఎల్లంపల్లి ప్రాజెక్టు లో మరో 20 టిఎంసిల నీటి లభ్యత ఉంటుంది. చెరువు పరివాహక ప్రాంతాల్లో 10 టిఎంసిలు వస్తుంది. ఆయకట్టు ప్రాంతాల్లో భూగర్భ జలాల రీచార్జ్ ద్వారా 25 టిఎంసిలు లభిస్తాయి. ఇందులో 134.5 టిఎంసి నీటిని 18.25 లక్షల ఎకరాలకు సాగునీటి తో పాటు 34.5 టిఎంసి నీటిని ఇతర ప్రాజెక్టుల కింది 18.82 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు, 30 టీఎంసిలను జంటనగరాల తాగునీటికి,10 టిఎంసిలను కాలువలు పోయే దారిపొడుగు గ్రామాలకు తాగునీరు కోసం,16 టీఎంసిల నీటిని పారిశ్రామిక అవసరాలకు, మిగిలిన 15 టిఎంసిలు ఆవిరైపోతాయని ప్రాజెక్టు నీటి ఉపయోగంగా చెబుతున్నారు. ఈ ప్రాజెక్టు మొత్తం వ్యయం 80,120 కోట్ల రూపాయలు. ఇందులో భాగంగా మొత్తం 20 రిజర్వాయర్లు ఉంటాయి. ఈ ప్రాజెక్టును మొత్తం ఏడు లింకులుగా, 28 ప్యాకేజీలుగా విభజించారు. ఒకసారి ఈ దశలను పరిశీలిద్దాం.

లింక్-1లో మేడిగడ్డ వద్ద బ్యారేజ్ కడతారు. దానివల్ల ప్రవాహం ఆగి 17 కిలోమీటర్ల వరకు నీరు బ్యాక్ వాటర్ గా ఉంటాయి. అక్కడి నుంచి 17 మోటార్ల సాయంతో 40 మెగావాట్ల కరెంటునుపయోగించి కన్నెపల్లి పంప్ హౌస్‌తో ఆ నీటిని గోదావరి నదిని బైపాస్ చేస్తూ కట్టిన 15 కిలోమీటర్ల కాలువలోకి ఎత్తిపోసి గ్రావిటీ ద్వారా, కొత్తగా కడుతున్న 66 గేట్ల అన్నారం బ్యారేజీకి పంపుతారు. దాంతో 32 కిలోమీటర్లు బ్యాక్ వాటర్‌గా నిల్వ చేయబడతాయి. అక్కడి నుంచి 8 మోటర్ల సహాయంతో 40 మెగావాట్ల కరెంటుతో సిరిపురం పంప్ హౌస్ ద్వారా మళ్లీ ఎత్తిపోస్తూ కొత్తగా కడుతున్న సుందిళ్ల బ్యారేజ్‌కి పంపుతారు. సుందిళ్ల బ్యారేజ్ కి 74 గేట్లు ఉంటాయి. దీనివల్ల 25 కిలోమీటర్ల వరకు బ్యాక్ వాటర్ నిల్వ చేయబడుతుంది. అక్కడి నుంచి 11 మోటర్లు, 40 మెగావాట్ల కరెంటుతో గోలివాడ పంప్ హౌస్ ద్వారా ఇప్పటికే 2016 లోనే కట్టి ఉన్న ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి నీటిని ఎత్తిపోస్తారు.

లింక్-2 లో నీటిని ఎల్లంపల్లి నుంచి మిడ్ మానేరుకు పంపుతారు. మొదట కాలువలు, ట్విన్ టన్నల్స్ ద్వారా 7 మోటార్లు, 124 మెగావాట్ల కరెంటుతో మేడారం రిజర్వాయర్‌కు నీళ్లు పంపిస్తారు. మళ్లీ ఈ చెరువు నుంచి మరో రెండు టన్నల్స్ ద్వారా 7 మోటర్లు, 139 మెగావాట్ల కరెంటుతో రామడుగు మండలం లక్ష్మీపూర్ మహాబావికి నీటిని పంపుతారు. ఇక్కడ ఉపయోగించే మోటార్లను బాహుబలి మోటార్లు అని అంటారు. ఎందుకంటే ఇంత సామర్థ్యం ఉన్న కరెంటు మోటార్లు ప్రపంచంలోనే ఎక్కడా లేవు. టన్నల్స్ అంటే సొరంగాలు. వీటిని నీటి మార్గంలో కొండలు అడ్డం వచ్చినప్పుడు, కొండను తొలిచివేస్తారు. మొదటి ట్విన్ టన్నల్ పది మీటర్లు (33 ఫీట్) డయామీటర్ కలిగి ఉంటుంది. ఒక్కో టన్నల్ 24 కిలోమీటర్ల పొడవు ఉంటుంది. అతి పొడవైన టన్నెల్స్ ఇవి. దేశం మొత్తంలో ఎక్కువ టన్నల్స్ తో నిర్మిస్తున్న ప్రాజెక్టు ఈ కాళేశ్వరం ప్రాజెక్ట్. సొరంగం(టన్నల్) పూర్తయ్యాక ఆ నీటిని స్టోర్ చేస్తారు. దీనిని సర్జిపూల్ అంటారు. సర్జిపూల్ ఒక అండర్ గ్రౌండ్ రిజర్వాయర్. అండర్ గ్రౌండ్‌లో నీటిని నిల్వ చేయడానికి కారణం భూసేకరణ (లాండ్ అక్విజిషన్) ను తగ్గించడం. ఇక లక్ష్మీపూర్ నుంచి గ్రావిటీ ద్వారా శ్రీరాంసాగర్ వరద కాలువలోకి పంపుతారు. ఎస్సారెస్పీ లోకి వరదనీరు ఎక్కువగా చేరినప్పుడు ఆ నీటిని విడిచేందుకు ఈ వరద కాలువను గతంలోనే నిర్మించారు. ఇది మిడ్ మానేరు దాకా వెళుతుంది. ఇప్పుడు మేడారం రిజర్వాయర్ నుంచి లక్ష్మీపూర్ మీదుగా నీటిని ఈ వరద కాలువలోకి పంపి మిడ్ మానేరు ప్రాజెక్టుకు చేర్చుతారు.

లింక్-3 లో మిడ్ మానేరు నుంచి మల్కాపేట్ రిజర్వాయర్ ద్వారా అప్పర్ మానేరుకు నీటిని తరలిస్తారు. అక్కడి నుంచి ఇసాయిపేట్, అమర్లబండ, గుజ్జల్, కటివాడ రిజర్వాయర్లకు, మధ్యలో అమర్లబండ నుంచి తిమ్మక్కపల్లె, కచ్చాపూర్ రిజర్వాయర్లకు కాలువలు,టన్నల్స్ ద్వారా నీటిని పంపిస్తారు. లింక్. 4 లో మిడ్ మానేరు నుంచి కొండపోచమ్మ సాగర్‌కు నీటిని తరలిస్తారు. మొదట మిడ్ మానేర్ నుంచి అనంతగిరి, ఇమామాబాద్, శ్రీ రంగనాయకసాగర్ రిజర్వాయర్‌ల మీదుగా నీరు 50 టిఎంసిల సామర్థ్యం ఉన్న మల్లన్నసాగర్‌కు రాగానే అక్కడినుంచి రెండు కాలువలుగా నీటి మార్గం విడిపోతుంది. ఇందులో ఒకటి పడమర వైపు మరొకటి దక్షిణం వైపు (పడమటి మార్గం లింక్ 6). దక్షిణం వైపు వచ్చిన కాలువ మళ్లీ రెండుగా వెళుతుంది. ఒకవైపు కొండపోచమ్మసాగర్, శామీర్ పేట్ రిజర్వాయర్లకు వెళుతుంది ఇది.

లింక్-4 - దక్షిణం కాలువను మరోవైపు గంధమల్ల రిజర్వాయర్ మీదుగా బస్వాపూర్ రిజర్వాయర్ కు పంపుతారు. ఇది లింక్-5. అంటే **లింక్-5**లో కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న 20 రిజర్వాయర్లలో అతిపెద్దదైన మల్లన్నసాగర్ రిజర్వాయర్ నుంచి దక్షిణంగా వెళ్లిన కాలువ యొక్క రెండవ మార్గం (మొదటి మార్గం లింక్. 4 గా కొండపోచమ్మ సాగర్ శామీర్‌పేట్‌లకు వెళ్తుంది) లో గంధమల్ల మీదుగా బస్వాపూర్‌కు పంపుతారన్నమాట.

హైదరాబాద్ పట్టణానికి మంచినీటి కోసం, మెదక్ జిల్లా రైతుల సాగునీటి కోసం 1998లో సింగూరు ప్రాజెక్టును మంజీరనది మీద నిర్మించి ప్రారంభించారు. ఆ తర్వాత మెదక్ రైతులను వదిలేశారు, అది వేరే విషయం. ఈ సింగూరు ప్రాజెక్టుకు ఇంకా ముందుకు ఇదే మంజీరనది మీద నిజాంసాగర్ ప్రాజెక్టు కట్టారు. ఆ తర్వాత మంజీర నది గోదావరిలో కలిసిపోతుంది.

లింక్-6లో మల్లన్న సాగర్ నుంచి పడమటికి వెళ్లిన కాలువ ద్వారా నీటిని సింగూరు ప్రాజెక్టులో కలుపుతారు. అంటే మేడిగడ్డ నుంచి ఆపి తీసిన గోదావరి నీళ్లు మళ్లీ సింగూరు ప్రాజెక్టు ద్వారా మంజీర లో కలిసి తిరిగి గోదావరిలో కలిసే చక్రీయమైన విధానం నిరంతరం కొనసాగుతుందన్నమాట.

మంజీర నది గోదావరిలో కలిశాక కొద్ది దూరానికి 1963లో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కట్టారు. ఇక్కడ నిల్వచేసిన నీటిని కాలువల ద్వారా నిర్మల్ కామారెడ్డి, నిజామాబాద్, మెదక్ జిల్లాలలోని రిజర్వాయర్లకు పంపుతారు. ఇది **లింక్-7**.

ఇదీ మొత్తంగా ప్రాజెక్టు సంపూర్ణ స్వరూపం. 204 కిలోమీటర్ల టన్నల్స్, 1531 కిలోమీటర్ల గ్రావిటీ కెనాల్స్, 20 పంప్‌హౌస్‌లు, 20

రిజర్వాయర్లు మొత్తం 1832 కిలోమీటర్ల దూరం నీటిని సరఫరా చేస్తారు. తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల్లోని 20 జిల్లాలకు ఈ ప్రాజెక్టు వల్ల లబ్ధి కలుగుతుంది. ఇందు కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెచ్చిస్తున్న మొత్తం రూ. 80 వేల కోట్లు. ఇందుకోసం ఆంధ్రాబ్యాంకు నుండి రు. 2,400 కోట్లు, పంజాబ్ నేషనల్ బ్యాంక్ నుంచి రు. 11,400 కోట్లు, పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నుంచి రెండు దశలలో వరుసగా రు. 12 వేల కోట్లు, రు. 7,700 కోట్లు ఇప్పటికే రుణంగా తీసుకుంది.

వినడానికి, చదవడానికి, ఊహించుకోవడానికి ఇదంతా చాలా బాగుండే విషయమే. అయితే మరోవైపు కాళేశ్వరం ప్రాజెక్ట్ రోజుకో కొత్త వివాదంలో నిలుస్తూ ఎన్నెన్నో విమర్శలకు గురవుతూ వస్తున్నది. వాటిలో కొన్నింటిని ఇక్కడ చూద్దాం.

1) రిడిజైనింగ్ లో శాస్త్రీయత లేదనేది మొదటి విమర్శ. తుమ్మిడిహట్టి వద్ద నీటిలభ్యత 165 టిఎంసి ఉంటూ ఆ నీటితో 16 లక్షల ఎకరాలకు సాగునీరు లభ్యమయ్యే అవకాశం ఉంది. ఆ ప్రాజెక్టుకయ్యే ఖర్చు 2008 నాటికి 38 వేలకోట్ల రూపాయలు. ఇప్పుడు మేడిగడ్డ వద్ద నీటిలభ్యత 240 టిఎంసి కాగా వాడుకోబోయే నీరు 180 టిఎంసి. దీనితో 18.25 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు లభ్యమవుతుంది. అంటే తుమ్మిడిహట్టి ప్రాజెక్టుకంటే మరో 2.25 లక్షల ఎకరాలకు ఎక్కువగా నీరు దొరుకుతుంది. కానీ మేడిగడ్డ ప్రాజెక్టుకయ్యే ఖర్చు 80 వేలకోట్ల రూపాయలు.అంటే రెట్టింపు కంటే ఎక్కువ. అదనంగా ఇవ్వబోయే 2.25లక్షల ఎకరాల కోసం రెట్టింపుకంటే ఎక్కువ ఖర్చుచేయడంలో శాస్త్రీయత ఏమిటి? అంటే రిడిజైన్ పేరిట అదనంగా ఇవ్వబోయేది 12 శాతం భూమికే అయినప్పుడు అందుకోసం దాదాపు 42 వేలకోట్ల రూపాయలు ఖర్చు చేయడం ఎందుకనేదే ఈ విమర్శ.

2) చాలామట్టుకు సర్వేలు తుమ్మిడిహట్టి దగ్గర నీటిలభ్యత 100 నుంచి 120 టిఎంసి కంటే ఎక్కువ ఉండదని, కేంద్ర జలసంఘం (సిడబ్ల్యుసి)కూడా ఇదే చెప్పిందని తెలంగాణ రాష్ట్రప్రభుత్వం అంటున్నది. అయితే ఇందులో నిజంలేదనేది మరో విమర్శ. కేంద్ర జలసంఘం చాలా స్పష్టంగా తన 2015, మార్చ్ 4 నాటి లేఖలో తుమ్మిడి హెట్టి వద్ద నీటి లభ్యత 165 టిఎంసి ఉంటుందని చెప్పింది. అయితే భవిష్యత్తులో మహారాష్ట్ర ప్రాణహిత మీద ప్రాజెక్టులు కడితే ఆ రాష్ట్రవాటాగా 63 టిఎంసిలను తెలంగాణ వదిలేయాల్సి ఉంటుందని చెప్పింది. అయితే ప్రభుత్వం కూడా ఇదే విషయాన్ని మరో చోట ఒప్పుకున్నా, ప్రజా సంఘాలు, మేధావులు మాత్రం మహారాష్ట్ర వాటాపోయిన తర్వాతే 165 టిఎంసిలు ఉంటాయని కేంద్ర జలసంఘం చెప్పిందని అంటున్నాయి.

3) తుమ్మిడిహట్టి నుంచి ప్రాజెక్టు స్థలాన్ని మేడిగడ్డ మార్చడానికి ప్రభుత్వం ప్రధానంగా మూడు కారణాలు చెప్పింది. మొదటిది– కేంద్ర జలసంఘం తుమ్మిడిహట్టి వద్ద తగినన్ని నీళ్లులేవని చెప్పింది. రెండోది– మేడిగడ్డ వద్ద పుష్కలంగా నీరు లభ్యమవుతాయి. మూడోది– తుమ్మిడిహట్టి దగ్గర కడితే 152 మీటర్ల ఎత్తులో మహారాష్ట్రకు ముంపు ప్రమాదం ఉంటుంది. అలాగే 148 మీటర్ల వద్ద కూడా నీటిని తరలించలేం. ఈ మూడు ప్రధాన కారణాలతో పాటు భూగర్భ జలాలు పెరగడం, నిల్వ సామర్థ్యం ఎక్కువగా ఉండడం, మత్స్య పరిశ్రమ అభివృద్ధి చెందడం అనే చిన్నచిన్న ఇతర కారణాలను కూడా ప్రభుత్వం చెప్పింది.

అయితే ఈ కారణాలలోని విషయం చాలామట్టుకు అసంగతంగా తోస్తున్నది. కేంద్ర జలసంఘం చెప్పిందేమిటి, డిపిఆర్‌లో ఉన్నదేమిటి చూసినప్పుడు ఇది తెలుస్తుంది. డిపిఆర్ వాల్యూం–1 పేరా 1.3(ఎ)లో 'కేంద్ర జలసంఘం తుమ్మిడిహట్టి వద్దనుంచి 165 టిఎంసిల నీటిని తరలించడం కష్టమని అభిప్రాయపడింది. మొత్తం నీటి సామర్థ్యం 165 టిఎంసి కాగా ఇప్పుడు (2016 నాటికి) ఉన్న పంపింగ్ సామర్థ్యంతో 100 నుంచి 130 కంటే ఎక్కువ టిఎంసిలను తరలించలేరు' అని కేంద్ర జలసంఘం చెప్పిందని రాశారు. నిజానికి పంపింగ్ సామర్థ్యం గురించి కేంద్ర జలసంఘం మాట్లాడలేదు. అంతేకాకుండా తుమ్మిడిహట్టి వద్ద ఉన్న 165 టిఎంసిలో పంపింగ్ సామర్థ్యంతో 130 టిఎంసిలే ఎత్తిపోసే వీలుండగా అందులో పైరాష్ట్రాలకు కూడా వాటా ఉంటుందని, ఆ వాటా 63 టిఎంసిలు పోను అక్కడ వాడుకోవడానికి మిగిలేది 67 టిఎంసిలే అవుతుందని కేంద్ర జలసంఘం చెప్పిందని కూడా డిపిఆర్‌లో చెప్పారు. అంటే పంపుల సామర్థ్యం, పక్క రాష్ట్రాల వాటాలను కారణాలుగా చూపి తెలంగాణ ప్రభుత్వం ప్రాజెక్టు స్థలాన్ని తుమ్మిడిహట్టి నుంచి మార్చినట్టుగా డిపిఆర్‌లో చెప్పింది.

అయితే అప్పటికున్న పంపుల సామర్థ్యం సరిపోకపోతే సామర్థ్యాన్ని పెంచుకోవచ్చు. అనేక ప్రాజెక్టులలో ఇట్లా పంపుల సామర్థ్యాన్ని తరచు పెంచుకుంటుంటారు. కేంద్ర జలసంఘం కూడా పంపింగ్ సామర్థ్యం పెంచుకోవద్దని ఎక్కడా చెప్పలేదు. అలాంటప్పుడు పంపుల సామర్థ్యం పెంచడం ద్వారా తుమ్మిడిహట్టి నుంచి 160 టిఎంసిలను తరలించు కోవచ్చు కదా! ఇప్పుడు మేడిగడ్డ నుంచి ఎల్లంపల్లికి 180 టిఎంసిల నీటిని తరలించేందుకు మొత్తం పంపుల సామర్థ్యం 1120 మెగావాట్లు పెడుతుండగా గతంలో తుమ్మిడిహట్టి నుంచి ఎల్లంపల్లికి 160 టిఎంసిలు తరలించేందుకు ప్రతిపాదించిన పంపుల మొత్తం సామర్థ్యం కేవలం 150 మెగావాట్లు మాత్రమే. 180 టిఎంసిల కోసం, అంటే మరో 20 టిఎంసిల కోసం తుమ్మిడిహట్టి వద్దనే మరో 50 మెగావాట్ల సామర్థ్యం పెంచుకుంటే సరిపోతుంది. ఇంతచిన్నది ఎవరికైనా అర్థమయ్యే విషయం.

ఇక పక్క రాష్ట్రాల వాటా విషయంలో కూడా కేంద్ర జలసంఘం లేఖలో పేరా 12 లో (తేది 4-3-2015) చాలా స్పష్టంగా నెట్ వాటర్ 165 టిఎంసిలని చెప్పింది. అంటే అన్నీ పోను, వాటాలు కూడా పోను తుమ్మిడిహట్టి దగ్గర ఉండే 165 టిఎంసిలని స్పష్టంగా చెప్పింది. అందులోని చివరి పట్టికలో అన్ని లెక్కలు వేసి కూడా చూపించింది. కానీ డిపిఆర్‌లో మాత్రం పక్క రాష్ట్రాల వాటాను 165 నుంచి నుంచి తీసేసి మాట్లాడారు. అయితే ప్రాజెక్టు స్థల మార్పు కోసం పక్కరాష్ట్రాల వాటా పోతుందని చెప్పిన డిపిఆర్, మేడిగడ్డ వద్ద నీళ్లు చాలా ఉంటాయని చెప్పడానికి ఈ పక్క రాష్ట్రాల వాటా తీసివేయకుండా నికర నీటి సామర్థ్యంలో పైనున్న తుమ్మిడిహట్టి నీటి సామర్థ్యాన్ని 165 టిఎంసిగా తీసుకుంటూ నీళ్లు చాలా ఉంటాయని చూపించింది. అంటే తుమ్మిడిహట్టి వద్దనేమో పక్క రాష్ట్రాల 63 టిఎంసి తీసేసి చెప్పి మేడిగడ్డ దగ్గర కలిపి చెప్పారు. దీన్నిబట్టి తుమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యతను డిపిఆర్ తక్కువ చేసి చూపిందనేది స్పష్టం అవుతుంది. ఆ నెపాన్ని కేంద్ర జలసంఘం మీదికి తోశారు.

4) తుమ్మిడి హెట్టి వద్ద కేంద్ర జల సంఘం చెప్పిందంటూ 165

టిఎంసిలు చూపుతూ పక్క రాష్ట్రాలవాటా పోను 67 టిఎంసిలే మిగులు తాయని చెప్పి, మేడిగడ్డ వద్ద మాత్రం నీటిలభ్యత 415 టిఎంసిలుగా చెప్పింది. డిపిఆర్ వాల్యూమ్.2,పేరా 3.3.1, టేబుల్ 3.2లో ఈ 415ను చూపిస్తూ గోదావరి మానేరు నదుల మీద భవిష్యత్తులో ఇతర అవసరాలు, కేటాయింపులు 132.2 టిఎంసిలు తీసివేసినా కూడా మేడిగడ్డ వద్ద ఇంకా 282.3 టిఎంసిలుంటాయని చెప్పారు. తుమ్మిడిహట్టితో చూస్తే అదనంగా మరో 250 టిఎంసిలు దొరుకుతున్నాయని చెప్తూ మేడిగడ్డకు స్థలాన్ని మార్చాలని చెప్పింది. తుమ్మిడిహట్టి నుంచి మేడిగడ్డకు వచ్చేసరికి హఠాత్తుగా ఈ 250 టిఎంసిలు ఎలా పెరిగాయో చెప్తూ, డిపిఆర్ వాల్యూం-1, చాప్టర్-5, పేజి 4లో మూడు మార్గాల ద్వారా మేడిగడ్డలోకి ఈ అదనపు నీరు వస్తుందని చెప్పారు. అవి ప్రాణహితలోకి తుమ్మిడిహట్టి దాటాక అనేక వాగులు, వంకలు వచ్చి చేరతాయని, మధ్య గోదావరిలో ఉండే నీరు, మానేరులో నీరు కూడా కలుస్తాయని చెప్పారు.

ఇక్కడ కూడా మళ్లీ అనుమానాలు కలగక మానవు. మధ్య గోదావరి పైన ఇప్పటికే శ్రీరాంసాగర్, ఎల్లంపల్లి ప్రాజెక్టులున్నాయి. అవి నిండాక, వాటిని దాటుకొని అంత భారీగా నీరు కిందికి రావడం కష్టమే. ప్రతిసారీ భారీగా వర్షాలు పడి మహారాష్ట్రలో నీళ్లు విడవడమో లేదా పెద్ద ఎత్తున వరదలు వచ్చి మధ్య గోదావరిలో నీరు చేరితేనే గాని అది సాధ్యపడదు. అది కాకుండా ఇతర పరిస్థితులలో ఎల్లంపల్లి నుంచి మేడిగడ్డ మధ్యన గోదావరిలో పెరిగే నీటిమట్టం డిపిఆర్ ప్రకారం కేవలం ఒక టిఎంసి మాత్రమే. మంచిర్యాల వరకు మధ్య గోదావరి పరివాహక ప్రాంతం ఒక లక్ష రెండువేల చదరపు కిలోమీటర్లు. అయినాసరే గోదావరిలో నీళ్లు ఉండవు. అందుకేకదా ప్రాణహిత నీటిపై ఆధారపడి తుమ్మిడిహట్టి అయినా మేడిగడ్డ గురించైనా సరే ఆలోచన చేసింది. కనుక గోదావరిలో నీళ్లుంటాయని ఆశ పడడం అత్యాశే అవుతుంది. ఒకవేళ గోదావరిలో నిండుగా నీళ్లున్నాయనే అనుకుందాం, ఇప్పుడు ఇంత పెద్ద క్యాచ్‌మెంట్ నీళ్లు ఎల్లంపల్లి వద్ద ఆపినప్పుడు అంతనీటిని అక్కడినుంచే అంటే ఎల్లంపల్లి నుంచే లిఫ్ట్ చేసుకోవచ్చు. మళ్లీ ఆ నీటిని మేడిగడ్డదాకా పంపి అక్కడి నుంచి మళ్లీ ఎల్లంపల్లికి లిఫ్ట్ చేయడం ఇప్పుడు జరుగుతున్న పని. అట్లాగే మానేరు నది మీద కూడా ఇప్పటికే అప్పర్ మానేరు, మిడ్ మానేరు, లోయర్ మానేరు డ్యామ్‌లు కట్టబడి ఉన్నాయి. కనుక వాటిని దాటుకొని నీరు గోదావరిలో వచ్చి చేరుతుందనే ఆశ కూడా లేదు. ఉన్న అవకాశమల్లా ప్రాణహిత నది నుంచి నీళ్లు సంపాదించు కోవడమే. కేంద్ర జల సంఘం కూడా గోదావరి, మానేరు, వార్ధ నదులను వదిలేసి ప్రాణహితనే పరిగణనలోకి తీసుకొని 284 టిఎంసి ఉండ వచ్చునని చెప్పింది. కానీ డిపిఆర్‌లో మాత్రం మూడు నదుల నుండి అవకాశం ఉందన్నారు.

5) ఒక టిఎంసికి ఎన్ని ఎకరాల భూమి సాగు చేయవచ్చుననే గణాంకాలను ప్రభుత్వం ఒక్కో చోట ఒక్కోతీరుగా చెప్తున్నదనేది మరో విమర్శ. గతంలో అనేక వేదికలమీద, శ్రీకృష్ణ కమిటీకి తెలంగాణ ఉద్యమ సమయంలో లేఖ రాసిన సమయంలో తెలంగాణ రాష్ట్ర సమితి ఒక టిఎంసికి గరిష్టంగా 10 వేల ఎకరాల భూమి సాగుచేయవచ్చునని, ఉమ్మడి ఆంధ్ర ప్రభుత్వాలు అబద్ధాలు చెబుతూ ఒక టిఎంసితో అంత కంటే ఎక్కువ ఎకరాలు సాగులో ఉంటాయని తప్పుడు గణాంకాలు చెప్తున్నారని ఆరోపించింది. అప్పట్లో కేసీఆర్ అనేకసార్లు ఈ ఆరోపణలు చేశాడు. కానీ ఇప్పుడు ముఖ్యమంత్రి హోదాలో ఆ పాతమాట మర్చిపోయి ఒక టిఎంసితో 12 నుంచి 14 వేల ఎకరాల నీరుపారించవచ్చునని అంటున్నారు. తాము నిర్మించబోయే ఈ ప్రాజెక్టుతో వీలైనన్ని ఎక్కువ ఎకరాలకు నీరందిస్తున్నామని చెప్పుకోవడానికే కెసిఆర్ గణాంకాలను తనకనుకూలంగా ఎక్కువచేసి చెప్తున్నారనేది ఈ విమర్శ సారాంశం.

6) నిజానికైతే ఒక టిఎంసి నీటితో మెట్టకైతే 10 వేల ఎకరాలు, మాగాణి అయితే ఆరువేల ఎకరాలను సాగుచేయవచ్చు. తెలంగాణ ప్రభుత్వం చెబుతున్న 45 లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వడానికి మొత్తం మెట్టభూమినే పరిగణించినా 450 టిఎంసిలు అవసరం. కొంత మాగాణి ఉందనుకుంటే దాదాపు 500 నుంచి 550 టిఎంసిలు అవసర మవుతాయి. పారిశ్రామిక అవసరాలు, తాగునీరు కలిపితే 600 టిఎంసిలు అవసరం. ఇన్నినీళ్లు అసలు గోదావరిలో ఉన్నాయా? కాళేశ్వరం ప్రాజెక్టుకు 225 టిఎంసిలు, శ్రీరాంసాగర్, నిజాం సాగర్, సింగూర్‌ల నీరు అంతా కలిపి కూడా 400 టిఎంసిలకు మించదు. పూడికతో వాడుకోలేకపోతున్న శ్రీరాంసాగర్‌ను బాగుచేసినా నీటి పరిమాణం 80 టిఎంసిల నుంచి 120 టిఎంసిలకు వస్తుంది. అంటే మరో 40 టిఎంసిలు పెరగవచ్చు. కానీ 600 టిఎంసిలకైతే చేరదు.

అయితే గోదావరిలో 600 టిఎంసిలు వాడుకోవాలంటే గోదావరిలోకి ఇంద్రావతి, శబరి నదులు కలిశాకే సాధ్యపడవచ్చు. కానీ ఇంద్రావతి కలిశాక ఇప్పటికే దేవాదుల, సీతారాం సాగర్ ప్రాజెక్టులున్నాయి. కనుక ఎలా చూసినా 600 టిఎంసిలు ఇప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా పొందడం అసాధ్యం. అలాంటప్పుడు 600 టిఎంసిలు ఎక్కడి నుంచి తెస్తారనే విమర్శ ఎక్కువగా వినిపిస్తున్నది. 600 టిఎంసిలు లభ్యం కాకుండా ప్రభుత్వం చెప్తున్న 45 లక్షల ఎకరాలకు నీరెలా అందుతుంది?

7) కాళేశ్వరం ప్రాజెక్టు నీటితో ఎన్ని ఎకరాలు సాగులోకి తెస్తారనేది ఒక చర్చ. ముఖ్యమంత్రి 45 లక్షల ఎకరాలని చెప్తున్నాడు. ప్రభుత్వంలోని ఇతరులు 35 లక్షలు అంటున్నారు. కానీ 35 లక్షలనే తీసుకున్నా, ఇందులో కొత్త ఆయకట్టు కేవలం 18.25 లక్షల ఎకరాలే. మిగిలిన 18 లక్షలు పాత ఆయకట్టే. ఆ పాత ఆయకట్టుకు కూడా ఇందులో కొత్తగా నీరు ఇవ్వడం ఉండదు. ఎప్పుడన్నా నీటి కొరత ఏర్పడితే ఆదుకోవడం కోసమే. ఇది మొత్తంలో 25 శాతం మాత్రమే. అంటే దాదాపు అది 4.5 నుంచి 5 లక్షల ఎకరాలకు మించదు.

8) తుమ్మిడిహట్టి వద్ద 152 మీటర్ల ఎత్తులో ప్రాజెక్టు కట్టడానికి ముంపు కారణంతో మహారాష్ట్ర అంగీకరించలేదు. 148 మీటర్లకు అంగీకరించింది. తుమ్మిడిహట్టి, ఎల్లంపల్లిలు సముద్ర మట్టానికి 148 మీటర్ల ఎత్తులో ఉంటాయి. అంటే సమాన ఎత్తు. అయినాగానీ నేరుగా నీటిని పంపలేం. తుమ్మిడిహట్టి నుంచి వాలు (స్లోప్) తీసుకుని ఎల్లంపల్లి వద్ద పంప్ హౌస్ కట్టి 19 నుంచి 24 మీటర్ల ఎత్తుకు ఎత్తిపోస్తాం. అయినా ఈ ఎత్తు తక్కువ ఎత్తే కాబట్టి తుమ్మిడిహట్టి నుంచి ఎల్లంపల్లికి నీళ్లు పంపడం సులభమైన పని. సమానఎత్తులో నీటిని ఎత్తిపోయడం సులభమైన పని. మహారాష్ట్ర ఒప్పుకుని ఉంటే 152 మీటర్ల ఎత్తున తుమ్మిడిహట్టి వద్ద కడితే ఇంకో నాలుగు మీటర్లు తక్కువ ఎత్తిపోస్తాం. అంతే తేడా. కానీ మేడిగడ్డ 100 మీటర్ల ఎత్తులో ఉంది. అక్కడి నుంచి

148 మీటర్ల ఎత్తులో ఉండే ఎల్లంపల్లికి ఎత్తిపోయడానికి ఇప్పటి డిజైన్‌లోని అన్నారం సుందిళ్లల ద్వారా ఎత్తిపోయాలంటే కష్టమైన పని. ఇందులోనూ తేడా ఎత్తు 48 మీటర్లు గానే పైకి కనబడినా అన్నారం, సుందిళ్లకు ఎత్తిపోసే దశలలో ప్రతిసారి వాలు తీసుకుని మళ్లీ పైకి ఎత్తిపోయడాన్ని లెక్కిస్తే ఎత్తిపోసే పొడవు పెరిగి మూడుదశల్లో కలిపి 123 మీటర్లు ఎత్తిపోయాల్సి వస్తుంది. అంటే ప్రాణహిత-చేవెళ్లలోని ఎత్తిపోసే ఎత్తు కంటే ఇది చాలా ఎక్కువ. దీనివల్ల తుమ్మిడిహట్టితో పోల్చితే ఆరు రెట్ల విద్యుత్ ఖర్చులు పెరుగుతున్నాయి.

9) ముఖ్యమంత్రి, టిఆర్ఎస్ పెద్దలు, ప్రభుత్వంలోవాళ్లు చెప్తున్నట్టుగా ఇప్పటికి ప్రాజెక్టంతా పూర్తి కాలేదు. కేవలం లింక్.1,2 లు మాత్రమే ఓ కొలిక్కిరావడం జరిగింది. వాటికి కూడా ఇంకా చాలాపనే ఉంది. ఇక మిగిలిన లింకులకైతే భూసేకరణ, కాలువల నిర్మాణం వంటి పనులన్నీ పెండింగ్ లోనే ఉన్నాయి. మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్‌లు ఇందుకు కళ్లముందరి ఉదాహరణలు. ఇవన్నీ పూర్తి కావాలంటే ఇంకా చాలాసమయమే పడుతుంది. ఆలోపు వాటికయ్యే ఖర్చు పెరిగి ప్రాజెక్టు నిర్మాణం మరింతగా పెరగవచ్చు. ఇప్పటికి అందరూ ఊహిస్తున్నట్టు లక్షకోట్ల అంచనా దాటిపోవచ్చు. కాబట్టి ఇప్పుడు జరుగుతున్నదంతా, చూపిస్తున్నదంతా, మనం చూస్తున్నదంతా కేవలం మేడిగడ్డ నుంచి ఎల్లంపల్లికి, మహా అయితే మిడ్ మానేరు వరకు జరుగుతున్న దశలనే. ఇంకా చాలా పని మిగిలే ఉంది.

10) 15వ ఆర్థిక సంఘానికి రాష్ట్ర ప్రభుత్వం లిఖితపూర్వకంగా రాసిన లేఖలోని విషయం మరో వివాదంగా మారింది. కాళేశ్వరం ఒక లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్. లిఫ్ట్ ప్రాజెక్టులకు నిర్వహణ ఖర్చు చాలా ఎక్కువగా ఉంటుంది. ప్రపంచంలోని అతిపెద్ద మల్టీస్టేజ్ లిఫ్ట్ ప్రాజెక్టుకు చాలా పెద్దఎత్తున కరెంటు అవసరం. అలాగే మిషన్ భగీరథ ఖర్చులు. అంతా కలిపి దాదాపు 50 వేలకోట్ల రూపాయలు అవుతాయి. కనుక రాష్ట్ర ప్రభుత్వం 15వ ఫైనాన్స్ కమిషన్ సహాయాన్ని కోరుతూ చెప్పిందేమిటంటే ప్రస్తుతానికి ఫైనాన్స్ కమిషన్ సహాయం చేస్తే ఆ తర్వాత వినియోగదారులపై యూజర్ చార్జీలు వసూలు చేసి సంపాదించుకుంటామని చెప్పింది. అంటే సాగునీటిని వాడుకోబోయే రైతులపై, తాగునీరు వాడుకునే ప్రజలపై భవిష్యత్తులో యూజర్ చార్జీల దెబ్బ పడబోతుందన్న మాట. కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు ప్రభుత్వం బడ్జెట్ ద్వారా కేటాయించిన మొత్తం కంటే బ్యాంకుల కన్సార్షియం ద్వారానే పెద్ద ఎత్తున నిధులు అందాయి. ఈ బ్యాంకుల వడ్డీలు చెల్లించడానికి ప్రభుత్వం యూజర్ చార్జీలు, వాడినా వాడకపోయినా పడే కరెంట్ ఫిక్స్‌డ్ ఛార్జీల మార్గం ఎంచుకుంటే ప్రజలు ఇబ్బందులు పడే అవకాశముంది.

11) వివిధ గణాంకాల ఆధారంగా కాళేశ్వరం ప్రాజెక్టు నీటిసరఫరాకు ఎకరానికి అయ్యే ఖర్చు రూ.1.4 లక్షలు. ప్రాజెక్ట్ ఎస్కలేషన్‌ను పరిగణిస్తే ఖర్చు ఇంకా ఎక్కువవుతుంది.

ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు, ఉద్యమ సంఘాలు, మేధావివర్గం అంతా కలిసి పైన పేర్కొన్నవే కాకుండా ఇంకా ఎన్నో విమర్శలు చేస్తూనే వస్తున్నా, ప్రభుత్వం కూడా ప్రాజెక్టు నిర్మాణాన్ని గట్టిగానే సమర్థించుకుంటోంది. ప్రభుత్వం స్వీయ సమర్థింపులు ఈ విధంగా ఉన్నాయి.

1) రీడిజైనింగ్ చేయడాన్ని అత్యావశ్యకమైందిగా ప్రభుత్వం చెప్పుకుంటున్నది. తుమ్మిడిహట్టి వద్ద కడితే 165 టిఎంసిలలో 63 టిఎంసిలు పోను మిగిలిన 102 టిఎంసిలతో ఏ ప్రయోజనాలు తీరుతాయని ప్రభుత్వం ప్రశ్నిస్తున్నది. అందుకే స్థల మార్పుతో మేడిగడ్డ నుంచి ఎక్కువ నీటిని తీసుకునే పనిచేశామని చెప్తున్నది.

2) ఖర్చు విషయానికి వస్తే ఎంత ఖర్చయినా వెనకాడబోమని, ఎంత అప్పు తెచ్చయినా ప్రజల, రైతుల ప్రయోజనాలు నెరవేరుస్తామని, ప్రాజెక్టుల నిర్వహణకు అయ్యే ఖర్చును కూడా భవిష్యత్తులో ఇతర మార్గాల ద్వారా తీర్చుకుంటామని, రైతులపై ఒక్క రూపాయి కూడా అదనపు భారం వేయబోమని ప్రభుత్వం అంటున్నది.

3) ప్రాజెక్టు ఇప్పటికి 50 శాతం పూర్తయిందని, మరికొద్ది నెలల్లో మిగతాది పూర్తవుతుందని, ప్రతిపక్షాలు కేవలం 20 శాతం మాత్రమే పూర్తయిందని అబద్ధపు ప్రచారాలు చేస్తున్నాయని చెప్తున్నది.

4) బయట ప్రచారం జరుగుతున్నట్టుగా రైతులపై ఎలాంటి యూజర్ చార్జీలు, విద్యుత్ ఫిక్సడ్ ఛార్జీలు వేయబోమని చెప్తున్నది.

5) ప్రతిపక్షాలు చెప్తున్నట్టు ఎకరాకు అయ్యే ఖర్చు లక్షల్లో ఉండదని ప్రభుత్వం అంటున్నది.

6) వీటన్నింటికితోడు ప్రతి సంవత్సరమూ లిఫ్టులు ఎత్తిపోసే అవసరం ఉండకపోవచ్చునని, వర్షాలు బాగా కురిసినప్పుడు లిఫ్టుల పంపింగ్‌ను తగ్గించి విద్యుత్ ఆదా అవుతుందని, పైనున్న రిజర్వాయర్లు, ప్రాజెక్టులు నిండితే కింది నుండి ఎత్తిపోయడం ఉండదు కనుక ఆ ఖర్చులు మిగులుతాయని ప్రభుత్వం అంటున్నది.

7) సాధారణంగా కరంట్‌ను కొంటున్నప్పుడు ప్రజలు వాడుకున్నా వాడకపోయినా ప్రభుత్వం ధర చెల్లించాలి. రాత్రి కరంట్ వినియోగం తక్కువగా ఉంటుంది. కానీ ధర మాత్రం చెల్లించాల్సి ఉంటుంది. ఈ పీక్ అవర్స్ రాత్రి 8 నుండి పొద్దున 6 వరకు ఉంటుంది. కరెంట్ వృథాగా పోయే ఈ సమయంలో ఆ కరంట్‌ను లిఫ్ట్‌కు ఉపయోగించుకుంటామని ప్రభుత్వం చెప్తున్నది.

8) ఇప్పటికి జెన్‌కో వంటి సంస్థలకిచ్చే వేలకోట్ల రూపాయల సబ్సిడీలు, తెలంగాణలో రైతులకు ప్రస్తుతం ఉన్న 14 నుండి 15 లక్షల బోర్లనుపయోగించడం వల్ల ఖర్చు అయ్యే విద్యుత్ వంటివన్నీ ప్రాజెక్టు వినియోగంలోకి వచ్చిన తర్వాత ఉండబోవు కనుక వాటినన్నింటిని కాళేశ్వరం ప్రాజెక్టు ఖర్చు కిందికి వాడుతామని ప్రభుత్వం చెప్తున్నది.

9) ఇవన్నీ చెప్తూ పదకొండేళ్ల కిందట 38 వేలకోట్ల రూపాయలున్న ప్రాజెక్టు అంచనా ఇప్పుడు కనీసం రెట్టింపు అయినా అవుతుంది కనుక ఆ లెక్కన కాళేశ్వరం ప్రాజెక్ట్ కు ప్రభుత్వం పెడుతున్న ఖర్చు ఎక్కువేమీ కాదని కూడా చెప్పుకువస్తున్నది.

ఏది ఏమైనా కాళేశ్వరం ప్రాజెక్టు మొదటి నుంచీ వివాదాలమయంగా ఉంటూ వస్తున్నది. ఇప్పటికీ ఎడతెగని చర్చోపచర్చల మధ్య, విమర్శల మధ్య ప్రాజెక్టు పనులు జరుగుతున్నాయి. ప్రభుత్వం చెప్పినవన్నీ నిజమై రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందితే అంతకు మించిన సంతోషం మరేదీ ఉండబోదు. కానీ ప్రభుత్వ అంచనాలు తారుమారు అయితే పరిస్థితి తలకిందులై తెలంగాణ ప్రజలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కంటే కూడా దారుణంగా వెనుకబడిపోతారనేది మాత్రం కఠిన వాస్తవం.

(రచయిత సామాజిక కార్యకర్త) వీ

భారత ఎన్నికల కమిషన్‌కి బహిరంగ లేఖ

***2019 సాధారణ ఎన్నికల సమయంలో జరిగిన అవకతవకలు, అక్రమాలు ఎన్నికల కమిషన్ దృష్టికి తెస్తూ ఇప్పటికైనా విశ్వాసం చూరగొనే చర్యలు తీసుకోవాలంటున్నారు* విశ్రాంత ఐఏఎస్ అధికారుల బృందం**

13 జూలై, 2019

శ్రీ సునీల్ అరోరా, ప్రధాన ఎన్నికల కమిషనర్
శ్రీ అశోక్ లావాస, ఎన్నికల కమిషనర్
శ్రీ సుశీల్ చంద్ర, ఎన్నికల కమిషనర్
భారత ఎన్నికల కమిషన్
నిర్వాచన్ సదన్, కొత్త ఢిల్లీ
భారతదేశం

అయ్యలారా,

2019 సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో తీవ్ర అవకతవకలు

1) పదవీ విరమణ చేసిన కొంతమంది ఐఏఎస్ (పౌర) అధికారులతో కూడిన బృందం మాది. అసాధారణ పరిస్థితులలో దేశ ప్రయోజనాలకు సంబంధించిన అంశాలను చేపడుతూ ఉంటాం, రాజ్యాంగ ఉన్నత ఆశయాలను కాపాడాల్సిన తమ బాధ్యత గురించి ప్రజాస్వామిక సంస్థలకు గుర్తు చేస్తూ ఉంటాం. భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ) నిర్వహించిన 2019 సార్వత్రిక ఎన్నికలలో ఆందోళన కలిగించే, ఇప్పటికీ వివరణ ఇవ్వని అనేక అంశాలను మీ దృష్టికి తీసుకురావడానికి ఈ రోజు మీకు ఈ ఉత్తరం రాస్తున్నాం.

2) 2019 సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో జరిగిన వివిధ అవకతవకల గురించి ప్రసార మాధ్యమాలలో ఎప్పటికప్పుడు కథనాలు వచ్చాయి. ఈ కథనాలు అన్నీ ఖచ్చితమైనవీ, యదార్థమైనవీ కావని మేం ఒప్పుకుంటాం. అయితే, ఇటువంటి వాటిని కూడా ఇసిఐ ఖండించక పోవడంతో దాని దగ్గర సరైన వివరణ లేదన్న నిర్ధారణకు ప్రజలు వస్తారు. నిరాధార ఆరోపణలు అన్న పేరుతో వాటిని కొట్టిపారేసి వివరణ ఇవ్వకుండా ఉంటే ప్రజలు సంతృప్తి చెందరు. ప్రజాస్వామ్యంలో ప్రజల ఆమోదం అన్న అత్యంత ముఖ్యమైనదానికి సంరక్షకులైన మీరు పారదర్శకంగా ఉండడం, దేశ ప్రజలకూ, రాజ్యాంగానికీ జవాబుదారీగా ఉండటం మీ బాధ్యత.

3) గత మూడు దశాబ్దాల కాలంలో జరిగిన ఎన్నికలలో స్వేచ్ఛ, న్యాయం బాగా లోపించినది 2019 సార్వత్రిక ఎన్నికలలోనే. గతంలో నేరపూరిత శక్తులు, గూండాలు, నీతిబాహ్యమైన రాజకీయ నాయకులు ఎంత ప్రయత్నించినప్పటికీ సాధ్యమైనంత స్వేచ్ఛగా, న్యాయంగా ఎన్నికలు నిర్వహించడానికి ఇసిఐలోని అధికారులు తమ శక్తిమేరకు కృషి చేశారు. ప్రజాస్వామిక ప్రక్రియను కాపాడాల్సిన అధికారం ఉన్న రాజ్యాంగ సంస్థే దానిని బలహీనపరిచిందన్న అభిప్రాయం ఈ సార్వత్రిక ఎన్నికలలో ఏర్పడింది. ఇసిఐ సామర్థ్యత, నిజాయితీ, నిష్పక్షపాతాలపై తీవ్ర అనుమానాలు కలగడం గతంలో చాలా అరుదు. ప్రస్తుత ఇసిఐ గురించి, 2019 సార్వత్రిక ఎన్నికల నిర్వహణ గురించి అలా చెప్పలేకపోవడం దురదృష్టమే. ప్రస్తుత ఇసిఐ తన విధుల్లో ఎంత ఘోరంగా విఫల మయ్యిందంటే మాజీ ఎన్నికల కమిషనర్లు, సిఇసిలు తప్పనిసరి పరిస్థితుల్లో, ఎంతో అయిష్టంగా తమ తరవాత బాధ్యతలు నిర్వర్తిస్తున్న అధికారుల నిర్ణయాలను ప్రశ్నించారు.

4) ఎన్నికలు ప్రకటించిన తేదీ నుంచే ఎన్నికల కమిషన్‌కి ఒక పార్టీ పట్ల ఉన్న పక్షపాత ధోరణి వెల్లడయ్యింది. 2004, 2009, 2014 సంవత్సరాలలో లోక్‌సభ ఎన్నికల ప్రకటనను వరసగా ఫిబ్రవరి 29, మార్చి 1, మార్చి 5న ఇసిఐ జారీ చేసింది. ఏప్రిల్-మే నెలల్లో జరగాల్సిన శాసన సభ ఎన్నికల ప్రకటనను మార్చి 1- 5 మధ్య జారీ చేస్తుండేవాళ్లు. ఈ ఆనవాయితీని 2019 లోక్ సభ ఎన్నికలలో పాటించలేదు. ఎటువంటి వివరణ ఇవ్వకుండా, కారణం చూపకుండా ఆలస్యంగా 2019 మార్చి 10న ఎన్నికల ప్రకటన జారీ చేశారు. ఫిబ్రవరి 8 - మార్చి 9 మధ్య ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తలపెట్టిన అనేక పథకాల (మొత్తం 157) ప్రారంభోత్సవాలను పూర్తి చెయ్యటానికి ఇసిఐ కావాలని ఎన్నికల ప్రకటనను వాయిదా వేసిందన్న అనుమానం కలగక మానదు. ఇసిఐ చేసే (అందరికీ తెలిసిన) ఎన్నికల ప్రకటన తేదీలకు అనుగుణంగా ప్రభుత్వం తన ప్రారంభోత్సవ తేదీలను మార్చుకోవటం కాకుండా ప్రభుత్వ కార్యక్రమాలను బట్టి ఇసిఐ తన ప్రకటన తేదీలను మార్చుకుంది. దీనితో ఆ సంస్థ స్వతంత్రత, నిష్పక్షపాత వైఖరిపై ప్రశ్నలు తలెత్తాయి.

5) ఎన్నికల తేదీలు ఆశ్చర్యం కలిగించాయి. దేశంలో సుదీర్ఘకాలం తీసుకున్న ఎన్నికలు ఇవే. కేంద్రంలో అధికారంలో ఉన్న పాలక పార్టీకి అనుకూలంగా ఉండేలా బహిరంగంగా, నిస్సిగ్గుగా తేదీలను నిర్ణయించారన్న అనుమానానికి ఇది తావు ఇచ్చింది. వివిధ రాష్ట్రాలకు ఎన్నికల తేదీలను నిర్ణయించడంలో ఎటువంటి హేతుబద్ధత లేదు. ఉదాహరణకు భాజపా బలహీనంగా ఉండి, ఎక్కువ సీట్లు గెలిచే అవకాశం లేని తమిళనాడు (మొత్తం 39 సీట్లు), కేరళ (20), ఆంధ్రప్రదేశ్ (25), తెలంగాణ (17) రాష్ట్రాలలో ఎన్నికలు ఒకే దశలో జరిగాయి. అంతకంటే తక్కువ లోక్‌సభ నియోజకవర్గాలు ఉండి, భాజపాకి గట్టి పోటీ ఉండి, లేదా బలం సమకూర్చుకునే అవకాశం ఉండి, బహుశ ప్రధాన మంత్రి ప్రచారం చెయ్యడానికి మరింత సమయం ఉండేలా కర్ణాటక (28), మధ్యప్రదేశ్ (29), రాజస్తాన్ (25), ఒడిషా (21)లలో పలు దశలలో ఎన్నికలు నిర్వహించారు. ప్రధానమంత్రి పోటీ చేస్తున్న వారణాసి

నియోజకవర్గానికి ఎన్నికలను అతనికి వీలుగా ఎన్నికల చివరి దశ అయిన 2019 మే 19న నిర్వహించారు.

6) ఓటర్ల జాబితా నుంచి పెద్ద ఎత్తున ఓట్లు – ప్రత్యేకించి కొన్ని అల్పసంఖ్యాక వర్గాల ఓట్లు తొలగించబడ్డాయని ప్రసార సాధనాలలో అనేక వార్తలు ప్రచురితమయ్యాయి. ఈ ఆరోపణలు నిజమని మేం అనుకోనప్పటికీ వాటిపై విచారణ జరిపించి, వెంటనే స్పందించాల్సిన బాధ్యత ఇసిఐ పై ఉండింది. అంతకుముందు ఎన్నికలలో తమ ఓటుహక్కు వినియోగించుకున్న అనేకమంది ఓటర్ల పేర్లు ఈసారి జాబితాలో లేవు. ఈ ఆరోపణలను ఇసిఐ సమర్థంగా తిప్పికొట్టడంలో విఫలం కావడంతో దాని ప్రతిష్ఠ మరింత దెబ్బతింది.

7) అనేకమంది అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని బాహాటంగా ఉల్లంఘించారు. ప్రత్యేకించి భాజపాకి చెందిన అభ్యర్థులు విద్వేషపూరిత ఉపన్యాసాలు చేశారు, మత తత్వాన్ని రెచ్చగొట్టే ప్రకటనలు చేశారు. చర్య తీసుకోడానికి తమకు ఎటువంటి అధికారం లేదంటూ ఇసిఐ వీటిని పట్టించుకోలేదు. ఉదాహరణకు, అక్రమ వలసదారులను బంగాళా ఖాతంలోకి గిరాటు వేస్తామని అమిత్ షా అన్నాడని వార్తలు వచ్చాయి. దీనికి అతడిపై భారత శిక్షా స్మృతి కింద, ప్రజా ప్రతినిధుల చట్టం కింద చర్య తీసుకోవచ్చు. సుప్రీం కోర్టు మొట్టికాయలు వేసిన తరవాత ఇసిఐ ఉన్నట్టుండి తన అధికారాలను గుర్తించింది. అప్పుడు కూడా ప్రధాన మంత్రి, భాజపా అధ్యక్షుల తీవ్ర వ్యాఖ్యానాలను పట్టించుకోకుండా కొంతమంది కింది స్థాయి నాయకుల మీద మాత్రమే ఈ అధికారాలను ఉపయోగించింది. అది తీసుకున్న అత్యంత కఠినమైన చర్య పశ్చిమ బెంగాల్‌లో చివరి దశలో ప్రచార సమయాన్ని కుదించడం, అయితే దీనిని ప్రకటించిన తీరు ఎలా ఉందంటే ఈ నిషేధం అమలులోకి వచ్చే సమయానికి ప్రధానమంత్రి ప్రచార కార్యక్రమం పూర్తి అయిపోయింది. ఇసిఐ పక్షపాత ధోరణి తేటతెల్లం కావడంతో ప్రధాన మంత్రి, అమిత్ షా, ఇతర పార్టీ ప్రతినిధులకు మరింత ధైర్యం వచ్చింది.

8) ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తీవ్రంగా ఉల్లంఘిస్తూ జాతీయతా భావాలను – ఇంకా ఖచ్చితంగా చెప్పాలంటే యుద్ధోన్మాదాన్ని రెచ్చగొట్టి, దానిని భాజపాకి అనుకూలంగా మలుచుకోటానికి పుల్వామా, బాలాకోట్ అంశాలను ప్రధానమంత్రి ఉపయోగించుకున్నారు. ఈ ఉల్లంఘనలకు ప్రధాన మంత్రి మళ్లీ మళ్లీ పాల్పడినప్పటికీ, వీటి గురించి రాష్ట్ర ఎన్నికల కమిషనర్లు నివేదికలు ఇచ్చినప్పటికీ ఎన్నికల కమిషన్ కనీసం షో కాజ్ నోటీసు జారీ చెయ్యకపోవడం వింతగా ఉంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘింపబడిందా లేదా అన్నదానిపై ఇసిఐలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ భిన్నాభిప్రాయాన్ని ఇసిఐ పట్టించుకోకుండా, ఈ ఘటనలను కొట్టిపారేసింది. న్యాయ శాఖలో చేసినట్టుగా ఇతరులతో విభేదించిన కమిషనర్ అశోక్ లావాసా అభిప్రాయాన్ని యథాతథంగా ప్రచురించి ఉండాల్సింది. రాజ్యాంగ 19వ అధికరణానికి, పౌరులకు ఉన్న సమాచార హక్కుకి భంగం కలిగిందని మా అభిప్రాయం.

9) ఒడిషాకి ప్రత్యేక ఎన్నికల అధికారిగా నియమించిన ఐఎఎస్ అధికారి మొహమ్మద్ మొహసిన్ విషయంలో ఇసిఐ పక్షపాతం మరింత స్పష్టంగా వెల్లడయ్యింది. అనుమతించని వస్తువులు ఏవైనా ఉన్నాయేమోనని ప్రధానమంత్రి హెలికాప్టర్‌ని తనిఖీ చేసినందుకు ఇతడిని ఉద్యోగం నుంచి సస్పెండ్ చేశారు. ఎస్‌పిజి రక్షణలోని వ్యక్తులను సోదా చెయ్యవద్దన్న తమ ఆదేశాలకు అనుగుణంగా అతడు ప్రవర్తించలేదని ఇసిఐ పేర్కొంది. పరిపాలన ఆదేశాలతో రాజ్యాంగ విధులను కుదించివేశారు. ఒడిషా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, అప్పటి పెట్రోలియం శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ హెలికాప్టర్లను కూడా ఇదే విధంగా తనిఖీ చేసినప్పుడు వాళ్లు ఎటువంటి అభ్యంతరమూ పెట్టలేదని అప్పుడు కూడా ఇసిఐ దృష్టికి తెచ్చారు. అయితే, తన ద్వంద్వ ప్రమాణాలను ఇసిఐ వివరించలేదు, వివరించలేకపోయింది.

10) అధికార దుర్వినియోగానికి పాల్పడిన ప్రభుత్వాన్ని ఏ శిక్షా లేకుండా ఇసిఐ వదిలేయడం తీవ్రంగా పరిగణించాల్సిన విషయం. ప్రధాన మంత్రి సందర్శించబోయే ప్రాంతాలకు సంబంధించి వివరాలు తెలియచెయ్యమని వివిధ కేంద్ర పాలిత ప్రాంతాలకు, కొన్ని జిల్లాలకు నీతి ఆయోగ్ అధికారిక ఉత్తరాలు పంపించింది. ఈ సమాచారాన్ని తన ప్రచారంలో ప్రధాన మంత్రి ఉపయోగించుకోవడం కోసమని అడిగారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఇది ఉల్లంఘించడమే అయినప్పటికీ ఈ ఫిర్యాదుని ఇసి కొట్టిపారేసింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఒక విధేయుడైన రాచబంటు లాగా, పక్షపాత ధోరణిలో ఇసిఐ ఎందుకు అమలుచేసింది? ప్రజా ప్రతినిధుల చట్టం కింద కూడా చర్య తీసుకుని ఉండవలసింది.

11) ప్రసార మాధ్యమాల్లో – ప్రత్యేకించి పాలక పార్టీ ద్వారా జరిగిన ఉల్లంఘనలను ఇసిఐ పట్టించుకోకపోవడం పట్ల కూడా ప్రజలు ఆందోళనకు గురయ్యారు. ఈ ఉల్లంఘనలలో అన్నింటికంటే తీవ్రమైనది నమో టివి అనే కొత్త చానెల్‌ని ఆరంభించడం. ఇందులో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఉపన్యాసాలూ, అతడి కార్యక్రమాలను 24 గంటలూ ప్రసారం చేశారు. కొత్త చానెల్ ప్రారంభించేటప్పుడు పాటించవలసిన పలు షరతులను ఇది పట్టించుకోలేదు, అలాగే కార్యక్రమాలు ప్రసారం చెయ్యడానికి సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ అనుమతి పొందలేదు. ఈ చానెల్‌ని నిలిపివెయ్యమని ఇసిఐ ఆదేశాలు జారీ చేసినప్పటికీ దాదాపు ఎన్నికలు పూర్తయ్యేవరకు ప్రసారాలు కొనసాగుతూనే ఉన్నాయి. అనేక విషయాల్లో నిర్ణయాలు తీసుకోకుండా జాప్యం చెయ్యడం, మౌనంగా ఉండడం, చర్యలు తీసుకోకపోవడం అన్న విధానాలను ఇసిఐ అనుసరించింది.

మరొక ఉల్లంఘన జరిగింది, ఎన్నికలు జరుగుతున్న సమయంలో ప్రధానమంత్రి వ్యక్తిగత అంశాలపై కేంద్రీకరిస్తూ నటుడు అక్షయ్ కుమార్ యాంకర్‌గా చేసిన కార్యక్రమాన్ని అనేక టివి చానెళ్లు ప్రసారం చేశాయి. దీంతో ఇతరుల కంటే ప్రధాన మంత్రికి ఎంతో ఉచిత ప్రచారం జరిగింది. ఎన్నికలు చివరి దశలో ఉండగానే కేదార్‌నాథ్ లోని ఒక గుహలో ప్రధానమంత్రి ధ్యానానికి ప్రచార సాధనాలు ఇచ్చిన ప్రాధాన్యత ఇందుకు మరొక ఉదాహరణ. మాకు తెలిసినంత వరకు ఈ ఖర్చులేవీ ప్రధానమంత్రి ప్రచార ఖర్చులలో జమ కాలేదు.

12) ఎన్నికల నిధుల విషయంలో ఇంత అపారదర్శకతను ఇంతకు ముందు ఎన్నడూ చూడలేదు. దీనికి కారణం ఎన్నికల బాండ్లను విస్తృతంగా వినియోగించడం. ఇంకోవైపున ఎన్నికల సమయంలో మొత్తం

3456 కోట్ల రూపాయల విలువ చేసే నగదు, బంగారం, మత్తు పదార్థాలను పట్టుకున్నారు. తమిళనాడులో పెద్ద ఎత్తున నగదు పట్టుబడిన సందర్భంలో ఇసిఐ కఠినంగా వ్యవహరించి ఒక పార్లమెంటరీ నియోజకవర్గంలో ఎన్నికలను వాయిదా వేసింది. అయితే, ఇతర సందర్భాలలో అది ఇంత కఠినంగా వ్యవహరించలేదు. అరుణాచల్ ముఖ్యమంత్రి కాన్వాయ్ నుంచి 1.8 కోట్ల రూపాయలు పట్టుకున్న సందర్భంలో ఇసిఐ ఏ చర్య తీసుకుందో సమాచారమే లేదు. అందరిపట్ల సమంగా ఎక్కడ ప్రవర్తించారన్న ప్రశ్న తలెత్తుతుంది.

13) ఎన్నికలకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను (ఇవిఎంలు) ఉపయోగించడం పెద్ద వివాదానికి కారణం అయ్యింది. భారత దేశంలో ఉపయోగిస్తున్న ఇవిఎంలను టాంపర్ చెయ్యలేరని ఇసిఐ పదే పదే ప్రకటనలు జారీచేసింది. అయినప్పటికీ వివిధ నివేదికలపై ఇసిఐ ప్రతిస్పందనలో పారదర్శకత లోపించడంతో దీనిపై అనుమానాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇవిఎంల తయారీకి అనుమతి పొందిన రెండు ప్రభుత్వ సంస్థలు ఉత్పత్తి చేసిన సంఖ్యకీ ఇసిఐ వద్ద ఉన్న ఇవిఎంల సంఖ్యకీ తేడా ఉంది. ప్రసార సాధనాలలో వచ్చిన ఒక నివేదిక ప్రకారం ఉత్పత్తిదారులు అందచేసిన ఇవిఎంలలో 20 లక్షల దాకా ఇసిఐ దగ్గర లేవని సమాచార హక్కు చట్టం సహాయంతో వెల్లడయ్యింది. ఈ తేడా గురించి ఇసిఐని అడగగా అనుమానాలను పూర్తిగా నివృత్తి చెయ్యకుండా కేవలం అటువంటిదేమీ లేదని తిరస్కరించింది. ప్రజలు సరిచూసు కోడానికి ఈ విషయంలో పూర్తివివరాలను, వాస్తవాలను వెల్లడి చెయ్యాలి.

14) ఓటర్ వెరిఫైయబల్ పేపర్ ఆడిట్ ట్రయల్స్ (వివిపాట్)లను ఉపయోగించి ఇవిఎం ఫలితాలను సరిచూసుకోవడంలో ఇసిఐ మరింత సానుకూలంగా ప్రవర్తించి ఉంటే ఇవిఎంల పట్ల ప్రజల విశ్వాసం పెరిగి ఉండేది. అనేక రాజకీయ పార్టీలతో సహా పలు బృందాలు విన్నపాలు చేసినప్పటికీ ఇవిఎంలలో నమోదైన ఓట్లను చెప్పుకోదగిన స్థాయిలో వివిపాట్ యంత్రాలతో సరిపోల్చడానికి ఇసిఐ మొదటి నుంచి తీవ్ర విముఖతను ప్రదర్శించింది. వివిపాట్‌ల ద్వారా 50 శాతం ఓట్లను సరి చూడటానికి ఆరు రోజులు పడుతుంది అని మొదట ఇసిఐ పేర్కొంది (గతంలో 100 శాతం బ్యాలెట్ పేపర్ల లెక్కించడానికి 12 – 18 గంటలకు మించి పట్టలేదన్న వాస్తవం అందరికీ తెలిసిందే).

ఒక శాసనసభ నియోజకవర్గానికి ఒక్క ఇవిఎం ఓట్లను సరిచూస్తే సరిపోతుందని ఇసిఐ మొండిగా వాదించింది. సుప్రీం కోర్టు పట్టుబట్టిన మీదట నియోజక వర్గానికి 5 ఇవిఎంల ఓట్లను సరిచూడడానికి ఇసిఐ ఒప్పుకుంది. పొరపాట్లు జరగలేదని నిర్ధారించుకోడానికి వివిపాట్‌ల సంఖ్యను నిర్ణయించడానికి అంతర్జాతీయ గణాంక పద్ధతుల గురించి వినడానికి, ఆమోదించడానికి ఇసిఐ నిరాకరించింది. లెక్కింపులో ఇవిఎంలకీ వివిపాట్‌లకీ తేడా ఉన్నప్పుడు ఏ చర్యలు తీసుకోవాలో కూడా పేర్కొనడానికి ఇసిఐ ఇష్టపడలేదు. వీటన్నింటి కారణంగా ఓటర్ల మనసుల్లో గందరగోళం నెలకొంది.

15) ఎన్నికలు జరిగిన చివరి తేదీకీ ఓట్ల లెక్కింపుకీ మధ్య వివిధ రాష్ట్రాలలో ఇవిఎంలు భద్రపరిచిన గదుల నుంచి ఇవిఎంల తరలింపు గురించి అనేక వార్తలు వచ్చాయి. దీనికి సరైన వివరణను ఇసిఐ ఇవ్వలేదు. ఏ ఇవిఎంలను ఎందుకు తరలించారో వివరించకుండా ఎటువంటి అవకతవకలు జరగలేదని కొట్టిపారెయ్యడం వల్ల ప్రజలలో నమ్మకం, విశ్వాసం నెలకొనవు.

16) ఓట్ల లెక్కింపు రోజున ఇవిఎంలను వివిపాట్‌లతో మొదట సరిచూడాలని అనేక పార్టీలు కోరగా ఏ కారణమూ లేకుండానే ఇసిఐ దానిని నిరాకరించింది. ఇది చాలా మామూలు కోరిక. దీనికి ఒప్పుకుని ఉంటే చాలా రాజకీయ పార్టీలు సంతృప్తి చెంది ఉండేవి. ఎన్నికలు స్వేచ్ఛగా, న్యాయంగా జరిగాయన్న నమ్మకాన్ని ప్రజలలో పెంచే ప్రతి విన్నపాన్ని, ప్రతి దశలో ఇసిఐ తిరస్కరిస్తూ వచ్చింది. సుప్రీం కోర్టు ఆదేశం ప్రకారం 5 వివిపాట్‌లలో నమోదైన ఓట్లతో సరిచూడడాన్ని చివరికి చేపట్టమన్నారు – ఈ రెండింటికీ మధ్య వ్యత్యాసం ఉందో లేదో చూడడానికి అప్పటికి కొద్దిమంది మాత్రమే ఉంటారు. వివిపాట్‌లతో సరిచూడడం వల్ల ఏం జరిగిందో ప్రసార మాధ్యమాల వార్తల వల్ల అర్థంకాలేదు. అయితే, చాలా చోట్ల ఇవిఎంలలో, వివిపాట్‌లలో నమోదైన ఓట్లలో తేడాలు ఉన్నాయనీ, ప్రసార సాధనాలలోని కొన్ని కథనాల ద్వారా 370 లోక సభ నియోజకవర్గాల ఫలితాలపై ప్రభావం ఉండే అవకాశం ఉందనీ తెలుస్తోంది.

17) తేడాలు ఉన్నాయని నివేదికలు వచ్చిన సందర్భాలలో చాలా పెద్ద మెజారిటీతో (దాదాపుగా అన్ని చోట్లా భాజపా లేదా దాని మిత్ర పార్టీ నిలబెట్టిన అభ్యర్థి) గెలిచారు కాబట్టి ఈ తేడా వల్ల ఎటువంటి ప్రభావం ఉండదని వివరించారు. గతంలో బ్యాలెట్ పేపర్లు ఉపయోగించినప్పుడు అంతిమ ఫలితాన్ని ప్రభావితం చెయ్యలేనంత తక్కువ తేడాలు ఉన్నప్పుడు వాటిని విస్మరించేవారు. వివిపాట్‌ల ఆధారంగా ఇవిఎంలను సరిచూస్తున్నప్పుడు ఈ తర్కం సరికాదు. ఎంపిక చేసిన ఇవిఎంకీ వివిపాట్‌కీ తేడా తక్కువే ఉన్నా, ఇవిఎంలో నమోదైన ఓట్లకీ ఎన్నిక పూర్తయిన తరువాత ప్రిసైడింగ్ అధికారి ఫారం 17సి లో నమోదు చేసిన ఓట్లకీ తేడా ఉన్నా చాలా తీవ్రమైనదిగా పరిగణించాలి, ఇవి మరింత పెద్ద సమస్యకి సంకేతాలు. సరైన గణాంక నమూనా పట్ల అవగాహన లేని కారణంగా రిటర్నింగ్ అధికారి, కౌంటింగ్ ఏజెంట్లు ఈ తేడాలను తేలికగా తీసుకుని ఉండవచ్చు కానీ ఇసిఐకి అసలు విషయం తెలియదనడానికి లేదు.

ఈ వాదనను అంగీకరించడమంటే కోట్ల రూపాయల వ్యాపార బ్యాలెన్స్ షీట్‌లో కొన్ని వందల రూపాయల తేడా పట్టించుకోనవసరం లేదని, జమా–ఖర్చు లెఖ్ఖలను ఆమోదించ వచ్చనే అకౌంటెంట్ వాదనతో అంగీకరించడం లాంటిది. ఎలక్ట్రానిక్ పద్ధతులు ఉపయోగిస్తున్నప్పుడు ఒక్క ఓటు తేడా వచ్చినా మొత్తం ఎన్నికల ప్రక్రియపైనే అనుమానం తలెత్తుతుంది.

18. "...మనకి అందుబాటులో ఉన్న అరకొర సమాచారం ఆధారంగా మనం కేవలం ప్రశ్నలు లేవనెత్తగలం. దేశంలోని అత్యున్నత సంస్థలు పారదర్శకంగా పనిచేస్తున్నప్పుడు వాటిల్లో తప్పులు జరిగాయని నిరూపించడం ప్రజల పని కాదు. స్పష్టంగ కనపడుతున్న తేడాల బట్టి ప్రశ్నలు లేవనెత్తడమే మన పని. ఆ తేడాలను వివరించే బాధ్యత ఎన్నికల సంఘానిది," అని ఇటీవల ఒక ప్రముఖ విద్యావేత్త రాశారు.

19. ఇంత పెద్ద దేశంలో, కోట్లాది ఓటర్లతో స్వేచ్ఛగా, న్యాయంగా ఎన్నికలు నిర్వహించగలుగుతున్నందుకు మన ఎన్నికల సంఘాన్ని చూసి

నిజాలపై కక్షే సంజీవ్ భట్‌కు శిక్ష

***ప్రభుత్వం చేసిన హత్యా రాజకీయాలను సమర్థించకుండా తన కర్తవ్య నిర్వహణలో భాగంగా దాన్ని ఎదిరించి, ఎత్తిచూపినందుకు పాలకులు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని అంటున్నారు* **బి. రామకృష్ణ**

2002లో గుజరాత్‌లో ముస్లింలపై జరిగిన దారుణమైన మానవ హనన చర్య అనేది దేశంలో జరిగిన మత ఘర్షణలు, మారణకాండలు అన్నింటిలోకెల్లా అతి దుర్మార్గమైనది. గతంలో ముంబాయిలో జరిగినవి కావచ్చు, ఇందిరాగాంధీ హత్య తరువాత సిక్కులపై ఊచకోతలు కావచ్చు అన్నీ కూడా 2002 గుజరాత్ గాయం ముందు మరుగుజ్జులే, దిగదుడుపులే.

2019 ఫిబ్రవరి 27న గోద్రా వద్ద సబర్మతి రైలులో అయోధ్య నుండి తిరిగి వస్తున్న కర సేవకులున్నబోగిలో చెలరేగిన మంటల్లో 59 మంది చనిపోయిన ఘటనకు ముస్లిం సంస్థలే కారణమన్నది సాకుగా తీసుకుని తదనంతరం గుజరాత్‌లో జరిగిన దారుణ హత్యాకాండలు, సామూహిక దాడులు, అత్యాచారాలు, లూటీలు, గృహ దహనాలు పెద్ద ఎత్తున జరిగిన ఘటన చరిత్రలో నిలిచిపోయింది. గోద్రా ఘటన జరిగిన రోజు హిందువులు ఆగ్రహావేశాలతో ఉన్నారని ఆ ఆగ్రహాలు బయటకు వెళ్లగక్కనీయండని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే ముస్లింలకు గుణపాఠం చెప్పాల్సిందేననే అర్థంలో స్వయంగా అప్పటి ముఖ్యమంత్రి తన నివాసంలో జరిగిన పోలీసు ఉన్నత అధికారుల సమావేశంలో చెప్పాడని సంజీవ్ భట్ అనే సీనియర్ పోలీసు అధికారి సుప్రీంకోర్టుకు తెలియచేశాడు. ఆ సమావేశంలో తాను కూడా ఉన్నానని సంజీవ్ భట్ చెప్పాడు. కాని తరువాత స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం దీన్ని ధృవీకరించలేదు అనేది వేరే విషయం అనుకోండి.

ఎనభై ఏళ్లుగా సంఘ పరివార్ శక్తులు చేస్తూ వస్తున్న ప్రయోగాలు, నిరంతర, విద్వేషపూరిత రాజకీయాలు, ప్రచారాలు గుజరాత్‌లో జరిగిన ముస్లింల హననానికి పునాదులు వేశాయి. 1990లలో అద్వాని చేసిన రథయాత్ర అగ్నికి ఆజ్యం పోసినట్లు సంఘ శక్తులకు తోడయ్యింది. హెగ్డేవార్, గోల్వాల్కర్, మదన్‌మోహన్ మాలవ్య, వి.డి.సావర్కర్ వంటి వారు హిందుత్వ భావా జాలాన్ని వక్రీకరణల చరిత్రలను, విద్వేష పూరిత మత అసహనాలను పెంచుతూ వచ్చారు. ముస్లింలు, క్రిస్టియన్లు, కమ్యూనిస్టులపై తప్పుడు ప్రచారాలు చేస్తూ వచ్చారు. పురాణాలు, పురాతన సంస్కృతి, ఋషులు, మునుల పేరుతో హిందుత్వను ముందుకు తెస్తూ ఈ దేశ సంస్కృతి ముస్లింల రాకతో ఆ తరువాత ఆంగ్లేయుల వల్లనే విచ్ఛిన్నం అయిందని విష ప్రచారం చేస్తూ దానికి ఆమోదాన్ని తెచ్చే ప్రయత్నాలను తీవ్రంగా చేస్తూ వచ్చారు. సరస్వతీ శిశు మందిర్‌లను అనేక ఇతర విద్యా సంస్థలను, ఆర్ఎస్ఎస్ శాఖలను స్థాపించి వాటి ద్వారా బాల్య దశ నుండే వీటిని నూరిపోస్తూ వచ్చారు. ప్రజల్లో ఉన్నటువంటి భక్తి కొన్ని రకాల మూఢ నమ్మకాలు, బలహీనతలు, విశ్వాసాలను ఆసరాగా చేసుకుని గ్రామాలలో ఎక్కడపడితే అక్కడ దేవాలయాలను కట్టడం అందులో పూజలు, ప్రార్థనలను ప్రోత్సహించడం, స్వాములను, సాధు సంతులను పోషిస్తూ వారి ద్వారా హిందూ మత ప్రచారాన్ని సాగించడం, పరమత ద్వేషాన్ని పరమత సంస్కృతులను కించపరిచేలా భావజాలాన్ని విస్తృతంగా వేళ్లూనుకునేల చేయడం, ఏ చిన్న మత పరమైన ఘర్షణ వచ్చినా దాన్ని పెద్దదిగా చేయడం దాడులకు హత్యలకు దిగుతూ అనేక రకాలుగా విస్తరిస్తూ పోయారు.

కూడు, గూడు, గుడ్డ, విద్యా, వైద్యం, ఉపాధి, ఉద్యోగాలనే మౌలిక అవసరాలకు ఏమాత్రం దోహదం చేయనటువంటి బాబ్రీ మసీదు స్థానంలో రామునికి గుడి కట్టాలనే డిమాండ్‌తో దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రచారం చేస్తూ హిందూ పోలరైజేషన్‌ను చేస్తూపోయారు. రామ జన్మభూమి పేరుతో కరసేవకులను తయారు చేస్తూ ముస్లింలపై విద్వేషాల విషాన్ని కుమ్మరిస్తూ, విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్, హిందూ వాహిని, దుర్గావాహిని, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ తదితర ఎన్నో జ్ఞాత, అజ్ఞాత సంస్థలు సంఘపరివార్‌గా కన్సాలిడేట్ అవుతూ దేశంలో ముస్లిం, క్రిస్టియన్‌లపై ద్వేషపూరిత భావజాలాన్ని రెచ్చగొడుతూ ఈ దేశం హిందువులదేనని ఇది హిందూ దేశమనీ, ఫాసిస్టు విధానాలను

అభివృద్ధి చెందిన దేశాలతో సహా మొత్తం ప్రపంచం అసూయ పడేది. ఆ ఘనత కనుమరుగవుతున్న ప్రక్రియను చూడడం చాలా విచారం కలిగిస్తోంది. ఇదే కొనసాగితే, భారత ప్రజలు గర్వంగా ఏర్పరచుకున్న రాజ్యాంగానికి, భారత గణతంత్రానికి మూలమైన ప్రజాస్వామిక సూత్రాలకు భంగం కలుగుతుంది.

20. మొత్తంగా చూస్తే, 2019 ఎన్నికల ఫలితాలపై తీవ్ర అనుమానాలు నెలకొన్నాయనడంలో సందేహం లేదు. ఈ సందర్భంగా తలెత్తిన ప్రశ్నలు మన ప్రజాస్వామ్య మనుగడకు కీలకమైనవి, కాబట్టి ఇసిఐ వాటికి తప్పనిసరిగా వివరణలు ఇవ్వాలి. ఇవి మళ్లీ జరగకుండా చూడడానికి జరిగాయంటున్న ప్రతి అవకతవకపై ప్రజలకు ఇసిఐ తనంతట తానుగా వివరణ ఇచ్చి, భవిష్యత్తులో ఇవి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి. ఎన్నికల ప్రక్రియలో ప్రజల విశ్వాసాన్ని తిరిగి నెలకొల్పడానికి ఇది తప్పనిసరి.

(అనువాదం: కె. సురేష్) వీ

వ్యాప్తి చేస్తూ ఒకప్పుడు ఇద్దరు పార్లమెంటు సభ్యులున్న బిజెపి క్రమేపి 1999లో వాజ్‌పేయ్ ప్రధానిగా 2014 నుండి నరేంద్రమోదీ ప్రధానిగా అధికారిక పాలనలోకి వచ్చింది. తద్వారా పరోక్షంగా సంఘ్ పరివార్ అధికారం చేపట్టినట్లైంది. అన్ని రకాల ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాల్లో, విద్యాసంస్థల్లో, విధాన నిర్ణయ కేంద్రాలలోకి తన భావజాలాన్ని విస్తృతంగా వ్యాప్తి చేయగలిగింది. అందులో భాగంగానే గుజరాత్‌లో 2002లో జరిగిన ముస్లింల హనన చర్యను, తరువాత నిరాఘాటంగా గుజరాత్‌లో నేటికీ బిజెపి గెలుస్తూ అధికారం చెలాయిస్తుండడాన్ని అర్థం చేసుకోవచ్చు. దీర్ఘకాలిక ప్రణాళికాబద్ధ కృషి ఫలితంగా దేశవ్యాప్తంగా నేడు అనేక రాష్ట్రాలలో బిజెపి అధికారంలో ఉన్నది. ప్రజాస్వామ్యం ముసుగులో నియంతృత్వ ఫాసిస్టు పాలనను సాగిస్తున్నది.

గుజరాత్ మారణకాండలో పాల్గొన్న వారంతా అగ్రవర్ణాల బ్రాహ్మలు కారు, నిమ్నకులాలు, వర్గాల వారేనన్నది తెల్సినదే. హిందూ మతం పేరుమీద వీరందరిని సమీకరించి వారి మెదళ్లను విషపూరితం చేయడంలో ఎంతగానో సఫలీకృతమయ్యారు. కూడు పెట్టని, గూడు నివ్వని, గుడ్డ నివ్వని మతం ఆసరగా ప్రజలను సమీకరించగలగడం ఎంతో ప్రమాదాన్ని సూచిస్తున్నది. దీన్ని ఎదుర్కోవడానికి ప్రజల పక్షం నిలిచే వారు, ప్రగతిశీల శక్తులు ఆలోచించవల్సి ఉన్నది. కార్యాచరణలను రూపొందించుకోవల్సి ఉన్నది.

గుజరాత్‌లో 27 ఫిబ్రవరి 2002 నుండి కొన్ని రోజుల పాటు నిరంతరాయంగా జరిగిన అరాచక మారణకాండ జరగిందనేది జగమెరిగిన సత్యమే. ప్రభుత్వ అండనే లేకుంటే ఇంత పాశవిక చర్యలు జరిగేవి కావు. పోలీసు యంత్రాంగం కాళ్లు, చేతులు చచ్చుబడినట్లుగా చేష్టలుడిగి మౌనసాక్షిగా మిగిలిపోయిందనే కంటే కూడా అగ్నికి ఆజ్యం పోసిందనేది వాస్తవం.

ప్రజల ఆస్తులను, ప్రాణాలను, ప్రజాస్వామిక పౌరహక్కులను కాపాడాల్సిన రాజ్యాంగ ప్రతినిధిగా ఉన్న ముఖ్యమంత్రి నిమ్మకు నీరెత్తినట్లు తగు చర్యలు తీసుకోకుండా మిన్నకుండడం అనేది కుట్ర పూరితంగానే జరిగింది. కావాలనే అధికారాన్ని దుర్వినియోగం చేయబడిందన్నదాన్ని ఐపిఎస్ అధికారి అయిన సంజీవ్ భట్ బయటపెట్టాడు. కంచె చేను మేసినట్లుగా అధికారాలను దుర్వినియోగం చేస్తూ క్రిమినల్ చర్యలను చేపట్టి నడి బజారులో పట్టపగలు ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, చట్టాలు, న్యాయం ధ్వంసం చేయబడడానికి కీలక పాత్రధారిగా ఉన్న ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా వ్యక్తిగత హోదాలో గొంతు విప్పడమంటే సామాన్యమైన విషయం కాదు. సుప్రీంకోర్టుకు, 2002లో అల్లర్లకు సంబంధించి నియమించిన నానావతి కమీషన్‌కు 2011లో నిజాలను చెప్పినందుకు సంజీవ్ భట్‌పై బిజెపి, ఆర్ఎస్ఎస్‌లు కక్ష గట్టాయి. అధికారంలో ఉన్నారు కాబట్టి ఎవరినైనా సరే నిర్బంధించడం, హింసల పాల్జేయడం, తప్పుడు కేసులు మోపడం, జైలు పాల్జేయడం, చడీ చప్పుడు లేకుండా లేదా బహిరంగంగానే హత్యలు, దొమ్మీలు, లూటీలు, అత్యాచారాలు, మూకదాడులు, చేయించడమూ చాలా సులభం. ఇలాంటి వాటిపై కేసులుండవు. న్యాయస్థానాల్లో సాక్ష్యాలుండవు. అధికార యంత్రాంగాన్ని తమ చెప్పు చేతుల్లో పెట్టుకుని నేరస్తులను స్వేచ్ఛగా వదిలేయడం ఒక నేరమయ రాజ్యాన్ని విస్తరించడం జరుగుతున్నది. ఎప్పుడయితే సంజీవ్ భట్ మోదీకి వ్యతిరేకంగా బహిరంగంగా నోరు విప్పడం మొదలు పెట్టాడో ఇక అతనిపై కక్ష సాధింపు చర్యలు నిర్బంధాలు, మానసిక వేధింపులు తీవ్రమవుతూ వచ్చాయి. అనుమతి లేకుండా విధులకు గైర్హాజరు అయ్యాడని, ప్రభుత్వ వాహనాలను దుర్వినియోగం చేశాడనే ఆరోపణలతో 2011లో సంజీవ్ భట్‌ను ఉద్యోగం నుండి సస్పెండ్ చేశారు. ఆ తరువాత 2014లో నరేంద్రమోదీ ప్రధానమంత్రి అయ్యాడు. ఆగస్ట్ 2015లో అతనిపైనున్న నేరారోపణలను గుజరాత్ ప్రభుత్వం వేసిన విచారణ కమిటీ నిర్ధారించిందని చెబుతూ కేంద్ర హోంమంత్రిత్వ శాఖ అతన్ని ఏకంగా ఉద్యోగం నుండి తొలగించింది. అయితే గుజరాత్ ప్రభుత్వం నియమించిన కమిటీ విచారణకు భట్ హాజరవలేదు. దాని కారణంగా అతనిపై చేసిన ఆరోపణలన్ని నిజమేననే నిర్ధారణకు ఆ కమిటీ వచ్చిందన్నమాట. ఒకవేళ భట్ నరేంద్రమోదీకి వ్యతిరేకంగా గొంతువిప్పకపోతే ఇవన్ని లెక్కలోకి వచ్చేవేకాదు. అసలు విచారణ కమిటీనే వేయబడేది కాదు అనేది సత్యదూరం కాదు.

అంతటితో గుజరాత్ రాష్ట్ర బిజెపి ప్రభుత్వం కాని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కాని ఆగలేదు. 1996లో గుజరాత్‌లోని బనస్‌కాంత జిల్లాలో సంజీవ్ భట్ సూపరిండెంట్ ఆఫ్ పోలీస్‌గా ఉన్నప్పుడు డ్రగ్స్‌ను కలిగి ఉన్నాడని ఒక అడ్వకేట్ తప్పుగా కేసులో ఇరికించబడ్డాడనే ఆరోపణ కేసులో సంజీవ్ భట్‌కు బెయిల్ నిరాకరించబడి సెప్టెంబర్ 2018 నుండి పలన్‌పూర్ సబ్ జైలులో ఉంటున్నాడు. జైలులో ఉన్న సమయంలోనే 1990 నాటి కస్టోడియల్ మరణం కేసులో జూన్ 2019లో యావజ్జీవ కారాగార శిక్షకు గురయ్యాడు. బిజెపి సీనియర్ నాయకుడు వాజ్‌పేయ్ ప్రభుత్వంలో హోంశాఖ మంత్రిగా పనిచేసిన లాల్‌కృష్ణ అధ్వాని దేశవ్యాప్తంగా రామ జన్మభూమి కోసం 1990లో రథయాత్ర చేశాడు. ఆ సందర్భంగా అధ్వాని యాత్రను అడ్డుకున్నందుకు బిజెపి, సంఘ్‌పరివార్ శక్తులు ఆందోళనలు చేసాయి. అందులో భాగంగా గుజరాత్‌లో జామ్‌జోద్‌పూర్‌లో అల్లర్లు జరిగాయి. వందకు పైగా అరెస్టులు జరిగాయి. అప్పుడు అక్కడ ఎఎస్‌పిగా సంజీవ్ భట్ పనిచేస్తున్నాడు. అరెస్టైన వారిలో ఒకతను బెయిల్‌పై విడుదల అయ్యాక పది రోజుల్లోనే మృతి చెందాడు. ఆ మృతికి పోలీసులే కారణమని చనిపోయిన వ్యక్తి సోదరుడు కేసువేసాడు. ఇతడు విశ్వహిందూ పరిషత్ కార్యకర్త. అప్పటి నుండి ఈ కేసులో పురోగతి లేదు. దాని విచారణల పై అప్పటి గుజరాత్ హైకోర్టు స్టే విధించింది. ఎప్పుడైతే భట్ మోదీకు వ్యతిరేకంగా మాట్లాడటం మొదలు పెట్టాడో ఇక ఆ కేసు ముందు వరుసలోకి వచ్చింది. 2011లో ఈ కేసుపై ఉన్న స్టే ఎత్తివేయడం జరిగింది. దానిపై విచారణ జరిగి కస్టోడియల్ డెత్‌కు సంజీవ్ భట్ కారణమని సంజీవ్ భట్ తో పాటు మరో పోలీస్ అధికారికి గుజరాత్‌లోని జామ్నానగర్ సెషన్స్‌కోర్టు యావజ్జీవ శిక్ష విధించింది. అలా తమ చేతులకు నెత్తురంటకుండా కోర్టు ద్వారా ఆ పని చేయించగలిగారు. 2001 నుండి 2016 వరకు గుజరాత్‌లో జరిగిన దాదాపుగా రెండొందల కస్టోడియల్ మరణాలపై ఏ పోలీసు అధికారికి శిక్షలు పడలేదు. కేసుల్లో పురోగతి లేదు కాని సంజీవ్ భట్‌కు శిక్ష అమలవుతుంది. తమ నేరాలను బయటపెడితే, ఎదిరిస్తే ఎలా అణచేస్తారో, నిర్బందిస్తారో భవిష్యత్‌లో కూడా ఎవరైనా

అలా చేయడానికి సాహసించకుండా ఉండడానకికి హెచ్చరికలను దీని ద్వారా పంపించదలిచారన్నమాట. భారతదేశంలో మునుపెన్నడు జరగనటువంటి కరమైన మారణకాండకు కారకుడైన శక్తిమంతున్ని ఎదుర్కోవడం వల్ల సంజీవ్ భట్ వంటి వారు కష్టాలనెదుర్కొంటున్నాడు. నేడు దేశాన్ని పాలిస్తున్న మిత్రద్వయం విద్వేష పూరిత కుట్రలను, అమానుషాలను ఆకృత్యాలను, అధికార దుర్వినియోగాన్ని, నేరపూరిత చర్యలను, బయట పెట్టినందుకు వారి బెదిరింపులకు లొంగనందుకు ఒక ప్రభుత్వ ఐపిఎస్ అధికారి ఎన్నో రకాల హింసలకు గురై చివరకు జైలు పాలు అయ్యాడు.

దేశంలో ఎందరో సామాన్య ప్రజలు, ఆదివాసులు, దళితులు సామాజిక ఉద్యమకారులు ఎన్నెన్నో అక్రమ కేసుల్లో జైళ్లలో మగ్గిపో తున్నారు. భీమా కోరేగావ్ అనే అబద్ధపు కేసును పుట్టించి దేశవ్యాప్తంగా ప్రజలకోసం పాటు పడుతున్న బుద్ధిజీవులను జైళ్లలో బంధించి బెయిల్ సహితం ఇవ్వ నిరాకరిస్తున్నారు. ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ సాయిబాబాను అబద్ధపు కేసులో ఇరికించి ఉపా చట్టం కింద శిక్షలు వేసారు. ఇవన్నీ చూస్తుంటే రాజ్య యంత్రంగాలైన న్యాయవ్యవస్థ, పోలీసు వ్యవస్థ తదితర ప్రభుత్వ సంస్థలన్నీ కూడా పాలకుల అనుంగు వర్గీయులకు కొమ్ము కాసేవిగానే ఉంటూ నిజమైన అర్థంలో రాజ్యాంగ విలువలకు స్ఫూర్తికి కట్టుబడి పనిచేయడం లేదని అనిపించకమానదు. ఇదే సంజీవ్ భట్ గనుక 2002లో మోడీ ఇచ్చిన సూచనలను పాటించి ఉంటే సిఐటి అధికారికి ఇచ్చినట్లుగానే ఉన్నత పదవులు లభించి ఉండేవి. అతనిపై మోపబడిన అన్నిరకాల అభియోగాలు గాలిలో ఎగిరిపోయేవి. లాకప్‌డెత్ కేసు అస్సలు బయటకి రాకపోయేది ఒకవేళ వచ్చినా పూర్తిగానే కొట్టేయబడేది.

అత్యున్నత పదవిలో ఉన్న వ్యక్తి గతంలో చేసిన ఘోరనేరమైన మానవ హనాన్ని ఒక పోలీసు ఉన్నతాధికారిగా ధృవీకరించడం అనేది మింగుడు పడని విషయంగా మారడం వల్లనే భట్ కక్ష సాధింపులకు బలయ్యాడని ఎవరైనా సులభంగానే తెలుసుకోవచ్చు. మాజీ పార్లమెంట్ సభ్యుడు ఇషాన్ జాఫ్రీని 2002లో గుజరాత్‌లోని మానవ హననంలో భాగంగా చంపేశారు. ముఖ్యమంత్రిగా ప్రజల ఆస్తులను, ప్రాణాలను, హక్కులను కాపాడాల్సిన రాజ్యాంగ కర్తవ్యాన్ని విస్మరించి దానికి వ్యతిరేకంగా ప్రవర్తించినందుకు అధికారాన్ని దుర్వినియోగం చేసినందుకు గాను నరేంద్రమోడీని మొదటి నేరస్థుడని ప్రకటించి శిక్షించాలని హత్యకు గురైన ఇషాన్ జాఫ్రీ భార్య జకియా జాఫ్రీ ప్రకటించింది. సొహ్రాబుద్దీన్ హత్యకు సంబంధించిన కేసులో నేరస్తులకు వ్యతిరేకంగా తీర్పునిచ్చే పరిస్థితిలో న్యాయమూర్తి లోయ అనుమానాస్పద స్థితిలో చనిపోయాడు అమిత్‌షాకు వ్యతిరేకంగా తీర్పునిచ్చే పరిస్థితి ఉన్నందునే లోయ మరణం సంభవించిందని అప్పట్లో వార్తలు వచ్చాయి. ఇది సహజ మరణం కాదని, అతని శరీరంపై రక్తపు మరకలున్నాయని ఇది హత్యేనని కుటుంబ సభ్యులు చెప్పారు. ఇటువంటి సందర్భంలో నరేంద్రమోడీని దోషిగా నిరూపించే ప్రయత్నం చేసినందుకు భట్ ప్రాణాలతో మిగిలి ఉండడమంటే ఆశ్చర్యపోవాలి కాని జైలుశిక్షకు గురయ్యాడంటే ఆశ్చర్య పోవల్సిందేమున్నది. లోయా మృతి తరువాత ఆయన స్థానంలో ఉండి తీర్పునిచ్చిన న్యాయమూర్తి సొహ్రాబుద్దీన్ కేసు విషయంలో అమిత్‌షాకు క్లీన్ చిట్ ఇచ్చారు. అలాగే సంజీవ్ భట్ 2002లో గుజరాత్‌లో ముస్లింలపై జరిగిన ఘోరమైన హనన చర్యకు మోదీ ఇచ్చిన సూచనలను పాటించకుండా బయట పెట్టినందుకు, ఆ చర్యను వ్యతిరేకించినందుకు భట్‌కు శిక్ష అమలవుతున్నది. దానిపై స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీంను వేస్తే అది మోదీకి క్లీన్ చిట్ ఇచ్చింది. ఈ నివేదిక ఆధారంగా కోర్టు మోదీని నిర్దోషిగా ప్రకటించింది. అటు లోయా చనిపోయాడు ఇటు అమిత్‌షా నిర్దోషిగా ప్రకటించబడ్డాడు. అలాగే భట్ ఉద్యోగం నుండి డిస్మిస్ అయ్యాడు, జైలు శిక్ష అనుభవిస్తున్నాడు. నరేంద్రమోదీ నిర్దోషిగా ప్రకటించబడ్డాడు.

2002లో గుల్బర్గ్ సొసైటీలో జరిగిన ఇషాన్ జాఫ్రీ హత్యకు వ్యతిరేకంగా అతని భార్య జకియా జాఫ్రీ న్యాయ పోరాటం చేస్తున్నది. ఆమెకు అండగా మరితర దారుణాలకు వ్యతిరేకంగా నేరస్థులకు శిక్షలు పడేలా న్యాయస్థానాల్లో తీవ్రమైన పోరాటం చేస్తున్న తీస్తా సెతల్వాద్‌ను అటు గుజరాత్ ప్రభుత్వం ఇటు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తీవ్రంగా వేధించింది. ఈ న్యాయ పోరాటాల ఫలితంగా నరోదా పాటియాలో 2002లో జరిగిన దాదాపు వందమంది హత్యకు సంబంధించిన హత్య కేసులో మాజీ మంత్రి మాయాకొద్నానితో పాటు మరితర 34 మందికి శిక్షలు పడ్డాయి. ఈ సందర్భంలో సంజీవ్ భట్ నరేంద్రమోదీకి బహిరంగ ఉత్తరం రాశాడు. తీర్పు వచ్చినరోజు మాయా కొద్నానికి దూరంగా, మౌనంగా ఎందుకు ఉండవల్సి వచ్చిందో తెలపాలని, మీ విధానాల్లో పావులుగా నిందితులు శిక్షలకు గురవుతున్నప్పుడు ఒక్కసారైనా వారి గురించి ఆలోచించారా? వీటికి నిజాయితీగా సత్యాలతో కూడిన జవాబులు చెప్పడానికి మీకు సమయం, విజ్ఞత, అవకాశం లభించాలని దేవున్ని ప్రార్థిస్తున్నానని ఆ లేఖలో వివరించాడు. ఇది మోదీకి అసహనాన్ని, చికాకును, కోపాన్ని కక్షను పెంచకుండా ఉంటుందా. భట్‌కు శిక్షలు త్వరగా పడేలా చేయకుండా ఉంటుందా.

2014లో మోదీకి మాజీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఆర్.బి. శ్రీకుమార్ ఉత్తరం రాశాడు. అందులో నిజాయితీగా విధులను నిర్వహించిన పోలీసు అధికారులను, మీరు చేసిన చర్యల పట్ల వ్యతిరేకంగా ఉన్న వారిని వేధించడం మానుకోవాలని కోరాడు. 2002లో గుజరాత్‌లో జరిగిన మానవహననం, అరాచకదాడులు, లూటీలు చేసిన అరాచక మూకలను, శక్తులను వారి వెనుక ఉన్న కుట్రదారులను నిరోధించకుండా, వారందరికి కావాలనే సహకరించి ఇండియన్ పీనల్ కోడ్ 186, 188 సెక్షన్‌ల కింద నేరాలు చేసిన అధికారులను శిక్షించాలని కోరాడు. జనరల్ పోలీస్ మాన్యువల్ III లోని నాలుగైదు అధ్యాయాల్లో చెప్పబడిన వృత్తి ధర్మాలను ఉల్లంఘించిన పోలీసు అధికారులకు వ్యతిరేకంగా చర్యలు తీసుకోవాలని కోరాడు. నిజానికి ప్రజలకోసం పనిచేసే ఏ ప్రజాస్వామిక ప్రభుత్వమైన చేయవల్సింది ఇదే. అలా చేస్తారని బిజెపి ప్రభుత్వాల నుండి ఆశించడం అమాయకత్వమే అవుతుంది.

జకియా జాఫ్రీ డిమాండ్ చేసినట్లుగా రాజ్యాంగ విధులను విస్మరించి వాటికి వ్యతిరేకంగా అధికారాన్ని దుర్వినియోగం చేసిన కర్తవ్యానికి శిక్షలెప్పుడు పడతాయో ఎదురు చూడవల్సిందే. అందుకోసం ఒక పోలీస్ అధికారిగా అలాగే వ్యక్తిగత స్థాయిలో తనవంతుగా ధైర్యంగా నిలబడిన సంజీవ్ భట్‌ను, ఆయన సహచరి శ్వేతభట్, వారి పిల్లలను అభినందించకుండా ఉండలేము.

(రచయిత ఉపాధ్యాయులు) వీ

జమిలి ఎన్నికలు హిందుత్వ ఎజెండా

దేశంలో సనాతన సమాజ పునరుద్ధరణ కోసం ఒకే దేశం, ఒకే మతం, ఒకే సంస్కృతి పేరుతో సమాఖ్య స్ఫూర్తిని ధ్వంసం చేసి, రాజ్యాంగాన్ని రద్దుపరిచి హిందూ రాజ్యస్థాపనే లక్ష్యంగా వచ్చిందే ఈ జమిలి ఎన్నికల ఎజెండా అంటున్నారు **బైరెడ్డి సతీష్**

అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీలను ప్రాధాన్యతీకరించుకుని అమలు దిశగా కార్యచరణకు పాలకులు పూనుకుంటారని, పూనుకోవాలని ప్రజలు ఆశిస్తారు. సాధారణంగా అటువంటి ప్రయత్నాలు జరిగినట్టు చరిత్రలో అనేక దాఖలాలు ఉన్నాయి. అవి నిజంగా ప్రజలకు ప్రయోజనకరంగా ఉన్నాయా? లేదా అనేది వేరే విషయం. దీనికి భిన్నంగా రెండవసారి అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశవ్యాప్తంగా చేపట్టాల్సిన తక్షణ, ప్రయోజనకరమైన పనులేవీ లేవన్నట్టు ఒకే దేశం, ఒకే ఎన్నికలు అనే ఎజెండాను బలంగా ముందుకు తీసుకెళ్లే క్రమంలో భాగంగా ఏకంగా అఖిలపక్ష సమావేశం ఏర్పాటుచేయడంతో దేశవ్యాప్తంగా చర్చ కొనసాగుతున్నది.

ఈ నినాదం ఇవ్వడం వెనుక ఆర్ఎస్ఎస్, బిజెపికి ఉన్న దీర్ఘకాలిక లక్ష్యం, భారీ మెజారిటీతో రెండవసారి అధికారాన్ని కైవసం చేసుకున్న సందర్భాన్ని దృష్టిలో పెట్టుకుని విశ్లేషించుకుంటే తప్ప ప్రయోజనాలు, ప్రమాదాలు ఏమిటి అనేది బోధపడవు. ప్రధానమంత్రి పదేపదే ఈ అంశాన్ని గతంలో లేవనెత్తడం, దానికి సమర్ధనగా 'సహేతుకం' అనిపించే ప్రయోజనాలు ముందుంచడం చూసే ముగింపునకు వస్తే అసలు ఎజెండా ఏమిటో అర్థం కాదు! సహజంగానే ఏ నూతన ప్రతిపాదనకైనా ఏదో ఒక సానుకూల అంశం, ఏదో ఒక కోణం నుంచి సమర్థించదగిన ప్రతిపాదనగానే కనిపిస్తుంది. వాటిని సమర్థించే రాజకీయ పార్టీలకైతే దేశంలో నెలకొని ఉన్న రాజకీయ వాతావరణం దృష్ట్యా వారి వారి ప్రయోజనాలకు అనుగుణంగా, ఒక్కోసారి ఆయా పార్టీల నాయకత్వ ప్రయోజనాలకు అనుగుణంగా ఏ ప్రతిపాదనైనా గుడ్డిగా వెనుకేసుకురావడం మామూలుగా జరుగుతున్నదే.

సైద్ధాంతిక రాజకీయాలు లుప్తమైన కాలంలో, ఏ విలువలకు కట్టుబడని, ప్రయోజనాలే పరమావధి అనుకునే 'వాస్తవ దృష్టి' రాజకీయాలలో 'బలమైన' వాళ్ల ప్రతిపాదనలు బలపర్చాల్సినవిగానే కనిపిస్తాయి. సరిగ్గా ఒకే దేశం–ఒకే ఎన్నికలు అంశంలో దేశవ్యాప్తంగా అదే పరిస్థితి కనిపిస్తున్నది. మొదటి దఫా అధికారపు చివరి అంకంలో ఈ ప్రతిపాదనను మోడీ ముందుకు తెచ్చాడు. పదేపదే ఎన్నికలు రావడం, రాష్ట్రాలకు, కేంద్రానికి, స్థానిక సంస్థలకు అనేక సందర్భాల్లో, సమయాల్లో నిర్వహించడం దేశ ఆర్థిక వ్యవస్థ మీద తీవ్రమైన భారం వేస్తున్నది. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన ప్రతి సందర్భంలో అమల్లోకి వచ్చే ఎన్నికల నిబంధనావళి వల్ల అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతున్నది, కొత్త నిర్ణయాలు, విధానాలను ప్రకటించడానికి నిబంధనావళి ప్రతిబంధకంగా మారుతున్నది. సుపరిపాలనను అందించే వ్యవస్థకు ఆటంకంగా మారి అనేక అత్యవసర అంశాలు వెనకపట్టు పడుతున్నాయి. ఉద్యోగవర్గం అంతా నెలల తరబడి ఎన్నికల విధుల్లో నిమగ్నమవడం వల్ల క్షేత్రస్థాయిలో అభివృద్ధి కుంటుపడుతున్నది. దేశరక్షణకు ఉపయోగించాల్సిన భద్రతా సిబ్బందిని ఎన్నికలకు తరలించడం వల్ల దేశభద్రత ప్రమాదంలో పడుతున్నది. అక్రమంగా సంపాదించిన, లెక్క చెప్పని సంపదనంతా ఎన్నికల్లో విచ్చలవిడిగా ఖర్చుపెట్టి ప్రజలను ప్రభావితం చేస్తున్నారు. కుల, మత, ప్రాంతాల మధ్య ఘర్షణలకు తరచూ జరిగే ఎన్నికలు కారణమవుతున్నాయి. పైన పేర్కొన్న కారణాలను పదేపదే పఠిస్తూ ఒకే దేశం–ఒకే ఎన్నికలు లేదా జమిలి ఎన్నికలు నిర్వహించడం ద్వారా ప్రజాధనం వృథాను అరికట్టవచ్చునని ప్రధాని ప్రచారం చేస్తున్నారు.

నిజానికి ప్రధాని మోడీ తన ప్రతిపాదనకు అనుగుణంగా ముందు పెడుతున్న కారణాలు కొట్టిపడేయాల్సినవి, వెంటనే వ్యతిరేకించాల్సినవి కావు. సమర్థనకు అర్హమైన అంశాలుగానే ఉన్నాయి. దేశవ్యాప్తంగా రాజకీయ పార్టీలు ప్రాంతాల వారిగా, బిజెపితో వాటికి ఉన్న సంబంధాల ఆధారంగా, సమర్థన ద్వారా ఆయా రాజకీయ పార్టీలు, నాయకత్వం పొందే ప్రయోజనాల ప్రాతిపదికన ప్రతిస్పందనలు వెలువడుతున్నాయి. ఉదాహరణగా తీసుకుంటే తెలుగుదేశం పార్టీ బిజెపితో చెడిన తన సంబంధాల ఆధారంగా వెంటనే వ్యతిరేకిస్తూ దానికి ఏవో సమర్థనలను ఇస్తూ వచ్చింది. తమిళనాడులో ప్రధాన ప్రతిపక్షమైన డిఎంకె అధికారంలో ఉన్న ఎఐఎడిఎంకెతో బిజెపితో పొత్తును కొనసాగిస్తున్నది కాబట్టి వ్యతిరేకించింది. తమిళనాడులో నెలకొనే ప్రత్యేక పరిస్థితుల వల్ల ప్రాంతీయ పార్టీల ప్రభావం వల్ల అధికార పక్ష ఎఐఎడిఎంకె కూడా మోడీ ప్రతిపాదనను వ్యతిరేకించాల్సిన అనివార్య పరిస్థితికి నెట్టివేయబడింది. ఉత్తరప్రదేశ్‌లో బలంగా ఉన్న ఎస్‌పి బిజెపి ప్రతిపాదనను బలపరిచింది. వైఎస్ఆర్ కాంగ్రెస్ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపితో టిడిపి అనుభవాల దృష్ట్యా, మొన్న ఒకేసారి అసెంబ్లీ, లోక్‌సభకు ఎన్నికలు జరగడం వల్లనూ ఈ ప్రతిపాదనను సమర్థించింది.

అన్ని పార్టీల కంటే ఆచరణలో ఒకటి పాటించి, అభిప్రాయంలో దానికి విరుద్ధంగా వ్యవహరించింది టిఆర్ఎస్. ప్రతిపాదన వచ్చింది మొదలు హైద్రాబాద్, ఢిల్లీలలో ఏక కంఠంతో ఒకే ఎన్నిక ఉండాల్సిందేనంటూ ఘంటాపథంగా చెబుతూ వస్తున్నది. తన వైఖరిని తానే అపహాస్యం చేసుకుంటూ తెలంగాణలో ఆరు నెలల ముందే ముందస్తుకు వెళ్లింది. లోక్‌సభ ఎన్నికల్లో ఘోరమైన ఓటమిని చవిచూసిన కాంగ్రెస్, వామపక్షాలు, ఇతర ప్రాంతీయ పార్టీలు ఇవిఎంల వల్లనే తాము ఓటమి చెందామని, బ్యాక్ టు బ్యాలెట్ నినాదంలో నిండుగా మునిగి ఉన్నాయి కాబట్టి ఈ ప్రతిపాదనను అంత సీరియస్‌గా తీసుకోవడం లేదు. ఈలోగా మోడీ పట్టుదలతో రూపం పోసుకున్న 'నీతి ఆయోగ్' జమిలి ఎన్నికలకు సంబంధించిన సమర్థన ముసాయిదాతో ముందుకొచ్చింది. లా కమిషన్ కూడా ఈ ప్రతిపాదనను పూర్తిగా ఆచరించదగినదని మరో అడుగు ముందుకేసి రాజకీయ పార్టీలతో ఏకాభిప్రాయం సాధించే ప్రక్రియను వేగవంతం చేస్తూ కనీసం 5 నుంచి 8 రాజ్యాంగ సవరణలు అవసరమవుతాయని స్పష్టంగా పేర్కొన్నది.

అధికార పార్టీల మధ్య ఉండే ప్రయోజనాల వైరుధ్యం వల్ల ఆయా

వైఖరులను ప్రదర్శిస్తున్నాయి. ఇది కష్టతరమైన ప్రక్రియ అని, ఆచరణసాధ్యం కాని ప్రతిపాదన అని, అనేక క్లిష్టమైన సాంకేతిక, భౌతిక పరిస్థితులు దీనిలో ఇమిడి ఉన్నాయని అందుకే ఈ ప్రతిపాదన విరమించుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. విస్తృతాంశాలు తడమకుండానే, రాజకీయంగా ప్రయోజనకరంగా ఉండే వైఖరిని ప్రదర్శిస్తున్నాయి. ఈ ప్రతిపాదన సమాఖ్య స్ఫూర్తికి గొడ్డలిపెట్టుగా మారుతుందని, రాజ్యాంగ విలువలను ఉల్లంఘిస్తున్నదని తరచూ జరిగే ఎన్నికల ప్రక్రియ వల్ల ఎదురయ్యే ఇతరేతర ఇబ్బందులను అధిగమించడానికి అప్రజాస్వామిక పరిష్కారాలను అవలంబించడం ప్రమాదకరమని, కాస్తోకూస్తో సూత్రప్రాయ వైఖరిని తీసుకున్న పార్టీలు, సంస్థలు లేకపోలేదు. ఏక కేంద్ర వ్యవస్థ వేళ్లూనుకుంటుందని, ప్రాంతీయ ఆకాంక్షల పట్ల నిర్లక్ష్య ధోరణి పెరుగుతుందని ప్రాంతీయ ప్రాతినిధ్యాలకు విలువ లేకుండా చేసి ప్రభావశీల పాత్రను నిర్వీర్యపరచి కేంద్రీకృత పాలనకు దారితీస్తుందనే అర్థవంతమైన, భవిష్యత్ దృష్టితో కూడిన అభిప్రాయాలు అనేకం బయటకు వస్తున్నాయి.

తరుచుగా, వేర్వేరుగా జరిగే అనేక ఎన్నికల ద్వారా ఆర్థిక వ్యవస్థపై భరించలేని భారం పడుతుందన్న వాదన అర్థరహితమైనది. ఇప్పటివరకు జరిగిన అనేక సాధారణ ఎన్నికల ఐదు సంవత్సరాల సరాసరి వ్యయం అంతాకూడా ఎనిమిది వేల కోట్లు మాత్రమే. సంవత్సరానికి కేవలం 1600 కోట్లు మాత్రమే ఖర్చవుతున్నది. అంటే ఐదేళ్ల సగటున దేశంలో ఓటరుగా నమోదైన ప్రతి పౌరునిపై 27 రూపాయల భారం పడుతున్నది. జమిలి ఎన్నికలు జరిగినా వ్యయం 4,500 కోట్ల రూపాయలు ఉంటుంది. అంటే దేశ ఆర్థిక వ్యవస్థకు ఒకే ఎన్నిక ద్వారా ఖర్చును కట్టడి చేయవచ్చన్న వాదనలోని డొల్లతనం బయటపడుతుంది. ఆ మాటకు వస్తే తరుచూ జరిగే అనేక రకాల ఎన్నికల వల్ల డబ్బు చెలామణిలోకి రావడం, అనేక రూపాల్లో తాత్కాలిక ఉపాధి లభ్యమవడం వల్ల ప్రజల చేతుల్లోకి ఎంతోకొంత వనరులు వచ్చే అవకాశమూ ఉంది! అనేక దశలుగా జరిగే ఎన్నికల ఖర్చు, భద్రతా సిబ్బంది, ఎన్నికల విధుల్లో ఉద్యోగ వ్యవస్థను ఆసాంతం ఉపయోగించుకోవాల్సిన అవసరం లేకుండా అదేదో ఒకటి, రెండో దశల్లోనో జరుపుకునే వీలుంటుంది కదా! మూడు నెలల ప్రక్రియగా దీనిని సాగదీయడం వల్ల ఈ నష్టాలు ఉంటాయన్న విషయాన్ని ఎందుకు పరిగణనలోకి తీసుకోవడం లేదో.

అసలు ప్రజాధనమంతా ఎన్నికల వల్లే దుబారా అవుతున్నట్టు, పాలకవర్గాల ఇష్టానుసారం విచ్చలవిడిగా ఖర్చుపెట్టే వికృత చర్యల వల్ల ఏమీ జరగనట్టు మాట్లాడడమే మరింత విడ్డూరంగా ఉంది. గడిచిన ఎన్నికల్లో ఒక్క బిజెపి చేసిన ఖర్చులో దేశంలోని మొత్తం పార్టీలు పెట్టిన ఖర్చు సగం కంటే తక్కువే అంటే ఏ స్థాయిలో డబ్బు ప్రవాహాన్ని కొనసాగించి ఎంత ప్రభావాన్ని చూపెట్టిందో అర్థం చేసుకోవచ్చు. బాండ్‌ల రూపంలో కూడా రాజకీయ పార్టీలకు విరాళాలు ప్రధానంగా కార్పొరేట్ దాతల నుండి బిజెపి సేకరించిన సొమ్ములో సైతం అన్ని పార్టీల వాటా సగానికి తక్కువగానే ఉందంటే దాని ఆర్థిక బలమేమిటో తెలిసిపోతున్నది. సహజంగానే బలమైన రాజకీయపార్టీకి అధికారమున్న పార్టీకి రాజ్యాంగబద్ధ స్వతంత్ర ప్రతిపత్తి ఉన్నప్పటికీ నిష్పక్షపాతంగా వ్యవహరించ కుండా బిజెపి వైపు ఎన్నికల కమిషన్ మొగ్గుచూపిన వైనం ఎన్నికల షెడ్యూల్ ప్రకటన మొదలు ఫలితాల వెల్లడి వరకు కనిపించింది. జమిలి ఎన్నికలు అన్నవాళ్లు కశ్మీర్ అసెంబ్లీకి కూడా ఏకకాలంలో మొన్న ఎన్నికలు జరగాల్సి ఉన్నా ఎందుకు నిర్వహించలేదో బిజెపి అందుకు ఎందుకు ఒత్తిడి చేయలేదో, కశ్మీర్‌లో బిజెపి చేస్తున్న ప్రమాదకర ప్రయోగాలు అంటే హిందూ జనాభా ఉన్న ప్రాంతాల్లో నియోజకవర్గాల సంఖ్య పెంచాలన్న ప్రతిపాదనను చూస్తే ఏ ఎజెండాతో బిజెపి ఉన్నదో అర్థమవు తున్నది. ఒకే లోక్‌సభ నియోజకవర్గానికి మూడు దఫాలుగా ఎన్నికలు నిర్వహించిన కమిషన్‌కు దేశమంతా ఒకేసారి ఎన్నికలను నిర్వహించే సత్తా ఉందని ఎలా అనుకోవాలి? జమిలి ఎన్నికలు రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకమే కాకుండా అప్రజాస్వామికమైన ఆలోచన కూడా. ఒకే దేశం–ఒకే ఎన్నిక కావాలంటే కనీసం ఐదు నుంచి ఎనిమిది రాజ్యాంగ సవరణలు చేయాల్సిందే అని స్వయంగా లా కమిషనే అభిప్రాయపడింది.

పార్లమెంటు ఉభయ సభల కాల పరిమితికి సంబంధించిన 83వ ఆర్టికల్, లోక్‌సభ రద్దుకు సంబంధించిన 85వ ఆర్టికల్, రాష్ట్ర శాసన సభల కాల పరిమితిని నిర్దేశించే 172వ అధికరణం, వాటి రద్దుకు చెందిన 174వ ఆర్టికల్, రాష్ట్ర ప్రభుత్వాలను రద్దు పరిచే రాష్ట్రపతి పాలనను విధించే 356వ అధికరణంతోపాటు 1951 ప్రజాప్రాతినిధ్య చట్టాన్ని సమూలంగా మార్చివేయాల్సి రావడమే కాకుండా ఎన్నికల సంఘం నిర్మాణాన్ని కూడా మార్చాల్సి ఉంటుంది. ఒకవేళ 356వ అధికరణాన్ని అలాగే కొనసాగించినట్టయితే రాష్ట్ర ప్రభుత్వాలను బెదిరించడం ద్వారా కేంద్రానికి వాటి రాజ్యాంగ ప్రతిపత్తిని హరించే అవకాశమున్నది. ఇవాళ వివిధ రాష్ట్రాల ప్రభుత్వాలు వాటి ఐదు సంవత్సరాల కాల వ్యవధిలో ఒక్కో కాలంలో ఉన్నాయి. వాటన్నంటినీ ఒకేసారి జమిలి ఎన్నికల కోసం రద్దుపరుస్తారా? రాజ్యాంగ స్ఫూర్తికి నిబంధనలకు వ్యతిరేకంగా కొన్నింటి కాలాన్ని పొడిగించడమో, కుదించడమో చేయడం కూడా సాధ్యం కాదు. కేంద్ర, రాష్ట్ర, స్థానిక ఎన్నికల్లో ఆయా పరిస్థితులే ప్రధానంగా ప్రజలను ప్రభావితం చేస్తాయి. ఒకేసారి ఎన్నికల నిర్వహణ అంటే కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి అనుకూలంగా మారి అనేక అంశాలు కలగాపులగమయ్యి ప్రజలు గందరగోళంలో పడి స్పష్టమైన అభిప్రాయాన్ని ఏర్పరుచుకునే హక్కును కోల్పోతారు. కేంద్రంలో బలమైన ప్రభుత్వమే రాజ్యమేలి రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాలు బలహీనమవుతాయి. ప్రజలు మరింత బలహీనపడి ప్రభుత్వ అణచివేతను ఎదుర్కొనే ప్రమాదమూ ఉన్నది.

బలమైన, స్థిరమైన ప్రభుత్వాల కంటే బలమైన ప్రజాఐక్యతే, సుస్థిరమైన సామరస్య సంబంధాలే సమాజ పురోగతిని వేగవంతం చేస్తాయి. ఇవాళ బిజెపి దేశమంతా విస్తరించి అధికార బలం, అంగబలం, అర్థ బలంతో పటిష్టంగా ఉండడం ఈ ప్రతిపాదనను మరింత ముందుకు నెట్టేందుకు ఉపకరిస్తున్నది. నిజానికి చరిత్రలో 1950 నుండి 1967 వరకు దేశమంతటా ఒకేసారి ఎన్నికలు జరిగినవే. రాష్ట్ర ప్రభుత్వాలను ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాల కోసం అస్థిర పరచడంతో ఆ పరంపర ఆగిపోయింది. ఇవాళ బిజెపి తనకు తాను దేశమంతటా పాలించడం కోసం సమాఖ్య స్ఫూర్తిని ధ్వంసం చేసి జమిలి ఎన్నికల పేరిట రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడేలా వ్యవహరిస్తున్నది. లోక్‌సభకు, రాష్ట్రాల శాసన సభలకు ఏక కాలంలో ఎన్నికలు జరిగి నప్పుడల్లా 77 శాతం కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీలకే ఫలితాలు అనుకూలంగా ఉన్నాయి. దీనిని అనుకూలంగా మలుచుకుని పార్లమెంటరీ తరహా ప్రభుత్వం నుండి అధ్యక్ష తరహాలోకి మార్చే హిడెన్ ఎజెండా ఉన్నదా?

పార్లమెంటరీ తరహానా, అధ్యక్ష తరహానా అసలు ఎన్నికల ప్రజాస్వామ్యంలో ప్రజలకు ఏం ఒరుగుతున్నది అనే అవగాహన, అభిప్రాయం అటుంచితే బిజెపి దాని సైద్ధాంతిక మాతృక అయిన సంఘపరివార్ ప్రవచిస్తున్న అఖండ భారత్ నిర్మాణం, గతకాలపు 'వైభవోజ్వల' హిందూ సామ్రాజ్య ఏర్పాటు లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకుంటే తప్పా ఒకే ఎన్నిక విధానం అర్థం కాదు. భారత ఉపఖండమంతా ఒక

రాజ్యం, మతం - మూక హత్యలు

***దళిత ముస్లిం మైనారిటీలపై గో రక్షణ పేరుతో జరుగుతున్న మూక దాడులు, హత్యలను మతం, రాజ్యం కలిసి చేస్తున్నాయని, హిందూ రాజ్య స్థాపన లక్ష్యంగా ఈ దాడులు కొనసాగుతున్నాయని అంటున్నారు* కె. మహేష్**

ఒక మూక అనుసరించే విధానాలు, తీసుకునే నిర్ణయాల తార్కికతను, హేతుబద్ధతను ఆ గుంపులోని వ్యక్తి స్వతహాగా పరిశీలించే గుణాన్ని కోల్పోతాడని ఫ్రెంచ్ శాస్త్రజ్ఞుడు గుస్తావ్ లీ బాన్ అన్నాడు. అంతేకాదు, మూకను ప్రభావితం చేయడానికి అవాస్తవ, నిర్హేతుక విషయాలైనప్పటికీ వాటితో వారందరికీ సమ్మతంగా కనిపించే ఒక వ్యాఖ్యానాన్ని రూపొందిస్తే చాలు అని చెప్పాడు. అలాంటి వ్యాఖ్యానాల మధ్యే అనేక వైరుధ్యాలు ఉన్నప్పటికీ ఆ మూక వాటన్నింటినీ బలంగా నమ్ముతుందని వివరించాడు. ఆ మూక భావిస్తున్న లక్ష్యం నెరవేరడానికి ఎంతకైనా తెగిస్తుందని, వాటి పరిణామాలను లెక్కచేయదని కూడా చెప్పాడు. ఒక వ్యక్తి ఒంటరిగా తలపెట్టలేని దుస్సాహసాన్ని మూకలో భాగంగా సులువుగా చేస్తాడు. మూక స్వభావాలను గురించి చదివే క్రమంలో నాకు తెలిసిన విషయాలివి.

ఉత్తర, మధ్య భారతంలో విపరీతంగా దాడులకు తెగబడుతున్న మూకల స్వభావానికి బాన్ చేసిన విశ్లేషణకు పొంతన ఉన్నట్టు అనిపిస్తున్నది. ఈ మూకదాడుల్లో బాధితులు ఎక్కువగా ముస్లింలు, లేదా దళితులు ఉన్నారు. అందులోనూ హిందువులు పవిత్రంగా భావించే గోవుల వధ, గోమాంసం తరలిస్తున్నారన్న ఆరోపణలతో జరిగిన మూకదాడులు అధికం. 'గో మాంసం' నుంచి మొదలైన ఇలాంటి దాడులు నేడు జైశ్రీరాం, జై హనుమాన్ అని నినదించాలని ముస్లింలను బెదిరించడాలు, హత్య చేసే దాకా వచ్చాయి. ఈ ఘటనలను పరిశీలిస్తే.. హిందూత్వ శక్తులు ముస్లింలపై జరుపుతున్న దాడులని సులువుగానే అర్థం చేసుకోవచ్చు. ముస్లింలపై హిందువులను రెచ్చగొట్టేలా ఉన్న ఒక వ్యాఖ్యానాన్ని మనం పరిశీలిద్దాం. అన్ని మతాలకు ఒక పుణ్య స్థలమున్నట్టే హిందువులకు అలాంటి స్థలం లేకుండా పోయిందనే భావనను కాషాయ శక్తులు ప్రచారం చేస్తున్నాయి. ఆ పుణ్య స్థలం అయోధ్యలోని బాబ్రీ మసీదు స్థలమేనని, రాముడి గుడి కూల్చివేత తర్వాతే అక్కడ మసీదు వెలిసిందనే వాదనలు భిన్న వర్గాల మధ్య చిచ్చుకు ఆజ్యం పోసేవే. ఇందులో వాస్తవ అవాస్తవాలెలా ఉన్నా.. కొన్ని మూకల ఎదుగుదలకు ఈ వ్యాఖ్యానం ఉపయోగపడింది. ఒక మనిషిపై నిజం ఎంత ప్రభావం వేస్తుందో.. అబద్ధమూ అంతే ప్రభావం వేస్తుందని ఒక అధ్యయనకారుడు చెప్పిన విషయాన్ని గుర్తుచేసుకోవడం ఇక్కడ సందర్భోచితం. అద్వాని రథయాత్ర తర్వాత చెలరేగిన అల్లర్లు, బాబ్రీ మసీదు విధ్వంసాన్ని మనం ఈ నేపథ్యంలో అర్థం చేసుకోవచ్చు. ఎందుకంటే సాధారణంగా సమూహానికి ఒక వ్యాఖ్యానం చాలు కానీ, అందులో వాస్తవ అవాస్తవాలేమిటన్న పట్టింపు పెద్దగా ఉండదని చెబుతాడు గుస్తావ్. ఇలా కాశ్మీర్ అంశం, గోమాసం లాంటి విషయాలతో హిందు, ముస్లింల

అద్భుతమైన హిందూ సామ్రాజ్యమని, అది పరాయివాళ్ల దాడులతో, ఆక్రమణలతో పరాయీకరించబడిందని, అంతటి గొప్ప హిందూ రాష్ట్రాన్ని నిర్మించాలనేది సంఘ పరివార్ అంతిమ లక్ష్యం. భారత ఉపఖండమంతా ఒక ఏకశిలా సదృశ్యమైన నిర్మాణమన్నట్టు, ఈ దేశ బహుముఖ బహుళత్వాన్ని, భౌగోళిక చారిత్రక వైవిధ్యాన్ని గుర్తించకుండా ఒకే ముద్దగా మార్చడం, మలచడం కోసం అందివచ్చిన ఏ అవకాశాన్నైనా ఆ లక్ష్యానికి అనుగుణంగా మలుచుకుంటుంది.

బహుళత్వం, వైవిధ్యమంతా పరాయీకరణలో భాగంగా జరిగిందని అది ఇప్పుడు ఏక రూపంలోకి పరివర్తన చేయాలనే ప్రాజెక్టులో భాగంగానే ఈ జమిలి ఎన్నికల ప్రతిపాదన. దేశ రాజ్యాంగ రూపకల్పన ఈ దేశ చారిత్రక(హైందవ) 'వైభవాని'కి అనుకూలమైనది కాదని రాజ్యాంగాన్ని గుర్తించ నిరాకరించింది సంఘపరివార్. గురూజీగా సంఘపరివార్ పిలుచుకునే గోల్వాల్కర్ స్వయంగా ఈ దేశ రాజ్యాంగాన్ని సమూలంగా సంస్కరించాలని, ఏక కేంద్ర పాలన ఏర్పరచాలని బలంగా ప్రబోధించాడు. తన 'ఏక', 'ఏకతా' అనే సిద్ధాంతమంతా ప్రజల ఐక్యత, సామరస్యం, సమిష్టి పురోభివృద్ధి కాకుండా బ్రాహ్మణీయ హిందూ మెజారిటీ ఆధిపత్య సిద్ధాంతమనేది సుస్పష్టం. ప్రగతిశీల, లౌకిక భావన పునాదుల కంటే మను తాత్వికత పునాదిగా ఉన్న సనాతన సమాజాన్ని ఇవాళ పునరుద్ధరించడానికి ఈ రాజ్యాంగం అడ్డంకిగా ఉన్నది. దాన్ని అడ్డుతొలగించుకోవడమే సంఘపరివార్ మిషన్. కేంద్రమంత్రులే బాహాటంగా రాజ్యాంగాన్ని మార్చడానికి అధికారంలోకి వచ్చాం అని ప్రకటించారు. ఒకే దేశం, ఒకే ప్రజా, ఒకే చట్టం, ఒకే మతం, ఒకే భాష (హిందూ–హిందీ), ఒకే సంస్కృతి, ఒకే పన్ను, ఒకే ఆహారం (శాఖాహారం) ఇలా చివరిగా జాతీయవాద ఇరుసుపై ఒకే పార్టీ నిర్మాణం, ఆధిపత్యంతో పాలన నడపాలనేది ఈ జమిలి ఎన్నికల సారాంశం. జమిలి ఎన్నికల ప్రతిపాదన ఒక తాత్విక అంశం కూడా.

వేల ఏళ్లుగా కొనసాగుతున్న సామాజిక వైరుధ్యాలను కొత్త రూపంలో కొనసాగించడానికి, కుల వ్యవస్థను కూకటివేళ్లతో పెకిలించాలన్న అంబేద్కర్ తాత్విక సిద్ధాంతాన్ని, ఆ వెలుగులో ఎదురవుతున్న ప్రతిఘటనను అడ్డుకునే, అణచివేసే, పెట్టుబడి మార్కెట్‌తో మనువాద బ్రాహ్మణీయ సనాతన భావజాలాన్ని మరింత బలపరిచే, వీటన్నింటినీ ఆచరణ రూపంలో ఎదుర్కొంటున్న ప్రజా విప్లవ పోరాటాలను తుదముట్టించేందుకే ఈ నయా ఎత్తుగడ. ఆ దిశలోనే మైనారిటీల, దళితులపై హింస దేశవ్యాప్తంగా బుద్ధిజీవులు, కవులు, రచయితలు, జర్నలిస్టులపైన నిత్యం నిర్బంధం కొనసాగిస్తూ సంవత్సరాల తరబడి జైళ్లలో మగ్గేలా ఫాసిస్టు చర్యలను కొనసాగిస్తున్నది. పార్లమెంటరీ ప్రతిపక్ష ముక్త భారత్, ప్రజాపక్ష శక్తుల ముక్త భారత్ కోరుకునే ఎత్తుగడలో భాగమే జమిలి ఎన్నికలు. ఈ సరికొత్త సవాల్ పార్లమెంటరీ పార్టీలు, ప్రజాపక్ష శక్తులకు మరో యుద్ధాన్ని ముందుకు తెచ్చింది.

(రచయిత ఆంగ్ల ఉపన్యాసకులు) వీ

మధ్య విభజన, ఘర్షణ.. సంఘ పరివారానికి సులువైంది. మైనార్టీలతో మెజార్టీలకు ముప్పుందనే వాదనలతో అల్లర్లకు ఆజ్యం పోసింది. రాజ్యాధికారం కోసం అరాచకాలకు ఉసిగొల్పింది. గుజరాత్ అల్లర్లు ఇందుకు ఉదాహరణ.

2011-14లో మోడీ గుజరాత్ సిఎంగా ఉన్నప్పుడు ఆయన సర్కారు గోసేవా, గోచార్ వికాస్ బోర్డు(జిజివిబి) వెబ్‌సైట్‌ను నిర్వహించింది. పశువులను తరలిస్తున్నవారిపై రెయిడ్ చేసినందుకు, ఎఫ్ఐఆర్‌లను నమోదు చేయించినందుకు రు. 75 లక్షల రివార్డును 1,394 గోరక్షకులకు పంపిణీ చేసినట్టు జిజివిబి వివరించింది. 'బెస్ట్ గోరక్షకుల'కు రెండేళ్లకోసారి అవార్డులను కూడా సర్కారు ప్రకటించింది. గో వధను నివారించే బృందాల సమన్వయమే జిజివిబి లక్ష్యంగా ఉండేది. సర్కారే ప్రోత్సహిస్తుండడంతో 'గో రక్షణ'కు ఎక్కువ మంది నుంచి సమ్మతి లభించింది. ఎక్కువమంది సమ్మతి లభించడంతో గోరక్షకుల ఆగడాలు శృతిమించాయి. ముందుగానే ముస్లిం వ్యతిరేక భావజాలం విస్తృతం చేయడంతో గోరక్షణ పేరుతో దాడులు పెరిగాయి. అప్పటికే 2002లో గుజరాత్ అల్లర్లలో మతోన్మాద మూకలు ముస్లింలపై అరాచకాలకు పాల్పడిన చరిత్ర ఉన్నది. గోరక్షణ పేరిట మూక దాడులు పెరిగిపోయాయి. మోడీ సర్కారు కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత దేశవ్యాప్తంగా మూకదాడులు పెరిగినట్టు పలు మీడియా కథనాలు తెలుపుతున్నాయి. ముస్లింలపై విద్వేషం, మతోన్మాద భావజాలం సోషల్ మీడియా ద్వారా వేగంగా వ్యాపితమవడం కూడా ఓ కారణంగా చెప్పుకోవచ్చు. ఇటీవలే బిజెపి మహిళా నేత ఒకరు ముస్లిం మహిళలపై హిందువులు లైంగిక దాడులకు పాల్పడాలని ఫేస్‌బుక్‌లో చేసిన పోస్టు దుమారం రేపిన సంగతి తెలిసిందే.

తబ్రేజ్ అన్సారీపై మూకదాడి

జార్ఖండ్‌కు చెందిన 22 ఏండ్ల తబ్రేజ్ అన్సారీ అమ్మనాన్నలను కోల్పోయి జీవనోపాధి కోసం మహారాష్ట్రలోని పూణెలో వెల్డర్‌గా పనిచేస్తుండేవాడు. రెండు నెలల క్రితమే పెండ్లి చేసుకున్న తబ్రేజ్ జార్ఖండ్ నుంచి పూణెకు బయల్దేరేందుకు భార్యకు, తనకు టికెట్లు కూడా బుక్ చేసుకున్నాడు. కానీ, అంతలోనే ఓ మతోన్మాద మూక అతన్ని పొట్టనబెట్టుకుంది. తన భవిష్యత్ కలలను వికటాట్టహాసం చేస్తూ ఆ మూక చెరిపేసింది. ద్విచక్ర వాహనాన్ని దొంగిలించాడని ఆరోపిస్తూ జూన్ 18న కొన్ని గంటలపాటు ఆ ఉన్మాదులు తబ్రేజ్‌పై దాడి చేశారు. స్తంభానికి కట్టేసి కొట్టారు. తొలుత తబ్రేజ్ అన్సారీని పేరు అడగడంతో సోను అని చెప్పాడు ఆ మూకకు. కానీ, ముస్లిం అనే నిర్ధారణకు వచ్చేందుకు పూర్తి పేరు, నిజం పేరు చెప్పాలని హూంకరించింది. ఎట్టకేలకు ముస్లిం అని నిర్ధారించుకోగానే దాడులు మొదలయ్యాయి. తర్వాత జై శ్రీరాం, జై హనుమాన్ అనాలని బెదిరించింది. ఆ నినాదాలను అనేందుకు తబ్రేజ్‌కు అభ్యంతరం లేదు. ఒప్పుకున్నాడు. మూక వికృతంగా నవ్వింది. మళ్లీ మళ్లీ అనిపించుకుని నవ్విందా మూక. ముస్లింగా పుట్టిన తబ్రేజ్‌కు అప్పుడు మరో అవకాశం లేకుండా పోయింది. తానున్న అగాథంలో జై శ్రీరాం, జై హనుమాన్ అన్నాగానీ దెబ్బల నుంచి తప్పించుకోలేకపోయాడు. ఆలస్యంగా చేరుకున్న పోలీసులు.. వాహనాన్ని దొంగతనం చేశాడని ఎఫ్ఐఆర్ రాసుకున్నారు గానీ, తబ్రేజ్‌కు తగిలిన దెబ్బల గురించి ప్రస్తావించనేలేదు. అంతేకాదు, పోలీసు స్టేషన్‌కు వచ్చిన మూకకు చెందిన ఓ వ్యక్తి.. ఇంత బాదినా ఇంకా బతికే ఉన్నాడా? అంటూ తబ్రేజ్‌ను ఉద్దేశిస్తూ వ్యాఖ్యానించాడని బాధితుడి బంధువులు చెప్పడం గమనార్హం. చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్న మూకకు దానిపై గౌరవం, భయం లేదనే విషయం తెలుస్తూనే ఉన్నది. తబ్రేజ్ తీవ్రంగా గాయపడింది చూశాకే బైక్ దొంగతనం ఆరోపణలు చేశారనీ బాధితుడి బంధువులు, మిత్రులు చెబుతున్నారు. 'ఇప్పుడు నేను ఎవరి కోసం బతకాలి' అని తబ్రేజ్ భార్య వేసిన ప్రశ్నకు ఎవరు సమాధానం చెబుతారు.

జార్ఖండ్ మూకదాడిపై పార్లమెంటులో ప్రధాని మోడీ మాట్లాడుతూ కనీసం బాధితుడి పేరును కూడా ప్రస్తావించలేదు. అంతేకాదు, ఆ మతోన్మాద దాడిని సాధారణీకరించేలా మాట్లాడాడు. జార్ఖండ్‌లో జరిగిన ఘటనకు బాధపడుతున్నానని, అయితే దానికి మొత్తం రాష్ట్రాన్ని నిందించడం సరికాదని అన్నాడు. గోవధ పేరిట జరుగుతున్న దాడుల పైనా గట్టిగా స్పందించింది లేదు. ఈ అంశాలు పరోక్షంగా ఉన్మాద మూకలకు మరింత బలాన్ని చేకూర్చేవే. ఎందుకంటే ఆయన గుజరాత్ సిఎంగా ఉన్నప్పుడు గో రక్షకులకు అండగా నిలిచారు. గోరక్షకులను ఆయన సర్కారు సమన్వయం కూడా చేసింది. నేపథ్యం ఇలా ఉండగా.. గోరక్షణ పేరిట దాడులకు పాల్పడుతున్న ఘటనలపై సాధారణంగా స్పందిస్తే.. సత్ఫలితాలు వస్తాయని ఆశించడం అత్యాశే అవుతుంది. పుల్వామా ఉగ్రదాడి అనంతరం కాశ్మీరీలపై హిందూత్వ శక్తుల దాడులకు తెగబడినప్పుడూ సుప్రీంకోర్టు స్పందించేవరకు మోడీ మౌనం దాల్చడం దేన్ని సూచిస్తుంది. మరోవైపు మూకదాడులకు పాల్పడినవారికీ బిజెపి నేతలు బహిరంగంగానే మద్దతు పలకడం, ఒక నేత నేరుగా సన్మానించడం పరోక్షంగా ఏ సంకేతాలనిస్తుందో అర్థం చేసుకోవచ్చు.

ఏ మతాన్ని అధికారికంగా గుర్తించని లౌకిక దేశమైన ఇండియా పార్లమెంటులో జైశ్రీరాం, జై హనుమాన్ నినాదాలను అధికార పార్టీ ఎంపీలు చేయడం గమనార్హం. లోక్‌సభలో ప్రమాణ స్వీకారం చేస్తున్న ఎంపీల మతం, పార్టీలను బట్టి బిజెపి చట్టసభ్యులు ఈ నినాదాలు చేశారు. పార్లమెంటులోనే ఇలాంటి నినాదాలు చేయడంతో మతోన్మాద మూకలకు నైతికంగా బలాన్నిచ్చినట్టయింది. బిజెపి అధికారంలోకి రావడంలో మతం కీలక పాత్ర పోషించిందన్న విషయంలో సందేహాలు లేవు. దేశ విభజన నుంచి మూకదాడులు, అల్లర్లు జరిగాయి. కానీ, నేడు జరుగుతున్న మతోన్మాద మూకదాడులకు అధికార పార్టీ అండ ఉన్నది. మూకదాడులకు పాల్పడినవారికి బిజెపి నేతలు బహిరంగంగానే మద్దతు పలకడం, ఒక నేత నేరుగా సన్మానించడం పరోక్షంగా ఏ సంకేతాలనిస్తుందో అర్థం చేసుకోవచ్చు. ఈ మతోన్మాద దాడులకు నేడు సర్కారు అండగా నిలవడంతో మూకలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. మూకదాడులను కట్టడి చేసేందుకు సుప్రీంకోర్టు మార్గదర్శకాలు జారీ చేసి ఏడాది గడిచినా ఇప్పటికీ అటువైపు అడుగులు వేయకపోవడం ఈ వాదనకు బలాన్నిస్తున్నది. రాజ్యాంగం ప్రవచిస్తున్న అందరికీ సమానత్వం అనే విషయాన్ని మరుగునపరిచి మైనార్టీ, దళితులపై కక్షకట్టే చర్యలకు పూనుకోవడం ప్రమాదకరం.

దేశంలో ముస్లిం, దళిత మైనారిటీలపై జరుగుతున్న హిందూ మతోన్మాద దాడుల పరంపరను గమనిస్తే అల్పసంఖ్యాకులను అబద్రతలోకి నెట్టి హిందువుల సమీకరణకోసం జరుగుతున్న దాడులుగా అర్థమవుతుంది. దీనికి రాజ్యం, మతం రెండు కలిసి ఈ దాడుల పరంపరను కొనసాగిస్తున్నాయి. ఈ దేశంలో మతం, రాజ్యం వేరుగా లేవు కాబట్టి ఈ మతోన్మాద దాడుల నుంచి ప్రజలు తమను ఎవరో వచ్చి రక్షిస్తారనే దానికన్నా తమను తాము రక్షించుకోవడానికి సిద్ధం కావాల్సిన పరిస్థితులు నేడు దేశవ్యాప్తంగా నెలకొని ఉన్నాయి. బుద్ధిజీవులు ఈ దాడుల గురించి ప్రజల్ని చైతన్యపరుస్తూ అండగా నిలబడి ఎదుర్కోవాల్సిన అవసరం ఉంది. ఈ దేశంలో ప్రజాస్వామ్యం పేరిటి కొనసాగుతున్న హిట్లర్ పాలనను ఎదిరించాల్సిన అవసరం ఉంది.

(రచయిత ఫ్రీలాన్స్ జర్నలిస్టు) వీ

మోడీ గెలుపుతో సింగూర్‌లో టాటా మోటార్స్

కేంద్రంలో మోడీ మళ్లీ అధికారంలోకి రావడంతో కార్పొరేట్, ప్రైవేట్ పారిశ్రామిక కంపెనీలకు మరింత బలం చేకూరిందనీ, సింగూర్‌లో టాటా మోటార్స్ మరోసారి ప్రవేశం ఇందుకు నిదర్శనమనీ అంటున్నారు **ఎం. రత్నమాల**

మోడీ గెలుపు కార్పొరేట్ పారిశ్రామిక శక్తుల విజయం అనడానికి దాఖలా మునుపెన్నడూ లేని విధంగా దేశంలోని కార్పొరేట్ పారిశ్రామిక అధిపతులందరూ మూకుమ్మడిగా మోడీ ప్రభుత్వ ప్రమాణ స్వీకారానికి హాజరుకావడం. ప్రధాని మోడీతో సహా ఆయన 57 మంది మంత్రివర్గ ప్రతినిధుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి దేశంలోని కార్పొరేట్ దిగ్గజాలు ముఖేశ్ అంబానీ, ఆయన భార్య నీతా అంబానీ, అంబానీ కొడుకు, అంబానీకి చెందిన రిలయన్స్ ఉన్నతాధికారి పరిమల్ నాథ్వాని, టాటా గ్రూప్స్ అధినేత రతన్ టాటా, ఇన్ఫోసిస్ అధినేత నారాయణ చారి, ఉక్కు పారిశ్రామికవేత్త ఎల్.ఎన్. మిత్తల్, ఆదానీ గ్రూప్ అధిపతి గౌతమ్ ఆదానీ, ఎస్సార్ డైరెక్టర్ ప్రశాంత రుయా, టాటా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్‌పర్సన్ ఎన్. చంద్రశేఖరన్, వేదాంత చైర్మన్ అనిల్ అగర్వాల్, ఎచ్‌డిఎఫ్‌సి చైర్మన్ దీపక్ పరేఖ్, భారత మిత్తల్ వీడియోకాన్‌కు చెందిన రాజ్‌కుమార్ మాత, కళ్యాణ్ జ్యూయలర్స్ ఎం.డి. కళ్యాణ్ రామన్ అయ్యార్, సి.జి. గ్రూప్ చైర్మన్ బినోద్ చౌదరి, నీతి ఆయోగ్‌కు చెందిన రమేష్, ఇంకా అనేక మంది కార్పొరేట్ పారిశ్రామిక అధిపతులు మోడీ ఆయన మంత్రివర్గ ప్రమాణ స్వీకారానికి హాజరై కన్నులపండుగగా తిలకించారు. వీళ్లంతా హాజరుకావడం అనే విశేషం మాత్రమే కాదు, పద్ధతి ప్రకారం ఆహ్వానాలు అందవలసిన ప్రతిపక్ష నేతలను ఆహ్వానించకపోవడం మరో విశేషం. డిఎంకె అధినేత స్టాలిన్‌ను ప్రమాణ స్వీకారానికి ఆహ్వానించలేదు. నిరసనగా ఆ పార్టీ వారెవ్వరూ ప్రమాణ స్వీకారానికి హాజరుకాలేదు. ఎన్నికల ముందు పాకిస్తాన్‌కు వెళ్లి ఇమ్రాన్‌ను కావలించుకున్న మోడీ ఇమ్రాన్‌ను ప్రమాణ స్వీకారానికి ఆహ్వానించలేదు. మమతా బెనర్జీ తాను ప్రమాన స్వీకార కార్యక్రమానికి వెళ్లేదిలేదని ముందే చెప్పింది. ఇంకా చాలా మంది ప్రతిపక్ష పార్టీల నాయకులు ప్రమాణ స్వీకారానికి హాజరు కాలేదు. అత్యధిక మెజారిటీతో గెలిచాడు కనుక ప్రతిపక్షాలను ఖాతరు చేయాల్సిన అవసరం లేదని మోడీ నిర్ణయించుకున్నట్లు స్పష్టమవుతున్నది. పార్టీలోని సీనియర్లను లెక్కచేయడు. ప్రతిపక్షాలను అసలు పార్టీలుగానే గుర్తించని ప్రధాని మోడీ అమిత్‌షా మొదలైన తాను ముఖ్యులనుకొంటున్న కొందరితో కలిసి ఏకపక్షంగా దేశాన్ని ఏలాలని నిర్ణయించుకున్నట్లుగా అర్థమవుతుంది.

ఇంకా ప్రమాణ స్వీకారమైన జరగకుండానే గెలిచీ గెలవగానే పశ్చిమ బెంగాల్‌లోని హుబ్లీ పార్లమెంట్ నియోజకవర్గం (సింగూర్ అసెంబ్లీ నియోజకవర్గం హుబ్లీ పార్లమెంట్ నియోజకవర్గంలోకి వస్తుంది) భారతీయ జనతా పార్టీ ప్రతినిధి లోకేత్ చటర్జీ ఇంకా ఓట్ల లెక్కింపు పూర్తికాక ముందే తాను ఆధిక్యతలో ఉన్నట్లు ప్రకటించగానే 'సింగూర్‌కు టాటా కార్ల కంపెనీని తిరిగి రప్పిస్తానని' ప్రకటించారు. అంతేకాదు 'సింగూర్ తృణమూల్ కాంగ్రెస్‌ను అధికారానికి తెచ్చింది సింగూర్ ఇప్పుడు తృణమూల్ పతనాన్ని తెస్తుంది' అని అదే చటర్జీ అన్నారు. సింగూర్‌లో 2008లో కార్పొరేట్ పరిశ్రమలు ముఖ్యంగా టాటా కార్ల కంపెనీ కోసం వ్యవసాయ భూములను మార్క్సిస్టు పార్టీ బుద్ధదేవ్ బట్టాచార్య ప్రభుత్వం చర్యలు తీసుకోవడానికి వ్యతిరేకంగా అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న తృణమూల్ పార్టీ నాయకురాలు మమతా బెనర్జీ కలకత్తాలో నిరాహార దీక్ష చేయడాన్ని దృష్టిలో ఉంచుకునే ఆమె (చటర్జీ) పై విధంగా అన్నారు.

బహుళజాతి గుత్త సంస్థ సలీమ్ గ్రూప్‌కు చెందిన రసాయన పరిశ్రమను నందిగ్రామ్‌ను టాటా కార్ల కంపెనీకే సింగూర్‌ను దారాదత్తం చేయడానికి అప్పుడు బెంగాల్‌లో అధికారంలో ఉన్న ప్రభుత్వం రైతుల పైనా, మొత్తంగా స్థానిక ప్రజల పైనా దారుణ మారణకాండను ప్రయోగించింది. దేశవ్యాప్తంగా ఆర్థిక శాస్త్రవేత్తలు, పర్యావరణ నిపుణులు, ప్రముఖ రచయితలు పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వ భూ సంస్కరణల మాజీ కమిషనర్ దేవబ్రత బందోపాధ్యాయ, ప్రపంచ ప్రఖ్యాత రచయిత్రి మహాశ్వేతదేవి, ఇంకా అనేక మంది ప్రజాస్వామిక వాదులు 'సాలీనా నాలుగు అధిక దిగుబడి పంటలు పండే సింగూరును కార్ల కంపెనీకి కట్టబెట్టే బదులు మరోచోట ఎక్కడైనా ఆ కంపెనీకి భూమిని కేటాయించాలని' ప్రభుత్వానికి లిఖిత పూర్వక విజ్ఞప్తులు చేశారు. రైతులు భూమిని ప్రభుత్వానికి అప్పగించడానికి అంగీకరించకపోవడంతో కంపెనీ గూండాలు, మార్క్సిస్టు పార్టీ సాయుధ కార్యకర్తలు, ప్రభుత్వ పోలీసు బలగాలు గ్రామాలపై మూకుమ్మడిగా దాడులు చేసి భీభత్సం సృష్టించారు. ఈ నేపథ్యంలో 2006 మేలో ప్రజలు సింగూర్ కృషి జీవరక్షక కమిటీ (ఎస్‌కెజిఆర్‌సి) ఏర్పరచుకుని ప్రభుత్వం కోరిన విధంగా భూమిని స్వాధీనం చేయడానికి నిరాకరిస్తూ 2006 జూలై 17న ప్రభుత్వానికి ఒక పిటిషన్ పెట్టుకున్నారు. ఆ తర్వాత సెప్టెంబర్ 25న ఏడు వేల మంది గ్రామస్తులు ఉదయం నుంచి రాత్రంతా శాంతియుతంగా బైటాయించి ఆందోళన చేశారు. వీరిపై పోలీసులు లాఠీచార్జీ చేసి 27 మంది స్త్రీలతో సహా 70 మందిని అరెస్టు చేశారు. లాఠీచార్జీలో స్త్రీలు, పిల్లలతో సహా 80 మంది తీవ్రంగా గాయపడి ఆస్పత్రి పాలయ్యారు. నవంబర్ 30 నుంచి 144 సెక్షన్ విధించారు. పోలీసు పహారాలో భూమి చుట్టూ ముళ్లకంచె వేశారు. అడ్డుకున్న ప్రజలపై కాల్పులు జరిపారు. పోలీస్ చెక్‌పోస్ట్ పెట్టారు. టాటా కార్ల కంపెనీకి చెందిన ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు డిసెంబర్ 18న కృషి జమీరక్షణ కమిటీలో చురుకైన కార్యకర్త 17 సంవత్సరాల వయసున్న బాలిక తపసీ మారిక్‌ను ఎత్తుకుపోయి సామూహిక లైంగిక బలత్కారం చేసి పోలీస్ ఔట్‌పోస్ట్ పక్కనే పెట్రోల్ పోసి తగులబెట్టి చంపారు. టాటా కంపెనీకి భూములు కట్టబెట్టే ప్రయత్నంలో ప్రభుత్వం హైకోర్టును, జస్టిస్ కృష్ణయ్యర్ పార్టీకి రాసిన లేఖను మార్క్సిస్టు పార్టీ ప్రభుత్వం పట్టించుకోలేదు. భూములు అప్పగించడానికి ప్రజలు అంగీకరించలేదు. పోరాటం కొనసాగించారు. ఇది గతం. సింగూర్‌కు టాటా కంపెనీని తిరిగి రప్పిస్తానని బిజెపి పార్టీ పార్లమెంట్ ప్రతినిధి లోకేశ్ చటర్జీ ప్రకటించడం వర్తమానం, భవిష్యత్తు ప్రజల పోరాటం.

(రచయిత విరసం సభ్యురాలు) వీ

దేశం మరో గుజరాత్ కానుందా?

బిజెపి, ఆర్ఎస్ఎస్ రోజురోజుకూ తమ బలాన్ని మరింత పెంచుకుంటూ పోతున్నాయనీ, ప్రజాస్వామిక శక్తులు అందరూ ఐక్యంగా పోరాడకపోతే దేశం మొత్తం ఛాందస హిందూత్వ భావజాలంలోకి మార్చేయబడుతుందనీ అంటున్నారు **అరుణ్**

రచయితలను, అందరినీగాకపోయినా, కొందరినైనా దార్శనికు లంటారు. అయితే వాళ్ల దార్శనికత కొన్ని సందర్భాలలోనే మనకు తెలుస్తుంది. కానీ, అమరుడు పతంజలి దార్శనికత ప్రతి ఎన్నికల, మరీ ముఖ్యంగా సారస్వత ఎన్నికల ముందూ, తర్వాతా, మనకు బూటకపు ప్రజాస్వామ్యాన్ని ఎత్తిచూపుతూ, ఎన్నికల మేడిపండు నిజస్వరూపం విప్పి చూపిస్తుంది. ఐదేళ్ల కొకమారు పాలకులు ప్రజాస్వామ్యశవాన్ని పాతరలోంచి తీసి శుభ్రంగా కడిగి అమెరికన్ సెంట్‌తో, అంబానీ, అధానీల సౌజన్యంతో ఊరేగించి, సంబరం చేసి ఎన్నికల తర్వాత మరల మౌనంగా పాతిపెడ్తారు. ఎన్నికల్లో పాలకవర్గాలలో ఏదో ఒక ఫ్యాక్షన్ గెలుస్తుంది. ఓట్ల లెక్కింపుకు ముందుగానే ఎగ్జిట్ పోల్స్ ప్రహసనం ఉంటుంది. పాత్రికేయులు జనం నాడిని బాగానే పట్టుకుంటారు. తమ సేవకుడు గెలుస్తున్నాడని స్టాక్ మార్కెట్లు విజృంభిస్తాయి. అది అభివృద్ధికి సూచికలంటూ ఆర్థిక మేధావులు సంబరపడి పోతారు. సామాన్యుడు నిత్యజీవిత ఆరాటంలో యధావిధిగా సతమవుతాడు.

పతంజలి ఎన్నికల ముందు. తర్వాత దేశామెలా ఉంటుందో సరిగ్గా చెప్పారు. ఎన్నికల్లో ఎవరు గెలుస్తారు అనేది అంబాని, అధానీలాంటివారు నిర్ణయిస్తే ఎగ్జిట్ పోల్స్ సరైన అంచనాను మనముందుంచుతాయి. ఒక్కొక్కమారు అవి తప్పవచ్చు కూడా. కానీ, విప్లవ కవి వరవరరావు మాత్రం గెలిచేదెవరో చెప్పలేం గాని, ఓడిపోయేది మాత్రం ఖచ్చితంగా ప్రజలేనంటూ, అన్ని ఎన్నికల ఫలితాలను నిక్కచ్చిగా ఎప్పుడో చెప్పాడు

ఎందుకంటే, ఈ బూటకపు ఎన్నికల్లో గెలిచేది కార్పొరేట్ శక్తులు, ఓడేది ప్రజలు అనే స్పష్టమైన అవగాహన కల్గినవాడు కనుక. అందుకు తగిన శిక్ష అనుభవిస్తున్నవాడు కనుక.

ఇక్కడ రాష్ట్రంలో జగన్, దేశానికి మోడీ మార్గదర్శకులయ్యారు, చుక్కానులేకాదు, నడిపే నావికులూ అయ్యారు. వారిని నడిపించే మీట మరొకరి చేతిలో ఉంటుందనేది కనిపించని చేదు వాస్తవం. మోడీ ఎన్నికల్లో తన గెలుపును భారతదేశపు విజయంగా ప్రకటించినప్పుడే, తనకూ దేశానికి భేదం లేదని చెప్పారు. ఆ స్లోగన్‌లోనే ఇక్కడ జరిగిన ఎన్నికలు పార్లమెంటరీ తరహా ఎన్నికలు కాదని, అధ్యక్ష తరహా ఎన్నికలనే అర్థం ఉంది. కమలనాథులకు కావాల్సిందదే. ఈ దేశానికి ప్రధానమంత్రి కాదు కావాల్సింది, ఒక చక్రవర్తి కావాలి. అఖండ భారత్‌కు ఒక భరతుడు కావాలి. అదేకదా సంఘపరివార్ ఆశయం, ఆకాంక్ష. ఉత్తభారత దండయాత్ర విజయాల ప్రేరణతో కమలనాథులు వింధ్య ధాటి, దక్షిణ భారత దండయాత్ర మొదలెట్టారు. కర్ణాటకలో తొలుత విజయం రుచిచూసినా, అసెంబ్లీ ఎన్నికల్లో భంగపాటుతో వెనక్కు తగ్గాల్సి వచ్చింది. అయితే ఈ సారస్వత ఎన్నికల విజయంతో బిజెపికి ఉత్సాహంతో పాటు, ప్రోత్సాహమూ లభించింది. 'రాక్షస' గణాలున్న తమిళనాడు, కేరళ రామభక్తులను మరికొంతకాలం నిలవరించగలవేమో గాని, తెలంగాణాలో ఇప్పటికే రామజపం మొదలయ్యింది. గతంలో విప్లవకారుల అడ్డాగా పేరొందిన కరీంనగర్ లాంటి ప్రాంతంలో మోడీ-షాలు శిబిరం వేశారంటే తెలంగాణ త్వరలోనే వారికి దాసోహంగాక తప్పదు.

ఇక, ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడిప్పుడే కాలు పెట్టడం ప్రారంభించింది. నేటి ప్రభుత్వాల ప్రాంతీయ వివక్షతలు ఇలాగే కొనసాగుతే, రాయలసీమ, శ్రీకాకుళాంధ్రలో రామభక్తులు పాగా వేయడం తప్పదు. వారిని ఎదుర్కొనడానికి ఇక్కడ ప్రగతిశీల శక్తులబలం తక్కువ. అంతేగాక తన అవసరార్థం, రాష్ట్ర అభివృద్ధి పేరుతో జగన్ మోడీతో చేతులు కలిపినా ఆచ్చర్యం చెందాల్సిన అవసరం లేదు. ఇక ఉత్తర భారత హిందీ, హిందూత్వానికి వ్యతిరేకంగా నిలువరించగలిగేది తమిళశక్తులే.

ఏమైనా తన సామ్రాజ్య విస్తరణలో అడ్డంకులన్నిటినీ తొలగించుకొని దక్షిణభారత ప్రభువులను సామంతులుగా మార్చుకొని తమ అఖండ భారత్, హిందూ రాష్ట్ర ఆకాంక్షలను నెరవేర్చుకునే దిశలో కమలనాథులు ఉన్నారనేది కళ్ల ముందు కనబడుతున్న దృశ్యం. అది బిజెపి ఎఐఎండికె ప్రభుత్వాన్ని గుప్పిట్లో పెట్టుకున్నపుడే అవగతమయ్యింది.

కమలనాథులకు తమ భావజాల వ్యాప్తికి దేశంలో అనుకూలమైన వాతావరణం ఉన్నదనేది వాస్తవం. హిందూమతమే కుల విభజనతో కూడినది. అసమానత దానికి పునాది. అంతేగాక, సమిష్టి కృషిని గాక, వ్యక్తి పూజ, ఆరాధనతో పనులు సాధించుకొనే సంస్కృతి అన్ని మతాలతో పాటు దీనిలోనూ ఉంది. ఇకపురుషాధిక్యత ప్రత్యేకంగా చెప్పేదేమీ లేదు. దీంతో సంఘపరివార్ భావన అయిన నియంతృత్వ భావన, పితృస్వామ్యం ఈ దేశ ప్రజలలో నాటుక పోయి ఉన్నాయి. తమ దీనస్థితికి తాము తప్ప మరెవ్వరో కారణం అనే ఆలోచనా విధానం తొలినుండి ఉన్నదే. అందువల్ల హిందూత్వ భావజాల విత్తులు నాటేందుకు అనుకూలమైన భూమిక ముందే ఉండడంతో, అంతేగాక స్వాతంత్ర్య పోరాటకాలం నుండి మతాన్ని తమ విముక్తికి సాధనగా తలిచే ఆలోచనా విధానం, పేదరికం అన్నీ పరివార్ శక్తులకు కలిసివచ్చాయి. దానికి తోడు ఈ ప్రతీఘాతుక శక్తులని ఎదిరించే ప్రగతిశీల శక్తులు బలహీనంగా ఉండడం బిజెపికి ఒక అనుకూలత.

గతతరం హిందూత్వవాదులు హిందూత్వ వాదానికి, అఖండ్ భారత్ విషవృక్ష విత్తులకు అనుకూలమైన క్షేత్రాన్ని దున్ని, చదను చేసి ఎరువులు చల్లి పెట్టారు. తర్వాతితరం విత్తువేసి, నీరు పోసి సాకుతూ వచ్చింది. ఇక ఈ తరం ఆ విషఫలాల్ని పంచేందుకు సిద్ధమవుతున్నారు. ఇది సంఘపరివార్ దశాబ్దాల క్రుశిపలితం అనేది మరవరాదు.

హిందూత్వ భావజాలాన్ని ఉగ్గుపాలతో గాకపోయినా 1వ తరగతి నుండే మెదళ్లకెక్కించిన సరస్వతీ పాటశాలల లక్ష్యం నేడు నెరవేరింది. ఆనాటి బాలురు నేడు యువకులై తమ తల్లి సంఘపరివార్ రుణం తీరుస్తున్నారు. ఇక్కడే ప్రగతేశీల శక్తుల అశక్తత కొట్టవచ్చినట్టు కనపడుతుంది. భావజాల రంగంలో విరసం, అరసం, ప్రజాసాహితి లాంటి సంస్థలు గాని అనేక అభ్యుదయభావాలున్న రచయితలు గాని

హిదూత్వ భావజాల వ్యాప్తిని అరికట్టలేకపోతున్నా(యి)రు. దానికి కారణం హిందూత్వ భావాజాల పునాదులు సమాజంలో బలంగా ఉండడం, ఆర్ఎస్ఎస్ లాంటి సంస్థలు ప్రణాళికబద్ధంగా, నిరంతరం ప్రజల మధ్య, ముఖ్యంగా బహుజనుల, దళితుల ఆదివాసీల మధ్య నిరంతరం పనిచేస్తూ వాళ్లను బ్రాహ్మణీకరణ చేయడంలో చాలామేరకు సఫలీకృతులయ్యారని చెప్పవచ్చు. దీనికి పరోక్షంగా పాలకుల మద్దతు ఉండడం కూడా చూడవచ్చు. ఇకపోతే ప్రగతిశీల శక్తుల కార్యకలాపాలకు నిర్బంధాలు ఒక అడ్డంకి కాగా, వీరు కొత్తగా తమకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించుకోవడంలో విఫలమయ్యారు. అందులోనూ వీరికి ప్రేరణ ఇచ్చి, ప్రోత్సహించి ప్రజావుద్యమాలు లేకపోవడం ఒక లోటే.

గతంలో లాగే బిజెపికే పార్లమెంట్‌లో తగిన మెజారిటీలభించడంతో ఇక మోడీ–షా ద్వయానికి తిరుగులేని పరిస్థితి. అందులోనూ అంతర్జాతీయంగా కూడా దక్షిణ పక్ష ప్రభుత్వాల హవా నడుస్తూ ఉండడం వారికి మరింత బలం చేకూరుస్తుంది. హిందూత్వవాదులు తమకు ప్రథమ శత్రువులు కమ్యూనిస్టులు, ముస్లింలు, క్రైస్తవులు అని స్పష్టంగా రాసుకున్నారు కూడా. హిందువులలో కులాల విభజన ఉన్నా 'మనమంతా హిందువులం–గంగ సింధు బిందువులం' అనే స్లోగన్‌తో కులవివక్షతకు గురవుతున్న దళితులనూ ముస్లింల పై దాడులకు వినియోగించుకొనే చాణక్య నీతి షా–మోడీలది. గత కొన్ని దశాబ్దాలుగా దళితుల, బహుజనుల, ఆదివాసీల బ్రాహ్మణీకరణ చాపకింద నీరులా వ్యాపిస్తూనే ఉంది. ఏ ఆచార వ్యవహారాలూ సాంప్రదాయాలూ వారిని నీచంగా చూస్తున్నాయో, వాటినే పీడితులు స్వీకరించేలా చేయడంలో సంఘ్ పరివార్ విజయం సాధించింది. ఇక కార్పొరేట్ శక్తుల అండదండలు మెండుగా ఉన్నాయి. ఎగ్జిట్ పోల్స్ మోడీకి మెజారిటీని సూచించగానే కార్పొరేట్ల సంబరాలు, స్టాక్‌మార్కెట్లు ఎలా మిన్నంటాయో గమనిస్తే మోడీకి కార్పోరేట్లకు గల సంభంధం అర్థమవుతుంది.

మరి ఇలాంటి పరిస్థితిలో దేశం ఎలా ఉంటుంది?

అంతా ప్రశాంతంగా, స్మశాన శాంతితో ఉంటుంది. అలజడులు, ఆందోళనలు ఉండవు. ఉండకూడదు. 'రామరాజ్యంలో' ఎవ్వరికీ అసంతృప్తి ఉండరాదు. అది రాజాజ్ఞ. గొంతువిప్పితే జైళ్లు నోళ్లు తెరుచుకుంటాయి. అసలు మన మెదళ్లకు పని పెట్టాల్సిన అవసరమే ఉండదు. ఇప్పటికే చాలామంది బుద్ధిజీవులు ఆలోచించడం మానివేశారు. మన ఆలోచనలను రూపుదిద్ది, వెలిబుచ్చే ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ఉండగా మనకెందుకు అనవసర శ్రమ. సోషల్ మీడియాను ఉపయోగిస్తే మరో గౌరీ లంకేష్, పనేసర్ అయ్యే ప్రమాదముంది. లేకపోతే కనీసం వివి, ప్రొ. సాయిబాబా, సోమాసేన్, సుధా భరద్వాజ్‌ల లాగా జైళ్ల ఆహ్వానం తప్పనిసరవుతుంది.

అయినా మనం ఆలోచించే పనేముంది. సంక్షేమ రాజ్యంలో నీకు తినడానికి, యింత కూడు, ఉండడానికి గూడు, కట్టేందుకు గుడ్డా ఉంటే చాలదు. అయినా నీవే తిండి తినాలో, ఏ బట్ట కట్టాలో, ఏం మాట్లాడాలో సంఘ్ అనునాయులే నిర్ణయిస్తున్నపుడు మనకు స్వంతంగా ఆలోచించే పనేముంది.

దళితుల, మైనారిటీల, ఆదివాసీలకు సంక్షేమ రాజ్యం అన్ని వసతులు కల్పిస్తుంది. వారు చేయాల్సిందంతా మను ధర్మాన్ని పాటించడమే. సంఘపరివార్‌కు, రామ్‌విలాస్ పాశ్వాన్‌ల లాగా తాబెదారులుగా పనిచేయడమే. ఇక ముస్లింలు తాము రెండవ శ్రేణి పౌరులమని అంగీకరిస్తే చాలు. పోతే ఘర్ వాపసి కి ఒప్పుకోవాలి. షా నవాజ్ ఖాన్ లాంటి వారికి బిజెపి అత్తగారింట ఎన్ని భోగాలు లభిస్తున్నాయో చూడండి.

మరి ఆదివాసీలు? ఎన్నాళ్లని అనాగరీకులుగా అడవుల్లో బతుకుతారు. అడవులను అంబానీలకు, అధానీలకు వదలండి. సుప్రీం కోర్టు ఎంతో అభిమానంతో, ఉదారంగా 10 లక్షల ఆదివాసీలను అడవుల నుండి బయటకు పంపమని ఆదేశాలివ్వడం వారిని నాగరికులను చేసేందుకే. ఇక్కడి జనజీవన స్రవంతిలో కలుస్తేనే కదా వారికీ బానిస మనస్తత్వం అలవడేది. మానసికంగా ప్రశాంతత దొరికేది. 'జల, జంగిల్, జమీన్' లంటూ పనికిమాలిన ఉద్యమాలు, వ్యర్థ త్యాగాలు. అందుకే ఆదివాసీలను జనజీవన స్రవంతిలో కలిపెందుకే, స్వదేశీ, విదేశీ కార్పొరేట్లు పాలకులకు నిస్వార్థంగా తమవంతు సహాయం చేస్తున్నాయి. ఆదివాసీల మెరుగైన జీవితం కోసమేగా వేలల, లక్షల కోట్లను ఖర్చు పెట్టి ఆ కారడవులలో మైనింగ్ వ్యాపారానికి పూనుకుంది. వారి త్యాగాలను గుర్తించక సాయిబాబా లాంటి మేధావులు దుష్ప్రచారం చేస్తుంటే ఏ భాధ్యతాయుత ప్రభుత్వమైనా ఊరుకుంటుందా?.

రామరాజ్యంలో యువకులకు ఉపాధి అవసరం లేదు. రామనామ జపమే అన్నిటికీ పరిష్కారం. కొత్త ఉద్యోగాలివ్వకపోగా, లక్షలాది ఉద్యోగాలను ఊడగొట్టిన మోడీని ఎంతో ప్రేమతో తిరిగి గద్దేనెక్కించాం కదా. అంతగా కావాలంటే, నెలకింత నిరుద్యోగ భృతి కింద కొన్ని రూపాయలిస్తే సరి. రైతాంగాన్ని గురించి పట్టించుకోవాల్సిన అవసరం లేదు. పిచ్చివాళ్లు. వందలకొద్దీ మైళ్లు నడుస్తారు, నిరసన తెల్పి అలసిపోతారు. జీవితాలపై విసుగువస్తే ఆత్మహత్యలకు పాల్పడతారు. కొంతమంది అమాయకులు మూకుమ్మడిగా నామినేషన్లు దాఖలు చేసి ఖజానాను నింపుతారు. ఏం చేయగలరు వారంతకన్నా?

మోడీ, సారీ రామరాజ్యంలో మహిళలకు పూర్తి రక్షణ. వారు బయటికి వస్తేనే గదా వారిపై అత్యాచారాలు. భారతీయ స్త్రీ వంటకూ, ఇంటికీ పరిమితమైతే ఏ సమస్య ఉండదు. ఇంకా మాట్లాడితే గృహ నిర్బంధం మంచిది. మరింతమందిని కని హిందూ జనాభాను పెంచాలని కొందరు కమలనాథులు సలహానిస్తున్నారు కూడా. వారే కాదు మన మాజీ సీఎం చంద్రబాబు అదే సలహా నిచ్చాడు. ఏమైనా దేశం ముస్లిం రాజ్యం కాకుండా ఎక్కువ మంది పిల్లల్ని కనాలి. అందుకై మహిళలు ఇంటి పట్టున ఉండడం శ్రేయస్కరం.

కమలనాథులు ప్రజల సంక్షేమం కోసం, దేశాభివృద్ధి కోసం అర్జెంట్‌గా చేయాల్సినవి రెండు, మూడు పనులున్నాయి. మొదటిది అయోధ్యలో రామాలయ నిర్మాణం. అది ఆగినా పర్వాలేదు, ఈసారి ఎన్నికలకు, ఎన్నికలంటూ జరిగితే అవసరం కావొచ్చు. కాశ్మీర్ విషయం మాత్రం తేల్చాల్సిందే. అక్కడ ముస్లిం జనాభా తగ్గించాలంటే అలజడులు సృష్టించి గుజరాత్ మారణకాండ లాగా వారిని ఊచకోత కోయాలి. అలజడులు సృష్టించాలంటే ఆర్టికల్ 370, 37–ఏ ను రద్దు చేయాలి. దాంతో అక్కడ తీవ్ర ప్రతిఘటన మొదలవుతుంది. ఎటూ సైన్యం ఉండనే ఉందిగా, దేశాద్రోహులకు బుద్ధిచెప్పడానికి. ఈ విధంగా అటు కాశ్మీర్‌లో ముస్లిం జనాభా తగ్గించవచ్చు, ఇటు ఇండియాలో ముస్లింలకు హెచ్చరిక పంపవచ్చు.

ఏమైనా కాశ్మీర్ సమస్యను అత్యవసరంగా అక్కడి ప్రజల అభీష్టాన్ని పట్టించుకోకుండా పరిష్కరించాలనే సంఘ్ పరివార్ ఆదేశాలు తు. చ. తప్పకుండా అమలు చేయాల్సి ఉంటుంది. దాంతో పాక్‌కు ఒక హెచ్చరిక చేసినట్లవుతుంది కూడా. అందుకు సంనద్ధులమై ఉన్నామని ప్రజలకు తెల్పేందుకే అమిత్‌షా ను కేంద్ర గృహశాఖా మంత్రిగా నియమించాడేమో మోదీ. ప్రజ్ఞా సింగ్‌ను కేంద్ర గృహశాఖా మంత్రిగా నియమిస్తే మరింత బలమైన సంకేతంగా ఉండేది. కానీ, గుజరాత్ మారణకాండ అనుభవం షా వైపు మొగ్గుచూపినట్టుంది.

కొండను తవ్వి ఎలుకను పట్టని వైద్యుల సమ్మె

***ప్రపంచీకరణ యుగంలో వైద్యరంగం వ్యాపార సరుకుగా మారిపోయిందనీ, ఆసుపత్రుల్లో కనీస సౌకర్యాలు కల్పించకుండా సమ్మె చేసిన వైద్యులకు పోలీసుల రక్షణే సమస్యలకు పరిష్కారం ఇవ్వదనీ అంటున్నారు* కేశవ్**

ఒక రోగికి సరైన వైద్యం అందలేదనే ఆరోపణతో జూన్ 10న ఇద్దరు జూనియర్ వైద్యులపై ఆ రోగి కుటుంబ సభ్యులు చేసిన దాడిని వ్యతిరేకిస్తూ తర్వాత రోజు నుండి జూనియర్ వైద్యులు కోల్‌కత్తాలోని ప్రఖ్యాత మెడికల్ కాలేజి నీల్ రతన్ హాస్పిటల్‌లో సమ్మె ఆరంభించారు. ముఖ్యమంత్రి బెదిరింపులకు లొంగకుండా సమ్మెను అత్యంత నిబద్ధతతో కొనసాగించారు. ఏ రకమైన హింసాత్మక సంఘటనలకు పురికొల్పకుండా ఆసుపత్రిలోనే సమ్మెను కొనసాగించారు. దాదాపు వారంరోజులు కొనసాగి మొత్తం వైద్య సేవల్ని అతలాకుతలం చేసిన ఈ సమ్మె ఏ మేరకు విజయం సాధించగలిగిందో, ఏ మేరకు విజయం సాధించలేకపోయిందో ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల్లో అందే వైద్య సేవల నేపథ్యంలో ఓసారి పరిశీలించవలసిన అవసరం ఉంది. ఇలాంటి దాడుల్ని కొనసాగనివ్వమనీ, తక్షణమే పరిష్కారం కావాలనీ జూనియర్ డాక్టర్లు వారం రోజులు సమ్మెచేశారు. ఈ సమ్మె ఇక్కడితో ఆగలేదు. దగ్గరలోనే ఉన్న అత్యంత ప్రతిష్ఠాత్మకమైన పిజి ఆసుపత్రికి ఈ సమ్మె పాకింది. మొత్తంగా అన్ని టీచింగ్ ఆసుపత్రుల్లోకి ఇది వ్యాపించింది. బెంగాల్‌లోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లో కూడా ఈ సమ్మె కొనసాగింది.

గతంలో దేశ సమస్యల పట్ల ఎల్లప్పుడూ స్పందించే యువత గత కొన్ని సంవత్సరాలుగా రాజకీయాలు, ప్రజా సమస్యలు తమవి కావని కెరియర్ వేటలో తప్పుడు తర్కంతో కనుమరుగయింది. మీడియా కూడా అలానే వంతపాడింది. దాంతో పాటు కొనసాగిన డిజిటల్ విప్లవం, అత్యంత చవగ్గా లభించే జియో ఇంటర్నెట్ కారణంగా యువత దేశ సమస్యలను రాజకీయ నాయకులే పరిష్కరిస్తారని, వాటికి స్పందించడం తమ పని కాదనీ స్మార్ట్‌ఫోన్‌లకు అతుక్కుపోయింది. కానీ, మొత్తం రాష్ట్ర ప్రభుత్వాన్నీ, దేశాన్నీ ఇబ్బందికర పరిస్థితుల్లోకి నెట్టేసిన ఈ వైద్యుల సమ్మె ప్రజా సమస్యల పట్ల యువత నిజమైన సామాజిక బాధ్యతని మరలా గుర్తుచేసింది. యువత ఉద్యమం చేసి సమస్యలను ఎలా పరిష్కరించగలదో మరోసారి రుజువు చేసింది. సమ్మె యువతతోనే ఆగలేదు. వీరికి మద్దతుగా సీనియర్ డాక్టర్లు కూడా స్పందించారు.

దేశంలో హిందూత్వ శక్తుల బలంగా ఎదిరించే బలమైన సంఘటిత రూపంలో ప్రత్యామ్నాయ శక్తులేవీ కనబడడం లేదు. రామజన్మ భూమి యాత్రను దృఢంగా ఎదుర్కొన్న లాలూ అవినీతి ఆరోపణలో కూరుకపోయి జైల్లో ఊచలు లేక్కపెడుతున్నాడు. దళిత–బహుజన ఐక్యకూటమి పేరుతో పదవీ కాంక్షతోనైనా ఏకమైన మాయావతి–అఖిలేష్ తొలి అడుగులోనే చతికిలబడ్డారు. ఇక ఆ కూటమి ఉంటుందో, ఊడుతుందో ఎవ్వరికీ తెలియదు. మాయావతి పదవి కోసం ఎవ్వరితోనైనా చేతులు కలిపే వ్యక్తి అని గత చరిత్ర చెబుతోంది. ఈ ఎన్నికలలో కూడా తనను ఎవరు ప్రధానమంత్రిగా ప్రతిపాదిస్తారో వారికి తన మద్దతు అని ముందుగానే తన పదవీకాంక్షను స్పష్టం చేసింది.

అయినా పార్లమెంటరీ వ్యవస్థలో నిబద్ధత, నిజాయితీగలవారిని వేదకడం గొంగలిలో అన్నం తింటూ వెంట్రుకలను ఏరడం లాంటి వ్యర్థ ప్రయాసనే. ఇక గ్రాండ్ ఓల్డ్ పార్టీ కాంగ్రెస్‌ను వృద్ధాశ్రమంలో చేర్చాల్సిన తరుణం.

పాపం వామపక్షాలు నిలువనీడలేక నిరాశ్రుయులయ్యారు. కనీసం, మాటలలోనైనా నయా ఉదారవాద విధానాన్ని వ్యతిరేకిస్తూ, రైతు, కూలీల కోసం కార్మికుల కోసం గొంతువిప్పే వీరూ కనుమరుగు కావడంతో ఆ అభాగ్యుల గురించి పార్లమెంటులో మాట్లాడేవారే ఉండరు. కేరళలో చావుదెబ్బ తిన్నారు. బెంగాల్‌లో మమత దెబ్బలకు తాళలేక, కమలం నీడలో సేదతీరడంతో తమ అస్తిత్వాన్ని కోల్పోవడం ఒక విషాదం.

ఇక మిగిలింది విప్లవశక్తులు. కొద్దిమంది ప్రజాస్వామిక, ప్రగతిశీల మేధావులు. ఈ రెండో రకానికి ఇప్పటికే పాలకులిచ్చిన ఘాటైన హెచ్చరిక ప్రొ. సాయిబాబా, వివి, సోమాసేన్, సుజాతభారద్వాజ్, లాంటివారి అక్రమ నిర్భందం. ఇది, కొంతమంది మేధావుల్లోనైన పునరాలోచనకు దారితీసింది. విప్లశక్తులు తమ ఉనికిని కాపాడే ప్రయత్నం లోనే సతమతమవుతున్నాయి. వారిది జీవన్మరణ పరిస్థితి. జెఎన్‌యు లాంటి విశ్వవిద్యాలయాలు ప్రగతిశీల విద్యార్థులకు స్థావరాలై పాలకు గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన పరిస్థితి ఉండేది. కాని కమలనాథుల విద్యారంగ ఆక్రమణతో అక్కడి విద్యార్థి, అధ్యాపకుల పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. అయినా పీలగానైనా నిరసన ధ్వనులు విన్పిస్తూనే ఉన్నాయి. అంతర్జాతీయంగా కూడా ప్రజాస్వామికవాదుల సంఘీభావ ప్రకటనలు ఇక్కడి నిరసన గొంతుకలకు బలం చేకూర్చుతున్నాయి.

ఆదివాసీ పోరాటాలు మనకు సందేశాలందిస్తున్నాయి. పోరు తప్ప వేరు దారిలేదని తెలియజేస్తున్నాయి. ఇప్పటికైనా పీడిత కులాలు, వర్గాలు మేల్కొనకపోతే, కమ్యూనిస్టులు, ప్రజాస్వామికవాదులు, దళితులు, మైనారిటీలు సంఘటితం గాకపోతే ఫాసిస్ట్ పాలన ఎవ్వర్నీ వదలి పెట్టదు. అప్పుడు జర్మనీలో, ఇటలీలో జరిగిన మారణహోమం ఇక్కడ జరిగే అవకాశం ఉంది. అయితే, ఫాసిజంను ఎదుర్కొనే సైద్ధాంతిక శక్తి, త్యాగ నిరతి ఉండేది కమ్యూనిస్టులకేననేది చరిత్ర చెబుతున్న సత్యం. ప్రఖ్యాత చరిత్రకారుడు సుమిత్ సర్కార్ చెప్పినట్టు భౌతిక, భావజాల రెండు రంగాలలో హిందూ ఫాసిజంను ఎదుర్కొనే తరుణమిది. అయితే హిందువులంతా హిందూత్వ వాదులు కాదనే విషయాన్ని గమనంలోకి తీసుకోవాలి. స్వేచ్ఛ కోసం, ప్రజాస్వామ్య హక్కుల కోసం గిరిగీసి నిలబడదామా, మౌనంగా ఉండి బానిస బతుకులీడుస్తూ, భవిష్యత్తరం ముందు దోషులుగా నిలబడుదామా అనేది నేటి బుద్ధిజీవుల ముందున్న ప్రశ్న.

(రచయిత విరసం సభ్యులు) వీ

వందల సంఖ్యలో వివిధ మెడికల్ కాలేజీల నుండి నిరసనగా సీనియర్ వైద్యులు రిజైన్ చేశారు. ఓపిడిలు మూతపడ్డాయి. దూర గ్రామాల నుండి వైద్యం కోసం వచ్చిన రోగులకు ఏంచెయ్యాలో తెలీని పరిస్థితి. ఎమర్జెన్సీ వైద్యం తప్ప మరే వైద్యం ప్రజలకు లభించలేదు. వీరికి నైతిక మద్దతుగా ఒక రోజు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ యావత్భారత దేశంలో సమ్మెచేసింది. ఇలాంటి ఆకృత్యాలు పునరావృతం కాకుండా ఉండడానికి ఒక ప్రత్యేక బిల్లు కోసం ఐఎంఏ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండు చేసింది.

జూనియర్ వైద్యులు ఏం కోరుకున్నారు?

తాము సురక్షితంగా పని చెయ్యగలిగే వాతావరణం కావాలి. ప్రభుత్వం అలాంటి సురక్షితమైన వాతావరణం కల్పించాలి. ఎవరు పడితే వారు ఆసుపత్రిలోకి ప్రవేశించి వైద్యులపై చెయ్యి చేసుకునే నేరాల్ని ఆపాలి. ఆసుపత్రి ఆవరణ కట్టుదిట్టంగా సురక్షితంగా ఉండాలి. వైద్యం అందించడం వైద్యుల బాధ్యత. వైద్యులకు, వైద్యం అందించే ఇతర సంబంధిత ఉద్యోగులకు రక్షణనివ్వడం ప్రభుత్వం బాధ్యత. తాము కోరిన విధంగానే ప్రభుత్వం స్పందించింది. వైద్యులతో నబన్నలో జరిగిన సమావేశం చారిత్రాత్మకంగా సమ్మె చేస్తున్న వైద్యుల డిమాండు మేరకు రాష్ట్రం మొత్తం టెలికాస్ట్ అయింది. మొత్తం రాష్ట్ర ప్రజలు టెలివిజన్లో గంటకు పైగా నడిచిన ఈ చారిత్రాత్మక సమావేశాన్ని ప్రజాస్వామ్యంలో ప్రజలకు సంబంధించినది ఏదీ రహస్యం కాదనీ, ఇది ప్రజల హక్కు అనీ జూనియర్ వైద్యులు రుజువు చెయ్యడం మంచి పరిణామం. కట్టుదిట్ట మైన పోలీసు సిబ్బందిని నోడల్ ఆఫీసర్ల సహాయంతో ఆసుపత్రి దగ్గర ఏర్పరచే ప్రణాళికను ప్రభుత్వం తీసుకుంది. రోగుల కోసం ఒక గ్రీవెన్స్ సెల్ కూడా ఏర్పాటు చెయ్యాలని నిర్ణయించింది. దాంతో సమ్మెకు తెరపడింది. శాంతియుతమైన చర్చలతో సమ్మె ముగిసింది. దాదాపు వారంరోజులు వైద్యానికి నోచుకోని ప్రజలు హాయిగా ఊపిరి పీల్చుకున్నారు.

వైద్యుల కోణం

న్యాయంగా ఆలోచిస్తే, వైద్యులు మెజీషియన్లు కారు. మంచి ఉద్దేశంతో వైద్యం చేసినప్పటికీ ఫలితాలు తారుమారు కావొచ్చు. ఒకే మందు ఒక్కో రోగికి ఒక్కో ఫలితాన్ని చూపించవచ్చు. వైద్యులు అనుభవంతో ఇది తెలుసుకోవలసి ఉంటుంది. అలానే, చాలాసార్లు రోగులు అత్యంత సీరియస్ స్థితిలో ఆసుపత్రికి వస్తారు. వైద్యాన్ని రిసీవ్ చేసుకొనే పరిస్థితిలో కూడా ఉండరు. ఇలాంటి పరిస్థితిలో వైద్యుడు సరయిన ట్రీట్మెంట్ ఇచ్చినప్పటికీ రోగిని రక్షించుకోలేకపోవచ్చు. ఒక గంట ముందు వచ్చి ఉంటే రోగికి అదే మందుతో రక్షించగలిగి ఉండొచ్చు. అయితే, రోగి కుటుంబ సభ్యులు ఆ సమయంలో చాలా ఉద్రిక్తతలో ఉంటారు. ఈ పరిస్థితిని జీర్ణం చేసుకొనే స్థితి ఉండకపోవచ్చు. వైద్యులే సరిగ్గా ట్రీట్మెంట్ ఇవ్వలేదని వారు ఆ సమయంలో నమ్మవచ్చు. మరికొన్నిసార్లు వైద్యులే సరయిన ట్రీట్మెంట్ ఇవ్వకపోయి ఉండొచ్చు. విపరీతమైన పని ఒత్తిడి వల్ల వారు వారి నిబద్ధతను కోల్పోవచ్చు. ఎన్నో ప్రాణాల్ని మంచి వైద్యంతో రక్షించవచ్చు. చాలా జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ ఒక ప్రాణం రక్షించలేకపోవచ్చు. ఇదంతా వైద్యులు కావాలని చేశారని అనడం పొరపాటు. అలా భావించి వైద్యులపై చెయ్యి చేసుకోవడం మరింత అన్యాయం. వైద్యులు నేడు అద్భుతమైన ఆపరేషన్లు చేస్తున్నారు. వైద్య శాస్త్రంలో వచ్చిన అద్భుతమైన పరిశోధనలతో ఎన్నో ప్రాణాల్ని కాపాడగలుగుతున్నారు. యంత్రాల్లో ఎంత ఘన విజయం సాధించినా వైద్యులే లేకపోతే ఇది సాధ్యం కాదు. వైద్యుని చెయ్యి పడకపోతే ఎన్ని గొప్ప యంత్రాలు వైద్యంలో వచ్చినా ప్రయోజనం శూన్యం. కాబట్టి వైద్యుల ప్రయత్నాన్నీ, పనినీ మనం శ్లాఘించాలి గాని, ఆక్రమణ చేసి కొట్టి గాయపడేలా చేసి మన కోపాన్ని నిరూపించకూడదు. ఇది రాక్షసత్వం అవుతుంది. ఒకవేళ అనుకోని అవాంతరం ఎదురయిందని మనకు అనిపిస్తే, చట్టపరమైన మార్గాలను ఆశ్రయించుకోవాలి. పరిష్కారాన్ని నిపుణుల మీదకు విడిచిపెట్టేయ్యాలి. అంతేగాని, వైద్యుల్ని కొట్టడం, గాయపరచడం కిరాతకం. అన్యాయం. అమానుషం. ఇందులో సందేహం లేదు. చావు అంచుని చూసిన వేల కొలది రోగులకు సరయిన సమయంలో సరయిన మందుని, ట్రీట్మెంట్ ని అందించి మరో జీవితాన్ని అందించే వైద్యుల్ని అమానుషంగా కొట్టడం, తల పగిలేలా గాయపరచడం ఆటవికం. మానవజాతి సహించలేని నేరం. ఇది నాణేనికి ఒక వైపు కోణం. వైద్యంవైపు, మానవత్వం వైపు నుండి చూస్తే ఇదంతా సవ్యంగానే ఉన్నట్టు అనిపిస్తుంది.

రోగుల కోణం

నాణానికి మరో వైపు చూస్తే, కొట్టడానికో, వైద్యుల్ని గాయపరచ డానికో రోగులు ఆసుపత్రిలోకి రారు. చాలా సీరియస్గా ఉన్న తమ కుటుంబ సభ్యులని లేదా స్నేహితుల్ని తీసుకొని వస్తారు. ఆ సమయంలో వారి ముఖాల్లో ఉద్వేగం ఉంటుంది. భయాందోళన ఉంటుంది. ఘర్షణ ఉంటుంది. చాలా పేదవారు అయితే, ఏం చెయ్యాలో పాలుపోని అస్థిరత ఉంటుంది. ఆందోళన ఉంటుంది. ఏదయినా మేజిక్ జరిగి తమ మనుషులు నయమైపోతే ఎంత బాగున్ను అని వారికి అనిపిస్తుంది. వైద్యుల్ని చాలా ఆశగా చూస్తారు. ఏదో మాయ చేసేసి తమ మనుషుల్ని నయం చేసెయ్యండి అన్నట్టు గంపెడు ఆశతో చూస్తారు. తమ రోగులు చాలా సీరియస్ అయిపోతుంటే రోగి దగ్గరకు వైద్యులు రాకపోతేనో లేదా వైద్యులు మరో దగ్గర బిజీ అయి సమయానికి చూడకపోయే పరిస్థితి కనిపిస్తే వారు చాలా ఉద్విఘ్నతకు గురవుతారు. ఇది మానసికం. మనస్తత్వ శాస్త్రవేత్తలే ఈ విషయంలో సరిగ్గా చెప్పగలరు.

చాలా ఆసుపత్రులలో పరిస్థితులు రోగికి అనుకూలంగా ఎల్లవేళలా ఉండవు. వైద్యుల సంఖ్య తగ్గి రోగుల సంఖ్య పెరుగుతోంది. పదవీ విరమణ తర్వాత ఆ స్థానంలో మరో వైద్యుడు నియామకం కావడం లేదు. ఉన్న వైద్యుల మీద ఒత్తిడి ఉంది. మొత్తం భారతదేశం పరిస్థితి ఇది. దాదాపు అన్ని రంగాలలో ఇలాంటి పరిస్థితి ఉంది. వైద్యుల సమ్మె తమ రక్షణ విషయం తప్ప ప్రజలకు సంబంధించిన ఇలాంటి అతి ముఖ్యమైన విషయాలను వైద్యం కోణంలో మాట్లాడలేదు. గ్రీవెన్సు సెల్ అనే ఒక్క విషయం విడిచిపెడితే, రోగులు ఎదుర్కొనే ఇతర సమస్యల విషయంలో ఏం పరిష్కారాలు జరిగాయో తెలీడం లేదు. ఆసుపత్రుల్లో రోగుల్ని ఆందోళనతో అంబులెన్సులలో మోసుకొచ్చిన ప్రతి ఒక్కరు తిరగబడాలన్న ఆలోచనతో రాళ్లుపట్టుకొని రారు. వీరి ఉద్దేశం కూడా అది కాకపోవచ్చు.

మరి ఇలాంటి సంఘటనలు ఎందుకు జరుగుతున్నాయి? ఒక్క రాష్ట్రమే కాదు, మొత్తం భారతదేశంలో చూస్తే, వైద్యం చాలా దీనస్థితిలో ఉంది. ఉత్తరప్రదేశ్లో ఆక్సిజన్ సిలిండర్ల ఉదంతం మనం చూశాం. ఎంతోమంది చిన్నారులు బలయ్యారు. ఇటీవల ముజఫ్ఫర్నగర్లో ఎన్సెఫలైటిస్కు గురై ఎంతోమంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. వెల్లోర్ సిఎంసి వైద్యుల ప్రకారం, రాత్రి పడుకునే ముందు పిల్లలకు

కాస్తంత ఆహారం పెట్టేస్తే ఎన్నో ప్రాణాలను కాపాడుకోగలిగే అవకాశం ఉంటుంది. ఇంతేకాకుండా వీరు తమ అధ్యయనంలో వైద్యులకు ఇలాంటి జబ్బుల విషయంలో, ఇలాంటి కేసుల్ని ఎదుర్కోవడం విషయంలో సలహాలను ఇంతకుముందే అందించారు. అది కూడా అమలు జరిగినట్టులేదు.

జబ్బుకు గురైన పిల్లలు, చనిపోయిన పిల్లలు ఎక్కువమంది పేదపిల్లలే. పోషకాహార లోపంతో బాధపడుతున్న పిల్లలే. రాత్రి భోజనం చెయ్యకుండా పడుకున్న పిల్లలే ఎక్కువ. వ్యవస్థ నిర్దయకు, బ్యూరోక్రసికి ఇవి సాక్షాలు. వైద్యం పబ్లిక్, ప్రైవేట్ అని రెండు భాగాలుగా విడిపోయి ఉంది. ప్రైవేట్ ఆసుపత్రుల్లోనూ, కార్పొరేటు ఆసుపత్రుల్లోనూ విపరీతమైన వ్యాపారం నడుస్తోంది. వేల కోట్ల వ్యాపారం నడుస్తోంది. మెడిక్లైముల పేర్లతో, ఒక్కో రోగం మెడిక్లెం పేరుతో క్రిటికల్ డిసీజ్ అంటూ, క్యాన్సర్ అంటూ రకరకాల పేర్లతో జబ్బులతో వ్యాపారం నడుస్తోంది. అలా నడవగలిగే పరిస్థితులు ఉన్నాయి. ప్రైవేట్ ఆసుపత్రులు అంటేనే ప్రజల్లో ఒక భయం కలుగుతోంది. డబ్బులు గుంజే వైద్యులు అక్కడ కనిపిస్తారనే భయం కనిపిస్తోంది. చిన్న జబ్బులకు వేలు లక్షలు మింగేసే పరిస్థితులు ఇక్కడ కనిపిస్తున్నాయి.

ఇక ప్రభుత్వ ఆసుపత్రుల విషయానికి వస్తే, పేదలకు ఈ ఆసుపత్రులు న్యాయం చెయ్యడం లేదని అనడం సరయినది కాదు. పేదలకు సమస్యలు వస్తే ఈ ఆసుపత్రులకు రావలసిందే. అతి తక్కువ డబ్బులకు లేదా చాలాసార్లు ఉచితంగానే వైద్యం అందుతుంది. పేదలను ఇలా ఇవి ఆదుకుంటున్నాయి. అయితే ఎల్లవేళలా ఈ విషయం సరయినది కాదు. చాలా ఆసుపత్రుల్లో వైద్యుల పదవీ విరమణ తర్వాత నియామకాలు జరగడం లేదు. ఉన్న వైద్యులే చాలా పని ఒత్తిడిలో పనిచేసే పరిస్థితులు లేకపోలేదు. సబ్ డివిజన్ ఆసుపత్రుల్లో ఒక బెడ్‌ను ఇద్దరేసి రోగులు షేర్ చేసుకోవాల్సిన గడ్డు పరిస్థితి ఉంది. సెలైన్ సీసాల్ని నర్సులు కాకుండా గ్రూప్ డి వారు కూడా అమర్చే గడ్డు పరిస్థితులు ఉన్నాయి. నగరాలలోని ఆసుపత్రుల్లో ఎమెర్జెన్సీ వార్డుల పరిస్థితి భయానకంగా ఉంటుంది. రోగులు బెడ్‌లు లేక నేల మీద పడుకోవలసి వస్తుంది. కొన్నిసార్లు ఒక రోగి ఎమెర్జెన్సీలో ఒక ఆసుపత్రి తర్వాత మరో ఆసుపత్రి, మరో ఆసుపత్రి తర్వాత ఇంకో ఆసుపత్రీ ఇలా తిరగాల్సిన పరిస్థితులు ఉన్నాయి. రోగుల్ని పట్టుకొని కొన్ని స్ట్రెచర్ల కోసం ఆందోళనతో వేచి చూడాల్సిన పరిస్థితులు రోగులను అడిగితే చెబుతారు.

ఆసుపత్రుల్లో రోగులకు వైద్యం చేసి న్యాయం చేసిన వైద్యులు ఉన్నట్టే, బెడ్ మీద ఉన్న రోగికి సమస్య వస్తే పట్టించుకోని వైద్యులు, నర్సులు కూడా లేకపోలేదు. కారణాలు ఏమైనా కావొచ్చు. ప్రభుత్వ వైద్యుల ప్రైవేట్ ప్రాక్టీసు నడవడం లేదనలేం. రోగులకు ఏవైనా టెస్టులు రాస్తే వారిని తీసుకెళ్లే ఆసుపత్రి సిబ్బంది చాలా సార్లు కనిపించరు. రోగుల ఇంటి మనుషులే ఈ పని చెయ్యాలి చాలా సార్లు. ఒక కుటుంబ సభ్యుడు ఆసుపత్రిలో చేరితే, మరో కుటుంబ సభ్యుడు లేదా కనీసం ఇద్దరు ఇరవై నాలుగు గంటలు ఆసుపత్రి ఆవరణలో ఎప్పుడు పిలుస్తారో అని ఆందోళనతో వడిగాపులు పడాల్సిందే.

వైద్యరంగం నేడు మనం ఊహించి నంత పవిత్రంగా, నిజాయితీగా లేదు. బహుళజాతి కంపెనీలు భారతదేశం వైద్య రంగాన్ని కైవశం చేసుకొని ఉన్నాయి. వైద్యంలోని విభిన్నమైన అంశాలను ఈ కంపెనీలు నియంత్రిస్తున్నాయి. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పరిశోధన ప్రకారం, నాణ్యతలేని మోకాలి చిప్పలు కూడా ఎంతోమంది రోగుల మోకాళ్లో అతికి వారికి నరకాన్ని చూపించే గడ్డు పరిస్థితి ఉంది. వైద్యుల దగ్గర మెడికల్ రిప్రజెంటేటివ్‌ల క్యూ కనిపిస్తుంది. వైద్య శాస్త్రంలో చదివిన మందుల కంటే వీరు సూచించిన మందులే వైద్యులు రాస్తారు. డాక్టర్ల సెమినార్లకు పెద్ద పెద్ద మందుల కంపెనీలు నేడు స్పాన్సర్ చేస్తున్నాయి.

మందులు అతి తక్కువ ధరలో దొరుకుతున్నప్పటికి కంపెనీల ఫ్రీబీల వెర్రిలో పడి చాలా మంది వైద్యులు బ్రాండెడ్ మాత్రలు,తక్కువ ధరకు దొరుకుతున్నా ఎక్కువ ధర మాత్రలు రాస్తున్నారు. అనవసరమైన టెస్టులు రాస్తున్నారు. టెస్టులు లేనిదే వీరు వైద్యం చెయ్యని స్థాయికి దిగజారారు. ఆ టెస్టులు ఎక్కడ చెయ్యాలో వీరే చెబుతారు. మరో దగ్గర చేసి వెళితే పరిగణనలోకి తీసుకోరు. డబ్బు సంపాదనే ధ్యేయంగా వైద్య రంగంలో చేరిన యువకులు వైద్యులుగా మారిన తర్వాత వారినుండి నైతిక విలువల్ని ఆశించగలమా? ఆపరేషన్‌లను వ్యాపారంగా మార్చేసిన వింత పరిస్థితులు ఉన్నాయి. కార్పొరేటు ఆసుపత్రుల్లో కూర్చున్న వైద్యులకు టార్గెట్లు ఉంటాయి. ఈ టార్గెట్ల ప్రకారం ఎంఆర్ఐ అవసరం లేకపోయినా, అది రాస్తారు. స్వాతంత్ర్యం తర్వాత డెబ్బయి సంవత్సరాలు దాటినా విద్య, వైద్యంలోని వ్యాపారం పబ్లిక్ ప్రైవేట్ అని రెండు భాగాలుగా విడిపోయి ఉంది. ఇంగ్లాండ్ ఆస్ట్రేలియా లాంటి పెట్టుబడిదారీ దేశాలు వైద్యంలో సాధించిన కనీస ప్రమాణాలను మనం స్వాతంత్ర్యం వచ్చిన డెబ్భై సంవత్సరాల తర్వాత కూడా అందించలేకపోతున్నాం.

ఎన్నో రకాల పన్నుల్ని భరిస్తున్న భారతీయుడికి వైద్యం అనేది హక్కు. ఏదో దయతో అందించే స్కీము కాదు. ఒక బెడ్ మీద ఇద్దరు రోగులు పడుకోవలసిన పరిస్థితులు, జబ్బుల్ని పంచుకోవలసిన దయనీయ పరిస్థితులు ఎందుకు ఉన్నాయి? రోగిని పట్టుకొని స్ట్రేచర్ కోసం ఆందోళనతో వెదకాల్సిన పరిస్థితులు ఎందుకు ఉన్నాయి? వైద్యుల సమ్మె, దానికి మద్దతుగా భారతీయ మెడికల్ అసోసియేసన్ సమ్మె ఇలాంటి ప్రజలకు అవసరమైన అతి ముఖ్యమైన విషయాలను చర్చించలేదు. తమ సంఘంలోని వైద్యులు నిజాయితీగా, ప్రజాస్వామ్యబద్ధంగా, బడా బహుళ జాతి సంస్థల ఫేబిలకు లొంగకుండా సేవలందించే పరిస్థితుల గురించి మాట్లాడలేదు. ఆసుపత్రుల్లో వైద్యుల నియామకాల విషయంలో మాట్లాడలేదు.

మౌలిక సమస్యలను తాకని సమ్మె

ఇలా వైద్యుల సమ్మె కేవలం పై పై విషయాలను మాత్రమే తాకింది. కొండని తవ్వి ఎలకను కూడా పట్టనట్టు రాష్ట్రం మొత్తం మీద గొప్ప హంగామా చేసేసి చివరికి సాధించినది ప్రజల కోణంలో ఏమీ లేదు. ప్రజలు తిరగబడుతున్నారు అంటే, తిరగబడిన ప్రజలందరు సంఘ విద్రోహులు కాదు. రక్త దాన శిబిరాల్లో స్వేచ్ఛా రక్తదానం ఇచ్చి తమ సామాజిక బాధ్యతను రుజువు చేసుకునేది ఇలాంటి యువతే. ఈ సాధారణ ప్రజలే, ఆసుపత్రిలో సరయిన వైద్యం ఆశించడం రోగి, రోగి బంధువుల హక్కు. అది ప్రభుత్వ ఆసుపత్రి అయినా, ప్రైవేట్ ఆసుపత్రి అయినా సరే ఇదే జరగాలి. విపరీతమైన బిల్లుల నుంచి రోగుల్ని కాపాడే బాధ్యత కూడా ప్రభుత్వానిదే. వైద్యులకు రక్షణను అందించడం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల బాధ్యత. అయితే, రోగికి సరైనవైద్యం అందించడం కూడా ప్రభుత్వాల బాధ్యతే. వైద్యుల సమ్మె పోలీసుల సహాయంతో రక్షణను తప్పించి, గ్రీవెన్స్ తప్పించి మరో ఎజెండా గురించి మాట్లాడలేదు. సరైన వైద్యం అందడంలో వైద్యుల నియామకాలు తప్పనిసరి. ఆసుపత్రుల నిర్వహణలో మరింత నిబద్ధత, ప్లానింగ్ అవసరం.

ఆసుపత్రులకు కావలసింది విసిరే రాళ్ల నుండి రక్షణ మాత్రమే కాదు, రాళ్ల అవసరం లేని వైద్య సేవలు. వైద్యునికీ, రోగికీ మధ్య ఘర్షణలే అవసరం లేని నమ్మకంతో కూడిన స్నేహపూరితమైన ఆరోగ్య

వ్యవస్థ. పబ్లిక్ ఆసుపత్రి అయినా, ప్రైవేట్ ఆసుపత్రి అయినా ఇదే నిజం. ఇది ఒక్క వైద్యుల వల్ల మాత్రమే సాధ్యం కాదు. వ్యవస్థాపరమైన మార్పులు ఇందుకు జరగాలి. ఒక్క పోలీసు సెక్యూరిటి పెంచేసినంత మాత్రాన ఇది సాధ్యం కాదు. వైద్యులకు మద్దతుగా దేశం మొత్తం మీద సమ్మె చేసిన వైద్యుల సంఘం తమ వైద్య సభ్యులు రోగుల పట్ల సేవ చెయ్యడంలో కార్పొరేట్ బడా కంపెనీల వలయంలో పడి తమ పవిత్రమైన వృత్తిని అపవిత్రంగా మార్చకుండా జాగ్రత్త పడేలా సూచనలివ్వాలి. రోగికీ, వైద్యునికీ మధ్య పవిత్రమైన బంధంలో మందుల కంపెనీలు తమ వ్యాపార ప్రయోజనాల కోసం, లాభాల గుట్టల్ని పెంచుకోవడానికోసం వైద్యుల్ని ప్రలోభపెట్టి రోగులకు నష్టం కాకుండా చూసే బాధ్యత వైద్యుల సంఘాలకూ, ప్రభుత్వానికీ ఉంది. ఆసుపత్రుల్లో అయితే వైద్యునికి జీతం దొరుకుతుంది. ప్రైవేట్‌గా అయితే ఎంత ఫీజు తీసుకుంటారో అది రోగి చెల్లిస్తాడు. ప్రైవేట్ ఆసుపత్రులు అయితే అక్కడ కూడా వైద్యునికి జీతం దొరుకుతుంది.

మెడిసిన్ చదువు కూడా ప్రభుత్వం సబ్సిడీలతోనే నడుస్తుంది. సమస్య ఇంత సరళంగా ఉంటే వైద్య రంగంలో ఏరకమైన ఇబ్బందులు ఉండవు. సాఫీగానే నడుస్తుంది. కానీ, వాస్తవ ప్రపంచంలో వైద్య రంగం ఇంత సహజంగా లేదు. కమీషన్ల కోసం రోగికి అవసరంలేని టెస్టులు రాసి రోగి ఖర్చు పెంచే పరిస్థితులు మారాలి. ఒక మందు అతి తక్కువ ధరకి లభిస్తుండగా మందుల కంపెనీల కమీషన్ల కోసం ఎక్కువ ధర మందులు రాయడం, ఆ మందు కోసం రోగికి ఇంట్లో ఉంచి దాదాపు ఓ ఇరవై దుకాణాలు తిరగడం, మందు అసలు కంపోజిసన్ వైద్యుడు రాయక పోవడం అనే పద్ధతి మార్చాలి. ఇవన్నీ ప్రభుత్వ నియంత్రణలోకి రావాలి.

కొన్ని వేల మంది వైద్యులు, ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు ఉన్నప్పటికీ వెల్లోర్‌లో పశ్చిమ బెంగాల్ నుండి రోగుల రష్ ఎందుకు పెరుగుతుందో సర్వే చేసి పొరపాట్లను సవరించగలగాలి. కార్పొరేట్ ఆసుపత్రుల్లో కౌంటర్ల బిల్లుకి బయట వైద్యులు కూడా క్యాష్ రూపంలో ఫీజు ఎందుకు తీసుకుంటున్నారో జిఎస్‌టి, నల్లధనం రూపుమాపేస్తామని దంకా కొట్టే ప్రభుత్వాలు పరిశోధనలు చెయ్యాలి. రోగుల ఇబ్బందులు తెలుసుకోవాలి. ఆసుపత్రి నుండి శవాన్ని మోసుకెళ్లి లేదా సైకిలు మీద గ్రామాల్లోని తమ ఇళ్లకు తీసుకెళ్లే దయనీయమైన పరిస్థితి స్వాతంత్ర్యం సంపాదించిన డెబ్భై సంవత్సరాల తర్వాత కూడా అక్కడక్కడా ఉంది. అత్యంత పెద్ద ప్రజాస్వామ్యం అని భుజాలు ఎగురవేసే మనం ఈ దయనీయమైన పరిస్థితిలో మార్పు తేకుండా ఊరికే రోగుల కుటుంబాలను విమర్శించి లాభం లేదు.

వైద్యంలో క్యూబా అద్భుతమైన ఫలితాల్ని సాధించింది. ఇదే దారిలో ఆసుపత్రుల నిర్వహణలో విప్లవాత్మకమైన మార్పులు అవసరం. వైద్యంలో జరుగుతున్న దోపిడిని అరికట్టే నిబద్ధత వ్యవస్థ నిర్మాతలకు ఉండాలి. ఆరోగ్యం కోసం కేంద్రం బడ్జెట్‌లో కేటాయింపులు పెరగాలి. ఆసుపత్రుల్లో నియామకాలు యుద్ధ ప్రాతిపదిక మీద జరగాలి. ఆసుపత్రుల సంఖ్య పెరగాలి. ఇవేవీ కాకుండా సెక్యూరిటీలు పెంచేసినంత మాత్రాన ప్రయోజనం ఉండదు.

ప్రపంచీకరణ మాయాజాలంలో 'ఆరోగ్యం'

1990ల నుండి వీచిన ప్రపంచీకరణ పవనాలు వైద్యం రూపురేఖలనే మార్చేశాయి. ఇంతకు ముందు వైద్యం అంటే 'రోగిని నయం చేయడమే' ధ్యేయంగా ఉండేది. నేడు రోగి మెడ ఒంచి వ్యాపారం చేసుకొని లాభాల పంటలు పండించడమే ధ్యేయంగా మారింది. వైద్యం ప్రభుత్వం చేతుల్లో నుండి పిపిపి మోడల్‌లోకి మారిపోయింది. ఈ మోడల్‌లో అత్యంత చవగ్గా ఆసుపత్రుల కోసం ప్రభుత్వం నుండి భూమిని కార్పొరేట్లు సంపాదిస్తారు. ఇంకెన్నో రాయితీలను సంపాదిస్తారు. కానీ వైద్యసేవల్ని ప్రజలకు అందించేటప్పుడు ఫీజు చెల్లించలేదని శవాల్ని కూడా ఇవ్వకుండా కనీస మానవతా విలువల్ని పాటించని సంఘటనలు అక్కడక్కడా చూశాం.

ప్రపంచీకరణలో వైద్యం 'సేవ' నుండి 'వ్యాపార సరుకు' అయిపోయింది. విజ్ఞానశాస్త్రంలో వచ్చిన ఆధునాతన మార్పుని ప్రైవేట్ ఆసుపత్రులు తమకు అణుగుణంగా మార్చుకుంటున్నాయి. రోగ నిర్ధారణ పేరు మీద, డయగ్నొసిస్ పేరు మీద విపరీతమైన వ్యాపారం నడుస్తోంది. డాక్టర్ అరుణ్ గాద్రే, డాక్టర్ అభయ్ శుక్లల అధ్యయనం ప్రకారం ఎంఆర్ఐ, సిటి స్కాన్‌లకు కొంతమంది వైద్యులకు 30 శాతం వరకు కమీషన్లు దొరుకుతున్నాయి.

పవిత్రమైన వైద్యవృత్తిలో చీకటి కోణాలు ఎలా ప్రవేశించాయో, వైద్యవృత్తి ఎంతగా అనైతికంగా మారిపోయిందో, ప్రపంచీకరణ అంటు జాడ్యాలైన కక్కుర్తి, అనైతిక ధోరణులు, కార్పొరేట్ల చొరవ వైద్య వృత్తిని ఎంతగా ప్రభావం చేస్తుందో, రోగులకు ఏ విధంగా అన్యాయం జరుగుతుందో వీరి అధ్యయనమే తెలియజేస్తుంది. 'వైద్యానికి సుస్తీ' అనే పుస్తకంలో వైద్యం చీకటి కోణాలను మనం చూడొచ్చు. ఒకవైపు మందుల కంపెనీలు, మరోవైపు ఇన్సురెన్సు కంపెనీలు, ఇంకోవైపు రోగ నిర్ధారణ కంపెనీలు వైద్యుల సహకారంతో మొత్తం వైద్యాన్ని వ్యాపారంగా మార్చేశాయి.

అలాగని మంచి వైద్యులు, ఇప్పటికీ నైతిక విలువల్ని నమ్ముకొని కంపెనీల వలల్లో పడని విలువలున్న వైద్యులు లేకపోలేదు. రోగి మంచికోసమే నిబద్ధతతో పనిచేసే వైద్యులు ఇప్పటికీ ఉన్నారు. కొట్నిష్‌లూ, నార్మన్ బెతూన్‌లూ ఇప్పటికీ ఆసుపత్రుల్లో ఉన్నారు. న్యాయమైన సేవల్ని అందిస్తున్నారు. వైద్యశాస్త్రం పవిత్రతను కాపాడుతున్నారు. మందుల కంపెనీల వలల్లో పడకుండా తమ నైతిక విలువల్ని కాపాడుతూ రోగులకు న్యాయం చేస్తున్నారు.

అయితే, ప్రపంచీకరణ మాయాజాలంలో వీరు మెల్లమెల్లగా అంతరించిపోతారు. 'రక్షణ' పేరు మీద సమ్మె చేసిన జూనియర్ డాక్టర్లు ఒక్క 'రక్షణ' అజెండాని మాత్రమే తీసుకొని విజయం పొందారు. తాత్కాలికంగా గెలుపొందినా ఇది శాశ్వతమైన గెలుపు కాదు. ఆసుపత్రుల్లోని మౌలిక సమస్యలను వీరు కనీసంగానైనా తాకలేదు. భారతదేశంలోని ఏ ఆసుపత్రిలోనయినా మౌలిక సమస్యలు పరిష్కరించ కుండా పోలీసు సిబ్బందిని పెంచేసినంత మాత్రాన సమస్యలు పరిష్కారం అయిపోతాయనుకోవడం అత్యాశే.

సమస్యకున్న విభిన్న పార్శ్వాలు పరిశీలించనంత కాలం, ఆరోగ్యాన్ని, వైద్యాన్ని స్వేచ్ఛా వాణిజ్యం, ప్రపంచీకరణ, నయా ఉదారవాదం సంకెళ్ల నుండి విముక్తి చేయనంత కాలం, ఆసుపత్రుల్లో సమూలమైన మౌలిక మార్పులు చెయ్యనంత కాలం ప్రజలకు సరయిన, న్యాయమైన వైద్య సేవలు ఏ ఆసుపత్రుల నుండి కూడా అందవు. 'సరుకు' నుండి 'హక్కుగా' వైద్యం మారనంతకాలం పొడి పొడి మార్గాల ద్వారా వైద్య సేవల్లో మార్పు రాదు.

(రచయిత ఉపాధ్యాయులు,
'జాగృతి సమీక్ష' త్రైమాసిక పత్రిక సంపాదకులు) వీ

స్వేచ్ఛ కోసం హాంకాంగ్ ఆందోళనలు

హాంకాంగ్ ప్రజలు చైనా మార్చాలనుకుంటున్న చట్టాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారనీ, చైనా నియంతృత్వ విధానాల ద్వారా ఆధిపత్యం నెరపాలనుకుంటుందనీ అంటున్నారు **ఎ. నర్సింహా రెడ్డి**

ప్రపంచ ఆర్థిక కేంద్రాలలో ఒకటిగా ఉంటూ ఎప్పుడూ ప్రశాంతతకు నిలయమై ప్రపంచ ఆర్థిక వ్యవస్థను శాసించే స్థితిలో ఉన్న హాంకాంగ్ నేడు అట్టుడుకుతోంది. అనుమానిత నేరగాళ్లను తమకు అప్పగించాలని చైనా ప్రతిపాదించిన వెంటనే హాంకాంగ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ క్యారీలామ్ ప్రభుత్వం 2019 ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన బిల్లుకు వ్యతిరేకంగా ప్రజలు పెద్దఎత్తున చేపట్టిన ఆందోళనలు, ప్రదర్శనలు ప్రపంచం దృష్టిని ఆకర్షించాయి. ఈ బిల్లుకు నిరసనగా జూన్ 9న లక్షలాది మంది రోడ్డు పైకి రావడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ప్రదర్శకులు ముసుగులతో పార్లమెంట్‌ను చుట్టుముట్టడంతో హాంకాంగ్ స్తంభించిపోయింది. తమ డిమాండ్లను గోడలపై రాశారు. అదుపు చేసేందుకు ప్రయత్నించిన పోలీసులతో ఘర్షణకు దిగారు. రాత్రి వరకు ఈ ఉద్రిక్తత కొనసాగింది. ప్రదర్శనకారులపై బాష్పవాయు గోళాలు, లాఠీచార్జి చేసినా పరిస్థితి అదుపులోకి రాలేదు. అతికష్టంమీద ప్రదర్శనకారులను వెనక్కి తిరిగి వెళ్లేలా పోలీసులు చేయగలిగారు.

చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ తన రాజకీయ ప్రత్యర్థులపై ఉక్కుపాదం మోపడానికి తెర వెనుక పావులు కదుపుతుంటే, తమ ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం హాంకాంగ్ ప్రజలు తీవ్రంగా ప్రతిఘటిస్తున్నారు. అయితే, నేరగాళ్లకు ఆశ్రయంగా మారకుండా చేయడానికి, నేరగాళ్లను శిక్షించడంలో ఉన్న లోపాలను సరిదిద్దడానికి ఈ సవరణ బిల్లు అవసరమని క్యారీలామ్ ప్రభుత్వం చెబుతుంది. అయితే ఇప్పటికే అనేక రకాలుగా హాంకాంగ్‌పై ఆధిపత్యం చలాయిస్తున్న చైనా ఈ చట్టంతో హాంకాంగ్‌లోని రాజకీయ ప్రత్యర్థులను చైనాకు రప్పించి శిక్షించడమే ధ్యేయంగా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తుందని హాంకాంగ్ ప్రజలు అనుమానిస్తున్నారు. హాంకాంగ్‌లో నేరస్తుల అప్పగింత బిల్లుకు వ్యతిరేకంగా ప్రజా ఆందోళన తీవ్రమవడంతో వివాదస్పద నేరగాళ్ల అప్పగింత బిల్లును చీఫ్ ఎగ్జిక్యూటివ్ క్యారీలామ్ జూన్ 15న వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. ఐనా ఈ బిల్లును పూర్తిగా రద్దు చేసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆందోళన కొనసాగిస్తున్నారు.

బ్రిటిష్ పరిపాలన నుంచి హాంకాంగ్ బయటపడిన జూలై 1, 1997ను గుర్తు చేసుకుంటూ 2019 జూలై 1న నిరసన ప్రదర్శనలు, విధ్వంసాలు జరిగాయి. రోడ్లన్నీ జన సముద్రాన్ని తలపించాయి. జూలై 9 నుంచి జరుగుతున్న శాంతియుత ప్రదర్శనలు ఒక్కసారిగా విధ్వంసానికి దారి తీశాయి. వేల సంఖ్యలో ఆందోళనకారులు పార్లమెంటు (లెజిస్లేటివ్ కౌన్సిల్–లెజ్‌కో)ను దిగ్బంధించారు. వందలమంది బారికేడ్లను విరగ్గొట్టి భవనంలోకి ప్రవేశించారు. గోడలన్నింటిపైనా పెయింటుతో నినాదాలు రాశారు. జాతీయ చిహ్నాన్ని సైతం పెయింట్ జల్లి చెరిపేశారు. అద్దాలను బద్దలు కొట్టారు. ఫర్నిచర్‌ను విరగ్గొట్టారు. తక్షణం పార్లమెంటును విడిచి వెళ్లాలని చైనా భద్రతా సిబ్బంది ఆదేశించినా ఫలితం లేకపోయింది. చివరకు జూలై 1న రాత్రి తుది హెచ్చరిక వెలువడ్డాక అనేకమంది బయటకు వెళ్లిపోయారు. అయినా పలువురు భవనం లోపలే ఉండి చైనా వ్యతిరేక, బ్రిటన్ అనుకూల నినాదాలు చేశారు. కొందరు వలస కాలం నాటి బ్రిటిష్ పతాకాన్ని కూడా ఎగరేయడానికి ప్రయత్నించారు. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు చైనా పోలీసు దళాలు బాష్పవాయుగోళాలను పెద్ద ఎత్తున ప్రయోగించడంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ ఆవరించింది. పరిస్థితి అదుపు తప్పిందని అంతర్జాతీయ వార్తా సంస్థలన్నీ ప్రత్యేక కథనాలు ప్రసారం చేశాయి.

చరిత్రలోకి వెళ్లి చూస్తే 1842లో మొదటి ఓపియమ్ యుద్ధం తర్వాత ట్రీటీ ఆఫ్ నాన్కింగ్ ప్రకారం చైనా రాజు హాంకాంగ్‌ను బ్రిటన్‌కు అప్పగించడంతో హాంకాంగ్ బ్రిటిష్ సామ్రాజ్యంలో ఒక భాగంగా మారింది. ఆ తర్వాత 1898లో బ్రిటన్‌కు 99 సంవత్సరాల కాలానికి హాంకాంగ్‌ను చైనా లీజుకు ఇచ్చింది. 1941లో ఇది జపాన్ చేతిలోకి వెళ్లింది. మళ్లీ 1945లో బ్రిటన్ దీనిని స్వాధీనం చేసుకొంది. 1984లో చైనా–బ్రిటిష్‌ల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం 1997 జూలై 1న హాంకాంగ్‌ను చైనాకు తిరిగి అప్పగించడానికి సమ్మతించింది. బ్రిటన్ హాంకాంగ్‌ను చైనాకు బదిలీ చేసిన తర్వాత 50 సంవత్సరాల వరకు హాంకాంగ్‌కు ప్రత్యేక ప్రతిపత్తిలో ఆర్థిక, రాజకీయ వ్యవస్థల కొనసాగింపుకు చైనా హామీ ఇచ్చింది. దీని ప్రకారం ఒక దేశం–రెండు వ్యవస్థలు అనే సూత్రం కింద హాంకాంగ్ ప్రత్యేకంగా పాలనా, ఆర్థిక వ్యవస్థలను కలిగి ఉంది. 1997 జూలై 1 నుంచి ప్రత్యేక పాలనా ప్రాంతమైన హాంకాంగ్ చైనాకు విడదీయరాని అంతర్భాగంగా మారింది. హాంకాంగ్‌ను అధికారికంగా చైనాకు చెందిన ప్రత్యేక పాలనా ప్రాంతంగా పరిగణిస్తారు. భౌగోళికంగా దక్షిణ చైనాలో నెలకొన్న హాంకాంగ్‌లో వివిధ దేశాలకు చెందిన సుమారు 74 లక్షల మంది ప్రజలు నివసిస్తున్నారు. ప్రపంచంలోని వ్యాపార దిగ్గజాలకు అడ్డాగా మారింది. ప్రపంచంలో హాంకాంగ్ నాల్గవ అతిపెద్ద జనసాంద్రత కలిగిన ప్రాంతం.

హాంకాంగ్‌లో ప్రస్తుతం అమలులో ఉన్న ఫ్యూజిటివ్ అఫెండర్స్ ఆర్డినెన్స్, క్రిమినల్ మ్యాటర్స్ ఆర్డినెన్స్‌కు సవరణలు చేసే ఉద్దేశంతో అఫెండర్స్ అండ్ మ్యూచువల్ లీగల్ అసిస్టెన్స్ ఇన్ క్రిమినల్ మ్యాటర్స్ లెజిస్లేషన్ (అమెండ్‌మెంట్) బిల్లు–2019 ప్రతిపాదించింది. ఈ బిల్లు రూపకల్పనకు 2018 ఫిబ్రవరిలో తైవాన్‌లో జరిగిన ఒక నేరం నాంది పలికింది. హాంకాంగ్‌కు చెందిన ఒక యువకుడు తన స్నేహితురాలితో కలసి తైవాన్ వెళ్లి అక్కడ ఆమెను హత్య చేసి హాంకాంగ్ తిరిగి వచ్చాడు. ప్రస్తుతం ఉన్న చట్టాల ప్రకారం హాంకాంగ్ వెలుపల జరిగిన నేరాలకు గాను నిందితులను హాంకాంగ్‌లో విచారణ జరపటానికి వీలులేదు. అందువలన అతని మీద విచారణ జరపాలంటే తైవాన్‌కు పంపాలి. ఈ పూర్వరంగంలో ఈ నేరస్థుల అప్పగింత బిల్లును 2019 ఫిబ్రవరిలో హాంకాంగ్ ప్రభుత్వం ప్రతిపాదించింది.

తైవాన్‌తో హాంకాంగ్‌కు నేరగాళ్ల అప్పగింత ఒప్పందం లేకపోవడంతో నిందితుడిని అప్పగించడానికి వీలు కాలేదు. ఈ బిల్లు చట్టమయితే నేరగాళ్లను తైవాన్‌కే కాకుండా, చైనాకు, మకావులకు కూడా అప్పగించడానికి వీలవుతుంది. ప్రస్తుతం అమలులో ఉన్న చట్టాల ప్రకారం హాంకాంగ్ 20 దేశాలతో నేరగాళ్ల అప్పగింత ఒప్పందాలు కలిగి ఉంది. వాటిలో బ్రిటన్, అమెరికా, సింగపూర్ వంటి దేశాలు ఉన్నాయి. 1997లో నేరస్తుల అప్పగింత ఒప్పందం ఖరారైనప్పుడు చైనా, తైవాన్‌లను అందులో చేర్చలేదు. హాంకాంగ్ అనుసరిస్తున్న ప్రమాణాలకు ఆ రెండు చోట్లా అమలవుతున్న నేర న్యాయ వ్యవస్థ విరుద్ధం గనుక ఆ నిర్ణయం తీసుకున్నారు. అందుకు చైనా కూడా అంగీకరించింది. ఇప్పుడు ప్రతిపాదించిన బిల్లు వెనుక రాజకీయ ప్రత్యర్థులను అణిచివేసే వ్యూహం చైనాకు లేకపోలేదు. చైనా కమ్యూనిస్టు పార్టీలోని జియాంగ్ జమీన్ వర్గాన్ని అవినీతి సాకుతో జిన్‌పింగ్ అణచివేశారు. 2012 తర్వాత చైనాలో జిన్‌పింగ్ కమ్యూనిస్టు పార్టీలో తిరుగులేని నాయకుడిగా ఎదిగిన సంగతి మనకు తెలిసిందే.

ప్రపంచవ్యాప్తంగా మంచి పర్యాటక ప్రాంతంగా, ఆర్థిక కేంద్రంగా, ఆకర్షణీయ ప్రదేశంగా కనిపించే హాంకాంగ్‌లో బయటి ప్రపంచం ఊహించినంత సులువుగా చైనా–హాంకాంగ్ మధ్య సంబంధాలు లేవు. చైనా పూర్తిగా కమ్యూనిస్టుల అధికారం కొనసాగుతుండగా, హాంకాంగ్‌లో మాత్రం అందుకు పూర్తి విరుద్ధమైన సంస్కృతి నెలకొని ఉన్నది. ప్రపంచవ్యాప్తంగా హాంకాంగ్ సరళీకృత విధానాలతో ఎవరి ఆధిపత్యంలో లేని స్వేచ్ఛాయుత జీవనానికి ప్రతీకగా భావించే ప్రదేశంగా ప్రచారంలో ఉన్నది. చైనాలో కనిపించే నియంత్రణ యంత్రాంగం ఇంతవరకు హాంకాంగ్‌లో ఏర్పడలేదు. రెండు భిన్న ధ్రువాలుగా ఉన్న ప్రాంతాలు ఏకంకావడం అంత తేలికైన అంశం కాదు. దాదాపు రెండు దశాబ్దాల క్రితం వరకు బ్రిటన్ పాలనలో ఉండడంతో ఇప్పటికీ ఆ దేశ ప్రభావం హాంకాంగ్‌లో స్పష్టంగా కనిపిస్తుంది. చైనా–హాంకాంగ్ ఆర్థికంగా ఒకదానితో మరొకటి తీసిపోని విధంగా ఉన్నప్పటికీ ఈ రెండు ప్రాంతాల మధ్య ఒకేదేశంగా బంధం ఏర్పరిచేందుకు అదొక్కటే చాలదు. రెండు ప్రాంతాల మధ్య రాజకీయ, సామాజిక వైరుధ్యాలు, ప్రజల జీవనసరళిలో ఎంతో తారతమ్యం ఉండడం పెద్ద ప్రతిబంధకంగా మారింది.

హాంకాంగ్‌లో ప్రస్తుతం కొనసాగుతున్న ఒకే దేశం... రెండు వ్యవస్థలు విధానం 2047 వరకు కొనసాగాలని గతంలో బ్రిటన్‌తో చైనా ఒప్పందం కుదుర్చుకుంది. దీని ప్రకారం చైనాలో హాంకాంగ్ విలీనం 2047 వరకు పాక్షికమనే భావించాలి. ఆ తరువాతే సంపూర్ణ విలీనం సాధ్యపడుతుంది. ఈలోగానే హాంకాంగ్‌లో తమదైన ముద్ర వేయాలని, ఇది తనలో అంతర్భాగమేనని ప్రపంచదేశాలకు చాటిచెప్పాలని చైనా భావిస్తోంది. హాంకాంగ్ ప్రభుత్వాధినేత అయిన చీఫ్ ఎగ్జిక్యూటివ్‌ను 1200 మంది గల ఎన్నికల కమిటీ ఎన్నుకొంటుంది. ఈ కమిటీ హాంకాంగ్‌లోని 6 శాతం మంది ప్రజలకు మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తుంది. ఇక శాసనసభలో చాలా సీట్లకు ఎన్నికలు ఉండవు. చైనాకు అనుకూలమైన వ్యక్తులే దీనిలో ఉంటారు. చైనా వ్యతిరేకులు శాసనసభకు ఎన్నికైతే వారిని ఏదో కారణంతో బహిష్కరిస్తారు. చైనాలో 2012లో జిన్‌పింగ్ అధికారం చేపట్టాక హాంకాంగ్ ప్రజల మీద నియంతృత్వం పెరిగిపోయింది. 2017 నుంచి అమలులోకి రావల్సిన ప్రజాస్వామ్యయుత ఎన్నికలను వాయిదా వేయడంతో చీఫ్ ఎగ్జిక్యూటివ్ వ్యవస్థే పెద్ద ప్రహసనంగా మారింది.

జిన్‌పింగ్‌కు చైనాలో మరో కమ్యూనిస్టు నేత జియాంగ్ జెమిన్‌తో పోటీ ఉంది. అందుకే 2012లో అధికారం చేపట్టగానే జెమిన్ వర్గానికి చెందిన నాయకులు, అధికారులను అవినీతిపరుల పేరుతో జైళ్లలో వేశారు. హాంకాంగ్‌లోని వ్యాపారవేత్తలు, నాయకుల్లో జెమిన్ అనుకూలురు ఇంకా ఉన్నారు. వీరి నుంచి ఎప్పటికైనా ముప్పు ఉంటుందని భావించిన జిన్‌పింగ్ అక్కడి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి నేరగాళ్ల అప్పగింత బిల్లును తెరపైకి తెచ్చారని ప్రజలు ధృడంగా అభిప్రాయపడుతున్నారు. చైనా పాలకవర్గ విధానాలను, అవినీతిని వ్యతిరేకిస్తూ రాసిన పుస్తకాలను, ప్రచురించినందుకు ఐదుగురు పుస్తక ప్రచురణకర్తలను చైనా ప్రభుత్వం కొద్ది రోజుల క్రితం అరెస్టు చేసి హింసించింది. అంతేకాదు, ఇప్పటికీ చాలా మంది హాంకాంగ్ వాసులు తమను చైనీయులుగా భావించరు.

ఈ క్రమంలో 2047 వరకు అక్కడ ప్రజాస్వామ్యం ఉంటే ఆ తర్వాత అది చైనాలో విలీనం అయ్యేందుకు అంగీకరించకపోవచ్చనే అనుమానాలు కూడా చైనా నాయకులలో ఉంది. అందుకే ఇక్కడ ప్రజాస్వామ్య ఉద్యమకారులను లక్ష్యంగా చేసుకొనేందుకు కూడా ఈ బిల్లును ఉపయోగించనున్నారు. ఇప్పటికే 2014లో ప్రజాస్వామ్యం కోసం భారీఎత్తున అంబ్రెల్లా ఉద్యమం జరిగింది. దీంతో హాంకాంగ్‌లో స్వతహాగా ఉన్న ప్రజాస్వామ్య చట్టాలను నీరుగార్చి కమ్యూనిస్టు ప్రభుత్వ చట్టాలను పోలిన వాటిని అమలు చేయాలని చైనా భావిస్తోంది. చైనా ఆధిపత్యాన్ని తగ్గించేలా విదేశీ శక్తుల ప్రాపకంలో జరిగే ఆందోళనలకు హాంకాంగ్ వేదికైతే సహించేది లేదని జిన్‌పింగ్ రెండేళ్లనాడు హెచ్చరించారు. హాంకాంగ్ 'స్వేచ్ఛనూ' తనదైన రీతిలో అదుపు చెయ్యకపోతే మరో తియనన్మెన్ స్క్వేర్ ప్రమాదం తప్పదేమోనన్నది బీజింగ్ బెదురు. స్వేచ్ఛాప్రియత్వ జాతి లక్షణాన్ని కాపాడుకోలేకపోతే భవిష్యత్తే అగమ్యగోచరమై పోతుందన్నది హాంకాంగ్‌వాసుల వాదన. ఈ నేపథ్యంలోనే హాంకాంగ్‌లో జరుగుతున్న ఆందోళనలు. నేరస్తులను అప్పగించడానికే ఈ చట్టం చేస్తున్నట్టు పైకి చెబుతున్నా, రాజకీయ అసమ్మతిని అణిచివేయడమే అసలు ఉద్దేశమని హాంకాంగ్ ప్రజలు అంటున్నారు.

మావో మరణాంతరం చైనా సోషలిస్టు నిర్మాణాన్ని అటుకెక్కించి, మార్కెట్ సోషలిజం అనే బురఖా తగిలించుకుని, నవ చైనా నిర్మాతగా వాసికెక్కిన డెంగ్ జియావోపింగ్ 1989లో ప్రజాతంత్ర స్వేచ్ఛ కోసం పరితపించిన వేలాది మంది యువకులను తియనన్మెన్ స్క్వేర్‌లో యుద్ధ ట్యాంకులతో తొక్కించిన భయానక ఘట్టం చైనా చరిత్రలో ఒక చీకటి అధ్యాయంగా మిగిలింది. దానికి సంబంధించిన వాస్తవాలు ఏవీ బయటకు పొక్కకుండా చైనా పాలకులు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా నాటి దారుణానికి సంబంధించిన చిత్రప్రదర్శన హాంకాంగ్‌లో కొనసాగు తుండడం చైనా ప్రస్తుత అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు కంటగింపుగా మారిందన్నది యదార్థం. మొన్న జూన్ 4న తియనన్మెన్ స్క్వేర్ దుర్ఘటనకు మూడు దశాబ్దాలైన సందర్భాన్ని సంస్మరించుకొన్న హాంకాంగ్ ప్రజలు భవిష్యత్‌లో తమకు అటువంటి గతే పడుతుందేమోనని భీతిల్లు తున్నారు. హాంకాంగ్ ప్రజల పోరాటం ఈ ఒక్క చట్టానికి సంబంధించినదే కాదు. తమ అస్తిత్వ పరిరక్షణ, హక్కులకు సంబంధించినది.

చైనా పొరుగుదేశాల విషయంలో ఎంతో దూకుడుగా వ్యవహరిస్తోంది. ప్రపంచంలో అమెరికా ఆర్థిక ఆధిపత్యాన్ని వెనక్కినెట్టే స్థితిలో ఉండడంతో చైనా దూకుడుకు అడ్డులేకుండాపోతోంది. ప్రచ్ఛన్న యుద్ధం ముగిసిన తర్వాత సోవియట్ యూనియన్ ముక్కలు చెక్కలైన నేపథ్యంలో ప్రపంచ పోలీసుగా వ్యవహరిస్తున్న అమెరికాకు పక్కలో బల్లెంలా చైనా తయారైంది. దాంతో నెమ్మది నెమ్మదిగా ఇరుగుపొరుగు దేశాలపై తన ఆధిపత్యాన్ని

చూపడం ద్వారా అమెరికాను నిలువరించాలన్నది చైనా ధ్యేయంగా పెట్టుకొన్నది. ఒకప్పుడు సామ్రాజ్యవాద దేశమని అమెరికాను తూర్పారబట్టిన కమ్యూనిస్టు చైనా ప్రస్తుతం చేస్తున్న ఆధిపత్య, విస్తారవాద ప్రయత్నాలకు సమాధానం చెప్పాల్సి ఉన్నది. ఇతర దేశాలపై కయ్యానికి కాలుదువ్వే అమెరికా లాగానే చైనా కూడా ప్రవర్తించడం ఆశ్చర్యం కలిగించే అంశం. ఇందుకు ఉదాహరణగా చైనాలో విలీనానికి హాంకాంగ్‌కు 2047 వరకు సమయం ఉండగా ఈలోగానే దాన్ని తన సంపూర్ణ ఆధిపత్యంలోకి తీసుకోవాలని ఉవ్విళ్లూరడమే ప్రస్తుతం హాంకాంగ్‌లో ఉద్రిక్త పరిస్థితులకు కారణంగా చెప్పుకోవచ్చు.

హాంకాంగ్‌లోని 'వ్యాపార ప్రపంచం'తో చైనాకు విభేదాలు ఉంటే ఉండవచ్చు. అమెరికాకు చైనాకు వాణిజ్యయుద్ధం సాగుతున్నది. సాంకేతికరంగంలో చైనా ఎదుగుదలను అమెరికా జీర్ణించుకోలేక పోతున్నదనే విమర్శలున్నాయి. చైనాకు చెందిన హువావెయి కంపెనీ అధికారిని అమెరికా కెనడాలో అరెస్టు చేయించింది. దీంతో చైనా కెనడాకు చెందిన ఒక వ్యాపారవేత్తను, మరో ప్రముఖుడిని అరెస్టు చేసింది. అమెరికా, చైనా వైషమ్యాలు హాంకాంగ్‌పై ప్రభావం చూపడం సాధారణమే. అయితే ఈ వివాదంలో ఎవరిది తప్పు, ఎవరిది ఒప్పు అనే చర్చవేరు. కానీ హాంకాంగ్ ప్రజల హక్కుల విషయంలో మాత్రం చైనాను కట్టడి చేయవలసిందే. చైనాలో రాజకీయ అసమ్మతికి స్థానం లేదు. పార్టీ పెద్దలు, వ్యాపార కుటుంబాలు, పాత రాచరిక వ్యవస్థ వారసులు చైనా కమ్యూనిస్టు పార్టీలో పెత్తనం చెలాయిస్తున్నారు. ప్రజలకు హక్కులు లేవు, స్వతంత్ర న్యాయవ్యవస్థ లేదు. అటువంటి వ్యవస్థ నీడలో హాంగ్‌కాంగ్ ప్రజలు స్వేచ్ఛగా జీవించడం సాధ్యం కాదు.

ప్రపంచంలో ఏ మూల ఉద్రిక్తతలు ఏర్పడినా వాటి వెనక అమెరికా హస్తం ఉందనేది నిరాధారమైన ఆరోపణ కాదు. హాంకాంగ్‌లో అమెరికా అనుకూల వాణిజ్య సంస్థలు ఈ ఆందోళనలను ప్రోత్సహిస్తున్నాయని చైనా ఆరోపించగా, చైనా జోక్యం వల్లే హాంకాంగ్‌లో వాణిజ్య సంస్థలకు భద్రత కొరవడిందని అమెరికా ఆరోపించింది. హాంకాంగ్‌లో ప్రస్తుతం జరుగుతున్న ఆందోళనలను చైనా, అమెరికాల మధ్య ప్రస్తుతం సాగుతున్న ఆధిపత్యపోరు, వాణిజ్య యుద్ధంలో భాగంగానే చూడాలి. కాగా, అవినీతి ఆరోపణలకు గురైనవారు జిన్‌పింగ్ వర్గంలోనూ ఉన్నారనీ, వారిని వదిలిపెట్టి కేవలం రాజకీయ కక్షతోనే జెమిన్ వర్గాన్ని చైనాకు తరలించాలని జిన్‌పింగ్ పట్టుపడుతున్నారని ప్రత్యర్థులు ఆరోపించారు.

నేరస్థుల అప్పగింత చట్టం అమల్లోకొస్తే అక్కడుండే తమ పౌరుల పరిస్థితి ఏమిటన్న ఆందోళన అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా తదితర దేశాల్లో ఉంది. అమెరికాకు చెందిన 1,300 సంస్థలు అక్కడ కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ఆ దేశ పౌరులు 85 వేల మంది వ్యాపారం, ఇతర రంగాల్లో పని చేస్తున్నారు. అలాగే ఆస్ట్రేలియా పౌరులు లక్షల మంది, బ్రిటన్‌కు చెందిన 50 వేల మంది అక్కడుంటున్నారు. కొత్త చట్టం అమలైతే వీరందరూ చైనా ప్రభుత్వం నుంచి వేధింపులు ఎదుర్కొనే అవకాశం లేకపోలేదని ఆ దేశాల భావన. హాకాంగ్, చైనా ఛత్రఛాయలోకి వచ్చాక భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసే మీడియా సంస్థలపై నిఘా మొదలైంది. అప్రకటిత సెన్సార్ షిప్ అమలు ప్రారంభమైంది. కొన్ని చానెళ్ల లైసెన్స్‌ల గడువు తీరాక వాటిని పునరుద్ధరించడాన్ని నిలిపేశారు. గతంతో పోలిస్తే హాంకాంగ్ ఆర్థిక వ్యవస్థ కూడా అంతంతమాత్రమే. 1997 నాటికి చైనా స్థూల దేశీయోత్పత్తి (జిడిపి)లో హాంకాంగ్ వాటా 16 శాతం. ఇప్పుడది కేవలం 2 శాతం మాత్రమే. దాన్ని పరిగణలోకి తీసుకుని కనీసం హామీ ఇచ్చిన విధంగా హాంకాంగ్‌లో యధాతథ స్థితిని కొనసాగించాలని కూడా చైనా భావించడం లేదు. హాంకాంగ్ పౌరుల నిరసనోద్యమ ఉధృతిని గమనించి ఇప్పటికైనా అది తన వైఖరిని మార్చుకోవాలి.

నూట యాభై ఏళ్లు బ్రిటిష్ వలస పాలనలో ఉంటూ లిబరల్ ఆలోచనా ధోరణికీ అలవాటుపడిన హాంకాంగ్ వాసుల్లో దేశభక్తి రగిలించి తమవైపు తిప్పుకోవాలన్న చైనా ప్రయత్నం కూడా చివరకు బెడిసికొట్టింది. పాఠ్యాంశాల్లో విస్తృత మార్పు చేర్పులు చేయాలన్న లక్ష్యానికి కూడా ఉద్యమకారులు గండిగొట్టారు. 1997లో హాంకాంగ్ చైనా చేతికి వచ్చినప్పుడు, విదేశీ వ్యవహారాలు, రక్షణ వంటి ఏవో ఒకటిరెండు కీలకాంశాలు మినహాయిస్తే, మిగతా అన్ని విషయాల్లోనూ అది యాభై యేళ్లపాటు గరిష్ట స్వయం ప్రతిపత్తిగల నగరంగా కొనసాగుతుందన్నది అప్పగింత ఒప్పంద సారాంశం. 'ఒకదేశం–రెండు వ్యవస్థలు' సూత్రంతో చైనా ఈ నగరాన్ని అందుకున్నప్పుడు, సాధ్యమైనంత త్వరలోనే ఈ బ్రిటిష్ వాసనలను తుడిచి పెట్టేయవచ్చునని చైనా భావించి ఉంటుంది. ఈ యాభై ఏళ్ల కాలంలో కనీసం కొత్త తరం కచ్చితంగా చైనా ప్రభావంలో పడుతుందని కూడా పాలకులు నమ్మి ఉంటారు. కానీ, ప్రజలు చైనాకు మానసికంగా ఎంతో దూరంగా ఉన్న విషయం అర్థమవుతుంది. దీనికి కారణం చైనా పాలకులు అనుసరిస్తున్న నిరంకుశ, అప్రజాస్వామిక ధోరణులేనన్నది యదార్థం.

హాంకాంగ్‌పై పెత్తనం కోసమే చైనా నేరస్థులను అప్పగించే తీర్మాణం కోసం క్యారీ లామ్‌పై ఒత్తిడి తెచ్చారనీ, ముందుగా చైనాలో ఉన్న ఆర్థిక నేరస్థులపై విచారణ జరిపించి జిన్‌పింగ్ అవినీతిపై యుద్ధంలో తన నిజాయితీని నిరూపించుకోవాలని వారు కోరుతున్నారు. హాంకాంగ్‌కు ఉన్న ప్రత్యేక ప్రతిపత్తికి తూట్లు పొడిచేందుకు చైనా ప్రయత్నిస్తోందని అమెరికా ఆరోపిస్తోంది. హాంకాంగ్ అలజడులు అమెరికా, చైనాల మధ్య చిచ్చుకు ఆజ్యాన్ని పోస్తున్నాయన్నది తిరుగులేని వాస్తవం. హాంకాంగ్‌లో చైనాతో విలీనాన్ని వ్యతిరేకించే వారు, సమర్థించే వారు ఉన్నారు. విలీనాన్ని వ్యతిరేకించే వారికి అమెరికా, బ్రిటన్, కెనడా వంటి దేశాల మద్దతు ఉందన్నది కూడ వాస్తవమే. ట్రంప్ కొంత కాలంగా చైనాతో వాణిజ్య యుద్ధాన్ని కొనసాగిస్తున్నాడు. అనుకోకుండా కలిసివచ్చిన హాంకాంగ్ బిల్లును కూడ ఉపయోగించుకునేందుకు పూనుకున్నాడు. ఆందోళనకారులు అమెరికా మద్దతును కూడ కోరారు. ఒకవేళ బిల్లును ఆమోదించినట్లయితే హాంకాంగ్‌కు కల్పిస్తున్న ప్రత్యేక సదుపాయాల రద్దు గురించి ఆలోచించాల్సి ఉంటుందని అమెరికా ప్రజా ప్రతినిధుల సభ స్పీకర్ నాన్సీ పెలోసీ బెదిరించారు. బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియా కూడా అదేబాటలో నడిచాయి.

తమ పాలకులను తామే ఎన్నుకుంటామని హాంకాంగ్ వాసులు గతంలో వీధుల్లోకి వచ్చి ఎంత పోరాడినా, తన చెప్పుచేతుల్లో ఉండే మనిషిని సిఇఒగా కూర్చోబెట్టడం కోసం యావత్ ఎన్నికల ప్రక్రియను చైనా తనకు అనుగుణంగా మార్చివేసిన నాటి నుంచీ ఈ అవిశ్వాసం కొనసాగుతూనే ఉంది. చైనా పట్ల హాంకాంగ్ ప్రజల సందేహాలు సహేతుకమే అనిపిస్తోంది. బీజింగ్ కరకు ఊచల పంజరం నుండి హాంకాంగ్ తప్పించుకోగలదా అన్నదే సందేహం. మానవ హక్కుల హననాలు, మరణ శిక్షలతో స్వేచ్ఛా పిపాసులను అదుపు చేయలేమన్నది గుర్తిస్తేనే హాంకాంగ్ ఆందోళన చల్లారుతుందన్నది నిర్ద్వందం. హంకాంగ్ విషయంలో బలప్రయోగం మంచిది కాదని చైనా గుర్తించాలి. ఏదెలా ఉన్నా ప్రజల మనస్సును జయించాల్సిన అవసరం చైనా పార్టీకి ఉంది.

(రచయిత ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు, రాజనీతిశాస్త్ర విద్యార్థి) వీ

ప్రపంచాన్ని తలకిందులు చేసే డబ్బు

ప్రఖ్యాత సాహిత్యరచనల ఉటంకింపులతో డబ్బు గురించి మార్క్స్ చేసిన అద్భుతమైన విశ్లేషణల సారాన్ని వివరించిన టర్కీకి చెందిన* పార్టీ ఆఫ్ లేబర్ - ఇఎంఇపి *వ్యాసానికి అనువాదం

"...అందువల్ల డబ్బు అనేది వ్యక్తిత్వాల సాధారణ వక్రీకరణ. అది వ్యక్తులను సరిగ్గా వారికి వ్యతిరేకంగా మార్చివేస్తుంది. వారి లక్షణాలకు సరిగ్గా విరుద్ధమైన లక్షణాలను వారికి కల్పిస్తుంది"

– మార్క్స్, ఎకనమిక్ అండ్ ఫిలసాఫికల్ మాన్యుస్క్రిప్ట్స్ ఆఫ్ 1844, డబ్బు అధికారం

మార్క్స్‌నూ ఆయన సిద్ధాంతాన్నీ పరిమితమైన అర్థశాస్త్ర గుడుగుడు గుంచం లోకి కుదించడానికి ప్రయత్నించేవారు డబ్బు, ఉత్పత్తి, పంపిణీ, విలువ వంటి అనేక అంశాల మీద ఆయన ప్రాతిపదికలను ఇతర ఆర్థిక దృక్పథాలతో పోల్చి మూస ప్రమాణాలతో చూస్తారు. అలా చూసి వారు ఈ ప్రాతిపదికలు అసమగ్రమైనవని అంటారు, లేదా వాటిని విస్మరిస్తారు. కాని మార్క్స్ ఒక గుడ్డి "అర్థశాస్త్రవేత్త" కాదు. ఆయన సిద్ధాంతం అర్థశాస్త్రాన్ని అధిగమించి ముందుకు వెళ్లి తత్వశాస్త్రంతో, కళతో సంపన్నమైంది. అందువల్ల ఆయన కాపిటల్ లో, తొలి రచనల్లో (ఎకనామిక్ అండ్ పొలిటికల్ మాన్యుస్క్రిప్ట్స్ ఆఫ్ 1844, గ్రండ్రిస్సె, కాంట్రిబ్యూషన్ టు ది క్రిటిక్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ, వగైరా) అత్యంత సంక్లిష్టమైన సిద్ధాంతాలను వ్యక్తీకరిస్తున్నప్పుడు మీకు డాంటే డివైన్ కామెడీ లోంచి ఒక ఉటంకింపో, లేదా షేక్స్‌పియర్ గీతమో కనబడుతుంది. ఈ అంశమే మార్క్స్‌నూ ఆయన సిద్ధాంతాలనూ విశిష్టమైనవిగా, విశ్వవ్యాప్త అన్వయానికి వీలైనవిగా రూపొందించింది. నిజానికి ఈ అంశాన్ని ఆయన జీవితమే పరిపుష్టం చేసింది. ఆ కారణం వల్లనే రెండు వందల సంవత్సరాల మార్క్స్, 151 సంవత్సరాల కాపిటల్ వర్తమానాన్నీ, భవిష్యత్తునూ కూడ అత్యంత స్పష్టమైన రూపంలో వివరించగలుగుతున్నాయి.

మార్క్స్ మేధకు రెండు లక్షణాలున్నాయి

ఏదైనా ఒక వస్తువును దానిలోని విభిన్న అంశాలుగా విభజించి పరిశీలించడంలో ఆయన సామర్థ్యం నిరుపమానమైనది. అలాగే అలా విడదీయబడిన భాగాల ద్వారా ఆ వస్తువును పునర్నిర్మించడంలో, ఆ భాగాల విభిన్న అభివృద్ధి రూపాలను గుర్తించడంలో, ఆ భాగాల అంతర్గత పరస్పర సంబంధాలను కనిపెట్టడంలో ఆయన మహా నిపుణుడు. ఆలోచించడానికి శక్తిలేని అర్థశాస్త్రవేత్తలు ఆయన అమూర్తమైన విషయాలు చెప్పాడని విమర్శించారు గాని ఆయన చూపినవి అమూర్తీకరణలు కావు. తమ చుట్టూ ఉన్న ప్రపంచం నుంచే తమ నిర్వచనాలు గ్రహించినప్పటికీ నిర్ధారణలు చేసేటప్పుడు మాత్రం ఆ ప్రపంచాన్ని పూర్తిగా వదిలేసే రేఖాగణిత శాస్త్రవేత్తల వంటి వాడు కాదు మార్క్స్. కాపిటల్ ముక్కలు ముక్కలుగా విడగొట్టిన ఏకాకి నిర్వచనాలూ సూత్రాలూ ఇవ్వదు, అది అతి ఎక్కువగా మన కన్ను గప్పే నీడలనూ, మన దృష్టి పడని అంతరాలనూ బైటికి లాగడానికి అత్యంత అన్వేషణాత్మకమైన విశ్లేషణల పరంపరను ఇస్తుంది" అని మార్క్స్ అల్లుడు, లారా సహచరుడు పాల్ లాఫార్గ్ అన్నాడు.

మార్క్స్ రచనలన్నిటిలోనూ ఉజ్వలంగా వెలిగేదీ, అంతకు ముందు చూడలేని దాన్ని దృశ్యమానం చేసేదీ ఆయన శక్తిమంతమైన పరిశీలనా శక్తీ, అద్భుతమైన వివరణా శక్తీ. ఈ వివరణాశక్తి ఆయనకు చిన్నతనంలో తన అక్కచెల్లెళ్లతో ప్రారంభమయింది. యవ్వనంలో సహచరితో, తన పిల్లలతో కొనసాగింది. అదే ఆయనను మొత్తంగా ఇతర అర్థశాస్త్రవేత్తల నుంచీ, తత్వవేత్తల నుంచీ, రాజనీతిజ్ఞుల నుంచీ, విజ్ఞానశాస్త్రవేత్తల నుంచీ వేరు చేసింది. మార్క్స్ వివరణాశక్తికి, కథనశక్తికి బలం ఆయన మనసులో ముద్ర పడిన అనేక మంది రచయితల, కవుల రచనలతో చేకూరింది.

మార్క్స్ సంవిధానాన్ని రూపొందించిన సాంస్కృతిక మూలాలు కేవలం ఆయనకు విశిష్టమైన వివరణాశక్తిని అందించడం మాత్రమే కాదు, అప్పటికి అత్యున్నత స్థాయి అమూర్తీకరణ వల్ల అర్థంకాకుండా మిగిలిపోయిన ఉత్పత్తి సంబంధాలను సరైన స్థలాల్లో పట్టుకుని వివరించడానికి ఆయనకు వీలు కలిగించాయి.

❖ ❖ ❖

1844 మాన్యుస్క్రిప్ట్స్‌లో మార్క్స్ "మనిషి అవసరాలకూ వస్తువుకూ మధ్యన, మనిషి జీవితానికీ జీవనసాధనాలకూ మధ్యన వాటిని సాధించిపెట్టేదిగా డబ్బు ఉంటుంది. నా జీవితాన్ని నాకు సాధించిపెట్టే మధ్యవర్తిగా ఉన్న డబ్బు, నాకోసం ఇతరుల ఉనికిని సాధించడానికి కూడ మధ్యవర్తిగా ఉంటుందన్నమాట. అంటే నావైపు నుంచి చూసినప్పుడు మరొక వ్యక్తి అంటే డబ్బే అవుతుంది" అన్నాడు.

ఈ విషయాన్ని వివరించడానికి ఆయన జర్మన్ మహాకవి గోథే రాసిన ఫౌస్ట్ నాటకం నుంచి కొన్ని కవితాపాదాలు ఉటంకించాడు:

"ఓయ్ మనిషీ! కలవర పడవోయ్, చేతులూ కాళ్లూ
తలా వీపూ అన్నీ నీకు చెందినవే గదా!
ఈ జీవన మాధుర్యంలో మనం తీసుకునేవి
మనవి కావని చెప్పమంటావా?
నా దగ్గర ఆరు గుర్రాలుంటే
వాటి శక్తంతా నా ఆస్తే, కాదంటావా?
గుర్రాల్ని పరుగెత్తి పగలదీస్తాను
వాటి కాళ్లూ నాకు చెందినవే గదా"

మార్క్స్ ఆ తర్వాత షేక్స్ పియర్ రచన టిమోన్ ఆఫ్ ఏథెన్స్ నుంచి మరొక ఉటంకింపు ఇచ్చాడు.

''బంగారమా? వసువుపచ్చ, మెరిసిపోయే, విలువైన బంగారమేనా?... నీ దగ్గర అది ఇంత ఉందంటే నలుపును తెలుపుగా మార్చేస్తుంది. అక్రమాన్ని సక్రమంగా, తప్పును ఒప్పుగా, నీచాన్ని

ఉత్తమంగా, వృద్ధాప్యాన్ని యవ్వనంగా, పిరికితనాన్ని సాహసంగా.... తస్సాదియ్య, భూమీ, మానవజాతి మొత్తానికీ ఉమ్మడి వేశ్యా, దేశాలు కూలిపోవడానికి కారణమైనదానా...”

ఈ ఉటంకింపులు రెండూ ఇచ్చి, మార్క్స్ ఈ రెండు సాహిత్య ఉదాహరణల్లో డబ్బును ఎట్లా వర్ణించారో వివరించడం మొదలుపెట్టాడు. మొదట, గోథె ఉటంకింపు... “డబ్బు అనే మాధ్యమం ద్వారా నాకు అందినది, దేనికోసమైతే నేను డబ్బు చెల్లించానో అది (డబ్బు ద్వారా కొనగలిగినది) – అది నేనే, డబ్బును కలిగి ఉన్నవాణ్నే' అని గోథె ఈ మాటల ద్వారా అంటున్నాడు” అని మార్క్స్ అన్నాడు. “డబ్బు శక్తి ఎంతో నా శక్తి అంతే. నా లక్షణాలు డబ్బు లక్షణాలే, అంటే డబ్బు కలిగి ఉన్నవాడి లక్షణాలే. అవి డబ్బు ప్రాథమిక శక్తులే” అని గోథె అంటున్నాడని మార్క్స్ వివరించాడు. డబ్బు ద్వారా ఒక మనిషి తాను ఏమి కోరుకుంటే అది చేయగలడని, డబ్బు అనేది అది ఉన్నవాడి అసమర్థతలను సామర్థ్యాలుగా మార్చగలదని గోథె అంటున్నాడని మార్క్స్ వివరించాడు. ఇది ఒక వినిమయ సాధనంగా డబ్బుకు ఉండే స్వభావాన్ని ఎత్తి చూపుతుంది. డబ్బు తాను ఏ సరుకును కొంటున్నదో ఆ సరుకుగా మారిపోతుందన్నమాట, అంటే దాని వ్యతిరేకమైనదిగా మారిపోతుందన్న మాట.

ఇక షేక్స్‌పియర్ ఉంటంకింపును వివరిస్తూ మార్క్స్ అక్కడ డబ్బు యొక్క రెండు లక్షణాలను నొక్కి చెప్పడం జరిగిందంటాడు:

1. దృశ్యమానమయ్యే దైవత్వం – మానవ, సహజ లక్షణాలన్నీ వాటికి వ్యతిరేకమైనవిగా పరివర్తన చెందుతాయి. సార్వత్రిక అంగీకారమూ వక్రీకరణా, అసాధ్యాలను కలిపి ముడివేయడం జరుగుతాయి.
2. మనుషులకూ, దేశాలకూ ఉమ్మడి వేశ్యగా, ఉమ్మడి సాధనంగా ఉండే లక్షణం.

ఈ రెండు బలమైన సాహిత్య ఉటంకింపుల తర్వాత మార్క్స్ ఏమంటాడంటే, “డబ్బు అనేది ప్రస్తుతం ఉనికిలో ఉన్న క్రియాశీలమైన విలువ భావనగా, అన్ని వస్తువులనూ తారుమారు చేస్తుంది, గందరగోళ పరుస్తుంది. అంటే అది అన్ని వస్తువుల సాధారణ తారుమారుగా, గందరగోళంగా ఉంటుంది. అలా అన్ని సహజ, మానవ లక్షణాలను తారుమారు చేసి, గందరగోళపరిచి, మొత్తంగా ప్రపంచాన్నే తలకిందులు చేస్తుంది.”

❖ ❖ ❖

ఉత్పత్తి సంబంధాల్లో డబ్బు పాత్రనూ ప్రాముఖ్యతనూ చాల సరళమైన పద్ధతిలో గ్రుండ్రిస్సె లో మార్క్స్ ఇలా వివరించాడు:

“డబ్బు విడిగా చూడగలిగిన, భౌతికమైన వస్తువు గనుక దానికోసం ఎక్కడైనా వెతకవచ్చు, దొరికించుకోవచ్చు, దొంగిలించవచ్చు, కనిపెట్టవచ్చు. అలా సాధారణ సంపదను ఒకానొక వ్యక్తి ఆక్రమణలోకి భౌతికంగా తీసుకురావచ్చునన్నమాట. దాని సేవక పాత్రలో అది కేవలం చలామణీ సాధనంగా మాత్రమే ఉంటుంది. కాని అది హఠాత్తుగా సరుకుల ప్రపంచపు ప్రభువుగా, దైవంగా మారిపోతుంది. అలా డబ్బు సరుకుల దైవిక అస్తిత్వానికి ప్రాతినిధ్యం వహిస్తుండగా సరుకులేమో డబ్బు యొక్క ఇహలోక రూపాలకు ప్రాతినిధ్యం వహిస్తాయి.”

పెట్టుబడి సంచయన సాధనంగా డబ్బు అమూర్త రూపం ధరిస్తుందని, అలా అది పెట్టుబడి సరుకు రూపాన్ని అధిగమించి, సరుకును దాటి, దాన్ని రూపొందించే “ఆత్మ”గా పరివర్తన చెందుతుందనీ మార్క్స్ అన్నాడు.

❖ ❖ ❖

ఎ కాంట్రిబ్యూషన్ టు ది క్రిటిక్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ లో మార్క్స్ బంగారం, వెండిల విధులను వివరిస్తూ, “బంగారమూ వెండీ కలిగి ఉండేది డబ్బునే. అవి పోగుచేసుకునే వ్యక్తి చేసే ఏదో ఒక కార్యకలాపపు ఫలితంగా కాదు, అతని సహాయం లేకుండానే సాగే చలామణీ ప్రక్రియకు ఘనీభవించిన రూపంగా డబ్బుగా అతని దగ్గర పోగవుతాయి. అతను ఏమీ చేయనక్కరలేదు, వాటిని పక్కన పెట్టుకుంటూ పోతే చాలు, ఒకదాని మీద ఒకటి పేర్చుకుంటూ పోతే చాలు. అదంతా పూర్తిగా అర్థరహితమైన కార్యకలాపం. అదే పని మరే ఇతర సరుకు విషయంలో చేసినా వాటి విలువ పడిపోతుంది” అన్నాడు. ఇంకా వివరిస్తూ, “ఒక వ్యక్తి వీణలు కొంటూ, వీణలోనూ, కళల్లోనూ ఏ ఆసక్తీ కనబరచకుండానే వీణలు పోగేసుకుంటూ పోతే, చెప్పులు కుట్టేవాడు కాకుండానే చెప్పులు, కత్తులూ, చెప్పుల దిమ్మెలూ పోగేసుకుంటూ పోతే, వర్తక జీవితానికి ఎదురుగా తెరచాపలు పోగేసుకుంటూ పోతే, అప్పుడతణ్ని పిచ్చివాడనో, వెర్రివాడనో అంటారు. అలా అనడం సరైందే కూడ. మరి వెండి, బంగారాలు పోగేసే వ్యక్తి, వాటిని ఎట్లా వినియోగించాలో తెలియని వ్యక్తి, అవేవో పవిత్రమైనవన్నట్టు వాటిని తాకడానికే భయపడే వ్యక్తి ఈ పిచ్చివాడి కన్న ఎట్లా భిన్నమైనవాడు?' అని అడిగినప్పుడు రోమన్ కవి హోరేస్ కు సంపదలను పోగువేసుకునే తత్వశాస్త్రమేమీ తెలిసి ఉండదు అంటాడు మార్క్స్.

ఈ రకంగా మార్క్స్ సంస్కృతిని తన వివరణలకు సహకరించే అంశంగా మాత్రమే కాక వాదనల్లో ఉపయోగపడే శక్తిగా వినియోగించాడు.

❖ ❖ ❖

ఇక కాపిటల్ వివరణలో మార్క్స్ కథనం మరింత పరిణతి సాధించింది. ఆ పుస్తకంలో ఏమి ఉంటుందని ఊహించవచ్చునో పాఠకులకు చెపుతూ కాపిటల్ ముందుమాటలో ఆయన ఇలా అన్నాడు:

“ఇంగ్లిష్ పారిశ్రామిక, వ్యవసాయ శ్రామికుల స్థితిని చూసి జర్మన్ పాఠకుడు భుజాలెగరేసి, లేదా ఆత్మసంతృప్తిలో మునిగే ఆశావాదిలా, ‘జర్మనీలో పరిస్థితులు ఇంత ఘోరంగా లేవులే' అనుకోవచ్చు. కాని అటువంటి పాఠకుడికి నేను సూటిగా చెప్పే మాట ఒకటే – హోరేస్ అన్నట్టుగా ‘ఆ కథ నీ గురించి చెప్పిందే' అని”. హోరేస్ రాసిన ప్రహసనాల నుంచి మార్క్స్ ఈ మాటను ఉటంకించాడు. ఒక సాహిత్య రచనను సరైన నేపథ్యంలో ఉపయోగిస్తే జీవిత వాస్తవాన్ని ఎంత శక్తిమంతంగా వివరించగలదో చూపడానికి ఇది ఉదాహరణ.

“ఇక సరుకులు ఎట్లా డబ్బుతో ప్రేమలో పడతాయో మనం చూస్తాం” అంటూ మార్క్స్ మళ్లీ ఒకసారి తన అభిప్రాయాన్ని బలపరచుకోవడానికి, “కాని ఎప్పుడూ నిజమైన ప్రేమ మార్గం సాఫీగా ఉండదు” అని షేక్స్ పియర్ ను ఉటంకించాడు. దాన్ని వివరిస్తూ, “గుణాత్మక శ్రమ విభజన ఎంత ప్రాప్తకాలజ్ఞతతో, ఎంత యాదృచ్ఛికంగా జరుగుతుందో పరిమాణాత్మక శ్రమ విభజన కూడ అదే విధంగా జరుగుతుంది. అందువల్ల సరుకుల సొంతదారులు తమను స్వతంత్ర వ్యక్తిగత ఉత్పత్తిదారులుగా మార్చిన శ్రమ విభజన గురించి ఒక గుర్తింపు పొందుతారు. సామాజిక ఉత్పత్తి ప్రక్రియను ఆ ఉత్పత్తిదారుల సంకల్పాలమీద ఆధారపడి ఉండడం నుంచి ఆ శ్రమ విభజనే స్వతంత్రం చేసిందనీ, పైకి చూడడానికి వ్యక్తులందరూ పరస్పరం స్వతంత్రులుగా ఉన్నట్టు కనబడినప్పటికీ, ఆ ఉత్పత్తుల ద్వారా, లేదా వాటి వల్లనే, మొత్తంగా సాధారణమైన, పరస్పరం ఆధారపడే వ్యవస్థ ఏర్పడిందని గుర్తిస్తారు” అన్నాడు.

❖ ❖ ❖

జైళ్లు పరివర్తనకా, ప్రాణాలు తీయడానికా?

***వికలాంగుడైన సాయిబాబాను ఆదివాసుల పక్షాన నిలబడి బడా కార్పొరేట్ సంస్థలను అడ్డుకున్నందుకు జైల్లో నిర్బంధించి కనీస వైద్య సౌకర్యం కల్పించకుండా మరణించే పరిస్థితికి ప్రభుత్వం నెడుతోందని అంటున్నారు** ఎన్. నారాయణరావు*

ఆలోచన ఉన్నవాడు, నిజంగానే ఆయుధాన్ని పట్ట లేని వాడు ఉపాధ్యాయుడిగా ఉంటూ విద్యార్థుల భవిష్యత్తే దేశ అభివృద్ధిలో భాగంగా చూసినవాడు. తన భవిష్యత్ చిత్రపటానికి నాగపూర్ అండాసెల్ బంధీగా మారిందని బాధపడుతున్న వాడు. కానీ న్యాయానికి లొంగుబాటు ఉండదని త్యాగాల రెపరెపల వెల్లువ ఉంటుందని తెలిసినవాడు. తెలంగాణ అనేక ఉద్యమాలలో పోరాట త్యాగాలు విలువలు తెలిసిన వాడు. రాజ్యం తాయిలాలకు నిజాన్ని అమ్ముకోలేని నిజాయితీపరుడు. నిర్బంధాన్ని తట్టుకోలేని శారీరక వికలాంగులు మరో మనిషి సాయం లేకుండా అడుగే వేయలేనివాడు, ఇతన్ని చూస్తే రాజ్యానికి విపరీతమైన భయం. అన్యాయం ఎంత బలమైనదైనా న్యాయం ముందు భయ పడాల్సిందే. భయమే కారణమని రాజ్యం ఒప్పుకోవడానికి మనసు అంగీకరించకపోవచ్చు కానీ అదే నిజం.

అఖిల భారత ప్రజాప్రతిఘటన వేదికను స్థాపించి రెండు లక్షల కిలోమీటర్లు ప్రయాణించి విముక్తి పోరాటాలపై అనేక ప్రసంగాలు ఇచ్చిన వాడు సాయిబాబా. 2009లో కేంద్రం ప్రారంభించిన ఆపరేషన్ గ్రీన్‌హంట్ ఆదివాసీల హత్యాకాండేనని ప్రపంచానికి తెలియజేసిన వాడు, ప్రపంచ ప్రజాస్వామిక వాదుల మద్దతు కూడగట్టినవాడు.

ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ జి.ఎన్ సాయిబాబాను 2014లో కిడ్నాప్ లాంటి అరెస్టు చేసి తర్వాత 2017లో ఉపా కేసు ఆధారంగా జీవిత ఖైదు శిక్షను ప్రకటించింది మహారాష్ట్ర ప్రభుత్వం. ఆనాటి నుండి నేటి వరకు అతని అనారోగ్య సమస్యలతో బెయిల్‌పై విడుదలయ్యారు. 2017లో జీవితకాలం శిక్షను ప్రకటించారు. ఆనాటి నుండి నేటి వరకు అనారోగ్యంతో సరైన వైద్య సహాయం అందనీయకుండా ఆరోగ్య స్థితి విషమించేలా, అందరూ నిరంతరం భయపడేలా స్టేటస్ కొనసాగిస్తున్నది. జైలు శిక్ష అనుభవించి వస్తాడు అని అనుకుందామా? జైల్లోనే జీవితాన్ని రాజ్యం అంతరింపజేస్తుందా అనే భయం మనందరినీ వెంటాడుతూనే ఉంది. అయితే ఆయన సహచరి వసంత, కూతురు మంజీరల బాధలను చెప్పడం మన మాటల్లో లేదు. ఈ స్థితి వారిని ప్రశాంతత నుండి చాలా దూరం నెట్టివేసింది.

ఢిల్లీకి చెందిన ఉపాధ్యాయుడు ప్రొ. సాయిబాబాను అక్రమంగా చట్టబద్ధ నియమాలను బేఖాతరు చేస్తూ తన ఇంట్లోనే తననే నేరస్తునిగా నిలబెడుతూ నేర ప్రక్రియ నియమం ప్రకారం స్వతంత్ర సాక్ష్యం లేకుండానే ఇంట్లోకి చొరబడి ప్రతి వస్తువు విచారణకు గురిచేశారు. కంప్యూటర్, పెన్ డ్రైవ్, హార్డ్‌డిస్క్‌లను పోలీసులు జప్తు చేయడం, ఈ జప్తు అయిన వాటిలో పోలీసులు పెట్టినవెన్నో నిజమైనవెన్నో సరైన లెక్క తేలకుండానే ప్రభుత్వం శిక్షలు వేసేసింది. గడ్చిరోలి కోర్టుకు వెళ్లి తీర్పును విని హైదరాబాద్ కేర్ ఆస్పత్రిలో వైద్యం చేయించు కుందామని బయలుదేరిన వాడు నాటి నుండి నేటి వరకు నాగపూర్ జైల్లో అండాసెల్లో బందీగా

"ఇప్పుడీ నాణాన్ని బాగా పరీక్షించాం మనకు దీని లోహమూ, బరువూ తెలిశాయి. కానీ నాకొకటి చెప్పు: ఈ నాణెం నీ జేబులోనే ఉందా?"

(డాంటే, డివైన్ కామెడీ)

మార్క్స్ పరీక్షించిన ప్రధాన ఇతివృత్తం డబ్బు. ఉత్పత్తి, పంపిణీ, చలామణీ సంబంధాలలో కీలక పాత్ర ఉన్నది డబ్బుకే. అందుకే ఆయన అభివృద్ధి చేసిన సిద్ధాంతంలో సహజమైన అంతర్భాగం డబ్బు. ఉత్పత్తి సంబంధాలను మొత్తంగా అర్థంగా చేసుకోవాలంటే డబ్బును దాని విధులన్నిటితోనూ సరిగ్గా అర్థం చేసుకోవడం కీలకం. కొనుగోలు సాధనంగా డబ్బు అది కొనే వస్తువుతో సమానంగా మారుతుందనే వాస్తవమే, తద్వారా ఉనికిలో ఉన్న సంబంధాన్ని తలకిందులు చేస్తుందనే వాస్తవమే దాన్ని అధ్యయనం చేసినవారందరినీ, ప్రాచీన గ్రీకు తత్వవేత్తల నుంచి సాంప్రదాయక అర్థశాస్త్రవేత్తల దాకా, దాదాపు అందరినీ అది "పరిష్కరించడానికి వీలు కానిది" అనిపించేలా చేసింది.

డబ్బు అనేది ప్రజలను గందరగోళ పరుస్తుంది! దాని ఈ సంక్లిష్టతే డబ్బును వివరించడంలో మార్క్స్ ను 'ఉద్వేగానికి' గురిచేసింది. ఈ సంక్లిష్టతను అధిగమించే క్రమంలో కొన్ని విశదీకరణలూ, సరళీకరణలూ అవసరమయ్యాయి. అందువల్ల ఆయన ఆ గందరగోళాన్నంతా శుభ్రం చేయడానికి పూనుకున్నాడు. ఆయన చిన్ననాటి నుంచీ కంఠోపాఠంగా ఉన్న సాహిత్య కళా ఖండాలు ఆయనకు ఈ కృషిలో ప్రధాన ఉదాహరణలుగా పనికివచ్చాయి.

డబ్బు అనే విషయంతో వ్యవహరించడంలో మార్క్స్, డబ్బు గురించి ఒక సిద్ధాంతం తయారు చేయడం, జీవన సాధనంగా డబ్బు అనేది తన దగ్గర లేకపోవడం అనే రెండు ప్రధాన అవరోధాలతో అలసి పోయాడు. డబ్బు గురించి సిద్ధాంతం తయారు చేయడం అనే కష్టతరమైన మార్గంలో మార్క్స్ తన కరదీపికగా ప్రామాణిక సాహిత్య రచనల సాయం తీసుకున్నాడు. కాని చిల్లిగవ్వలేని పేదరికంలో గడపడం గురించి మాత్రం ఆయన పెద్దగా చేయగలిగిందేమీ లేకపోయింది. ముగ్గురు పిల్లలు ఆకలితో చనిపోయినప్పటికీ, మార్క్స్ ఎప్పుడూ డబ్బు వల్ల తలకిందులైపోయిన మనిషిగా బతకలేదు. అందువల్లనే 200 సంవత్సరాల తర్వాత కూడ ఆయన అదే కథను అంతే ఉత్సాహంగా చెప్పగలుగుతున్నాడు.

(టర్కీకి చెందిన పార్టీ ఆఫ్ లేబర్ (ఇఎంఇపి) ఆగస్ట్ 2018లో సమర్పించిన ఈ వ్యాసాన్ని మార్క్సిస్టు లెనినిస్టు పార్టీల, సంస్థల అంతర్జాతీయ సదస్సుల పత్రికగా వెలువడే యూనిటీ & స్ట్రగుల్ 2019 ఏప్రిల్ సంచికలో ప్రచురించింది.) వీ

ఉండిపోయాడు. మావోయిజం దేశంలో అతిపెద్ద సమస్యగా మారిందని ప్రభుత్వాలు ప్రకటిస్తున్నాయి. మామూలు మనుషులు వారితో జతకడితే వారి స్వప్రయోజనాల కోసం కలిసారని ప్రభుత్వం భావిస్తుంది. కానీ ఒక ఉపాధ్యాయుడికి వారి రాజకీయాలపై అభిమానం ఉంటే అది ఉపాధ్యాయుడిగా తప్పు లేక ఇప్పుడున్న ప్రజాస్వామిక స్థితిదా? వారి మనస్సు గెలవలేని రాజకీయాలవా? ఆలోచన ఆచరణ కలిగినవాడు విద్యాధికుడు, విచక్షణ కలిగినవాడు ప్రభుత్వ రాజకీయాల పట్ల విముఖత ఏర్పడడానికి మావోయిస్టులు కారణం కాదు కదా ప్రభుత్వం ఎందుకు తన స్థితిని నిర్ధారించుకోలేకపోతున్నది. 90 శాతం అంగవైకల్యం కలిగినవాడు, మరొకరి సాయం నిరంతరం తప్పనివాడు మొన్న ఈ మధ్య పూనే కోర్టుకు పౌరహక్కుల సంఘ బృందం వెళ్లి వరవరరావుతో పాటు అరెస్టయిన వారిని కలిసే ప్రయత్నం చేసినపుడు వారిని కలవనీయ లేదు. కానీ నాగపూర్ నుండి వచ్చిన సాయిబాబా అడ్వకేట్ సాయిబాబా ఆరోగ్యస్థితిని వివరిస్తూ ఒకటి రెండు నెలల్లో ఎటువంటి వార్తనైనా వినాల్సి వస్తుందేమోనని వాపోయారు. సాయిబాబా బయట ఉంటే అతడు ప్రాణాలకు తెగించి ఉద్యమాలు చేసేవాడో లేదో తెలియదు కాని అతని ప్రాణాలు జైల్లోనే తీసే హక్కు రాజ్యాంగ వ్యవస్థకు లేదన్నది నిజం. కానీ జైళ్లశాఖ రాజ్యం ఒత్తిడిలోపడి వారి హక్కులను హరించి వేస్తున్నాయి.

ప్రభుత్వ ఆరోపణ ప్రకారం కొద్దిసేపు అతడు నేరస్తుడే అనుకుందాం నేరం ఎందుకు చేసాడు ఎందుకు చేయాల్సి వచ్చింది చివరికి ఆపరేషన్ గ్రీన్ హంట్ గురించి మాట్లాడను అని రాసిస్తే విడిచిపెడతానని వాదా చేసింది ప్రభుత్వం కాదా? కాళ్లులేని కదలలేని మనిషి సంసిద్ధత ముందు అమెరికా కుడిభుజంగా ఉన్న ఇండియా కూడా భయపడి పోవడం నిజంగా ఇది దేన్ని సూచిస్తున్నది. ఐక్యరాజ్య సమితి కూడా సాయిబాబాను విడిచిపెట్టాలనే సలహాను కూడా పాటించని ఇండియాది నియంతృత్వం అందామా? ప్రజాస్వామ్యం అందామా? ప్రభుత్వాలకి ఒక పునాది ఉంటుంది. కానీ ఇంతటి బలహీనమైన పునాది ఉంటుందని ప్రజలు అనుకోవడం లేదు. ప్రభుత్వాలు ప్రజా ఉద్యమాలను చూసి ప్రజా తిరుగుబాట్లను చూసి చాలా భయపడిపోతున్నాయి. ఆ భయానికి సాయిబాబా లాంటి వారి సాయం ఉందని ఊహించుకుంటున్నారు.

నక్సలైట్లు దేశభక్తులు అన్న ఎన్‌టిఆర్ ముఖ్యమంత్రి అయ్యాడు. నక్సలైట్ ఎజెండానే నా ఎజెండా అన్న కెసిఆర్ ముఖ్యమంత్రి అయ్యాడు. అదే నక్సలిజం సామాజిక మార్పుకు అవసరమా అని అన్న మనిషిని అండాసెల్‌లో ఎలా జీవచ్ఛవంలాగా మారుస్తారు. మనిషి మాట్లాడుతాడు చర్చిస్తాడు మనిషిలో మానవత్వం చనిపోతే రాజ్యాం హత్యలకు సిద్ధమవుతుంది. హంతకుల చేతుల్లోనే ప్రజాస్వామ్యాన్ని ఎలా విశ్వసించగలం. రక్తంతో తడిసిన రాజ్యానికి ప్రజాస్వామ్య పరిభాష కన్నా టాడా, పోటా, ఊపా, ఆస్పా లతో కూడిన నిర్బంధ భాషే ఎక్కువగా ఉంది. లాకప్ హత్యలు, ఎన్‌కౌంటర్ హత్యలు ఆదివాసీల అత్యాచారాలు చివరికి సామాన్యులపై తుపాకి భాషనే ప్రయోగిస్తూ ప్రజాస్వామ్యంగా ప్రకటిస్తున్నారు. ఈ క్రమంలో ప్రజల పక్షం వహిస్తున్న మేధావులపై కూడా క్రూర నిర్బంధ చట్టమైన ఊపా చట్టం తన దమనకాండను యథేచ్ఛగా కొనసాగిస్తున్నది. ఈ దమనకాండలో మేధావులను హత్య చేయడానికే ప్రభుత్వం కుట్రపన్నుతున్నది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో నాగరికులు గానైనా స్పందిద్దాం. వసంత, మంజీరాల బాధల్లో భాగమవుదాం. 'నిజం' విడుదలకై గొంతెత్తుదాం.

గత ఏడాది కాలంగా సాయిబాబా సహచరి వసంత కనీసం విడుదల క్యాంపెనైనా కొనసాగించాలని అడగని సంస్థ, వ్యక్తులు లేరని ఆశ్చర్యపోరాదు. బాధ్యత పడాల్సిన వ్యక్తులు బాధ్యతలను విస్మరించి ప్రవర్తిస్తున్నారు. ఎప్పుడు ఏ వార్త వినాల్సి వస్తుందేమోననే బాధను దిగమింగుతుంది వసంత. న్యాయ సహాయం అందకుండా రాజ్యం చేస్తుందేమో కానీ సాయి విడుదల కోసం జరిగే ఉద్యమం సాయికి మరింత బలాన్నిస్తుందనేది సత్యం. అదే మన బాధ్యతను కూడా గుర్తు చేస్తుంది. ఇప్పటికీ సాయి తన ప్రధాన అవయవాలకు ఉండాల్సిన ఫిజియోథెరపీ లేని స్థితి శరీరంపై తీవ్ర ప్రభావం పడుతుందని వార్తలు వస్తూనే ఉన్నాయి. రెండు చేతులు లేవలేని స్థితికి వచ్చేస్తున్నాయి. రోజుకు 2, 3 సార్లు స్పృహ తప్పే స్థితి ఏర్పడింది. బాధను భరిస్తున్నాడే కాని ఊహించకూడనిది జరిగితే మనందరం నేరస్తులుగా కూడా మిగిలిపోతాం. జోహార్లని ఉచ్ఛరించే అధికారం, హక్కును కోల్పోతామేమో. సమాజంలో భవిష్యత్ పరిణామాలపై దృష్టి పెట్టడం మేధావుల బాధ్యత. అధ్యాపకులు ఆచరణలో మార్పు కోరుకుంటున్నారంటే దానిపై దృష్టి పెట్టడం, దాని గురించి మొదటగా ప్రభుత్వాలే గుర్తించాలి. సమాజ శోధకులు మేధావుల మన్ననలను ప్రభుత్వాలు పొందలేకపోతే లోపం ఎక్కడుందని ప్రభుత్వాలు అన్వేషించాలి, పరిశోధించాలి. ఆధిపత్యం, బలం ఉన్నదని నిరసనను నిశ్శబ్దం చేయవద్దు. సాయిబాబా వేసిన ప్రశ్నల ముందు సర్కారు దోషిలా ప్రజల్లో సామాజిక చైతన్యం ఉన్నంత కాలం నిలబడాల్సిందే.

దేశంలో ఆర్‌ఎస్‌ఎస్ చాలా బలమైనదని చాలా మంది హత్య చేసిందని ఆరోపణలు ఉన్నాయి. కానీ ఒక ఉపాధ్యాయుడు జనం మధ్యలో ఉంటే భయపడిపోతున్నాయి. అమిత్‌షా, అజిత్ దోవల్‌ల బలగాలు ఉన్నప్పటికీ ఒక పోలియో వ్యక్తిని జైళ్లోనే చంపాలనుకోవడం ఎలా ప్రజాస్వామికమవుతుంది. అసలు ప్రపంచంలో చాలా దేశాలు వికలాంగులను జైలులో బంధించటానికి మినహాయిస్తాయి. కానీ మనదేశం వికలాంగుడికి కూడా కనీస వసతులు, వైద్య సహాయం లేని స్థితిని కల్పించి తనకు తానే మరణాన్ని ఆస్వాదించాలనే స్థితికి నెట్టడం మన రాజ్యాంగానికి విరుద్ధం కాదా! ఎక్కడ అసహజ మరణమైనా అది ప్రభుత్వ హత్యే. ఏ ఆత్మహత్య ఐనా ప్రభుత్వం హత్యే.


కాశ్మీర్ నుండి కేరళ వరకు ఆదివాసీలకు అండగా నిలబడినందుకు సాయిబాబా నేరం చేశాడా? తన బాధ్యతలను నిర్వర్తించాడా? జీవిత ఖైదు విధించిన జడ్జి ఇంకా పెద్ద శిక్ష ఉంటే బాగుండునని ఊహించడాన్ని మనం ఎలా స్పందించగలుగుతాం? నాగరిక దేశంలో హక్కులకు గుర్తింపు ఉంటుందని, వాటిని రాజ్యాంగంలో రాసుకుంటామని అనుకుంటాం కానీ తోటి ప్రజల హక్కులడిగితే మరణాన్ని శిక్షగా అందియ్యాలనుకుంటే ఇది న్యాయమవుతుందా? న్యాయం కాకపోయినా మరణాన్ని హత్తుకో వాల్సిందేనన్న న్యాయవ్యవస్థ తీర్పు న్యాయమవుతుందా? వేల కోట్లు మింగినవాడికి భోపాల్లో మారణ హోమం సృష్టించినవాడికి దగ్గర ఉండి పంపించిన వాళ్లు మన దేశ నేతలు. ఆదివాసీ హక్కుల పట్ల బాధ్యతగా స్పందిస్తే ఎలా నేరవుతుంది? వ్యవస్థలను రాజ్యాధికారం గుప్పిట్లో పెట్టుకున్నంత మాత్రాన ఎప్పుడైనా న్యాయం గెలుస్తుంది. విశ్వాసం లేని ప్రజలు ఉంటే దేశం అభివృద్ధి చెందటం కష్టం. ఎన్నో ప్రభుత్వాలను చూసాం, పోరాటాలు చేసిన ప్రభుత్వాల్ని చూసాం. వృద్ధులను, వికలాంగులను హత్య చేయడానికి సిద్ధమవుతున్న ప్రభుత్వాన్ని నేడే చూస్తున్నాం. సమానత్వపు హక్కు కోసం జరిగే హక్కుల పోరాటాల్లో ఎంతటి త్యాగాలకైనా వెనకాడని మేధావుల బలం ముందు రాజ్యం తప్పక ఓడిపోతుంది. 100 మంది ట్రంపులైనా, 1000 మంది మోడీలైనా సత్యాన్ని దాచిపెట్టి విజయానికి ఎన్నటికీ చేరుకోలేరు.

(రచయిత ప్రధాన కార్యదర్శి పౌరహక్కుల సంఘం, తెలంగాణ) వీ

జైళ్లు, రాజకీయ ఖైదీలు, ప్రజా ఉద్యమాలు

ప్రొ. ఎస్. శేషయ్య

'జైలు తలుపులు తెరుచుకుంటే
డ్రాగన్‌లు కూడా భయపడి పారిపోతాయి'.



జైలులో ఖైదీ నిశ్శబ్దం, ఒంటరితనం, చిత్రహింసలు అతన్ని భౌతికంగా, మానసికంగా కుంగదీస్తాయి. బయటి ప్రపంచంతో, కుటుంబంతో, స్నేహితులతో సంబంధాలు తెగిపోయి ఒంటరి జీవితం దుర్భరంగా ఉంటుంది. ఒక విధంగా ఆ పరిస్థితి 'సివిల్ డెత్' లాంటిది. బయటివాళ్లకు ఖైదీల మానసిక స్థితిని అర్థం చేసుకోవడం అసాధ్యం. నాగపూర్‌లోని అండా సెల్‌లో కఠినమైన కారాగార జీవితం గడుపుతున్న ప్రొఫెసర్ జి.యన్. సాయిబాబా ఖైదు కవిత్వం 'నేను చావును నిరాకరిస్తున్నాను' అంటూనే మరణంతో స్నేహం చేస్తున్నాడు. విప్లవ రచయిత వరవరరావుతో సహా వివిధ ప్రజా ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించిన వాళ్లు 'భీమా కోరేగావ్ కుట్ర కేసు'లో అరెస్టయ్యారు. వాళ్లు ఇంతవరకు బెయిల్‌పై విడుదల కాలేదు. చట్టపరంగా బెయిల్ రావడానికి అవకాశం ఉన్నా బెయిల్ ఇవ్వడానికి జడ్జీలకు మనసొప్పడం లేదు. వారిని విడుదల చేస్తే 'భద్రమైన వ్యవస్థ'ను కూల్చివేస్తారనే భయం. రాజ్యం దృష్టిలో వీరంతా నేరస్తులు. కానీ, ప్రజా ఉద్యమాల దృష్టిలో రాజకీయ ఖైదీలు.

డాన్ బెర్గర్ రచించిన 'ది స్ట్రగుల్ విథిన్ – ప్రిజన్స్, పొలిటికల్ ప్రిజనర్స్ అండ్ మాస్ మూవ్‌మెంట్స్' పుస్తకం అమెరికాలో దాదాపు 5 దశాబ్దాలుగా వివిధ ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్నవారి అరెస్టులు, శిక్షల, కారాగార జీవితం, జైలులో పోరాటాల గురించి, వారి ఉద్యమాల నేపథ్యం గురించి, వారి విడుదల కోసం బయట జరిగిన ప్రచార ఆందోళన గురించి వివరిస్తుంది. ప్రత్యేకించి రాజకీయ ఖైదీల పట్ల విస్తృతమైన అవగాహనను ఇస్తుంది. ఈ పుస్తకానికి ముందుమాట, చివరి మాటను రూత్ విల్సన్ గిల్మోర్, డ్రీమ్ హ్యాంప్టన్ రాశారు. ఈ పుస్తకాన్ని అమెరికాలోని పి.ఎం. ప్రెస్ 2014లో ప్రచురించింది.

రాజకీయ ఖైదీలు అంటే ఎవరు?

ప్రపంచ వ్యాప్తంగా రాజకీయ ఖైదీల పట్ల భిన్నమైన అవగాహనలు, అభిప్రాయాలు ఉన్నాయి. అమ్నెస్టీ ఇంటర్నేషనల్ సంస్థ రాజకీయ ఖైదీలకు బదులు మనస్సాక్షి ఖైదీలు (ప్రిజనర్స్ ఆఫ్ కన్‌సైన్స్) అని మాట్లాడుతుంది. రాజ్యం వ్యక్తి లేదా వ్యక్తులు రాజకీయ, మతపరమైన విశ్వాసాలను కలిగి ఉన్నందుకు జైలులో నిర్బంధించిన వారిని మనస్సాక్షి ఖైదీలుగా గుర్తిస్తుంది. 1964లో నెల్సన్ మండేలా అరెస్టును నిరసిస్తూ అతన్ని విడుదల చేయాలని డిమాండ్ చేసింది అమ్నెస్టీ ఇంటర్నేషనల్. కానీ, ఆయనపై రొవన్ కేసు విచారణ జరిగినప్పుడు, ఆ తర్వాత అతను హింసను ప్రబోధించాడనీ, సాయుధ చర్యలను ప్రోత్సహించాడనీ తన మద్దతును ఉపసంహరించుకుంది. మనదేశంలో బినాయక్ సేన్, సోనీ సోరీ, ఇరోం షర్మిలాల విడుదల కోసం ప్రచారం చేసింది. అమ్నెస్టీ దృష్టిలో వ్యక్తులు హింసాత్మక చర్యలకు పాల్పడినా, ప్రబోధించినా రాజకీయ ఖైదీలుగా గుర్తించదు.

మరికొన్ని మానవ హక్కుల సంఘాలు రాజకీయ ఖైదీలను గుర్తిస్తూనే వారిని బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేయవు. వారిని 'ఖైదీల్లో సమానత్వం' పేరుతో సాధారణ ఖైదీలుగానే నేర విచారణ జరిగి విడుదల కావాలని వాదిస్తాయి. కానీ, ఈ పుస్తక రచయిత రాజకీయ ఖైదీల పట్ల విస్తృతమైన అవగాహనతో అమెరికాలో 1950 నుండి జరిగిన అనేక రకాల ఉద్యమాలను, వాటి నేపథ్యంలో, అందులో చురుగ్గా పాల్గొన్న నాయకుల, కార్యకర్తల వివరాలను పాఠకులకు అందించారు.

మనం సాధారణంగా రాజకీయ ఖైదీలను విడుదల చేయాలని డిమాండ్ చేసే సందర్భంలో వారి రాజకీయ విశ్వాసాలు, నమ్మకాలను సహించలేని రాజ్యం జైల్లో నిర్బంధించిందనీ, వారి వ్యక్తిగత స్వార్థ ప్రయోజనం కోసం 'నేరం' చేయలేదనీ, ఉద్యమంలో భాగంగా చేసిన చర్యలను 'నేరం'గా పరిగణించకూడదనీ వాదిస్తుంటాం. కానీ, ఈ పుస్తక రచయిత 'నేరం', 'అమాయకత్వం', 'హింస' అన్న విషయాలు రాజకీయ ఖైదీలుగా గుర్తించడానికి ప్రధానం కాదు అంటారు. ఈయన దృష్టిలో సాయుధ పోరాటంలో పాల్గొన్నవారే కాకుండా బలమైన శాంతియుత ఉద్యమాల్లో పాల్గొన్న వారిని కూడా రాజకీయ ఖైదీలుగా గుర్తించాలంటారు. పుస్తకంలోని 4 అధ్యాయాల్లో అమెరికాలో గత 5 దశాబ్దాలుగా జరిగిన, జరుగుతున్న ప్రజా ఉద్యమాల గురించి ప్రస్తావిస్తూ, ఆ ఉద్యమాల్లో పాల్గొన్న వేలాది మందిని అమెరికా ప్రభుత్వం జైళ్లలో నిర్బంధించింది. విచారణలు జరిపి దీర్ఘకాలం శిక్షలు వేసింది. ప్రజా ఉద్యమాలను బలహీన పరచడానికి తీవ్రమైన అణచివేతను అమలు చేసింది. రచయిత ప్రస్తావించిన ఉద్యమాల్లో బ్లాక్ ఫాంథర్ పార్టీ, బ్లాక్ లిబరేషన్ ఆర్మీ, సివిల్ రైట్స్ మూవ్‌మెంట్, అమెరికా సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాలు, యుద్ధోన్మాద వ్యతిరేక ఉద్యమాలు, శ్వేతజాతి ఆధిపత్యానికి, పితృస్వామ్యానికి వ్యతిరేకంగా ఉద్యమాలు, పర్యావరణ విధ్వంసానికి వ్యతిరేకంగా నిరసనోద్యమాలు ప్రధానమైనవి. ఈ ఉద్యమాల్లో పాల్గొని జైళ్లలో నిర్బంధించబడి, దీర్ఘకాల శిక్షలకు గురైన వారి గురించి వివరించాడు.

ప్రతిఘటనా పోరాటాల్లో చురుగ్గా పాల్గొనే వారినందరినీ రాజకీయ ఖైదీలుగా గుర్తించాలని రచయిత బలంగా వాదిస్తాడు. రాజకీయ ఖైదీలంటే ఉద్యమాల నుండి వచ్చినవారు. అందుకే రాజకీయ ఖైదీల విడుదల గురించి డిమాండ్ చేసేటప్పుడు వారు పాల్గొన్న ఉద్యమాల గురించి, వాటి లక్ష్యం గురించి తప్పనిసరిగా ప్రస్తావించాలంటాడు. ఆ తర్వాత నిర్బంధానికి దారితీసిన పరిస్థితులు, అక్రమ కేసుల గురించి ప్రస్తావించాలంటాడు. రాజకీయ ఖైదీల ప్రస్తావన ద్వారా భావితరాల వారు చరిత్ర తెలుసుకోవాలి. వారి విడుదలను వ్యక్తుల పరంగా అర్థం చేసుకోకూడదు. ప్రజా ఉద్యమాల లక్ష్యంలో భాగంగా వారి విడుదల కోసం జరిగే ఆందోళనను అర్థం చేసుకోవాలంటాడు రచయిత.

జైలు పోరాటాలు

అమెరికా జైళ్లలో వివిధ సందర్భాల్లో రాజకీయ ఖైదీల పోరాటాలు, వాటిని తీవ్రంగా అణచివేసిన సంఘటనల వివరాలు మనల్ని ఆశ్చర్యపరుస్తాయి. జైలు సంస్కరణల గురించి బయట చాలా ప్రచారం జరుగుతూ ఉంటుంది. కానీ, వాస్తవంలో జైలులోని పరిస్థితులను బాగుపరుచుకోవడానికి ఖైదీలు చేసే పోరాటాలే ప్రధానం. నిర్బంధాన్ని సహితం లెక్కచేయకుండా తమ డిమాండ్ల సాధన కోసం చావును కూడా లెక్క చేయరు. ఒక్కోసారి సాహసోపేతంగా జైలును బద్దలుకొట్టి స్వేచ్ఛను పొందిన సంఘటనలు అమెరికాలో చాలా జరిగాయి. జైలులో జరిగిన పోరాటాల సందర్భాల్లో జైలు గార్డులను చంపిన సంఘటనలు ఉన్నాయి. ఖైదీలు కూడా చంపబడ్డ ఉదంతాలు ఉన్నాయి.

బ్లాక్ పాంథర్ పార్టీ, బ్లాక్ లిబరేషన్ ఆర్మీకి చెందిన డేవిడ్ జాక్సన్, అసస్టా షాకూర్‌ల గురించిన ఉద్యమ నేపథ్యం, వారు చేసిన పోరాటాలు మనకు స్ఫూర్తిని కల్గిస్తాయి. బ్లాక్ పాంథర్ పార్టీ, బ్లాక్ లిబరేషన్ ఆర్మీ ప్రభావం దేశవ్యాప్తంగా విస్తరించింది. వేలాది మంది యువకులు వాటి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పోలీసు అధికారులపైన దాడులు చేసి హత్య చేశారు. నిధుల కోసం బ్యాంకులను దోపిడీ చేశారు. దీన్ని దోపిడే అనరు. జప్తు (కాన్ఫిస్కేషన్) అంటారు. స్మగ్లర్ల పైన, డ్రగ్స్ వ్యాపారస్తుల మీద దాడులు చేశారు. వేలాది మంది నిర్బంధాన్ని ఎదుర్కోవడమే కాకుండా జైళ్లలోనెట్టబడ్డారు. దీర్ఘకాలం కారాగార శిక్షలు అనుభవించారు.

డేవిడ్ జాక్సన్‌ను 1970లో చిన్న 'దొంగతనం' కేసులో అరెస్టు చేస్తారు పోలీసులు. అతను అప్పుడు టీనేజర్. జైలులోని రాజకీయాల గురించి తెలుసుకొని ఆ తర్వాత బ్లాక్ పాంథర్ పార్టీ ఫీల్డ్ మార్షల్‌గా ఎన్నుకోబడతాడు. ఆయన జైలులో రాసిన 'సోల్‌డాడ్ బ్రదర్స్' పుస్తకం బయట విపరీతంగా అమ్ముడు పోయింది. ఆయన రాసిన మరో పుస్తకం 'బ్లడ్ ఇన్ ది ఐ' అతను చనిపోయిన తర్వాత వెలువడింది. దీన్ని బ్లాక్ గెరిల్లా ఆర్మీకి మాన్యువల్‌గా చెప్పుకుంటారు.

డేవిడ్ జాక్సన్ జైలులో ఉండగానే ఇద్దరు సహచరులతో కలిసి జైలు అధికారిని హత్య చేశారనే అభియోగం మోపుతారు. వీరి విడుదల కోసం దేశ వ్యాప్తంగా డిఫెన్స్ కమిటీలు ఏర్పాటవుతాయి. అందులో జాతీయ వాదులు, కమ్యూనిస్టులు, రాడికల్స్ పాల్గొని ప్రచార ఆందోళన చేశారు. జాక్సన్ తమ్ముడు (17 సంవత్సరాలు) తన అన్నతో పాటు ఇతర ఖైదీల విచారణ సందర్భంగా ముగ్గురు ఖైదీలకు ఆయుధాలు సరఫరా చేస్తారు. ఖైదీలు జడ్జీని, ప్రాసిక్యూటర్‌ను, జ్యూరీ సభ్యులను బందీలుగా తీసుకొని జాక్సన్‌ను, ఇతరులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తారు. వాస్తవానికి ఆరోజు జాక్సన్ కోర్టు విచారణకు హాజరు కాలేదు. కానీ, గార్డులు జరిపిన కాల్పుల్లో ముగ్గురు ఖైదీలు చనిపోయారు. ఈ సంఘటనలో పాల్గొన్న ఖైదీ మాంగీ కిడ్నాప్‌కు పాల్పడ్డాడు అని అభియోగంతో మళ్లీ జైలులో నిర్బంధిస్తారు. 1963 నుండి 2013 వరకు జైలులోనే శిక్ష అనుభవించాడు.

ఆగస్టు 21, 1971లో జాక్సన్ తనను నిర్బంధించిన జైలులోనే 26 మంది ఖైదీల సహాయంతో జైలును స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తాడు. ఈ క్రమంలో ముగ్గురు గార్డులు, ఇద్దరు తెల్లజాతి ఖైదీలు చనిపోయారు. మిగతా గార్డులు జైలు ఆవరణలోనే జాక్సన్‌ను కాల్చి చంపుతారు. గార్డులను, ఖైదీలను చంపినందుకు జాక్సన్ లాయర్‌తో పాటు మరో 6 మంది ఖైదీలపై కుట్ర కేసులు పెడతారు. ఈ కేసులో సాక్ష్యాధారాలు లేనందున 5 మంది విడుదల అవుతారు. కానీ, హుగో పిన్నెల్‌కి శిక్షపడి 40 సంవత్సరాలు జైల్లో ఒంటరి ఖైదీగా గడపాల్సి వచ్చింది.

జాక్సన్ మరణం అమెరికా జైళ్లలో తిరుగుబాటుకు దారితీసింది. అట్టికా కారాగారం (పశ్చిమ న్యూయార్క్ రాష్ట్రం)లో జాక్సన్ మరణానికి నిరసనగా ఖైదీలు శాంతియుతంగా ప్రదర్శన చేశారు. అలాగే జైలు పరిస్థితులు మారడానికి చేసే నిరసనలు అధికారులను భయపెట్టాయి. కొన్ని వారాల నిరసనల తర్వాత ఖైదీలు జైలును స్వాధీనం చేసుకున్నారు. అది రాజకీయ తిరుగుబాటుగా మారింది. నాలుగు రోజులు అట్టికా జైలు ఖైదీల స్వాధీనమైంది. జైలు పరిస్థితులు మెరుగుపడడానికి ప్రభుత్వం, జైలు అధికారులతో చర్చలు జరిగాయి. కానీ, రాష్ట్ర గవర్నర్ నెల్సన్ రాక్‌ఫెల్లర్ జైలును తిరిగి స్వాధీనం చేసుకోవాలని సైనిక పటాలాన్ని ఆదేశించాడు. దీంతో 43 మందిని చంపి జైలును స్వాధీనం చేసుకున్నారు సైనికులు. చనిపోయిన వారిలో జైలు గార్డులు, ఖైదీలు ఉన్నారు. తిరుగుబాటు దారుల చేతిలో నలుగురు ఖైదీలు, ఒక పోలీస్ అధికారి చనిపోయారు. డేవిడ్ జాక్సన్ మరణించిన రోజును ప్రతి సంవత్సరం బ్లాక్ ఆగస్టుగా రాజకీయ ఖైదీల గురించి స్మరించుకుంటారు.

1960-70ల కాలంలో అమెరికాలో జైలు పోరాటాలు తీవ్రమయ్యాయి. జైలుగార్డుల మీద దాడులు, జైలును బద్దలుకొట్టి పారిపోయిన సంఘటనలు జరిగాయి. ఖైదీల్లో లేబర్ యూనియన్స్ స్థాపించబడ్డాయి. జైలులోనే బ్లాక్ పాంథర్ పార్టీ యూనిట్ ప్రారంభమైంది. దీనికి బాధ్యుడైన విల్కర్‌సన్‌ను సహించలేని ప్రభుత్వం హత్యా నేరం కింద తప్పుడు కేసుపెట్టి శిక్షవేసి ఒంటరి ఖైదీగా ఉంచింది. సాక్ష్యాధారాలు లేక 2001లో ఈ కేసు నుండి విడుదల అయ్యాడు. ఎలాంటి నేరం చేయకుండానే 30 సంవత్సరాలు జైలు జీవితం గడపాల్సి వచ్చింది. ఇతని విడుదల కోసం అంతర్జాతీయంగా న్యాయ సహాయంతో పాటు, ఆందోళన ఒత్తిడి కారణంగా ఒంటరి ఖైదీ నుండి విముక్తి లభించింది. విల్కర్‌సన్‌తో పాటు అరెస్టయిన మరో ఇద్దరిని 2008లో, 2013లో కేసు కొట్టివేసినా ప్రభుత్వం పై కోర్టుకు అప్పీలుకి వెళ్లింది. విల్కర్‌సన్‌కు లివర్ క్యాన్సర్ రావడంతో విడుదల చేస్తారు. విడుదలైన 3 రోజుల తర్వాత చనిపోయాడు. అమెరికాలో రాజకీయ ఖైదీల పోరాటాలకు జాక్సన్‌ను స్ఫూర్తిగా భావిస్తారు. అతని బాటలోనే చాలా మంది రాజకీయ ఖైదీలు పోరాటం చేస్తున్నారు. ఈ కోవకు చెందిన వారిలో అసస్టా షాకుర్ అనే మహిళ, మరికొంత మందిని గురించి రచయిత పరిచయం చేస్తారు.

మనదేశంలో రాజకీయ ఖైదీల విడుదల కోసం మనం ఎలాంటి ప్రచార ఆందోళనా కార్యక్రమాలు చేయాలో ఆలోచించడానికి, నిర్వహించడానికి ఈ పుస్తకం ఉపయోగపడుతుంది. ప్రపంచంలో ఏ దేశంలోనైనా రాజకీయ ఖైదీల పరిస్థితి ఒక్కటే. మనకు ఖైదీలకు మధ్య ఉన్న గోడను బద్దలు కొట్టాలి. రాజకీయ ఖైదీ అసస్టా షాకుర్ చెప్పినట్టుగా

'దట్ ఎ వాల్ ఈజ్ ఎ జస్ట్ వాల్
అండ్ నథింగ్ మోర్ ఎట్ ఆల్
ఇట్ కెన్ బి బ్రోకెన్ డౌన్
ఫ్రీ ఆల్ పొలిటికల్ ప్రిజనర్స్'

(రచయిత పౌరహక్కుల సంఘం అధ్యక్షులు) వీ

డేవిడ్ హార్వే: పెట్టుబడి - 7 ప్రధాన వైరుధ్యాలు

***పెట్టుబడిదారీ వ్యవస్థ తనలోని పదిహేడు అంతర్ వైరుధ్యాల వల్ల పతనం దిశగా పయనిస్తుందని డేవిడ్ హార్వే చేసిన విశ్లేషణలోని ఏడు ప్రాథమిక వైరుధ్యాలను వివరిస్తున్నారు* రమేష్ పట్నాయక్**

(...గత సంచిక తరువాయి భాగం)

వైరుధ్యం - 4

అందరికీ చెందిన సామాజి సంపద - వ్యక్తిగత హరణం

డేవిడ్ హార్వే 'సామాజిక శ్రమ ఫలితమైన విలువలను వ్యక్తులు స్వాహా చేయడం లేదా అపరిమితంగా పోగుచేసుకోవడం గమనిస్తాము. అయితే పరిశ్రమలలో జరిగే చట్టబద్ధమైన శ్రమ దోపిడీ ద్వారా అలాగే వ్యాపార, వాణిజ్యాల ద్వారా సామాజిక శ్రమ విలువలు ఆ విధంగా స్వాయత్తం శిస్వంతంరి చేయబడడం పోగు చేసుకోబడడం మాత్రమే జరగడం లేదు. తదితరంగా చట్ట విరుద్ధ కార్యకలాపాలుగా పరిగణిచబడే దొంగతనం, దోపిడీ, మోసం, అవినీతి, అధిక వడ్డీ, హింస, అణచివేత వంటి విధానాల ద్వారా కూడా సామాజిక సంపద స్వాయత్తం చేయబడడం, పెట్టుబడిగా సమీకరించబడడం చూస్తున్నాము. అంటే చట్టబద్ధ, చట్టవిరుద్ధ కార్యకలాపాల ద్వారా సంపద పోగుపడుతున్నది. చట్టవిరుద్ధ కార్యకలాపాల ద్వారా పోగుపడుతున్న సంపద కూడా అంత నిర్లక్ష్యం చేయదగ్గ పరిమాణంలో లేదు. అది కూడా పరిగణించదగ్గ పరిమాణంలోనే ఉంది.

పెట్టుబడి సరఫరా, సమీకరణల గురించి మాట్లాడే అధికారిక సిద్ధాంతవేత్తలు ఇందులో మొదటి పద్ధతిలో జరిగే, అంటే చట్టబద్ధ పద్ధతిలో జరిగే పెట్టుబడి సమీకరణ గురించి మాత్రమే మాట్లాడుతారు. రెండవది జరగనట్లు, జరిగినా అంత ప్రధానమైనది కాదన్నట్లు, ఆర్థిక వ్యవస్థను వివరించడానికి చట్టవిరుద్ధంగా జరుగుతన్న పెట్టుబడి సమీకరణను పరిగణనలోనికి తీసుకోవలసిన అవసరం లేనట్లు మాట్లాడుతున్నారు. పాఠ్యపుస్తకాలలో బోధించే,పెట్టుబడి శక్తులకు సౌకర్యంగా ఉన్న కాని విశ్లేషణను తప్పుదారి పట్టించే ఈ వాస్తవ దూరమైన పరిశీలనా పద్ధతిని మనం తిరస్కరించ వలసిన సమయం వచ్చింది.

వ్యవస్థలో సామాజిక శ్రమ, దాని ఉత్పత్తులైన సామాజిక విలువలను స్వాయత్తం చేసుకోవడంలో చట్టబద్ధ, చట్టవిరుద్ధ దోపిడీల మధ్య ఒక సజీవ సంబంధం ఉన్న విషయాన్ని మనం గుర్తించాలి. ప్రపంచ వాణిజ్యాన్ని పెద్ద ఎత్తున ప్రభావితం చేస్తున్న మత్తుమందు కార్టెల్స్, మారణాయుధాల దొంగ రవాణా, వివిధ రకాల మాఫియా గురించి చర్చించకుండా మనం ప్రపంచ పెట్టుబడిని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించడం తెలివితక్కువ పని.

2008లో అమెరికాలో వచ్చిన గృహ రుణ సంక్షోభం సందర్భంలో బయటపడిన బ్యాంకులు అవలంభిస్తున్న వ్యవస్థీకృత నేరాలను - బ్యాంకింగు పోర్టుఫోలియోలలో ఆస్తుల విలువను ఎక్కువ చేసి చూపించడం, మని లాండరింగ్, పోంజి ఫైనాన్స్ (పరిశ్రమ లేదా వ్యాపారం ఏదీ లేకుండా నిజమైన లాభాలు లేకుండా కొత్తవారిని గోదాలలోనికి దింపి పాతవారికి డివిడెండ్లు చెల్లించే మోసపూరిత స్కీములు), వడ్డీ రేట్లలో అవకతవకలకు పాల్పడడం వంటివాటిని దృష్టిలోనికి తీసుకోకుండా ఆర్థిక వ్యవస్థను అర్థం చేసుకోవడం అసాధ్యం ....' అని అంటాడు.

స్పష్టంగా కనిపిస్తున్న ఈ వాస్తవాలను బట్టి మాత్రమేకాక, విస్థాపన (డిస్‌పొజిషన్) అనేది పెట్టుబడి పునాదులకు సంబంధంచిన విషయం అని చెప్పడానికి బలమైన ఆధారాలున్నాయి అని, పరిశ్రమలలో శ్రమ దోపిడీ అనేది ప్రధానమైన విస్తాపన మాత్రమే అని అనేక ఇతర విస్తాపనలు కూడా ఉన్నాయని డేవిడ్ హార్వే చేప్తాడు. ఈ వివరణలో ప్రధానంగా డేవిడ్ హార్వే 'వ్యవస్థలో సామాజిక శ్రమ, దాని ఉత్పత్తులైన సామాజిక విలువలను స్వాయత్తం చేసుకోవడంలో చట్టబద్ధ, చట్టవిరుద్ధ దోపిడీల మధ్య ఒక సహజీవ సంబంధం ఉందని స్పష్టంగా వివరించాడు. పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థలో చట్టవిరుద్ధమైన దోపిడీ ఒక అనివార్యమైన మరియ ప్రధానమైన భాగమని హార్వే వివరించి చూపాడు.

డేవిడ్ హార్వే కార్ల్ పొల్యాని 1944లో ప్రచురించిన 'ద గ్రేట్ ట్రాన్స్‌ఫర్మేషన్' అన్న పుస్తకంలో ఒక భాగాన్ని ఉటంకిస్తూ 'పెట్టుబడికి తన విధుల నిర్వహణకు, విలువ సృష్టికి శ్రమ, భూమి, ధనానికి చెందిన మార్కెట్లు అవసరం అవుతాయని అంటే వాటిని సరుకులుగా పరిగణించవలసి ఉంటుందని అయితే అవి సరుకులు కానందున ఒక పరిష్కారం కాని వైరుధ్యం వస్తుందని' చెప్తాడు. పెట్టుబడి శ్రమ శక్తిని, భూమిని, ధనాన్ని సరుకులుగా దిగజార్చిన విషయం తెలిసందే. అయితే పొల్యాని, హార్వేలు శ్రమ శక్తి అని కాకుండా శ్రమ అని వాడారు.

ఈ రెండు పదాలను సమానార్థకాలుగా వాడినట్లుంది. అదే విధంగా డబ్బును, పెట్టుబడిని కూడా కొన్ని సందర్భాలలో సమానార్థకాలుగా వాడారు. ఆ విషయాలను అలా ఉంచితే ఆధునిక పరిశ్రమలో పోటీలో అలాగే బలప్రయోగంతో కూడిన విస్తాపన కారణంగా తమ భూములను, ఉత్పత్తి సాధనాలను కోల్పోయిన శ్రామిక రైతులు, వృత్తి కారులు తమ శ్రమ శక్తి తప్ప ఏమీ లేనివారయి మార్కెట్లో తమ శ్రమ శక్తిని, దినానికి, వారానికి లేదా నెలకి చొప్పున అమ్ముకుంటున్నారు. వారి కనీస జీవనాధారాల విలువే వారి శ్రమ శక్తి విలువ. వారి శ్రమ శక్తి ధర ఎగుడు దిగుడులకు గురవుతూ వారి శ్రమ శక్తి విలువకు సరాసరిన సర్దుకుంటుంది. వారి శ్రమ శక్తి ధర డిమాండు, సప్లైలపై ఆధారపడి ఎగుడు దిగుడులకు గురవతుంది.

ఒక్కమాటలో చెప్పాలంటే ఏ యితర సరుకు వలే శ్రమ శక్తి ఒక సరుకుగా ప్రవర్తిస్తున్నది. అంటే పెట్టుబడి సజీవమైన శ్రమ శక్తిని ఒక సరుకుగా దిగజార్చింది. ఇందులో ఒక మార్క్సిస్టు విద్యార్థికి క్రొత్త విషయం ఏమీ లేదు. అయితే పొల్యాని 'శ్రమ శక్తి ఇతర సరకుల లాంటిది కాదు, ఇది సజీవమైన శ్రామికుని అంటిపెట్టుకుని ఉంటుంది. శ్రమ శక్తిని శ్రామికుని నుంచి వేరుచేయడం సాధ్యం కాదు.

శ్రామికునికి దూరంగా శ్రమ శక్తిని ట్రాన్స్‌పోర్టు చేయలేము, శ్రమ శక్తిని వస్తువు వలే స్టోర్ చేయలేము (నిలువ ఉంచలేం). శ్రామికులకు దూరంగా శ్రమ శక్తిని సమీకరించలేం' అని అంటాడు. అటువంటి శ్రమ శక్తిని సరుకుగా పరిగణించడంలో సమస్య ఉందంటాడు. అలాగే భూమి అనేది ఇతర సరుకుల వలే మానవ శ్రమ వలన, మానవ కార్యాచరణ వలన ఏర్పడలేదు. అది ప్రకృతి సిద్ధమయినది. దానిని ఒక సరుకుగా భావించడం ఒక పెద్ద అసంబద్ధం అంటాడు. అలాగే డబ్బు ఉపయోగ విలువ ఉన్న వస్తువు కాదు, రెండు ఉపయోగ విలువలున్న వస్తువుల మధ్య మారకపు మాధ్యమం మాత్రమే. ఉపయోగపు విలువ లేని డబ్బుకూడా సరకుగా చలామణి అవుతుంది.

ఒక బ్యాంకు వారు మీకు సంవత్సరానికి ఒక లక్ష రూపాయిలు అప్పుగా ఇస్తే మీవద్ద వారు కనీసం 18వేలు వడ్డీగా వసూలు చేస్తారు. ఈ వడ్డీనే డబ్బు ఖరీదు అంటారు. డబ్బుకు ఖరీదు ఏర్పడినందున దానిని సరుకుగా భావిస్తారు. డబ్బు ఒక చిహ్నం మాత్రమే. చిహ్నానికి ఖరీదు ఏర్పడడం ఒక వైపరీత్యం అంటాడు పొల్యాని. ఈ విధంగా మనిషి నుంచి వేరుచేయ వీలుకాని శ్రమ'శ్రమశక్తి' , ప్రకృతి సిద్ధమైన భూమి, ఉపయోగపు విలువ లేని డబ్బు సరుకులుగా పరిగణించబడడం పూర్తిగా కల్పితం అంటాడు పొల్యాని.

మార్క్స్ చెప్పిందానికి పొల్యాని చెప్పింది విరుద్ధమైనది ఏమీకాదు. అవి ఆవిధంగా తమతమ వాస్తవ, సహజ రూపాలకు వ్యతిరేకంగా నిలబెట్టబడడం, అవి కల్పిత పాత్రలు పోషించవలసి రావడం సమాజ విచ్ఛిత్తికి కారణమం అవుతుందని అంటాడు పొల్యాని. పొల్యానిని ఉటంకించిన తరువాత పెట్టుబడి అభివృద్ధి చెందిన విధానాన్ని వివరిస్తూ హార్వే 'మానవ శ్రమ, ప్రకృతి సిద్ధమైన భూమి, చిహ్నమైన డబ్బు బజారు సరుకులుగా రూపాంతరీకరణం చేయబడడం హింస, మోసం దోపిడీ, కుయుక్తులపై ఆధారపడి జరిగింది. అందరికీ చెందిన గ్రామ కంఠాలు, ఇతర సమూహ భూములు ఆవృతం (ఎన్‌సర్కిల్) చేయబడి విభజించబడి వ్యష్టి ఆస్తులుగా అమ్మకానికి పెట్టబడ్డాయి.

అమెరికాను కనుగొన్న తరువాత అక్కడ స్థానికుల నుంచి బంగారం, వెండి దొంగలించబడింది. స్వంత దేశంలోనే రైతులు భూమి నుంచి బలవంతంగా తొలగించబడి 'స్వేచ్ఛ కలిగిన' వేతన కూలీల స్థితికి నెట్టివేయబడి పెట్టుబడిచే స్వేచ్ఛగా దోపిడీ చేయబడడానికి సిద్ధం చేయబడ్డారు. అటువంటి రూపాలు, అంటే భూముల ఆక్రమణ, రైతుల విస్థాపన, దొంగతనం, దోపిడీ, మోసం, కుయుక్తి వంటి విధానాలు పెట్టుబడి పుట్టుకకు కారణం అవడం మాత్రమే కాకుండా ఈ నాటికీ ఈ దుష్టమైన మార్గాలు కొనసాగుతూనే ఉన్నాయి.

కార్పొరేటు, రాజ్యం మధ్య అపవిత్ర సంబంధం భూమి, నీరు, ప్రకృతి వనరుల నుండి ప్రజలను విస్థాపన చేస్తుండడం వలన ప్రపంచ వ్యాప్తంగా నేడు అలజడి పరిస్థితి నెలకొని ఉంది. పొల్యాని కూడా ఊహించలేని స్థాయిలో ఈనాడు ఆఫ్రికాలో, లాటిన్ అమెరికాలో, ఆసియాలో ప్రధానంగా చైనాలో జరుగుతున్న భూ ఆక్రమణలు విస్థాపన రాజకీయాలకు స్పష్టమైన ఉదాహరణలు.

అమెరికాలో కూడా ఈ విస్థాపన జరుగుతున్నది. అమెరికాలో పదుల లక్షలలో కుటుంబాలు తమ ఇళ్లనుండి విస్థాపన చేయబడ్డాయి 2008 గృహ రుణ సంక్షోభంలో. విద్య, వైద్యం, పెన్షన్ వంటి హక్కులన్నింటి నుంచి ప్రజలు దూరం చేయబడుతున్నారు. ఇదంతా పెట్టుబడికి గుండెకాయ వంటి దేశాలలో కూడా జరుగుతున్నది. ఎంతో కష్టంతో పోరాటాల ద్వారా సాధించిన హక్కులను పెట్టబడి మన కళ్లెదుటే రోజూ రద్దుచేస్తున్నది. ...' అని డేవిడ్ హార్వే అంటాడు.

డేవిడ్ హార్వే పొల్యానిని మరల ఉటంకిస్తాడు. పొల్యాని 'ప్రకృతిని పరాయీకరించి దాని నుండి మార్కెట్‌ను సృష్టించడం, అలాగే శ్రమను జీవిత ఇతర వ్యక్తీకరణల నుంచి వేరుచేసి దానిని మార్కెట్ నియమాలకు లోబర్చడం, ఆ విధంగా ఉనికి అన్ని సజీవ సంబంధాలను హతమార్చి వాటి స్థానంలో విడివిడి వ్యష్టి సంబంధాలను తీసుకురావడం పెట్టుబడి చేసిన అత్యంత దుస్సహమైన పనికావచ్చు' అంటాడు.

డేవిడ్ హార్వే తన విశ్లేషణను కొనసాగిస్తూ 'ఒక్కసారి శ్రమ, భూమి, ధనం సరుకులుగా మార్చబడిన తరువాత వాటిని వాటి వాటి స్థానాలనుంచి అంటే సాంస్కృతిక సంబంధాల నుండి, జీవ పదార్థం నుండి పెకిలించివేసిన తరువాత,అవి నుగ్గు నుగ్గు చేయబడిన తరువాత వాటిని వ్యక్తిగత హక్కుల నిబంధన క్రింద రాజ్యంచే గ్యారంటీ చేయబడిన తరువాత వ్యక్తిగత ఆస్థి అనే పాలనా ఛత్రం క్రింద తిరిగి ఏవిధంగానైనా కలిపి ముడివేయవచ్చు.

ఈ విధంగా నిర్మితమైన ప్రపంచంలో సూర్యుని క్రింద ఉన్న ప్రతీది, సాంకేతికంగా సాధ్యమైన ప్రతి సందర్భంలో,సూత్రప్రాయంగా, సరుకుగా, డబ్బుకు లోబడేదిగా, వ్యక్తిపరం చేయదగ్గదిగా భావించబడుతుంది. అటువంటి భావన ఎటువంటి సమర్థన అవసరం లేని తేటతెల్లమైన సత్యంగా కనబడుతుంది.

జీన్ సీక్వెన్సీస్, కాలుష్య సంబంధమైన క్రెడిట్స్, వాతావరణం ప్రతీది సరుకుగా ఇప్పటికే మార్చబడింది. ప్రతి సందర్భంలో ఉపయోగపు విలువ బానిసగానూ మారకపు విలువ యజమానిగానూ అయిపోయినాయి. ఈ పరిస్థితులలోనే వినియోగపు విలువలు తగినంత అందుబాటుకై ప్రజలు చేసే తిరుగుబాటు విధాయకమైనది, అత్యావస్యకమైనది' అని అంటాడు.

డేవిడ్ హార్వే 'ప్రకృతి, మనిషి సమస్తం సరుకుగా మార్చబడుతున్న ఈ పరిస్థితిలో సామూహిక ప్రకృతి సంపదను కొల్లగొడుతున్న వ్యక్తులు 'పెట్టుబడిదారులు' సమిష్టిగా ప్రకృతి వనరుల పునరుత్పత్తికి ఏంచేస్తున్నారు? వారు ప్రకృతి సంపద పునరుత్పత్తి అవకాశాలను ధ్వంసం చేస్తున్నారు. లేదా కనీసం వాటి పట్ల వారు నిర్లక్ష్య వైఖరి అనుసరిస్తున్నారు అని గట్టిగా చెప్పవచ్చు.

గల్ఫ్‌లో 2010లో బ్రిటిష్ పెట్రోలియం కంపెనీవారి పెట్రోలియం బావులు సముద్రంలోనికి పొంగిపోయి వివిధ అంచనాల ప్రకారం 17 నుంచి 39 మిలియన్ గాలన్లు ఆ సముద్ర జలాలో

కలిసిపోయినప్పుడు, పర్యావరణం సర్వ వినాశనం పొందినప్పుడు బ్రిటిష్ పెట్రోలియం కంపెనీ ఎటువంటి బాధ్యత వహించలేదు. భోపాల్ కార్బైడ్ ఫ్యాక్టరీలో గ్యాస్ లీక్ అయిన సందర్భంలో ఏం జరిగిందో మనకు తెలియంది కాదు.

అంటే సహజ వనరులను వ్యక్తి గత ఆస్తులుగా మార్చుకునే కంపెనీలు ప్రకృతి విధ్వంసం ఎడల ఎటువంటి బాధ్యత వహించవని అంటాడు. వ్యక్తిగత ఆస్థి ప్రకృతి వనరులను స్వాయత్తం చేసుకుంటుంది గాని ప్రకృతి పరిరక్షణ, పునరుత్పత్తి ఎడల బాధ్యత వహించదని వివరించిన తరువాత సమాజం సృష్టించిన సంపద ఎడల కూడా వ్యక్తిగత ఆస్థి వ్యవస్థ బాధ్యతా రహితంగానే ఉంటుందని వివరిస్తాడు.

అసలు కంపెనీలు నిజాయితీగా ఉండడానికి ప్రోత్సాహకాలు ఏవీ లేవని, నిజాయితీగా ఉండే కంపెనీల కంటే అడ్డదారులు తొక్కే కంపెనీలు పెద్ద లాభాలు సంపాదిస్తాయని, తమ అవినీతి దొరకిపోయి నప్పుడు విధించే జరీమానాలు పరిగణనలోనికి తీసుకున్నా అవినీతి కంపెనీలు ఎక్కువ లాభాలు పొందుతాయని, అటువంటప్పుడు కంపెనీలు నీతిగా ఎందుకు వ్యవహరిస్తాయని ప్రశ్నిస్తాడు.

ఎచ్.ఎస్.బి.సి; వెల్స్, ఫార్గో, జె.పి మోర్గాన్ వంటి సంస్థలు అడ్డంగా దొరికిపోయి పెద్ద ఎత్తున జరీమానాలు కట్టిన తరువాత కూడా ద్రవ్య రంగంలో భ్రష్టాచారాలు యాథాతథంగా కొనసాగుతున్నాయంటే జరీమానాలు అవినీతిని ఆపలేవు 'అవినీతి వ్యవస్థాగతమైనది' అని అంటాడు సారాంశంలో పెట్టుబడిని, వ్యక్తిగత ఆస్థిని అనుమతించి అదే సందర్భంలో దానిని నియంత్రించడం సాధ్యం కాదు అంటాడు. ఈ విషయంలో జోసెఫ్ స్టిగ్లిచ్ వంటి వారిని ఎత్తిపొడుస్తాడు.

డేవిడ్ హార్వే చివరిగా 'భూమి, శ్రమ, పెట్టుబడులు సరుకులుగా మార్చబడడం ప్రైవేటీకరణ చేయబడడం, పెట్టుబడిదారీ రాజ్యాంగబద్ధ పాలనకు దాని కపట నాటకానికి మూలంలో ఉంటాయి. ఫలితంగా పెట్టుబడిదారీ రాజ్యాంగం, ఇతర చట్టాలు చట్టవ్యతిరేకతకు ఆశ్రయం ఇస్తాయి. ఈ కల్పితాలు, మాయలు ఒక పద్ధతి ప్రకారం కొందరికి ఇతరుల కంటే అనుకూలంగా ఉంటాయి. ఈ పరిస్థితి పెట్టుబడిదారీ వర్గ అధికారాన్ని నిర్మిస్తున్నది. పెట్టుబడి నిర్మించే మొత్తం రాజకీయ, ఆర్థిక కట్టడానికి – ఏదైతే చట్టవ్యతిరేక కార్యకలాపాలకు అనివార్యంగా ఆశ్రయం ఇస్తుందో ఆ కట్టడానికి – భూమి, శ్రమ, పెట్టుబడి సరుకులుగా మార్చబడడం, ప్రైవేటీకరణ చేయబడడం పునాదిగా ఉంటుంది. ...' అంటాడు.

ఈ అధ్యాయంలో డేవిడ్ హార్వే, పెట్టుబడిదారీ వ్యవస్థలో చట్టబద్ధమైన దోపిడీయే కాకుండా చట్టవ్యతిరేకమైన దోపిడీ కూడా ప్రధానంగానే ఉంటుందని, చట్టవ్యతిరేకంగా జరుగుతున్న విస్తృతమైన దోపిడీని దృష్టిలోనికి తీసుకుకోకుండా పెట్టుబడిదారీ దోపిడీని అర్థం చేసుకోవడం సాధ్యం కాదు. చట్టబద్ధ, చట్టవిరుద్ధ దోపిడీల మధ్య ఒక సహజీవ సంబంధం ఉంది. సూర్యుని కింద ఉన్న ప్రతీది, సాంకేతికంగా సాధ్యమైన ప్రతి సందర్భంలో, సూత్రప్రాయంగా, సరుకుగా, డబ్బుకు లోబడేదిగా, వ్యక్తి పరం చేయదగ్గదిగా ఈ వ్యవస్థలో భావించబడుతుంది.

మనిషి నుంచి వేరుచేయలేని శ్రమను, మానవ శ్రమతో తయారు కాని ప్రకృతిని, ఊరకే చిహ్నం అయిన ఉపయోగపు విలువ లేని డబ్బును సరుకులుగా పరిగణించి వ్యవహరించడంలో మౌలికమయిన వైరుధ్యముంది. పెట్టుబడిదారీ వ్యవస్థ శ్రమను, భూమిని, డబ్బును సరుకులుగా భావించి వాటిని నిర్వహిస్తున్నది కావున అనివార్యంగా అది చట్టవ్యతిరేక కార్యకలాపాలకు ప్రాతిపదికలు కలిగి ఉంటుందని అంటాడు. అలాగే సమూహానికి చెందిన ప్రకృతి వనరులను అలాగే సామాజిక శ్రమ ఫలితాలైన ఉత్పత్తులను స్వాయత్తం చేసుకుని సంపదలను పోగుచేసుకునే పెట్టుబడిదారులు ప్రకృతి పునరుత్పత్తికి సమాజ వికాసానికి సహకరించరని వారు ప్రకృతిని, వ్యక్తిని విధ్వంసం చేస్తారని; వారు పెట్టుబడి పునరుత్పత్తికి అవసరమైన పాదార్థిక పరిస్థితులను కూడా విధ్వంసం చేస్తారు కావున శ్రమను, భూమిని, డబ్బును సరుకులుగా భావించే వ్యవస్థలో పరిష్కారం కాని వైరుధ్యం పెట్టుబడి పునాదిలోనే ఉందని అంటాడు.

(ఇంకా ఉంది)

(రచయిత ఆంధ్రప్రదేశ్ విద్యా పరిరక్షణ కమిటీ నాయకులు) వీ

అబ్బూరి ఛాయాదేవి మృతి



ప్రముఖ రచయిత్రి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అబ్బూరి ఛాయాదేవి(86) కన్నుమూశారు. హైదరాబాద్‌లో గల కొండాపూర్‌లోని చంద్ర రాజేశ్వరరావు వృద్ధాశ్రమంలో ఆమె నిద్రలోనే జూన్ 28న మరణించారు. 1933 అక్టోబర్ 3న తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రిలో ఛాయాదేవి జన్మించారు. ఆమె రాసిన 'తనమార్గం' కథా సంపుటికి 2005లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. 'మృత్యుంజయ' నవలకు 1996లో తెలుగు విశ్వవిద్యాలయం నుంచి 'ఉత్తమ రచయిత్రి' పురస్కారం అందుకున్నారు. ఆమె కథలు ఆంగ్లం, స్పానిష్, హిందీ, తమిళ, కన్నడ భాషల్లోకి అనువాదమయ్యాయి. 1998–2002 మధ్యకాలంలో కేంద్ర సాహిత్య అకాడమీ కౌన్సిల్ సభ్యురాలిగా సేవలందించారు. ఛాయాదేవి డెబ్భైకి పైగా కథలు, యాత్రా రచనలు, సాహిత్య వ్యాసాలు, నవలలు రాశారు. తన రచనలు ప్రధానంగా మధ్యతరగతి మహిళల జీవితాల్లోని ఆటుపోట్ల ఆధారంగా సాగాయి. వీ

కందుకూరి వీరేశలింగం శత వర్ధంతి సభ

ప్రముఖ సంఘ సంస్కర్త, సాహితీవేత్త కందుకూరి వీరేశలింగం శతవర్ధంతి సందర్భంగా జూన్ 30న శ్రీకాకుళంలోని బాపూజి కళామందిరంలో శ్రీకాకుళ సాహితి స్రవంతి ఆధ్వర్యంలో 'సాహిత్య, సామాజిక, సాంస్కృతిక సమాలోచనలు–చర్చలు అనే సదస్సు నిర్వహించారు. వక్తలు కేంద్ర ప్రభుత్వం మనుధర్మశాస్త్రం అమలుచేయాలని అనుకుంటోందన్నారు. దళిత, ముస్లింలపై దాడులు, హత్యలు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తంచేశారు. హిందీని తప్పనిసరి చేస్తూ యుజిసి గుట్టుచప్పుడు కాకుండా ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. శ్రీకాకుళం జిల్లాలో మందస జమిందారులకు వ్యతిరేకంగా పోరాడిన వీరగున్నమ్మ విరోచిత పోరాట స్ఫూర్తిని కలిగి ఉండాలన్నారు. దేశంలో ప్రశ్నించే స్వేచ్ఛ లేకుండా పోయిందని విమర్శించారు.

అఖిల భారత రైతు కూలీ సంఘం సదస్సు

ఆదివాసులు, గిరిజనులపై దాడులను అరికట్టాలని కోరుతూ రైతు కూలీ సంఘం (ఎఐకెఎంఎస్) డిమాండ్ చేసింది. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎఐకెఎంఎస్ అధ్యక్షులు వేములపల్లి వెంకట్రామయ్య అధ్యక్షతన జూలై 5న సదస్సు జరిగింది. సదస్సుకు ముఖ్య అతిథిగా అటవీ హక్కుల కార్యకర్త, హైకోర్టు న్యాయవాది పల్ల త్రినాథ్‌రావు హాజరయ్యారు. ఈ సదస్సులో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, మహారాష్ట్ర, పంజాబ్, ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాలకు చెందిన 600 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజా ఫ్రంట్ 3వ రాష్ట్ర మహాసభలు

తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర మూడవ మహాసభలు 'ప్రజాస్వామిక తెలంగాణకై పోరాడుదాం' అనే నినాదంతో జూలై 13, 14 తేదీల్లో షాద్‌నగర్‌లో పరిగి రోడ్డులో గల షాహీ పంక్షన్ హాల్‌లో జరిగాయి. సభకు హాజరైన వక్తలు తెలంగాణ ఏర్పడితే నీళ్లు, నిధులు, నియామకాలు జరుగుతాయని అనుకొని తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదన్నారు. ప్రత్యేక తెలంగాణను వ్యతిరేకించిన ప్రత్యర్ధి పార్టీల నేతలను పార్టీలోకి చేర్చుకుంటూ, ప్రశ్నించే ప్రజాస్వామిక వాదులను కట్టడి చేయడం సరికాదన్నారు. ప్రజాస్వామిక తెలంగాణ కొరకు ప్రజలు సిద్ధంకావలని వక్తలు పిలుపునిచ్చారు.

పాఠశాలల మూసివేతను విరమించుకోవాలి

పేద విద్యార్థులకు విద్యను అందిస్తున్న రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను మూసివేసే ఆలోచనలను ప్రభుత్వం విరమించుకోవాలని ప్రొ. హరగోపాల్ అన్నారు. బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో వివిధ ఉపాధ్యాయ సంఘాలతో కలిసి ప్రభుత్వం విద్యా పరిరక్షణకోసం జూలై 16న రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరయిన వక్తలు నూతన జాతీయ విద్యా విధానం 2019 ముసాయిదా బిల్లును కేంద్రం ఉపసంహరించాలన్నారు. కాషాయికరణలో భాగంగా కస్తూరి రంగన్ కమిటీ విద్యా విధానం అమలు చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు.

బంధు మిత్రుల సంఘం సభలు

దేశంలో అణచివేతలు, నిర్బంధాలు లేని ప్రజాస్వామ్యం ఏర్పడాల్సిన అవసరం ఉందని ప్రొ. హరగోపాల్ అన్నారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జూలై 18న అమరుల బంధుమిత్రుల సంఘం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో 'రాజ్య నిర్బంధం – త్యాగాల పరంపర' అనే అంశంపై సభ నిర్వహించారు. వక్తలు దేశంలో మేధావులు, పౌర ప్రజాస్వామిక వాదులపై రాజ్యం తీవ్ర నిర్బంధం, అణచివేత, అక్రమ కేసులు పెట్టడం దారుణమన్నారు. ఇప్పటికే దేశంలో అత్యంత అమానుషమైన అణచివేతను ప్రజలపై రాజ్యం కొనసాగిస్తోందని ఆందోళన వ్యక్తంచేశారు. కేంద్ర, రాష్ట్ర అణచివేత చర్యలపై అంతర్జాతీయ స్థాయిలో విమర్శలు వస్తున్నప్పటికీ పాలకులు పట్టించుకోవడంలేదన్నారు. రాజ్యం ఎన్ని నిర్బంధాలు తెచ్చినా, పీడిత ప్రజల హక్కుల కోసం త్యాగాల పరంపర కొనసాగుతుందని తెలిపారు. ఈ సభకు కాకరాల అధ్యక్షత వహించారు.

డా. కృష్ణమూర్తి మృతి

అభ్యుదయవాది డా. కృష్ణమూర్తి రక్త సంబంధిత వ్యాధితో బాధపడుతూ తమిళనాడులోని వేలూరు సిఎంసి ఆస్పత్రిలో చికిత్సపొందుతూ జూలై 14న మృతిచెందారు. కృష్ణమూర్తి అనంతపురం జిల్లాలోని చామలూరు గ్రామంలో 1961 జూన్ 6న జన్మించారు. కర్నూలు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ తరువాత స్త్రీల వ్యాధులపై డిజిఒ కోర్స్ పూర్తిచేశారు. విద్యార్థి దశలోనే రాడికల్ విద్యార్థి సంఘం కర్నూలు జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. పౌరహక్కుల సంఘం సభ్యునిగా అనేక ప్రజా ఉద్యమాలలో పనిచేశారు. 2009లో రాయలసీమ విద్యావంతుల వేదిక వ్యవస్థాపక కన్వీనర్‌గా ఎన్నుకోబడి రాయలసీమ నాలుగు జిల్లాలకు ఉద్యమాన్ని విస్తరించారు.

జైలులో కనీస సౌకర్యాలు కల్పించండి

పుణేలోని యరవాడ సెంట్రల్ జైల్లో విచారణ ఖైదీగా ఉన్న విరసం నేత వరవరరావుకు కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతూ ఆయన సహచరి హేమలత డిమాండ్ చేశారు. ఈ మేరకు మహారాష్ట్ర గవర్నర్‌కు ఆమె లేఖ రాశారు. ఈ లేఖను జూలై 19న సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ వేదికగా విడుదల చేశారు. వయోభారం సమస్యల కారణంగా నేలమీద కూర్చోలేని, పడుకోలేని స్థితిలో ఉన్నారని తెలిపారు. కవి, రచయిత అయిన వరవరరావుకు ఎనిమిది నెలలుగా తెలుగు అక్షరం చూడకుండా ఆంక్షలు విధించారన్నారు. జైల్లోని చర్యలు చూస్తుంటే విచారణ పూర్తికాకముందే ఆయనకు కఠిన శిక్ష విధిస్తున్నట్లు ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. జైలులో కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతూ సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌కు, తెలంగాణ సిఎం కెసిఆర్‌కు తాను లేఖలు రాసినా స్పందన లేదన్నారు. ఆమెకు సంఘీభావంగా ప్రొ. హరగోపాల్, వసంత కన్నబిరాన్, పాత్రికేయులు కె. శ్రీనివాస్, దేవులపల్లి అమర్, కవి శివారెడ్డి, పాశం యాదగిరి తదితరులు సభలో పాల్గొన్నారు.

శ్రీకాంత శర్మ కన్నుమూత

కవి, సాహితీవేత్త, విమర్శకుడు ఇంద్రగంటి శ్రీకాంత శర్మ(75) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాదపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని జికె కాలనీలోని తన స్వగృహంలో జూలై 25న మృతి చెందారు. శ్రీకాంత శర్మ తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురంలో 1944లో జన్మించారు. ఆయన వచన రచనలు, కవిత్వం, పద్యం, లలిత గీతాలు, యక్షగానం, నాటకం, నాటిక, విమర్శ ఇలా సాహిత్యంలోని అన్ని ప్రక్రియలపై తనదైన ముద్రవేశారు. విజయవాడ, నిజామాబాద్ ఆకాశవాణి కేంద్రాల్లో పనిచేశారు. ఆంధ్రజ్యోతి పత్రికలో ఉప సంపాదకునిగా, ఆంధ్రప్రభ వారపత్రికలో సంపాదకునిగా పనిచేశారు. పలు సినిమాలకు పాటలు రాశారు. 'ఇంటిపేరు ఇంద్రగంటి' పేరుతో తన ఆత్మకథను రాశారు.

చలో సెక్రటేరియట్‌ను అడ్డుకున్న పోలీసులు

ప్రభుత్వం తీసుకున్న సచివాలయం కూల్చివేత నిర్ణయాలను వ్యతిరేకిస్తూ జి. వెంకటస్వామి ఫౌండేషన్ ఆధ్వర్యంలోని ప్రజాస్వామిక తెలంగాణ వేదిక నేతృత్వంలో జూలై 25న ఇందిరా పార్క్ వద్ద ధర్నా చౌక్‌లో అఖిలపక్ష నేతలు ఆందోళన చేపట్టారు. అనంతరం నేతలు సచివాలయం ముట్టడికి బయల్దేరగా పోలీసులు వారిని అడ్డుకొని పోలీసు స్టేషన్‌లకు తరలించారు. సచివాలయానికి రాని ముఖ్యమంత్రికి కొత్తదెందుకు అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎన్నో పథకాలు, అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాల్సి ఉండగా వాటిని పక్కన పెట్టి సచివాలయం, అసెంబ్లీ భవనాలు నిర్మించాలనుకోవడం మూర్ఖత్వమే అవుతుందన్నారు. వీ

యుపిలో ఎస్‌సి జాబితాలోకి 17 ఒబిసి వర్గాలు

ఒబిసికి చెందిన 17 సామాజిక వర్గాలను ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఎస్‌సి జాబితాలోకి చేర్చింది. ఈ 17 సామాజిక వర్గాలకు చెందిన కుటుంబాలకు ధ్రువీకరణ పత్రాలను అందించాలని ముఖ్యమంత్రి జూన్ 28న అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో నిషాద్, బింద్, మల్లా, కెవట్, కశ్యతిప్, భర్, దీవర్, బతమ్, మచువా, ప్రజాపతి, రాజ్‌భర్, కహార్, పోట్టార్, ధీమార్, మంఝి, తహవహ, గౌర్ వంటి ఒబిసి సామాజిక వర్గాలు ఎస్‌సి జాబితాలో చేరాయి. యుపిలో 12 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు విమర్శలున్నాయి.

పెరుగుతున్న ఎన్‌కౌంటర్‌లు

ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా కేశ్‌కుతుల్ గ్రామ సమీపంలో సిఆర్‌పిఎఫ్ జవాన్లకు మావోయిస్టులకు మధ్య జూన్ 28న జరిగిన కాల్పుల్లో ముగ్గురు జవాన్లు ఆ రోడ్డు పైనే వెళుతున్న ఒక మైనర్ బాలిక మృతిచెందారు. దంతెరి జిల్లా మాదాగిరి అటవీ ప్రాంతంలో ఎస్‌టిఎఫ్ దళాలకు మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో నలుగురు నక్సల్స్ మృతిచెందగా అందులో ముగ్గురు మహిళా నక్సల్స్ ఉన్నట్లు డిజిపి సుందర్‌రాజ్ తెలిపారు. ఝార్ఖండ్ లోహగడ జిల్లా బహేగర గ్రామం వద్ద జూలై 18న భద్రతా బలగాలకు మావోయిస్టులకు మధ్య జరిగిన కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందారని పోలీసు అధికారులు తెలిపారు.

హరేన్ పాండ్య హత్య కేసులో 12 మంది దోషులు

గుజరాత్ మాజీ హోం మంత్రి హరేన్ పాండ్య హత్యకేసులో నిందితులైన 12 మందిని సుప్రీంకోర్టు దోషులుగా నిర్ధారించింది. ఉగ్రవాద నిరోధక చట్టం (పోటా) ప్రత్యేక కోర్టు చెప్పిన తీర్పును ఖరారు చేసింది. హత్యాభియోగం నుంచి వారికి విముక్తి కలిగిస్తూ గుజరాత్ కోర్టు గతంలో ఇచ్చిన తీర్పును జస్టిస్ అరుణ్ మిశ్రా, జస్టిస్ వినీత్ శరణ్‌ల సుప్రీం కోర్టు ధర్మాసనం జూలై 5న కొట్టివేసింది. కోర్టు పర్యవేక్షణలో ఈ కేసు పునర్విచారణకు సెంటర్ ఫర్ పబ్లిక్ ఇంటరెస్ట్ లిటిగేషన్ అనే స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని కొట్టివేసింది. హరేన్ పాండ్య హత్య వెనుక అప్పటి గుజరాత్ ముఖ్యమంత్రి మోడీ, హోంమంత్రి అమిత్ షాల ప్రమేయం ఉన్నట్లు కాంగ్రెస్ అంటున్నది.

ఎన్‌కౌంటర్లపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలి

ఎన్‌కౌంటర్లపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఎదురుకాల్పుల్లో పాల్గొన్న పోలీసులపై హత్యానేరం నమోదు చేయాలంటూ ఉమ్మడి హైకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలను సవాల్ చేస్తూ ఎపి పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్, ఎపి, తెలంగాణ ప్రభుత్వాలు దాఖలు చేసిన పిటిషన్‌పై జూలై 18న సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ దీపక్ గుప్తా, జస్టిస్ అనిరుద్ధ బోస్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఇంట్లోంచి బలవంతంగా పట్టుకెళ్లి చంపేసి అడవుల్లో పడేసి ఎన్‌కౌంటర్ అంటున్నారని న్యాయవాది వాదనలు వినిపించారు. అనంతరం తమపై హత్యాయత్నం చేయడంతో చంపాల్సి వచ్చిందని పోలీసులే కేసు మూసివేస్తున్నారని కోర్టుకు తెలిపారు. ఎన్‌కౌంటర్ల విషయంలో 2014లో జస్టిస్ లోధా, జస్టిస్ నారీమన్‌లు ఇచ్చిన తీర్పులోని 16 మార్గదర్శకాలు అనుసరించాల్సిందేనని ధర్మాసనం స్పష్టం చేస్తూ దశాబ్ద కాలంనాటి పిటిషన్‌లపై విచారణ ముగించింది.

అకాడమీ అవార్డును తిరస్కరించిన రఘునందన

మతం పేరిట హింస, మూకదాడులును నిరసిస్తూ ప్రముఖ నాటక రచయిత, థియేటర్ ఆర్టిస్ట్, కవి ఎస్. రఘునందన సంగీత అకాడమీ ప్రకటించిన అవార్డును తిరస్కరించారు. 2018 ఏడాదికి గాను జూలై 17న సంగీత్ నాటక్ అకాడమీ అవార్డులను ప్రకటించింది. తనకు ప్రకటించిన అవార్డును తిరస్కరిస్తూ ప్రకటన విడుదల చేశారు. దేశంలో పెరిగిపోతున్న హింసాత్మక ఘటనలు, పెరిగిపోతున్న అసహనం నన్ను నిస్పృహలోకి నెట్టాయని, ఆ నిస్పృహతోనే అవార్డు అందుకునేందుకు తన మనస్సు అంగీకరించడం లేదన్నారు. దేశ భవితకోసం ఆలోచిస్తున్న మేధావులు, సామాజిక కార్యకర్తలను ఉపా చట్టం కింద అరెస్టు చేశారు. వారికి బెయిల్ ఇవ్వడంలేదు. దేశ, ప్రపంచ వ్యాప్తంగా తమకంటూ ఏమీలేని ప్రజల పక్షాన సొంత లాభం ఆశించకుండా వారు పనిచేస్తున్నారు. అలాంటి వారిని జైళ్లలో నిర్బంధించారు. ఇలాంటి స్థితిలో ఒక థియేటర్ ఆర్టిస్ట్‌గా, కవిగా, నాటక రచయితగా ఈ అవార్డును నేను స్వీకరించలేకపోతున్నానన్నారు.

బీహార్‌లో మరో మూక దాడి - ముగ్గురు మృతి

ఆవులను దొంగిలిస్తున్నారనే నెపంతో బీహార్‌లో మూకదాడి చేయడంతో ముగ్గురు మృతిచెందారు. బీహార్‌లోని సరణ్ జిల్లా పైగంబర్పూర్, కన్హౌలి గ్రామాలకు చెందిన నలుగురు యువకులు పక్క గ్రామానికి వాహనం కొనుగోలు చేయడానికి వెళ్లారు. వీరు జంతువులను అమ్మడం కొనడం చేస్తుంటారు. జూలై 18న వీరు తమ గ్రామంలోకి ఆవులను దొంగతనం చేయడానికి వచ్చారని గోరక్షకులు గ్రామస్థులను వారిపైకి ఉసిగొల్పి బాధితుల పైకి దాడికి దిగారు. వారిని కర్రలు, ఇటుకలు, ఇనుపరాడ్లతో విచక్షణా రహితంగా కొట్టారు. ఈ దాడితో ముగ్గురు మృతిచెందగా మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు.

ప్రజాస్వామిక హక్కుల పట్ల సినీ ప్రముఖుల ఆందోళన

దేశంలో మత విద్వేశం పెరుగుతోందని వివిధ రంగాలకు చెందిన 49 మంది తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. 'జై శ్రీరామ్ అనేది ఓ యుద్ధ నినాదంలా మారిందని, జై శ్రీరామ్ పేరిట అరాచకాలు పెరిగిపోయాయి. మూక దాడులు, విచారణ లేకుండా శిక్షించే ఘటనలు జరుగుతున్నాయన్నారు. ఈ ఘటనలు 2014 తరవతే పెరిగాయంటూ సినీమా రచయితలు, దర్శకులు, తదితరులు కలిసి జులై 24న విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. 'దేశంలో దళితులు, మైనారిటీలు, మహిళలపై అరాచకాలు పెరిగాయన్నారు. 2016 ఎన్‌సిఆర్‌బి నివేదిక ప్రకారం ఒక్క దళితులపైనే 840 అఘాయిత్యాలు జరిగాయి. వాటికి పాల్పడ్డ వారందరికీ శిక్ష మాత్రం పడడంలేదని ఇది ప్రజాస్వామ్యానికి హానికరమని ఆందోళన వ్యక్తం చేశారు.

సమాచార హక్కు చట్ట సవరణకు రాజ్యసభ ఆమోదం

సమాచార హక్కు చట్ట సవరణలకు జూలై 25న రాజ్యసభ ఆమోదం తెలిపింది. ఈ బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌ను సభ తిరస్కరించింది. సెలెక్ట్ కమిటీకి పంపాలా వద్దా అన్న అంశంపై ఓటింగ్ జరగగా వద్దంటూ 117 మంది, పంపాలంటూ 75 మంది ఓటువేశారు. దీంతో సవరణ బిల్లుకు ఆమోదం లభించినట్టయింది.

కర్నాటకలో అధికార మార్పు

కర్నాటకలో పాలకపక్ష అసమ్మతితో ముఖ్యమంత్రి కుమారస్వామి జూలై 18న విశ్వాస తీర్మానాన్ని సభలో పెట్టారు. ఈ తీర్మాణంపై ఐదు రోజులు చర్చలు, వాయిదాలతో జూలై 23న ఓటింగ్‌కు స్పీకర్ ప్రతిపాదించారు. సభకు హాజరయిన మొత్తం సభ్యులు 204, విశ్వాస తీర్మానానికి వ్యతిరేకంగా 105 ఓట్లు, అనుకూలంగా 99 ఓట్లు వచ్చాయి. పాలకపక్షం సభ విశ్వాసాన్ని కోల్పోయినట్లు స్పీకర్ ప్రకటించారు. దీంతో కుమారస్వామి గవర్నర్ వజూభాయి వాలాకు తన రాజీనామాను అందజేశారు. అత్యధిక స్థానాలున్న బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పటు చేసింది. బిజెపి నాయకుడు యడియూరప్ప జూలై 26న ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. వీ

సుడాన్‌లో నిరసనలు

సుడాన్‌లో సైనిక ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న నిరసన కార్యక్రమం తీవ్ర రూపం దాలుస్తోంది. అధ్యక్షుడు ఒమర్ అల్ బషీర్ పాలనలో సైనిక ఆంక్షలు, దాడులు తీవ్రతరమయ్యాయి. గత నెల రోజులుగా జరుగుతున్న ఆందోళనల్లో వందలాది మంది మరణించారు. ఐదు వందల మందికి పైగా గాయపడ్డారు. మరోవైపు జూన్ 30న ఒక ప్రకటనలో అధ్యక్షుడు ఒమర్ నిరసనలు నిలిపివేయాలని ప్రతిపక్షాలను కోరారు. ఒకవేళ ఆందోళనలు యథావిధిగా కొనసాగితే పరిస్థితులు తీవ్రంగా ఉంటాయనీ, మరణాలకు ప్రతిపక్షాలదే బాధ్యతనీ హెచ్చరించారు.

కిమ్ జోంగ్ - డోనాల్డ్ ట్రంప్ భేటీ

ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ జూన్ 30న దక్షిణ కొరియా సరిహద్దు ప్రాంతమైన ప్యాంగ్యాంగ్‌లో మరోసారి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తమ దేశం అణు నిరాయుధీకరణకు కట్టుబడి ఉన్నదని ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ తెలిపారు. ఉత్తర కొరియాపై ఉన్న ఆంక్షలను తొలగించాలని డోనాల్డ్ ట్రంప్‌ను కోరారు. ఈ సమావేశం దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్ జే ఇన్, వైట్ హౌస్ సలహాదారు ఇవాంకా తదితరులు పాల్గొన్నారు. ట్రంప్ మాట్లాడుతూ ప్రస్తుతానికి ఉత్తర కొరియాపై విధించిన ఆంక్షలు కొనసాగుతాయని, ఆంక్షలను తొలగించే అంశాలన్నీ పరిశీలిస్తామని అన్నారు.

హాంకాంగ్‌లో ఆందోళనలు ఉధృతం

హాంకాంగ్‌లో గత కొద్ది రోజులుగా జరుగుతున్న నిరసనలు ఇంకా ఉధృతమవుతున్నాయి. నేరారోపణ ఎదుర్కొంటున్న పౌరులను విచారణకు చైనాకు అప్పగించాలని హాంకాంగ్ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా ఆ దేశ పౌరులు తీవ్ర ఆందోళనలు చేపట్టారు. ఈ ప్రతిపాదనను పూర్తిగా ఎత్తివేయాలని నిరసనకారులు డిమాండ్ చేస్తున్నారు. నేరారోపణ ఎదుర్కొంటున్న పౌరులను చైనాకు అప్పగించినట్టయితే ఇక్కడి న్యాయవ్యవస్థకు ప్రమాదమని స్వతంత్ర ప్రతిపత్తి కోల్పోతామని ఆందోళనకారులు విమర్శించారు. జులై 1న వేలాది మంది హాంగ్‌కాంగ్ వీధుల్లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు చేశారు. రోడ్లపై బైఠాయించి రాకపోకలను స్థంభింపచేశారు. భారీ ర్యాలీగా శాసనసభకు చేరుకుని ఆందోళన చేశారు.

చైనా - టర్కీ అధ్యక్షుల సమావేశం

చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, టర్కీ అధ్యక్షుడు ఎర్డోగాన్ జులై 3న బీజింగ్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇరు దేశాల అధ్యక్షులు పరస్పర వ్యూహాత్మక సహకారాన్ని విస్తరించుకోవడానికి, ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి కృషి చేస్తామని అన్నారు. ఇరు దేశాలూ పరస్పర రాజకీయ విశ్వాసాన్ని పెంపొందించుకోవడంతో పాటు వ్యూహాత్మక కమ్యూనికేషన్లను విస్తరించుకునేలా, పరస్పర మౌలిక ప్రయోజనాలను గౌరవించుకుంటూ ముందుకు సాగాలని అన్నారు. చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ మాట్లాడుతూ చైనా చేపట్టిన బెల్ట్ అండ్ రోడ్ ప్రాజెక్టులో టర్కీ ప్రధాన భాగస్వామిగా కొనసాగుతుందన్నారు. వన్ చైనా విధానాన్ని పూర్తిగా సమర్థిస్తున్నామని ఎర్డోగాన్ తెలిపారు.

లిబియాలో దాడులు

లిబియా రాజధాని ట్రిపోలీలో జులై 3న వైమానిక దాడులు జరిగాయి. ముఖ్యంగా శరణార్థుల శిబిరాలను కేంద్రంగా లిబియా నేషనల్ ఆర్మీ ఈ దాడులకు పాల్పడిందని అనుమానిస్తున్నారు. ఈ దాడిలో దాదాపు యాభై మంది మరణించారు. నూట ముప్పైకి పైగా తీవ్రంగా గాయపడ్డారు. మరణించిన వారిలో సుడాన్, ఎరిట్రియా, సోమాలియా దేశాల నుంచి వలస వచ్చిన వారు, ముఖ్యంగా స్త్రీలు, పిల్లలు అధికంగా ఉన్నారు. దాడి జరిగిన సమయంలో శరణార్థుల కేంద్రంలో 600 మందికి పైగా వలసదారులు ఉన్నారని ఐక్యరాజ్య సమితి శరణార్థి సంస్థ తెలిపింది. స్వదేశాల్లో చెలరేగుతున్న అంతర్యుద్ధాల వల్ల ఆశ్రయం కోసం వస్తున్న వలసదారుల సంఖ్య పెరిగిపోతోందనీ, వీరిని నిర్బంధించడం దారుణమనీ హక్కుల సంఘాలు విమర్శిస్తున్నాయి.

అఫ్ఘనిస్తాన్‌లో శాంతి చర్చలు మొదలు

అఫ్ఘనిస్తాన్‌లో సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న అంతర్యుద్ధాన్ని ముగించేందుకు ఆ దేశ రాజకీయ నాయకులు, హక్కుల నాయకులు తాలిబన్లతో శాంతి చర్చలు ప్రారంభించారు. జులై 7, 8 తేదీల్లో ఖతార్‌లోని దోహాలో ఈ సమావేశాలు జరిగాయి. ఈ సమావేశంలో తాలిబన్ నేతలతో పాటు పలు ఉగ్రవాద గ్రూపులకు చెందిన నాయకులు కూడా పాల్గొన్నారు. ఖతార్, జర్మనీ సంయుక్తంగా ఈ సమావేశాన్ని నిర్వహించాయి. ఈ సందర్భంగా పాకిస్తాన్ మాజీ అఫ్ఘన్ రాయబారి ఒమర్ జకిల్వాల్ మాట్లాడుతూ ఈ సమావేశాలు గొప్ప ముందడుగనీ, ఇరువర్గాల మధ్య మరిన్ని చర్చలు జరిగి ఈ యుద్ధం ఆగిపోయేలా కృషి చేసేందుకు అందరూ సహకరించాలని కోరారు. అఫ్ఘనిస్తాన్‌లో నానాటికీ పెరిగిపోతున్న హింస, మానవ హక్కుల ఉల్లంఘన, ఉగ్రవాద దాడులు, మహిళా హక్కులపై ప్రధానంగా ఈ సమావేశంలో చర్చ జరిగింది.

పెన్షన్ ప్రైవేటీకరణకు బ్రెజిల్ ఆమోదం

పెన్షన్ విధానాన్ని ప్రైవేటీకరించే బిల్లుకు బ్రెజిల్ పార్లమెంట్ ఆమోదం తెలిపింది. జులై 11న పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఈ బిల్లుకు అనుకూలంగా 379 ఓట్లు రాగా, వ్యతిరేకంగా 131 ఓట్లు వచ్చాయి. పెన్షన్ సంస్కరణల పేరుతో పెన్షన్ విధానం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గత నెలలో దేశవ్యాప్తంగా అన్ని వర్గాల నుంచి పెద్ద ఎత్తున ఆందోళన, నిరసన కార్యక్రమాలు జరిగాయి. కార్మిక, విద్యార్థి సంఘాలు తీవ్ర నిరసన తెలిపారు. ఈ బిల్లుపై బ్రెజిల్ సెనెట్ ఆమోదముద్ర వేయాల్సి ఉంది. ఈ బిల్లు అమల్లోకి వస్తే మహిళలకు 62 ఏళ్లకు, పురుషులకు 65 ఏళ్లకు రిటైర్మెంట్ వయసుగా మారుతుంది.

ఇరాన్-బ్రిటన్ మధ్య ఉద్రిక్తత

బ్రిటన్‌కు చెందిన రెండు చమురు ట్యాంకర్లను జులై 19న ఇరాన్ అడ్డుకోవడంతో గల్ఫ్‌లో తీవ్ర ఉద్రిక్తత నెలకొన్నది. ఇందులో ఒక ట్యాంకర్ బ్రిటన్‌కు చెందినది కాగా, రెండోది లైబీరియాకు చెందింది. బ్రిటన్ నౌకలో 23 మంది సాంకేతిక సిబ్బందిని ఇరాన్‌కు చెందిన రెవల్యూషనరీ గార్డ్స్ అదుపులోకి తీసుకున్నారు. తీర ప్రాంత నిబంధనలు ఉల్లంఘించినందుకే ఈ నౌకలను అదుపులోకి తీసుకున్నట్టు ఇరాన్ తెలిపింది. ఈ చర్యతో ఇరాన్, బ్రిటన్ దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. తమ నౌక అంతర్జాతీయ జలాలో హర్మోజ్ జల సంధి దాటుతుంటగా ఇరాన్ అధీనం చేసుకుందని, తమ నౌకలను, సిబ్బందిని వెంటనే విడుదల చేయాలని, లేని పక్షంలో పరిణామాలు తీవ్రంగా ఉంటాయని బ్రిటన్ ప్రభుత్వం హెచ్చరించింది.

బ్రిటన్ ప్రధానిగా బోరిస్ జాన్సన్

బ్రిటన్ ప్రధానిగా కన్జర్వేటివ్ పార్టీ నేత బోరిస్ జాన్సన్ ఎన్నికయ్యారు. జులై 23న బ్రిటన్ పార్లమెంట్‌లో జరిగిన ఓటింగ్‌లో మాజీ మేయర్ అయిన జాన్సన్‌కు 92,153 రాగా, బ్రిటన్ విదేశాంగ మంత్రి జెరెమీ హంట్‌కు 46,656 ఓట్లు వచ్చాయి. దీంతో ఆయన ప్రధానిగా ఎన్నికయ్యారు. జులై 24న ఆయన ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. బ్రెగ్జిట్ వివాదం కారణంగా జూన్ 7న ప్రధాని పదవికి థెరిసా మే రాజీనామా చేశారు. వీ

అసహజ మరణాల సూచి

సంకలనం: ఎస్. వెంకటేష్

మరణం ఎప్పుడయినా విషాద సూచకమే. మృతుల బంధువులకూ, మిత్రులకూ విచారకరమే కాని అందులోనూ మరణించిన మనిషి నిండు జీవితం గడిపి వయోభారంతోనే మరణిస్తే దాన్ని సహజ మరణంగా అంగీకరించి ఊరట పడవచ్చు. సగటు ఆయు ప్రమాణంలో సగం కూడా అనుభవించక ముందే మరణిస్తున్నారు. ఈ అసహజ మరణాలకు లెక్కలేనన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ కారణాలున్నాయి. మన పక్కనే మనతోనే ఉండే మనుషులు అర్థాంతరంగా అసహజంగా అకాలంగా అదృశ్యమైపోతున్నారు. ఇటువంటి అసహజ మరణాలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి సామాజిక సంక్షోభానికి, సమాజం దిగజారుడుకు ఒక చిహ్నం. మన రాష్ట్రంలో సాలీనా ఈ రకంగా చనిపోతున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటుందని అంచనా. నిజానికి అసహజ మరణాలన్నీ అసహజ మరణాలుగా నమోదు కావడం లేదు గనుక ఈ సంఖ్య వాస్తవంలో ఒక భాగం మాత్రమే కావచ్చు. పత్రికలలో అచ్చయిన ఇటువంటి ఘటనలన్నిటినీ ఒక్కచోట నమోదు చేయాలని భావిస్తున్నాం. ఈ శీర్షిక ప్రతి నెల ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రతి గ్రామంలో జరుగుతున్న సంఘటనలన్నీ ఇక్కడ రిపోర్ట్ కాకపోవచ్చు. కొన్నయినా మనల్ని ఆలోచింపజేస్తే, మనం మనచుట్టూ ఉన్న మనుషుల కోసం ఇంకాస్త బాధ్యతగాను, జాగ్రత్తగాను వ్యవహరిస్తూ మొత్తంగా పరిష్కారాలవైపు వెళ్లడానికి ఏమయినా తోడ్పడితే ఈ శీర్షిక విజయవంతమైనట్లే.


(జూన్ 1 నుండి జూన్ 30, 2019 వరకు తెలంగాణలోని 10 జిల్లాలు (1113), ఆంధ్రప్రదేశ్‌లోని 12 జిల్లాలలో (930) అసహజ మరణాల పాలైన వారి సంఖ్య 2043)

జిల్లా	ఆకలి	ఆత్మహత్యలు				చికిత్స అందక, అనారోగ్యం			గుర్తు తెలియని		హత్యలు		ప్రమాదాలు				పోలీసు కాల్పుల్లో		పోలీసులు, సైన్యం	మిస్సింగ్/ లాకప్ మరణాలు	ప్రకృతి వైపరీత్యాలు
		వ్యవసాయ రంగం	చేనేత రంగం	ఇతరాలు									పనిచేసే స్థలంలో	కరెంట్	రహదారి	ఇతరాలు	ఉద్యమ కారులు	ఇతరులు			
				స్త్రీ	పు.	స్త్రీ	పు.	పి.	స్త్రీ	పు.	స్త్రీ	పు.									
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)	(12)	(13)	(14)	(15)	(16)	(17)	(18)	(19)	(20)	(21)	(22)
ఆదిలాబాద్	2	3	-	14	20	11	16	6	2	2	3	3	2	4	36	39	-	-	-	6	4
హైదరాబాద్	-	-	-	12	13	3	4	2	2	4	3	8	6	5	29	16	-	-	-	2	-
కరీంనగర్	-	3	2	5	9	3	4	1	2	3	1	2	3	4	17	8	-	-	-	-	12
ఖమ్మం	-	1	-	13	10	-	2	2	-	3	3	3	1	5	28	8	-	-	-	-	47
మహబూబ్‌నగర్	-	1	1	4	5	4	2	4	4	2	4	2	6	12	46	4	-	-	-	-	3
మెదక్	-	11	5	3	2	5	2	1	1	2	4	4	3	16	16	29	-	-	-	3	1
నల్గొండ	-	3	-	4	6	4	5	2	3	4	3	4	3	2	33	12	-	-	-	-	38
నిజామాబాద్	-	2	-	4	7	3	4	-	1	2	1	3	2	4	17	8	-	-	-	-	3
వరంగల్	1	9	3	6	4	3	5	5	1	4	3	6	5	21	23	31	-	-	-	2	2
వికారాబాద్	-	3	-	3	5	3	6	3	2	4	3	4	4	8	24	17	-	-	-	-	4
తెలంగాణ	**3**	**36**	**11**	**68**	**81**	**39**	**50**	**26**	**18**	**30**	**28**	**39**	**35**	**81**	**269**	**172**	**-**	**-**	**-**	**13**	**114**
అనంతపురం	-	3	-	16	30	1	3	1	-	3	2	3	7	7	37	-	-	-	-	-	3
చిత్తూరు	-	2	-	1	7	-	-	-	4	4	4	1	9	10	29	13	-	-	-	-	5
కడప	-	2	-	1	2	-	-	-	-	3	-	-	-	2	17	5	-	-	-	-	-
గుంటూరు	-	3	-	3	5	2	4	1	2	3	2	2	1	2	24	11	-	-	-	-	6
కృష్ణా	-	-	-	5	6	2	3	2	2	3	2	3	2	3	14	12	-	-	-	-	7
కర్నూలు	-	3	-	4	6	2	4	2	3	5	3	4	3	5	29	22	-	-	-	-	4
తూర్పు గోదావరి	-	-	-	8	11	1	6	2	4	8	2	5	6	6	27	17	-	-	-	5	3
ప్రకాశం	-	2	-	6	5	2	4	1	2	4	1	3	-	4	18	13	-	-	-	-	6
శ్రీకాకుళం	వివరాలు అందలేదు																				
పశ్చిమ గోదావరి	-	-	-	4	2	3	5	2	1	2	2	1	3	4	12	9	-	-	-	-	6
నెల్లూరు	-	2	-	3	4	2	4	2	2	4	1	2	3	2	18	11	-	-	-	-	7
విజయనగరం	-	-	-	2	3	3	6	3	-	-	2	1	3	4	13	8	-	-	-	-	9
విశాఖపట్నం	-	-	-	12	12	-	1	-	1	6	-	3	-	7	17	12	-	-	-	21	3
ఆంధ్రప్రదేశ్	**-**	**17**	**-**	**65**	**93**	**18**	**40**	**16**	**21**	**45**	**21**	**28**	**37**	**56**	**255**	**133**	**-**	**-**	**-**	**26**	**59**

VEEKSHANAM Telugu Monthly Journal of Political Economy and Society - 217 - August 2019 ● ISSN 2231-6892
● RNI Regn.No.APTEL/2003/11482 ● Published on 27/7/2019 ● Postal Regn. No. HD/1100/2017-19

బొజ్జా తారకం రచనలు

హైదరాబాద్ బుక్‌ట్రస్ట్, బొజ్జా తారకం ట్రస్ట్ ప్రచురణ




నీలి జెండా
వ్యాసాలు

పేజీలు: 440 వెల: రు. 250



నీలి జెండా
సంపాదకీయాలు


పేజీలు: 180 వెల: రు. 150



అంటరానితనం ఇంకానా?

పేజీలు: 64 వెల: రు. 50

ప్రతులకు: హైదరాబాద్ బుక్‌ట్రస్ట్, ప్లాట్ నం. 85, బాలాజీ నగర్,
గుడిమల్కాపూర్, హైదరాబాద్ – 500006; ఫోన్: 23521849
ఇతర ప్రముఖ పుస్తక షాపులు




పేజీలు: 136
వెల: రు. 120

నా గొంతే తుపాకి తూటా
మల్లు స్వరాజ్యం ఆత్మకథ

హైదరాబాద్ బుక్‌ట్రస్ట్ ప్రచురణ

ప్రతులకు: హైదరాబాద్ బుక్‌ట్రస్ట్, ప్లాట్ నం. 85, బాలాజీ నగర్,
గుడిమల్కాపూర్, హైదరాబాద్ – 500006; ఫోన్: 23521849
ఇతర ప్రముఖ పుస్తక షాపులు



కామ్రేడ్ అమ్మ
లతగా మారిన యాదమ్మ జ్ఞాపకాలు

అమరుల బంధుమిత్రుల సంఘం

ప్రతులకు: పద్మకుమారి, డోర్ నెం. 50–348–1, 19/బి2,
సెకండ్ ఫ్లోర్, అరోరానగర్, బి క్యాంప్, కర్నూల్ – 518002;
ఇతర ప్రముఖ పుస్తక షాపులు

Date of Posting : 29th, 30th

Advt.

Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at Charitha Impressions, Azamabad, Hyderabad - 500 020
and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao